అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

శుక్రవారం 11-04-2025

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 11 | సంచిక : 100 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 16 పేజీలు | వెల : 6.50



ధర్నాలో మాట్లాడుతున్న సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు ఆర్. అరుణ్‌కుమార్
చిత్రంలో రాష్ట్రకార్యదర్శి జాన్‌వెస్లీ, కేంద్రకమిటీ సభ్యులు టీ. జ్యోతి తదితరులు

సిలిండర్ ధర పెంపుతో ప్రజలపై రూ.3700 కోట్ల భారం

పెట్రోలియం ఉత్పత్తులపై సర్‌చార్జీతో సర్కారు రూ. 37వేల కోట్లు వసూలు

ధరల పెంపు సొమ్మును కార్పొరేట్లకు కట్టబెడుతున్న మోడీ

గ్యాస్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలి :

సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు ఆర్.అరుణ్‌కుమార్

బీజేపీ ప్రభుత్వ కుట్రలను ప్రజలు అర్థం చేసుకోవాలి :

రాష్ట్రకార్యదర్శి జాన్‌వెస్లీ

ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో కట్టెల పొయ్యి, గ్యాస్ సిలిండర్‌తో నిరసన

రాష్ట్రవ్యాప్తంగా కొనసాగిన ఆందోళనలు

నవతెలంగాణ-సిటీబ్యూరో

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గ్యాస్ సిలిండర్‌పై రూ.50 పెంచి ప్రజలపై రూ.3700 కోట్ల భారం వేసిందని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు అరుణ్‌కుమార్ విమర్శించారు. పెట్రోలియం ఉత్పత్తులపై సర్కారు రూ.37వేల కోట్ల స్పెషల్ సర్‌చార్జీ వేసిందని వివరించారు. పెంచిన వంట గ్యాస్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ.. రాష్ట్ర వ్యాప్త ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్డులో కట్టెల పొయ్యి, గ్యాస్ సిలిండర్ పెట్టి నిరసన చేపట్టారు. "మోడీ హయాంలో గ్యాస్ బండ పేదల పాలిట గుదిబండ.. పెంచిన వంట గ్యాస్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలి.. పేదలపై భారాలు.. కార్పొరేట్లకు వరాలా..? వంటగ్యాస్ ధరలు పెంచిన మోడీ ప్రభుత్వాన్ని వ్యతిరేకించండి.." అని నినాదాలిచ్చారు. కార్యక్రమానికి పార్టీ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం.వెంకటేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ మాట్లాడుతూ.. మోడీ ప్రభుత్వం వంట గ్యాస్ ధర పెంపుతోపాటు పెట్రోల్ ఉత్పత్తులపై ప్రత్యేక సర్‌చార్జీ పేరుతో కోట్ల రూపాయలు వసూలు చేసి.. ఆ సొమ్మును కార్పొరేట్లకు అప్పనంగా కట్టబెడుతోందన్నారు. మోడీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. కేంద్ర బీజేపీ ప్రభుత్వ విధానాలు పేదలను కొట్టి.. గద్దలకు వేసినట్టుగా ఉన్నాయని విమర్శించారు. బీజేపీ సర్కారు అధికారంలోకి రాకముందు రూ.380 ఉన్న సిలిండర్ ధర ప్రస్తుతం రూ.905కు పెరిగిందన్నారు. అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గుతున్నా పెట్రోల్, డీజిల్ ధరలు పెంచుకుంటూ పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయన్నారు. మోడీ పాలనలో గ్రామీణ ప్రాంతంలో 'ఉపాధి' ...3లో

నేటినుంచి సామాజిక న్యాయ సాధన కోసం సభలు

గ్రామాలు, బస్తీల్లో 14 వరకు నిర్వహణ : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ 3లో..

యంగ్ ఇండియా నా బ్రాండ్

దేశంలోనే బెస్ట్ యూనివర్శిటీగా తీర్చిదిద్దుతాం

మహాత్ముడి స్ఫూర్తితోనే రాష్ట్రంలో ఏర్పాటు

విద్య, ఉద్యోగాలకే మొదటి ప్రాధాన్యత

ప్రతి నియోజకవర్గంలోనూ 25 ఎకరాల్లో పోలీస్ స్కూల్స్

ప్రభుత్వ బడుల్లోనూ మార్పులు

సామాజిక బాధ్యతగా ప్రయివేటు కంపెనీలు సాయమందించాలి

చరిత్రను మలుపు తిప్పిన కొంతమంది సీఎంల నిర్ణయాలు :

మంచిరేవులలో యంగ్‌ఇండియా పోలీస్‌స్కూల్

ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి

పిల్లలతో కలిసి కొద్దిసేపు ఆటలు



చిన్నారులతో కలిసి ఫుట్‌బాల్ ఆడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ-రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

"దేశ భవిష్యత్ తరగతి గదుల్లోనే ఉంది. దీని దృష్ట్యా విద్యా, ఉద్యోగ కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇస్తోంది. అందులో భాగంగా యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసి దేశంలోనే ది బెస్ట్ యూనివర్సిటీగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తున్నాం. ఇదే నా బ్రాండ్" అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. నిరుద్యోగులకు సాంకేతిక నైపుణ్యంలో శిక్షణ అందించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని తెలిపారు. మహాత్ముడి స్ఫూర్తితో యంగ్ ఇండియా బ్రాండ్‌ను తెలంగాణలో క్రియేట్ చేసుకున్నామని చెప్పారు. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం మంచిరేవులలో గురువారం యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌ను సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌ను రాష్ట్రంలోనే ప్రప్రథమంగా ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఆనాడు పండిట్ జవహర్ లాల్ నెహ్రూ సారథ్యంలో దేశంలో యూనివర్సిటీల పునాదులు పడ్డాయని గుర్తు చేశారు. నెహ్రూ దార్శనికతతోనే మన దేశం ప్రపంచ దేశాలతో పోటీ పడే స్థాయికి చేరిందన్నారు. వచ్చే ఒలంపిక్స్ లక్ష్యంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ, అకాడమీని ఏర్పాటు చేసుకోబోతున్నామన్నారు. ప్రతి నియోజక వర్గంలోనూ 25 ఎకరాల విస్తీర్ణంలో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తామన్నారు. ప్రాథమిక స్థాయిలోనే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్చుకోకపోవడంతో సంఖ్య తగ్గుతోందన్నారు. ఒకటో తరగతి నుంచి ఉన్న ప్రభుత్వ స్కూల్స్ విధానంలో మార్పులు తీసుకొచ్చి ప్రీ-స్కూల్ విధానాన్ని తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. సైనిక్ స్కూల్‌కు దీటుగా పోలీస్ స్కూల్‌ను తీర్చిదిద్దాలని, అందుకు కావాల్సిన నిధులు ప్రభుత్వం ఇవ్వడానికి సిద్ధంగా ఉందని తెలిపారు. పోలీస్ స్కూల్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దడం మనందరి బాధ్యతని, సామాజిక బాధ్యతగా ప్రయివేట్ కంపెనీలు పోలీస్ స్కూల్‌కు ఆర్థిక సాయం అందించాలని కోరారు. పోలీస్ స్కూల్ కోసం రూ.100 కోట్ల కార్పస్ ఫండ్ క్రియేట్ చేసుకోవాలని, ఇందుకు అవసరమైన అనుమతులు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. అనంతరం సీఎం యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌లో స్టాఫ్ రూమ్స్, తరగతి గదులను సందర్శించి, విద్యార్థులతో ముచ్చటించారు. ఫుట్‌బాల్ గ్రౌండ్‌ను సందర్శించి, చిన్నారులతో కాసేపు ఫుట్‌బాల్ ఆడారు. ఈ కార్యక్రమంలో ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, దయానంద్, ...15లో

అప్రమత్తంగా ఉండాలి

వర్షాలపై అధికారులకు సీఎం ఆదేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్‌తో పాటు పలు జిల్లాల్లో వర్షాలు పడుతున్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. మరో రెండు రోజుల పాటు ఓ మోస్తరు వర్షాలు వివిధ జిల్లాల్లో కురిసే ...15లో

పూలే మార్గం అందరికీ ఆచరణీయం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

త్యాగాలు, సమాజానికి చేసిన సేవల స్మరణ 15లో..

నేడు ఆయన జయంతి



వెనుకడుగు వెనుక..



ట్రంప్‌పై కార్పొరేట్ల ఒత్తిడి..మాంద్యం భయాల ఎఫెక్ట్

- 90 రోజుల పాటు సుంకాలకు విరామం
- చైనాపై మాత్రం 145 శాతానికి పెంపు
- యూఎస్ అధ్యక్షుడిపై ఇన్‌సైడర్ ట్రేడింగ్ ఆరోపణలు

మేం చైనీయులం.. రెచ్చగొడితే భయపడం : చైనా విదేశాంగ శాఖ

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఉన్నట్టుండి ప్రపంచ దేశాలపై వేస్తున్న సుంకాలను మూడు నెలల పాటు నిలిపివేస్తున్నట్టు ప్రకటించారు. ఈ విరామానికి ప్రధాన కారణం పెట్టుబడిదారులని రిపోర్టులు వస్తున్నాయి. చైనా నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై సుంకాన్ని 104 శాతం నుంచి 145 శాతానికి పెంచుతున్నట్టు ట్రంప్ గురువారం ప్రకటించారు. ట్రంప్ టారిఫ్‌లు ఏప్రిల్ 9 నుంచే అమల్లోకి రావాల్సి ఉంది. చివరి నిమిషంలో ట్రంప్ వీటిని తాత్కాలికంగా నిలిపివేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న 46 దేశాలు, యూరోపియన్ యూనియన్‌పై సుంకాలు విధించిన తర్వాత, గ్లోబల్ మార్కెట్లలో నెలకొన్న గందరగోళం, మాంద్యం ముప్పు కారణంగా ట్రంప్ తన నిర్ణయంపై వెనక్కి తగ్గారని బ్లూమ్‌బర్గ్ ఓ రిపోర్ట్‌లో పేర్కొంది. ఎవరెన్ని చెప్పినా వెనక్కి తగ్గనని చెప్పిన ట్రంప్, చివరి నిమిషంలో టారిఫ్‌లకు బ్రేక్ వేయడం విశేషం.పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారుల నుంచి ట్రంప్‌నకు తీవ్రమైన నిరసన, ఒత్తిడి ఎదురైంది. సుంకాలు పెంచుకుంటూ వెళ్లడం ద్వారా స్వయంకృతాపరాధం అవుతుందని, తాను తీసిన గోతిలో తానే పడడం వంటిదని చాలా మంది నిపుణులు హెచ్చరించారు. అమెరికాలో మరో ఆర్థిక మాంద్యానికి ట్రంప్ కారణమవుతున్నారని పరిశోధన సంస్థలు విశ్లేషించాయి. సుంకాలు పెంచుకుంటూ వెళ్లడం ఆర్థిక అణు యుద్ధంతో సమానమని పేర్కొన్నాయి. దాని పరిణామాలను అమెరికానే ఎక్కువగా భరించాల్సి వస్తుందని హెచ్చరించాయి. ఈ పరిణామాలకు మరోవైపు ప్రపంచ దేశాలపై ఆయన పెంచుకున్న అహం (ఇగో) కూడా తగ్గడంతో టారిఫ్‌లపై వెనక్కి తగ్గారని తెలుస్తోంది. అయితే చైనా మాత్రం దీటుగా నిలబడటంతో ట్రంప్ ఆ దేశంపై సుంకాలకు సంబంధించి వెనక్కి తగ్గలేదు. చాలా వాణిజ్య ...15లో

ఎట్టకేలకు భారత్‌కు తహవ్వుర్ రాణా

అమెరికా నుంచి

ప్రత్యేక విమానంలో ఢిల్లీకి

ఎయిర్‌పోర్ట్‌లో ల్యాండైన

వెంటనే అరెస్ట్ చేసిన ఎన్ఐఏ

ఆ తర్వాత విమానాశ్రయం నుంచి

ఎన్ఐఏ ప్రత్యేక కోర్టుకు తరలింపు

భద్రతను కట్టుదిట్టం చేసిన అధికారులు

విచారణానంతరం తీహార్ జైలుకు

ముంబయి ఉగ్రదాడిలో కీలక సూత్రధారి



వివరాలు 6లో..





సమస్యను కోరి తెచ్చుకున్నారు

లైంగికదాడి కేసులో నిందితుడికి బెయిల్

అలహాబాద్ హైకోర్టు తీర్పు

మహిళాసంఘాల ఆగ్రహం

న్యూఢిల్లీ : లైంగికదాడి ఆరోపణలు ఎదుర్కొంటున్న నిందితుడికి బెయిల్ మంజూరు చేస్తూ అలహాబాద్ హైకోర్టు, బాధితురాలు తనకు తానుగా సమస్యను కోరి తెచ్చుకుందని వ్యాఖ్యానించింది. పైగా ఈ ఘటనలో ఆమె బాధ్యత కూడా వుందని పేర్కొంది. మాస్టర్స్ చదువుతున్న బాధితురాలు గత సెప్టెంబరులో తన స్నేహితులతో కలిసి బార్‌కు వెళ్ళింది. అక్కడ అందరూ కలిసి తాగారు. దాంతో ఆమెకు ఇంటికి వెళ్ళడానికి మరొకరి సాయం అవసరమైంది. ఈ విషయాలన్నీ ఆమె తన ఎఫ్ఐఆర్‌లోనే పేర్కొంది. నిందితుడి ఇంటికి రెస్ట్ తీసుకునేందుకు వెళ్ళడానికి కూడా అంగీకరించినట్టు ఆమె తెలిపింది. అయితే దారిలో వెళుతుండగానే నిందితుడు తనను అనుచితంగా తాకాడని, వాళ్ళ ఇంటికి కాకుండా వారి బంధువుల ఇంటికి ...6లో



పాలస్తీనా దేశాన్ని గుర్తిస్తాం

ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్

పారిస్ : పాలస్తీనా దేశాన్ని జూన్‌లో గుర్తిస్తామని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మాక్రాన్ చెప్పారు. ఇందుకు ప్రతిగా మధ్య ప్రాచ్యంలోని కొన్ని దేశాలు ఇజ్రాయిల్‌ను గుర్తించగలవన్నారు. పాలస్తీనాను సార్వభౌమాధికార దేశంగా దాదాపు 150 దేశాలు గుర్తించినా అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్ వంటి ప్రధాన పశ్చిమ దేశాలు ఇప్పటివరకు ...15లో

ఆర్టీఐ చట్టాన్ని నాశనం చేసే డీపీడీపీ యాక్ట్



తక్షణమే రద్దు చేయాలన్న ఇండియా బ్లాక్

న్యూఢిల్లీ : డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ యాక్ట్ (డీపీడీపీ) లోని సెక్షన్ 44(3) సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) ని నాశనం చేస్తుందని ప్రతిపక్ష ఇండియా బ్లాక్ గురువారం విమర్శించింది. తక్షణమే దాన్ని రద్దు చేయాల్సిందిగా డిమాండ్ చేసింది. ఇక్కడ జరిగిన సంయుక్త పత్రికా సమావేశంలో కాంగ్రెస్ నేత గౌరవ్ గగోయ్ మాట్లాడుతూ ప్రతిపక్ష నేత ...15లో



వాస్తవమేంటీ!

హెచ్‌సీయూ భూములను సందర్శించిన సుప్రీంకోర్టు కమిటీ

సర్వే నెం.25లోని కంచ గచ్చిబౌలి భూముల పరిశీలన

విద్యార్థులను అడ్డుకున్న పోలీసులు

సమస్య ఉన్న దగ్గర వివరిస్తేనే కదా కమిటీకి అర్థమయ్యేది :

యూనివర్సిటీ విద్యార్థి సంఘం నాయకులు

నవతెలంగాణ-మియాపూర్

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) భూములను సుప్రీంకోర్టు కమిటీ పరిశీలించింది. రంగారెడ్డి జిల్లా కంచ గచ్చిబౌలి సర్వే నెంబర్ 25లోని భూములను కమిటీ సభ్యులు గురువారం పరిశీలించారు. హెచ్‌సీయూలోని 400 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం అమ్మాలని భావించగా.. విద్యార్థులు ఆందోళనలు చేయడం, తీవ్ర వివాదం ఏర్పడిన విషయం తెలిసిందే. దాంతో సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని హైకోర్టు రిజిస్ట్రార్‌ను ఆ భూముల్లోకి వెళ్లి నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. ఆయన సుప్రీంకోర్టుకు నివేదిక సమర్పించారు. దీంతో ఆ భూముల్లో చెట్లు ...15లో

కంచ గచ్చిబౌలి భూములపై కేంద్రప్రభుత్వం విచారణ

ప్రభుత్వం తరపున నివేదిక సమర్పించిన సీఎస్

బీఆర్ఎస్, బీజేపీ, హెచ్‌సీయూ విద్యార్థుల నుంచి వివరాల సేకరణ

నేడూ క్షేత్ర స్థాయిలో పర్యటన 15లో..

నేల రాలిన ధాన్యం, మామిడి

పలుచోట్ల ఈదురుగాలులతో

కూడిన వర్షం..వడగండ్లు

పిడుగులు పడి ఇద్దరు మృతి

చల్లబడిన హైదరాబాద్





నవతెలంగాణ-సిటీబ్యూరో/విలేకరులు

పలు జిల్లాల్లో గురువారం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు, వడగండ్లు పడటంతో పంట పొలాల్లో వడ్లు, మామిడి కాయలు నేల రాలాయి. కల్లాల్లో ఆరబోసిన ధాన్యం, మొక్కజొన్న తడిసి ముద్దయ్యాయి. పైరు నేలకొరిగింది. వేలాది ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. ఇండ్లు కూలిపోయాయి. హైదరాబాద్‌లో మధ్యాహ్నం నుంచే వాతావరణం చల్లబడగా.. సాయంత్రం పలుచోట్ల వర్షం కురిసింది. సంగారెడ్డి, నల్లగొండ జిల్లాల్లో పిడుగులు పడి ఇద్దరు మృతి చెందారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలంలోని ఖానాపూర్, మైసంపల్లి, నర్మెట, పాలమాకుల, రాజగోపాల్ పేట, ముండ్రాయి, వెంకటాపూర్, కోనాయిపల్లి, తిమ్మాయిపల్లి గ్రామాలతో పాటు పలుచోట్ల ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో భారీ వడగండ్ల వర్షం కురిసింది. కోత దశకు వచ్చిన వరి చేలల్లో వడగండ్ల ధాటికి వడ్లు నేలపాలయ్యాయి. మామిడి తోటల్లో ...6లో

కంచ గచ్చిబౌలి భూములు అటవీ శాఖవి కావు

"కాంచ అస్తబల్ పోరంబోకే సర్కారీ" భూమిగా రికార్డుల్లో నమోదు

400 ఎకరాలకు బదులుగా 397 ఎకరాలు తీసుకున్న హెచ్‌సీయూ

కోర్టులో అఫిడవిట్ దాఖలు చేయనున్న సర్కార్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కంచ గచ్చిబౌలిలోని సర్వే నెంబరు 25లోని 2,324 ఎకరాల భూమి రాష్ట్ర ప్రభుత్వానిదేననీ, అటవీ భూములు ఎంత మాత్రం కావని సర్కార్ వెల్లడించింది. సంబంధిత చట్టాల ప్రకారం అటవీ భూమిగా ఎప్పుడూ నోటిఫై చేయలేదనీ, రెవెన్యూ, అటవీ రికార్డులలో అటవీ భూమిగా చూపబడలేదని తెలిపింది. ఈ మేరకు సీఎంవో అధికారులు ఒక ప్రకటన విడుదల చేశారు. "రెవెన్యూ రికార్డుల ప్రకారం, కంచ గచ్చిబౌలి గ్రామంలోని సర్వే నెంబర్ 25లోని భూమిని "కాంచ అస్తబల్ పోరంబోకే సర్కారీ" అంటే ప్రభుత్వ భూమిగా నమోదు చేశారు. 1975లో హైదరాబాద్ విశ్వవిద్యాలయం (హెచ్‌సీయూ) కంచ గచ్చిబౌలి గ్రామంలోని సర్వే నెంబరు 25లోని మొత్తం భూమిని స్వాధీనం చేసుకుంది. రెవెన్యూ, అటవీ శాఖ రికార్డుల ప్రకారం సర్వే నెం. 25లోని భూమిని ఎప్పుడూ "ఫారెస్ట్"గా వర్గీకరించలేదు. అప్పటి ప్రభుత్వం 2003న ఐఎంజీ అకాడమీస్ భారత ప్రయివేట్ లిమిటెడ్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఒప్పందం ప్రకారం, రంగారెడ్డి జిల్లా బాలాపూర్ మండలం గచ్చిబౌలిలో 400, మామిడిపల్లి గ్రామంలో 450 ఎకరాలను అప్పగించాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. హెచ్‌సీయూ నుంచి 534.28 ఎకరాల భూమిని తిరిగి స్వాధీనం చేసుకుంది. అందులోంచి 400 ఎకరాలను తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీకీ, 134.28 ఎకరాలను టీఎన్‌జీవోకు అప్పగించింది. అప్పటి యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ రిజిస్ట్రార్‌కు 2004 ఫిబ్రవరి 3న శేరిలింగంపల్లి రెవెన్యూ అధికారుల సమక్షంలో పంచనామా ద్వారా భూమిని అప్పగించారు" అని సర్కార్ తెలిపింది. హెచ్‌సీయూ నుంచి తీసుకున్న భూమికి బదులుగా సర్వే నం 36లో 191.36 ఎకరాలు, సర్వే నం 37లో 205.20 ఎకరాలు, మొత్తం 397 ఎకరాల ప్రత్యామ్నాయ భూమిని హెచ్‌సీయూకు కేటాయించామని సర్కార్ పేర్కొంది. ఈ భూమిని యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ రిజిస్ట్రార్ అదే రోజు పంచనామా ద్వారా స్వాధీనం చేసుకున్నారని గుర్తు చేసింది. 400 ఎకరాలకు బదులుగా 397 ఎకరాలను తీసుకోవడం ద్వారా భూమిపై తన హక్కులను హెచ్‌సీయూ వదులు కుందని తెలిపింది. "టీఎన్‌జీవో కాలనీ రహదారి కోసం భూమిని గుర్తించాలని 2017లో అప్పటి రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు ప్రభుత్వం మెమో జారీ చేసింది. దాన్ని హైకోర్టులో హెచ్‌సీయూ సవాలు చేసింది. అయితే సదరు భూమిపై హెచ్‌సీయూకి ఎలాంటి హక్కు లేదని హైకోర్టు తీర్పు చెప్పింది" అని సర్కార్ గుర్తు చేసింది. వాస్తవం ఇలా ఉంటే హెచ్‌సీయూ భూములని, అటవీ భూములని ప్రజలను కొంతమంది తప్పుదోవ పట్టిస్తున్నారని ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేసింది. భూములకు సంబంధించి వాస్తవ పరిస్థితులను కోర్టుకు నివేదించనున్నట్టు సర్కార్ పేర్కొంది.

రబ్బర్ చెప్పులతో వచ్చిన హరీశ్‌రావుకు రూ.10 వేల కోట్లు ఎలా వచ్చాయి?

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పున్న కైలాష్ నేత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రబ్బర్ చెప్పులతో వచ్చిన హరీశ్‌రావుకు రూ.10 వేల కోట్లు ఎలా వచ్చాయి? అని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పున్న కైలాష్ నేత ప్రశ్నించారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రాన్ని ఆర్థిక విధ్వంసంలోకి నెట్టి, ఎస్సీ, ఎస్టీల భూములను గుంజుకున్న దాంట్లో హరీశ్‌రావు వాటా ఎంతని ప్రశ్నిం చారు. 3 కోట్ల మందికి సన్నబియ్యం ఇస్తూ, 58 వేల మందికి ఉద్యోగాలు కల్పించి, 5 లక్షల మందికి స్వయం ఉపాధి కల్పిస్తున్న రేవంత్ రెడ్డి ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పూలే ఆశయాలను నెరవేరుస్తున్నదని చెప్పారు.

నేటి నుంచి సామాజిక
న్యాయ సాధన కోసం సభలు

గ్రామాలు, బస్తీల్లో 14 వరకు నిర్వహణ : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక దళితులు, గిరిజనులు, బలహీన వర్గాలు, మైనార్టీలతోపాటు, మహిళల మీద దాడులు పెరిగాయని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. కుల వివక్ష, లైంగిక దాడులు, హత్యలు, సాంఘిక బహిష్కరణలు పెచ్చరిల్లుతున్నాయని విమర్శించింది. ఈ నేపథ్యంలో మనువాదం, కార్పొరేట్ సంస్థల దోపిడీకి వ్యతిరేకంగా సామాజిక న్యాయసాధన కోసం జీవితాంతం కృషి చేసిన సామాజిక ఉద్యమ నేతలు జోతిబా పూలే, అంబేద్కర్ జయంతుల సందర్భంగా శుక్రవారం నుంచి ఈనెల 14 వరకు రాష్ట్రంలోని అన్ని గ్రామాలు, బస్తీల్లో సభలు, ప్రదర్శనలు నిర్వహించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. శ్రామిక వర్గాలు, అణగారిన తరగతులన్నీ సంఘటితంగా పోరాటాల్లోకి ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రంలో కులాంతర వివాహాలు చేసుకున్నందుకు 100 మందికిపైగా హత్యలకు గురయ్యారని జాన్‌వెస్లీ తెలిపారు. పండగలు, విందు భోజనాల్లో దళితులు అంటరానితనానికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కులవివక్షను ప్రతిఘటించినందుకు ఏడాదిలో 1000 మందికి పైగా చంపబడ్డారని వివరించారు. ఏటా 50 వేలకుపైగా దాడులకు గురవుతున్నారని పేర్కొన్నారు. గిరిజనులపై దాడులు, హత్యలు, లైంగిక దాడులు పెరిగాయని తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో బిల్లును ఆమోదించి కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం పంపిస్తే దాన్ని అమలు చేయడానికి బీజేపీ సర్కారు పూనుకోవడంలేదని విమర్శించారు. సామాజిక న్యాయాన్ని బీజేపీ పూర్తిగా వ్యతిరేకిస్తున్నదని తెలిపారు. బీసీల కులగణనకు బీజేపీ వ్యతిరేకంగా ఉన్నదని పేర్కొన్నారు. మహిళలపై లైంగిక దాడులు అరికట్టకుండా, వారినే బాధ్యులుగా చేసే ధోరణితో బీజేపీ నాయకులు మాట్లాడుతున్నారని తెలిపారు. మైనార్టీలపై దాడులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. వక్ఫ్‌బోర్డు చట్టానికి సవరణ పేరుతో వారి హక్కులను హరిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటుపరం చేయడంతోపాటు, ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లు అమలుచేయడం లేదని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీచేయడం లేదని పేర్కొన్నారు. కేంద్రంతోపాటు, రాష్ట్రాలు కూడా బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు తగిన నిధులను కేటాయించి, ఖర్చుచేయడంలో వైఫల్యం కొనసాగుతున్నదని విమర్శించారు. అంటరానితనం, కులవివక్షతను రాజ్యాంగం నిషేధించిందని గుర్తు చేశారు. రాష్ట్రంలో జస్టిస్ కె పున్నయ్య కమిషన్ ఆధారంగా ప్రభుత్వమే నెల లో ఒక రోజు పౌరహక్కుల దినం పాటించి, కులవివక్షను నిషేధించాలనే నిబంధన ఉన్నా, అమలు జరిపే పరిస్థితి లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో సామాజిక న్యాయం కోసం జరిగే సభలు, ప్రదర్శనల్లో పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ప్రజలకు జాన్‌వెస్లీ విజ్ఞప్తి చేశారు.

యర్రా శ్రీకాంత్ కుటుంబానికి
మంత్రి పొంగులేటి పరామర్శ



నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు, ఖమ్మం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు యర్రా శ్రీకాంత్ మృతికి రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సంతాపం తెలిపారు. ఖమ్మం శ్రీనివాసనగర్‌లోని శ్రీకాంత్ ఇంటికి గురువారం రాత్రి వెళ్లారు. శ్రీకాంత్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన భార్య యర్రా సుకన్యతోపాటు కుమారులు రంజిత్, శ్రావణ్, జ్ఞానేశ్‌ను పరామర్శించారు. శ్రీకాంత్ లాంటి నాయకుడిని కోల్పోవడం విచారకరమని మంత్రి అన్నారు. కుటుంబానికి ఆయన లేని లోటును ఎవరూ పూడ్చలేరని, ఇలాంటి సమయంలోనే గుండె ధైర్యంతో ఉండాలని సూచించారు. శ్రీకాంత్ ఆకస్మిక మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన సోదరుడు, కార్పొరేటర్ యర్రా గోపి, మరో ఇద్దరు సోదరులు రమేష్, నాగరాజుతో మాట్లాడారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, కార్యదర్శివర్గ సభ్యులు యర్రా శ్రీనివాసరావు, కళ్యాణం వెంకటేశ్వరరావుతోనూ మాట్లాడుతూ.. మంత్రి భావోద్వేగానికి గురయ్యారు. మంత్రి వెంట మార్క్ ఫెడ్ మాజీ వైస్ ఛైర్మెన్ బొర్రా రాజశేఖర్, కార్పొరేటర్ దొడ్డా నగేశ్ ఉన్నారు.

'రుతుస్రావం' కారణంగా
మెట్లపై పరీక్ష రాసిన బాలిక

కోయంబత్తూరులో ఓ ప్రయివేట్ పాఠశాల నిర్వాకం

కోయంబత్తూరు : రుతుస్రావంతో ఉన్న 8వ తరగతి బాలికను గది వెలుపల మెట్లపై కూర్చొబెట్టి పరీక్ష రాయించారు ఒక ప్రయివేట్ పాఠశాల సిబ్బంది. ఈ



ఘటన తమిళనాడులోని కోయంబత్తూరు జిల్లాలోని పొల్లాచ్చికి సమీపంలో జరిగింది. బాధితురాలి తల్లి ఈ దృశ్యాన్ని రికార్డ్ చేశారు. సోషల్ మీడియాలో ఈ వీడియో వైరల్‌గా మారడంతో అధికారులు విచారణ జరుపుతున్నారు. పొల్లాచ్చి ఏఎస్పీ శ్రీస్తి సింగ్ మీడియాకు తెలిపిన వివరాల ప్రకారం.. బాధితురాలు సెంగుట్టాయిపాళయం లోని మెట్రిక్యులేషన్ పాఠశాలలో చదువుతున్నారు. ఇటీవల పాఠశాలలో వార్షిక పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో రుతుస్రావంతో ఉన్న తన కుమార్తెకు ఇన్‌ఫెక్షన్లు సోకుండా తరగతి గదిలో ప్రత్యేక డెస్క్‌ను ఏర్పాటు చేయాలని బాధితురాలి తల్లి ముందుగా క్లాస్ టీచర్‌ను కోరారు. అయితే ఈ విషయంపై ప్రిన్సిపాల్‌తో మాట్లాడాలని టీచర్‌ను సూచించారు. దీంతో ఈ నెల 7న కుమార్తెను పాఠశాల వద్ద దింపిన తల్లి ప్రిన్సిపాల్‌ను కలిసి తన విజ్ఞప్తి తెలిపారు. అయితే ఆమె వెళ్లిన తరువాత తరగతి గది వెలుపల కూర్చోబెట్టి విద్యార్థిని చేత పరీక్ష రాయించారు. దీంతో ఇంటికి వెళ్లిన తరువాత బాలిక కాళ్ల నొప్పితో బాధ పడింది. బుధవారం జరిగిన మరొక పరీక్షకు హాజరైన బాలికను తరగతి గది వెలుపల మెట్లపై కూర్చొ బెట్టారు. దీన్ని చూసిన బాలిక బంధువులు తల్లికి సమాచారం ఇచ్చారు. తల్లి వెంటనే పాఠశాలకు వచ్చి ఈ దృశ్యాన్ని రికార్డు చేశారు. ఈ విషయంపై మెట్రిక్యులేషన్ స్కూల్స్ డైరెక్టర్ ఎ.పళనిసామి మాట్లాడుతూ పాఠశాల యాజమాన్యం నుంచి వివరణ కోరినట్టు తెలిపారు. అధికారులు విచారణ చేస్తున్నారని, నివేదిక అందిన తరువాత తగిన చర్యలు తీసుకుంటామని కూడా చెప్పారు. మరోవైపు చిన్నారులకు ఉచిత, నిర్బంధపు విద్యా హక్కు చట్టం 2009 సెక్షన్ 17 (చిన్నారులపై మానసిక, శారీరక వేధింపుల నిషేధం) కింద పాఠశాల ప్రిన్సిపాల్‌పై సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు.

సిలిండర్ ధర పెంపుతో
ప్రజలపై రూ.3700 కోట్ల భారం



(మొదటి పేజీ తరువాయి)

దొరకని పరిస్థితి ఏర్పడిందన్నారు. దేశంలో ఒకవైపు తమ కార్పొరేట్ అనుకూల ఆర్థిక విధానాలను కొనసాగిస్తూ.. ప్రజలను మతతత్వంతో విడదీస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్‌ఎస్‌ఎస్, సంఘ్ పరివార్ శక్తులు మతఘర్షణలు సృష్టించి ప్రజల మధ్య అనైక్యతను పెంచుతూ డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతున్నాయన్నారు. ప్రజలందరూ బీజేపీ కుట్రలను అర్థం చేసుకోవాలన్నారు. కేంద్ర కమిటీ సభ్యురాలు టి.జ్యోతి మాట్లాడుతూ.. బీపీఎల్ కుటుంబాలకు దీపం, ఉజ్వల పథకాల ద్వారా గ్యాస్ కనెక్షన్లు ఇచ్చారని, కానీ వాటిపైనా ధరల భారం వేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న ప్రజానీకం పెరుగుతున్న ధరల వల్ల సిలిండర్లు పక్కకు పెట్టాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పేరుతో పేదలకు రూ.500కే సిలిండర్ ఇస్తున్నందున.. ఇప్పుడు ధర పెరగడంతో రాష్ట్ర ప్రభుత్వంపైనా అధిక భారం పడుతుందన్నారు. అందువల్ల రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ పార్టీ కూడా గ్యాస్ ధరలపై పోరాటం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు నంద్యాల నర్సింహారెడ్డి, డిజి.నరసింహారావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బండారు రవికుమార్, నగర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.శ్రీనివాసరావు, ఎం.దశరథ్, కె.నాగలక్ష్మి, నగర కమిటీ సభ్యులు ఆర్.వెంకటేశ్, జె.కుమారస్వామి, ఎన్.మారన్న, జి.నరేష్ పాల్గొన్నారు.

జిల్లాల్లో..

వంట గ్యాస్ ధరల పెరుగుదలను నిరసిస్తూ సీపీఐ(ఎం) హైదరాబాద్ సౌత్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఐఎస్ సదన్ సంతోష్ నగర్ చౌరస్తా వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి.అబ్బాస్ మాట్లాడుతూ.. భారత్ ఎగుమతులపై ట్రంప్ పన్నులు వేస్తుంటే నోరు మెదపడానికి ధైర్యం చేయని మోడీ.. దేశంలో మాత్రం ప్రజలపై ధరల పెంచుతూ దాడి చేస్తున్నారని విమర్శించారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మల్కాజిగిరి చౌరస్తాలో ధర్నా చేశారు.

మహబూబాబాద్ జిల్లాలో రోడ్డుపై గ్యాస్ సిలిండర్ పెట్టి నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. కేసముద్రం మండల కేంద్రంలోని ఇంటికన్నె గ్రామంలో రాస్తారోకో నిర్వహించారు. జనగామ జిల్లా పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలో రాజీవ్ చౌరస్తాలో నిరసన తెలిపారు. బచ్చన్నపేట మండలంలో జనగామ-సిద్దిపేటకు వెళ్లే ప్రధాన రోడ్డులో నిరసన చేపట్టారు. మలుగు జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో గ్యాస్ సిలిండర్ నెత్తిన పెట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్లో ఖాళీ సిలిండర్లను, కట్టెల పొయ్యిని వెలిగించారు. గద్వాల జిల్లా అయిజ మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్ చౌరస్తా, వెంకటాపురం గ్రామంలో, ధరూర్ మండల కేంద్రంలో నిరసన కార్యక్రమాలు చేశారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఐద్వా ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. వీపనగండ్ల, చిన్నంబాయి మండల పరిధిలోని అయ్యవారిపల్లి గ్రామంలో ఉపాధి పనుల ప్రాంతంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కూలీలు నిరసన తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలోని బిజినపల్లి మండల కేంద్రంలో నిరసన చేపట్టారు. బల్మూరు మండల వ్యాప్తంగా ఖాళీ సిలిండర్లతో నిరసన తెలిపారు. పెద్దకొత్తపల్లి మండల పరిధిలోని కల్వకోల్ బస్టాండ్ సెంటర్లో ఖాళీ సిలిండర్‌తో నిరసన కార్యక్రమం చేపట్టారు. నారాయణపేట జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఖాళీ సిలిండర్లతో నిరసన తెలిపారు.

సిరిసిల్ల పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద గ్యాస్ సిలిండర్‌తో నిరసన తెలిపారు. జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని బస్టాండ్ అంబేద్కర్ చౌరస్తాలో గ్యాస్ సిలిండర్, పొయ్యి పెట్టి నిరసన తెలిపారు. కరీంనగర్ జిల్లా మానకొండూర్ సదాశివపల్లిలో సిలిండర్లు ఎత్తుకుని నిరసన తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని భగత్‌సింగ్‌నగర్‌లో గ్యాస్ బండ, కట్టెల పొయ్యితో నిరసన తెలిపారు. నిర్మల్‌లో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో మినీ ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం ముందు కట్టెల పొయ్యి పెట్టి నిరసన తెలిపారు. ఖానాపూర్‌లోనూ సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ ఆధ్వర్యంలో కొమురం భీమ్ చౌరస్తాలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. నస్పూర్‌లో సీపీఐ ఆధ్వర్యంలో సీసీసీ కార్నర్‌లో రాస్తారోకో నిర్వహించారు. తాండూర్ మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో కట్టెల పొయ్యిపై వంట చేసి నిరసన తెలిపారు. సీఐటీయూ ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఆటోకు తాడుకట్టి లాగుతూ నిరసన తెలిపారు.

నల్లగొండ జిల్లా కేంద్రంలో గ్యాస్‌బండ, పొయ్యి పెట్టి నిరసన తెలిపారు. మిర్యాలగూడ మండలంలోని ఆలగడప, చండూరు మండల కేంద్రంలో నిరసన తెలిపారు. భువనగిరి పట్టణంలో బహార్ పేట్ 26వ వార్డు, సింగన్నగూడెం 9వ వార్డులో ప్రజలు నిరసన తెలిపారు. ఐద్వా ఆధ్వర్యంలో ఇందిరమ్మ కాలనీలో నిరసన వ్యక్తం చేశారు. వికారాబాద్ జిల్లా పరిగి బస్టాండ్ ఎదుట నేషనల్ హైవేపై సిలిండర్‌తో నిరసన వ్యక్తం చేశారు తాండూర్‌లో పట్టణ కేంద్రంలోని గాంధీ చౌక్ చౌరస్తాలో సీపీఐ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండల కేంద్రంతోపాటు నాగిళ అంబేద్కర్ చౌరస్తాలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో గ్యాస్ సిలిండర్లతో మహిళలు నిరసన తెలిపారు.

మద్దతు ధర కల్పించడంలో
ప్రభుత్వాలు విఫలం

- మిల్లుల్లో అమ్ముకున్న ధాన్యానికి బోనస్ ఇవ్వాలి

గ్యాస్ ధర పెంపుతో సామాన్యులపై భారం : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి

నవతెలంగాణ-మిర్యాలగూడ



రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు. గురువారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంతో కష్టపడి పండించిన పంటలకు కనీసం మద్దతు ధర కూడా ఇప్పించలేకపోతున్నారని, దీనివల్ల రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని తెలిపారు. ముఖ్యంగా మిల్లుల వద్ద ధాన్యాన్ని అమ్ముకునేందుకు వెళ్లిన రైతులను అనేక రకాలుగా మోసం చేస్తున్నారని, వాటిని అరికట్టాల్సిన అధికారులు పర్యవేక్షించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఐకేపీ, పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నా కాంటాల్లో ఆలస్యం, ఇతర కారణాల వల్ల రైతులు మిల్లులకే ఎక్కువగా ధాన్యం అమ్ముకుంటున్నారని అన్నారు. మిల్లుల్లో అమ్ముకున్న ధాన్యానికి ప్రభుత్వం రూ.500 బోనస్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. అప్పుడే రైతులకు కనీసం మద్దతు ధర అందుతుందన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెండు సీజన్లు దాటిపోయాయని రైతు భరోసా ఇవ్వలేదని విమర్శించారు. వచ్చే సీజన్ నాటికైనా పాతవి కలిపి రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ ఇంకా పదివేల కోట్లు పెండింగ్ ఉందని, వెంటనే విడుదల చేసి అందరికీ అమలు చేయాలని అన్నారు. గ్యాస్ ధరల పెంపుతో సామాన్య ప్రజలపై భారం పడిందన్నారు. చమురు ధరలు తగ్గినా గ్యాస్ ధరలు పెంచడం సరైనది కాదన్నారు. పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని కోరారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలు గ్యారంటీగా అమలుచేసి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. ఇంటి స్థలాలు, ఇందిరమ్మ ఇండ్ల విషయంలో గ్రామాలను మోడల్‌గా ప్రకటించినా పురోగతి కనిపించడం లేదన్నారు. పెరుగుతున్న ధరలను నియంత్రించి సామాన్యులకు అందుబాటులో నిత్యావసర వస్తువులు ఉండే విధంగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాల న్నారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు జగదీష్ చంద్ర, నాయకులు రవి నాయక్, భవాండ్ల పాండు, తిరుపతి రామ్మూర్తి, ఎండి అంజాద్, పాదురీ గోవర్దన్, ఉన్న వెంకటేశ్వర్లు, లక్ష్మీ నారాయణ, రామారావు ఉన్నారు.

అన్ని రకాల దోపిడీలపై పోరాటాలు అవసరం

సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు

సామాజిక న్యాయ వారోత్సవాలు, సంఘీభావ నిధికి కార్మికుల ఆదరణ



నవతెలంగాణ-పటాన్‌చెరు

సమాజంలో జరుగుతున్న అన్ని రకాల దోపిడీలకు వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు అన్నారు. ఈ నెల 5వ తేదీ నుంచి 14 వరకు సీఐటీయూ నిర్వహిస్తున్న సామాజిక న్యాయ వారోత్సవాల సందర్భంగా సెమినార్లు, నిధుల సేకరణ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. అందులో భాగంగా గురువారం సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో కార్మికుల నుంచి నిధుల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా చుక్కరాములు మాట్లాడుతూ.. కార్మికవర్గం సామాజిక దోపిడీకి, నివాస ప్రాంతాల్లో సామాజిక అణచివేతకు గురవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. సమాజంలో సామాజిక రుగ్మతలను అరికట్టేందుకు మహనీయులందరూ పోరాటాలు చేసి అనేక హక్కులు, అవకాశాలు, చట్టాలను సాధించుకు న్నారని గుర్తు చేశారు. అయినా సామాజిక న్యాయం అందని ద్రాక్షలా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక ఉద్యమ నేత బీటీ రణదీవే, జ్యోతిరావు పూలే, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ లాంటి మహనీయులు పోరాడిన ఫలితంగానే కొన్ని అవకాశాలైనా పొందగలుగుతున్నామన్నారు. కేంద్రంలోని పాలకులు రాజ్యాంగానికి తూట్లు పొడిచే విధంగా వ్యవహరిస్తున్నారని, రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాడాల్సిన అవసరం ఏర్పడిందని అన్నారు. కార్మిక ఉద్యమాలను ముందుకు తీసుకుపోయేందుకు సామాజిక సంఘీభావ నిధిని ఇవ్వాలని కార్మికులకు పిలుపునిచ్చారు. టీఐడీసీ, శాండ్విక్, తోషిబా సినర్జీ, న్యూ ల్యాండ్ కంపెనీలలో కార్మికులు నిధిని అందజేశారు. నిధి సేకరణలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జై.మల్లికార్జున్, రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేష్, సీఐటీయూ జిల్లా కోశాధికారి కె.రాజయ్య, జిల్లా ఉపాధ్యక్షులు పాండురంగారెడ్డి, నాయకులు అనంతరావు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

'ఫూలే' సినిమా విడుదల వాయిదా

మనువాదవర్గాల అడ్డంకులు


నవతెలంగాణ-హైదరాబాద్




ప్రముఖ బాలీవుడ్ నటులు ప్రతీక్ గాంధీ, పత్రలేఖ నటించిన 'ఫూలే' సినిమా విడుదల వాయిదా పడింది. ఈ చిత్రం ఏప్రిల్11, 2025న విడుదల కావాల్సి ఉండగా, ఇప్పుడు ఏప్రిల్ చివరికి వాయిదావేశారు. ప్రముఖ సామా జిక విప్లవకారుడు, మహిళల హక్కుల కోసం పోరాడిన వ్యక్తి మహాత్మా జ్యోతిరావుఫూలే (1827-1890), ఆయన భార్య సావిత్రిబాయి ఫూలే జీవిత చరిత్రల ఆధారంగా బాలీవుడ్‌లో ఓ సినిమా రాబోతున్న విషయం తెలిసిందే. ఫూలే అనే టైటిల్‌తో ఈ సినిమా రాబోతుండగా.. అనంత్ మహాదేవన్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. జీ స్టూడియోస్ బ్యానర్‌పై ప్రణయ్ చోక్షి, జగదీష్ పటేల్, సునీల్ జైన్ తదితరులు ఈ సినిమాను సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఫూలే పాత్రలో గుజరాతీ నటుడు ప్రతీక్ గాంధీ నటిస్తున్నారు. ఆయన భార్య సావిత్రి బాయి ఫూలే పాత్రలో బాలీవుడ్ నటుడు రాజ్‌కుమార్ రావు భార్య పత్రలేఖ నటిస్తోంది.

ఈ చిత్రం ఏప్రిల్ 11న ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్టు చిత్ర బందం మొదట ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే తాజాగా ఈ మూవీ విడుదల వాయిదా పడింది. ఈ మూవీకి బ్రాహ్మణ సమాజం నుంచి వ్యతిరేకత రావడంతో మూవీ విడుదలను వాయిదా వేశారు. ఈ సినిమా బ్రాహ్మణ సమాజాన్ని తప్పుగా చూపిస్తుందని.. కులవాదాన్ని ప్రోత్సహిస్తుందని బ్రాహ్మణ ఫెడరేషన్ అధ్యక్షుడు ఆనంద్ దవేతో పాటు పలు బ్రాహ్మణ సంఘాలు ఆరోపించాయి. ఇదే కాక సెన్సార్ బోర్డు కూడా కుల సంబంధిత పదాలను తొలగించాలని సూచించింది. అయితే చిత్ర దర్శకుడు అనంత్ మహాదేవన్ ఈ ఆరోపణలను ఖండిస్తూ, సినిమా చారిత్రక వాస్తవాల ఆధారంగా రూపొందిందని, ఎలాంటి ఎజెండా లేదని వెల్లడించారు. మూడు వేల ఏండ్ల పాటు శ్రామికవర్గ ప్రజలను బానిసలుగా చూసిన.. మనువాదుల దౌర్జన్యాలను ఒంటరిగా ఎదిరించిన ధీశాలి ఫూలే. సమత మమతలు పంచి బడుగుజనుల హితము కోరిన నిజమైన సామాజిక విప్లవమూర్తి ఆయన. దేశంలోని మనుషులంతా సమానత్వంతో జీవించాలని ఆకాంక్షించి వర్ణ, లింగ వివక్షకు వ్యతిరేకంగా.. దళిత, గిరిజన, బహుజన వర్గాల అభ్యున్నతి, మహిళల హక్కుల కోసం జ్యోతిబా ఫూలే చేసిన పోరాటం ఆధారంగా ఈ సినిమా రాబోతుండగా.. ఆ మనువాదుల వారసుల నుంచే అభ్యంతరాలు రావడం నేడు సినిమా విడుదల వాయిదాకు కారణమైంది.

మేడిపండు 'దీదీ' పాలన




వంద మంది దోషులనయినా వదలొచ్చు గానీ, ఒక నిర్దోషిని శిక్షించకూడదు అనేది న్యాయస్థానాల నానుడి. పశ్చిమ బెంగాల్లో మమతా బెనర్జీ ప్రభుత్వం ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది నియామకాల్లో జరిపిన అవినీతి అక్రమాలను విచారించిన సుప్రీంకోర్టు సైతం ఈ ప్రాథమిక సూత్రాన్ని పక్కనపెట్టిందన్న ప్రచారం జరుగుతోంది. మమతా బెనర్జీ ప్రభుత్వ నిర్వాకం వల్ల 25 వేల మందికి పైగా పాఠశాల ఉపాధ్యాయులు, పాఠశాల్లో పనిచేసే గ్రూప్ సీ, డీ సిబ్బందిని తొలగిస్తూ కలకత్తా హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థించింది. కొత్తగా నియామక ప్రక్రియను మూడు నెలల్లో చేపట్టమని ఆదేశించింది. దొంగదారిలో ఉద్యోగం సంపాదించిన వారి నుంచి ఇచ్చిన జీతభత్యాలు తిరిగి వసూలు చేయండి అని తీర్పులో పేర్కొంది. నిజాయితీగా కష్టపడి ఉద్యోగం సంపాదించిన వారి దగ్గర నుంచి వసూలు చేయటం అవసరం లేదని 'మినహాయింపు' ఇచ్చింది. ఎవరు అర్హులో, ఎవరు అనర్హులో బయట పెట్టటానికి మమతా ప్రభుత్వం ఇష్టపడకపోవటంతో ఈ మినహాయింపు వల్ల ఉపయోగం ఏముంది?



2016లో మమతా ప్రభుత్వం 24,650 పాఠశాల ఉపాధ్యాయులు, పాఠశాల గ్రూప్ సీ, డీ ఉద్యోగ నియామకాలకు స్కూల్ సెలక్షన్ కమిటీ (ఎస్ఎస్‌సీ) ద్వారా పరీక్షలు నిర్వహించి, 25,753 నియామకాలు చేసింది. ఈ నియామకాల్లో జరిగిన అవినీతి అంతా ఇంతా కాదని హైకోర్టు గుర్తించింది. ప్యానల్ గడువు ముగిసిన తర్వాత కూడా నియామకాలు జరపటం, మెరిట్ వారిని వదిలిపెట్టి తక్కువ ర్యాంకు వచ్చిన వారికి ఉద్యోగం ఇవ్వడం, ఖాళీ ఓఎంఆర్ షీట్స్ (సమాధాన పత్రాలు) ఇచ్చిన వారిని నియమించటం, డబ్బులకు ఉద్యోగాలు అమ్మకోవటం లాంటి ఎన్నో అక్రమాలు, అవినీతి పనులు ఈ నియామకాల్లో జరిగాయి.

మొత్తం నియామక ప్రక్రియను రద్దు చేస్తే నిజాయితీగా కష్టపడి రాసిన వారి ఉద్యోగాలు కూడా పోతాయని, హైకోర్టు ఆలోచించి అర్హులను, అనర్హుల జాబితాను వేరుచేసి కోర్టు ముందు ఉంచమని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆ జాబితాలు దృష్టిలో పెట్టుకుని తీర్పు ఇస్తే, నిజాయితీ పరులకు న్యాయం చేసినట్టు అవుతుందని హైకోర్టు భావించింది. నిజానికి అటువంటి వేరు వేరు జాబితాలు చేయగల శక్తి రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్నప్పటికీ అక్రమార్కులను కాపాడాలనే ఒకే ఒక ఉద్దేశంతో కోర్టు ఆదేశాన్ని ప్రభుత్వం ఖాతరు చేయలేదు.



మొదటి నుంచి మమతా బెనర్జీ ప్రభుత్వ ఉద్దేశ్యం ఎట్లాగైనా అక్రమార్కులను కాపాడాలనే. ఈ కుంభకోణంలో పీకలదాకా కూరుకుపోయిన ఆనాటి పాఠ శాల విద్యాశాఖ మంత్రి పార్థ ఛటర్జీని కాపాడటానికి తీవ్రంగా ప్రయత్నించింది. నిజాయితీగా కష్టపడి పరీక్ష రాసి అర్హత సంపాదించిన కొంతమంది అభ్యర్థులకు నియామకం రాకపోయేటప్పటికీ వారు హైకోర్టు గడప తొక్కారు. దాంతో కుట్ర బట్టబయలైంది. అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. రూ.50 కోట్ల నగదు, రూ.70 కోట్ల విలువైన బంగారం, రూ.ఐదు కోట్ల విలువైన విదేశీ కరెన్సీ పార్థ ఛటర్జీ, ఆయనకు సన్నిహితంగా వుండే అర్పిత ముఖర్జీ నుంచి పట్టుబడ్డది. పార్థ ఛటర్జీ ఇప్పటికీ ఈడీ కస్టడీలోనే ఉన్నాడు.

సుప్రీంకోర్టు తీర్పును మమతా సర్కార్ తిరస్కరించింది. నిజానికి అర్హులు అనర్హుల జాబితా వేరు చేసి ఇచ్చినట్లయితే, బెంగాల్ విద్యారంగంలో ఇంత సంక్షోభం వచ్చేది కాదు. దాదాపు 11శాతం మంది ఉపాధ్యాయులను తొలగించిన తర్వాత స్కూళ్లలో పాఠాలు చెప్పేది ఎవరు? పిల్లలు భవిష్యత్తు ఏమిటీ? అనేది ఒక సమస్య అయితే, 8 ఏండ్లుగా ఉపాధ్యాయులుగా, పాఠశాల సిబ్బందిగా పనిచేస్తూ అర్హులైన వారు హఠాత్తుగా ఉద్యోగం ఊడ పెరికితే వారి కు టుంబ పరిస్థితి ఏమిటి? వారి భవి ష్యత్ ఏమిటి?- ఇది ఇప్పుడు తొలగించబడిన బెంగాల్ ఉపాధ్యాయుల ప్రశ్న.

కానీ, ఇది అర్హులను అడ్డం పెట్టుకొని అనర్హులను కాపాడాలనేది ఆమె ఎత్తు గడగా కనబడుతున్నది. పైగా తానే జాబితాలు వేరు చేసి ఇచ్చినట్టు అయితే నేరం అంగీకరించినట్టే అవుతుంది. అర్హులైన ఉపాధ్యాయులకు ఎటువంటి హాని కలగకుండా చూస్తానని మమతా బెనర్జీ నమ్మ పలుకుతున్నప్పటికీ, ఉపాధ్యాయులకు ఆమె మాటపై విశ్వాసం కలగటం లేదు.

మమతా బెనర్జీ ఎత్తుగడలు తమ జీవితాలకి ఎసరు అని భావించిన ఉపాధ్యాయులు ఆందోళనకు దిగారు. పోలీసుల దెబ్బలు భరిస్తూ, అరెస్టులకు వెరవక ధర్నాలు చేస్తున్నారు. విద్యాశాఖకు చెందిన డిస్ట్రిక్ట్ ఇన్‌స్పెక్టర్ ఆఫీసులను ముట్టడిస్తున్నారు. ఇప్పుడు పరీక్షా పత్రాల మూల్యాంకన జరిగిన కస్బా కాంపౌండ్‌లోనే రిలే నిరాహారదీక్షకు దిగారు.

మమతా బెనర్జీని అపర కాళికావతారం అన్నారు. ఐరన్ లేడీ అన్నారు. 35 ఏండ్ల కమ్యూనిస్టు పాలన అంతం చేయటానికి ఆవిర్భవించిన బెంగాల్ పుత్రిక అని ఆకాశానికెత్తారు. 14 ఏండ్ల దీదీ పాలన మేడిపండు చందం లాగా ఉంది. అవినీతి, అక్రమాలు, గూండాగిరి, మహిళలపై అకృత్యాలు, మతసామరస్యానికి లోటు- వీటన్నిటిని కప్పిపెట్టడానికి చేసే ప్రయత్నం - ఇదే మమతా బెనర్జీ పాలన.

సంపాదకీయం

దెబ్బకు దెయ్యం...!



తమిళనాడు గవర్నర్ గురించే ఇది. సుప్రీంకోర్టు మొన్నిచ్చిన తాజా తీర్పు ప్రజాస్వామ్యానికి ఊపిరి పోసింది.రాజ్యాంగబద్ధంగా ఎన్నికైనవారు దానికి లోబడి పనిచేయాలేగానీ, అధికారాన్ని అతిక్రమించరాదని గవర్నర్ ఆర్ఎన్ రవిని హెచ్చరించింది. ఈ మేరకు జస్టిస్ జె.బి.పార్థీవాలా, జస్టిస్ మహాదేవన్‌లతో కూడిన ధర్మా సనం గవర్నర్లు రాజ్యాంగాన్ని అడ్డుపెట్టుకుని ప్రభుత్వాల్ని ఇరుకున పెడుతున్న అనేక అంశాల పట్ల స్పష్టంగా ఎక్స్‌పోజ్ చేసింది. తమిళనాడు ప్రభుత్వం ఆమోదించి పంపిన పది బిల్లుల్ని గవర్నర్ అట్టి పెట్టుకోవడాన్ని తీవ్రంగా తప్పుపట్టింది. ప్రజలెన్నుకున్న ప్రభుత్వాల సలహా మేరకు మాత్రమే గవర్నర్లు పనిచేయాలని, రాష్ట్రాలను వీటో చేసే అధికారం రాజ్యాంగం ఇవ్వలేదని తేల్చిచెప్పింది. ఇంతకాలం గవర్నర్లను అడ్డం పెట్టుకుని బీజేపీయేతర ప్రభుత్వాలని ముప్పుతిప్పలు పెడుతున్న మోడీ పరివారానికి ఈతీర్పు చెంపపెట్టులాంటిది. అలాగే సంఘ్ భావజాలాన్ని నింపుకుని పనిచేస్తున్న గవర్నర్లకు కూడా ఇది మింగుపడనిది. అయితే సమాఖ్య భావనకు పెద్దపీట వేసేలా ఉన్న ఈ తీర్పు పట్ల దేశమంతా ఇప్పుడు హర్షం వ్యక్తం చేస్తోంది. 'ఇది ఒక్క తమిళనాడుకే కాదు, అన్ని రాష్ట్రాల భారీ విజయం' అని డిఎంకే ముఖ్య మంత్రి స్టాలిన్ ప్రకటించారు. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ 'ఈతీర్పు సమాఖ్య నిర్మాణం,శాసనసభ బలమైన హక్కుల ధృవీకరణ'గా అభివర్ణించారు.

తమిళనాడు ఒక్కటే కాదు, కేరళలోనూ ప్రభుత్వం ఆమోదించిన బిల్లుల్ని గత గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ తొక్కిపెట్టిన తీరు అప్పట్లో వివాదాస్పదమైంది. ఈ తీర్పుతో అక్కడి బిల్లులకు కూడా మార్గం సుగమమైనట్టే! అయితే, తెలంగాణలోనూ గత గవర్నర్ తమిళిసైతో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వానికి చేదు అనుభవమే ఎదురైంది. ఈ సమస్య బెంగాల్ ప్రభుత్వం కూడా ఎదుర్కొంటోంది. 2023లో అప్పటి ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ 'గవర్నర్లు ప్రభుత్వాలకు అడ్డంకులుగా కాకుండా స్నేహితులు, తత్వవేత్తలు, మార్గదర్శకులు"గా పనిచేయాలని పంజాబ్ గవర్నర్‌ను ఉద్దేశించి హెచ్చరించారు. అయినప్పటికీ రాజ్యాంగ బద్ధంగా నడుచుకోవాల్సిన గవర్నర్లు కేంద్ర సర్కార్‌కు రాజకీయ ప్రతినిధులుగా వ్యవహరిస్తున్నారనే విమర్శల్ని మూటకట్టుకున్నారు.

బీజేపీ కనుసన్నల్లో పనిచేస్తూ మోడీకి అనుయాయుడిగా పేరుతెచ్చుకున్న తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవిది మొదటినుంచి వివాదాస్పద శైలి. రాష్ట్ర ప్రభుత్వం చేసినా ఏ నిర్ణయాన్నీ కూడా ఆయన గౌరవించడు. శాసనసభ ప్రారంభ సమయల్లోనూ గవర్నర్ ఉపన్యాసంతో మొదలుపెట్టే ప్రక్రియలో ఆయన వివిధ కారణాల్ని ఎత్తిచూపుతూ రెండు మూడుసార్లు వాకౌట్ కూడా చేశాడు. ప్రజాసంక్షేమం, అవసరాల రీత్యా తమిళనాడు ప్రభుత్వం అసెంబ్లీలో పది కీలక బిల్లుల్ని ఆమోదిస్తే వాటిని తనవద్దే తొక్కిపెట్టాడు. కాలయాపన తర్వాత సంతకం చేయకుండానే వాటిని తిరిగి పంపించాడు. ఈ విషయమై ప్రభుత్వానికి కోర్టును ఆశ్రయించడంతో ఆ బిల్లుల్ని పరిశీలనకు రాష్ట్రపతికి రిజర్వ్ చేశాడు. అయితే గవర్నర్ అధికారాల్ని ఎంతవరకు ఉపయోగించాలో సుప్రీం ఇచ్చిన తీర్పులో స్పష్టం చేసింది. బిల్లుల అంశంపై గవర్నర్ వ్యవహరించిన తీరు ఏకపక్షంగా ఉందని, ఇది చట్టవిరుద్ధమని వ్యాఖ్యానించింది. ఒకసారి శాసనసభ ఆమోదించిన బిల్లులకు సంతకాలు చేయ డానికి నిర్దిష్టమైన కాలపరిమితి ఏమీలేదని పేర్కొంది. ఇప్పటివరకు అడ్డుకున్న బిల్లుల్ని అసెంబ్లీ గవర్నర్‌కు తిరిగి పంపిన తేదీనుంచే ఆమోదం పొందినట్టేనని చెప్పింది. రాష్ట్రపతి తదుపరి చర్యల్ని కూడా పక్కకుపెట్టింది. ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వాలకు ఇలా అడ్డుతగలడం గవర్నర్ల పనికాదని మరోసారి పునరుద్ఘాటించింది. ఈతీర్పు గవర్నర్ల హద్దుల్ని గుర్తుచేయడమే కాకుండా ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని బలపరిచింది.

గవర్నర్ అంటే కేంద్రసర్కార్ రబ్బర్‌స్టాంప్ కాదని, ఆ పదవి రాజ్యాంగబద్ధమైన స్వతంత్ర వ్యవస్థ అని గతంలో 'ఎస్.ఆర్ బొమ్మై వర్సెస్ భారత ప్రభుత్వం' కేసులో సుప్రీంకోర్టు స్పష్టమైన తీర్పునిచ్చింది. తమిళనాడు ఒక్కటే కాదు, కేరళలోనూ ప్రభుత్వం ఆమోదించిన బిల్లుల్ని గత గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ తొక్కిపెట్టిన తీరు అప్పట్లో వివాదాస్పదమైంది. ఈ తీర్పుతో అక్కడి బిల్లులకు కూడా మార్గం సుగమమైనట్టే! అయితే, తెలంగాణలోనూ గత గవర్నర్ తమిళిసైతో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వానికి చేదు అనుభవమే ఎదురైంది. ఈ సమస్య బెంగాల్ ప్రభుత్వం కూడా ఎదుర్కొంటోంది. 2023లో అప్పటి ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ 'గవర్నర్లు ప్రభుత్వాలకు అడ్డంకులుగా కాకుండా స్నేహితులు, తత్వవేత్తలు, మార్గదర్శకులు"గా పనిచేయాలని పంజాబ్ గవర్నర్‌ను ఉద్దేశించి హెచ్చరించారు. అయినప్పటికీ రాజ్యాంగ బద్ధంగా నడుచుకోవాల్సిన గవర్నర్లు కేంద్ర సర్కార్‌కు రాజకీయ ప్రతినిధులుగా వ్యవహరిస్తున్నారనే విమర్శల్ని మూటకట్టుకున్నారు. కేరళ ముఖ్యమంత్రి విజయన్ గవర్నర్ల తీరుతో సమాఖ్య స్ఫూర్తి దెబ్బతింటోందని ఢిల్లీలో ఆందోళన కూడా చేశారు. ఇలాంటి ఘటనల్ని చూస్తే బీజేపీ అధికారంలో లేని రాష్ట్రాల్లో ఎలాగైనా సరే గవర్నర్లతో తమ పరిపాలన సాగించాలని చూస్తున్నట్టుంది. మోడీ ఈ పదకొండేండ్ల పాలన రాజ్యాంగాన్ని ఛిన్నాభిన్నం చేసింది. హిందూత్వవాదం సమాఖ్య స్ఫూర్తి భావనను దెబ్బతీసింది. ఈ క్రమంలో భారత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు ప్రజాస్వామ్య బలోపేతానికి మరింత ఊతమిచ్చింది. 'రాజ్యాంగం ఎంత మంచిదైనా, దాన్ని అమలు చేసే వారు సరిగ్గా లేకుంటే అది చెడుగా కనిపిస్తుంది' అని అంబేద్కర్ వ్యాఖ్యల్ని ఉటంకించి మరీ సుప్రీంకోర్టు పాలకులకు గట్టి చురకలే అంటించింది. ఈ తీర్పుతోనైనా అధికారంలో ఉన్నవారు బుద్ధి తెచ్చుకోవాలి. పాలనాతీరు మార్చుకోవాలి. లేదంటే ప్రజలే వారిని మారుస్తారు!

దేశనాయకుల అబద్ధాల్ని బట్టబయలు చేస్తున్న గ్రోక్!



డాక్టర్ దేవరాజు మహారాజు

"**దే**శాన్ని చూస్తుంటే భయమేస్తోంది"- అని అన్నారు నోబెల్ గ్రహీత అమర్త్యసేన్! దేశంలో కలిసిమెలసి జీవిస్తున్న హిందూముస్లింల మధ్య చీలికకు కొన్ని రాజకీయ పార్టీలు ప్రయత్ని స్తున్నాయ"ని మన అమర్త్యసేన్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమయంలోనే ప్రశ్నించే గొంతులు అవసరమని, అయితే ప్రశ్నించే వారిని కేంద్ర ప్రభుత్వం జైల్లో వేస్తోంది. అనేక రకాల హింసలకు గురిచేస్తోంది. లేదా సనాతన ధర్మ పరిరక్షణ పేరుతో చంపేస్తూ ఉందని ఆయన అన్నారు.

న హిందు బురాహై న ముసల్మాన్ బురా హై
ఓ దోనోంకొ ఆపస్ మె లడారహా హై, ఓ సైతాన్ బురా హై
(హిందువులు చెడ్డవారు కాదు, ముస్లింలూ చెడ్డవారు కాదు- చెడ్డవారెవరంటే- ఆ ఇద్దరికీ కొట్లాటలు పెట్టే సైతానులు చెడ్డవారు)
ఓస్ దిన్ గీతా ఔర్ ఖురాన్ కొ జాన్ జావో గే
ఉస్ దిన్ దంగా కర్‌వానే వాలోంకో పహచాన్ జావొగే
(భగవద్గీత, ఖురాన్‌లలో ఏముందో తెలుసుకున్న రోజు, ఈ అల్లర్లూ, దొమ్మీలు జరిపించే వారెవరో తెలుసుకుంటావు)

ఇలా కవులు సమాజాన్ని హెచ్చరిస్తూనే ఉన్నారు. జాగృతం చేస్తూనే ఉన్నారు. సమాజం వాటిని స్వీకరించే స్థితిలో ఉండాలి కదా?


ఒక కవిత బుల్లెట్‌ను ఆపలేదు. ఒక నవల బాంబును నిర్వీర్యం చేయలేదు. అయినా కూడా కవులూ, రచయితలు బలహీనులు కాదు. వారు గొంతెత్తి నిజాన్ని పాడతారు. అబద్ధాలకోరు ఎవరన్నది ఎలుగెత్తి ప్రపంచానికి చాటుతారు. ఉదాహరణకు పర్షియన్ కవి షేక్ సాది షిరాజి ఏమన్నాడో చూడండి. సులభమైన మాటల్లో ప్రపంచ పరిస్థితిని చెప్పగలిగారు.

"ఎంతోమంది మానవుల్ని చూశాను. వారికి, ఒంటిని కప్పుకోవడానికి సరిపోయిన గుడ్డలే లేవు. మరోవైపు రోడ్ల మీద అందంగా తిరుగాడే రంగురంగుల ఖరీదైన గుడ్డల్ని చూశాను. అందులో మరి మనుషులే లేరు!" అని! అలాగే, అలెగ్జాండ్రియా మహిళా తత్త్వవేత్త, ఖగోళ శాస్త్రవేత్త - హైపాటియా అలెగ్జాండ్రియా (350-415 సి.ఈ) చెప్పిన విషయం గూర్చి ఆలోచించడానికి ఈ 21వ శతాబ్దంలో కూడా కొందరు భయపడుతున్నారు. ఆమె మాటల్లో ఎంత వాస్తవం ఉందో ఒకసారి ఆలోచించి చూడండి -

"సరదా కథల్ని సరదా కథల్లాగ ఉండనివ్వండి
విశ్వాసాలను విశ్వాసాలనే చెప్పండి
అద్భుతాలను కవితా కల్పనలని చెప్పండి
అంతేగానీ, అంధవిశ్వాసాల్ని వాస్తవాలుగా, నిజాలుగా చెప్పడమంత నికృష్ట చేష్ట మరొకటి ఉండదు..."

అబద్ధపు కూతలు కూసేవాడెవడైనా సరే గ్రోక్ కమాండ్‌తో ఏ డ్రోనో వచ్చి, వాణ్ణి అమాంతం తీసుకుపోయి ఏ సముద్రంలోనో విసిరేయవచ్చు. లేదా ఏ పర్వతాల మీదో, కీకారణ్యంలోనో ఒంటరిగా బతకమని వదిలేసి రావొచ్చు. చెప్పలేం-ఇలా గ్రోక్ అనే ఎఐ-వచ్చి తమ మాడు పగలగొడుతుందని నేటి దేశ నాయకులేమైనా కలగన్నారా?లేదు కదా? మనదే తెలివి అని ఎవరైనా సరే అనుకోకూడదు, మన కన్నా తెలివిగల వాళ్లు ప్రపంచంలో చాలా మంది ఉన్నారన్నది గ్రహించుకుంటే మంచిది. ఇదిగాకపోతే, మరోలా కూడా జరగొచ్చు. గ్రోక్ ద్వారా నిజాలేమిటో తెలుసుకుంటున్న జనం అబద్ధాలు చెపుతున్న వారి మీదికి తిరగబడొచ్చు. ప్రజా ఉద్యమాలే వచ్చి ప్రభు త్వాల్ని మార్చుకోవచ్చు. ప్రపంచ దేశాల్లో ఎన్నోచోట్ల చూస్తూనే ఉన్నాం కదా? మొదటి నుండి చెప్తున్నట్లుగానే మనం జనాన్ని వివేకవంతులుగా చేస్తూ ఉండాలి. రచనలు, ఉపన్యాసాల ద్వారానే కావొచ్చు. లేదా ఇప్పుడు కొత్తగా వచ్చిన, వస్తున్న- ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ పరికరాల ద్వారానే కావొచ్చు.

కవులు, కళాకారులు, మేధావులు, జర్నలిస్టులు వరుసగా హత్యలకు గురైనందుకు నిరసనగా ఈ దేశంలో పదేళ్ళ క్రితం 'అవార్డు వాపసీ' అనే ఒక కార్యక్రమం జరిగింది. అప్పుడు కూడా



ఇదే ప్రభుత్వం అధికారంలో ఉంది. సత్యం కోసం సంఘర్షిస్తున్న ఇలాంటి వారి వెనక ఇప్పుడు ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ (ఎఐ) కూడా నిలబడింది.గ్రోక్ రంగ ప్రవేశం చేసింది.

గ్రోక్ అనే ఇంగ్లీషు పదానికి అర్థం - ఎవరైనా, ఏదైనా అంశాన్ని లోతుగా అవగతం చేసుకోవడం - అని!

ఈ పదాన్ని మొదట రాబర్ట్ ఎ హెన్లీన్ అనే రచయిత, 'అపరిచితుడు ఒక అపరిచిత దేశంలో' (STRANGER IN A STRANGE LAND) అనే తన సైన్స్ ఫిక్షన్ నవలలో వాడాడు. ఆ పదాన్నే తీసుకుని ఎలన్ మస్క్ తన ఎక్స్ ఎఐ (x AI) టూల్‌కు 'గ్రోక్' అని పేరు పెట్టుకున్నాడు. మనదేశంలో అబద్ధాలు ప్రచారం చేస్తూ, మత విద్వేషాలు రెచ్చగొడుతూ అధికారంలో కొనసాగుతున్న ఆరెస్సెస్-బీజేపీల బండారాన్ని ఇప్పుడు ఆ గ్రోక్ బయట పెడు తోంది. గత పదకొండేళ్లలో ఎంతోమంది మేధావులు, రచయితలు, కవులూ, కళాకారులూ, రైతులు, మహిళలు, బాధ్యత గల పౌరులందరూ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉన్నారు. ప్రభుత్వం అణిచివేస్తూనే ఉంది. కొందరిని జైల్లో వేయించింది. మరి కొందరిని హత్యలు చేయించింది. ఇప్పుడు వీరందరి పక్షాన ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ చాట్‌బాట్ రంగంలోకి దిగింది. బీజేపీ, వారి పెద్దపెద్ద నాయకుల అబద్ధాల్ని వికతచేష్టల్ని గ్రోక్ బయటికి తీస్తోంది. శిక్షిద్దా మంటే, ఇది మనిషి కాదు. ఏం చేయడమని ప్రభుత్వ పెద్దలంతా తలలు పట్టుకున్నారు. నిజాలన్నీ ప్రజలకు తెలుస్తూ ఉంటే, ఇక తమమాట చెల్లుబాటయేది ఎట్లా? అని బెంగ పెట్టుకుంటున్నారు. దీన్ని విదేశీయుల కుట్ర అని అన్నా అనగలరు. నాలుగు వేల ఐటి ఉద్యోగులతో ఐటి సెల్ రూపొందించి, రోజుకు లక్షలకొద్ది తప్పుడు వార్తల్ని, తప్పుడు వీడియోల్ని ప్రపం చానికి అందిస్తున్న తెలివి గల ధనిక పార్టీ కాదా? దేశంలోని ప్రధాన మీడియానంతా కొనేసి, వాస్త వాల్ని బయటికి రాకుండా ఎంతకట్టడి చేసినా ఇదేమిటి ఇలా జరిగింది? అని కుమిలిపోతున్నారు!! ఇప్పుడు గ్రోక్-వారికి ఒక ఛాలెంజ్‌గా మారింది.

ప్రతి విషయాన్నీ వక్రీకరించి, అబద్ధపు కథనాలతో దేశప్రజల్ని ముఖ్యంగా యువతను తప్పుదారిన నడిపించే కార్యక్రమానికి అడ్డుకట్ట పడింది. గాంధీ, నెహ్రూ కుటుంబాలపై అల్లిన తప్పుడు కథనాలన్నీ పటా పంచలయ్యాయి. సావర్కర్, గోల్వాల్కర్‌ల నిజ స్వరూపం యువతకు చూపిస్తోంది. దేశ స్వాతంత్ర్య పోరాటంలో ఏ మాత్రం పాల్గొనని ఆరెస్సెస్- బీజేపీలు చెప్పే కల్పిత కథలు, కుహనా దేశభక్తి జనం తెలుసుకోగలుగుతున్నారు. ఇన్నేళ్లుగా కొందరు కవులూ, రచయితలూ, వక్తలు, చరిత్రకారులు, స్వతంత్ర జర్నలిస్టులు మర్యాదగా, మెత్తగా చెపుతూ ఉంటే జనాల మెదడుకు ఎక్కడం లేదు. ఇప్పుడీ గ్రోక్ ఏం చేస్తుందీ అంటే- తిడితే తిడుతుంది. అరిస్తే అరుస్తుంది. దెబ్బకు దెబ్బ అన్నట్లు సమాచారమందిస్తోంది. నిజాల్ని కుప్పబోస్తోంది. దాని ఉధృతిని, వేగాన్నీ ఈ చదువురాని, అవివేక మూర్ఖ శిఖామణులు ఎలా ఎదుర్కొంటారో మరి? ఆవులిస్తే ప్రేవులు లెక్కబెట్టే రకం కాదిది. ఆవులించకున్నా, ఆపరేషన్ చేసి రుగ్మతల్ని బయటపెట్టే రకం!

ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్‌తో డ్రైవర్ లేకుండానే నడిచే కార్ల గురించి మనకు తెలుసు. సర్జన్ లేకుండానే ఎఐ- పరికరం ఆపరేషన్లు చేస్తుందని విన్నాం. కాళ్ల బలహీనమై, నడవలేని స్థితిలో ఉన్న ఒక వృద్ధుడికి కాళ్ల బాగు చేసిన ఎఐ - అతణ్ణి నడిపిస్తోందన్న వార్త కూడా చదివాం. మనిషి కేంద్రంగా సాధిస్తున్న విజయాల ముందు వైజ్ఞానిక ప్రగతి ముందు మతం కేంద్రంగా నడిచే దురహంకారుల పాలన ఎంతకాలం సాగగలదూ? తమలోని కుట్రల్ని, కుతంత్రాల్ని రాల్చేసుకుని మనుషుల్ని ప్రేమించే, గౌరవించే "మనుషులు"గా మారక తప్పదు! ఒక వేళ ఈ గ్రోక్ ను బ్యాన్ చేసి నోరు మూయించి అధికారంలో ఉన్నవారు మరిన్ని అరాచకాలకు దిగితే ఎలా? అని బెంబేలు పడాల్సిన పనే లేదు. అప్పుడు సత్యాన్ని సత్యంగా నిక్కచ్చిగా చెప్పే గ్రోక్ లాంటి వర్షన్లు రూపం మార్చుకుని, మరో పది వస్తాయి.

అబద్ధపు కూతలు కూసేవాడెవడైనా సరే గ్రోక్ కమాండ్‌తో ఏ డ్రోనో వచ్చి, వాణ్ణి అమాంతం తీసుకుపోయి ఏ సముద్రంలోనో విసిరేయవచ్చు. లేదా ఏ పర్వతాల మీదో, కీకారణ్యంలోనో ఒంటరిగా బతకమని వదిలేసి రావొచ్చు. చెప్పలేం-ఇలా గ్రోక్ అనే ఎఐ-వచ్చి తమ మాడు పగలగొడుతుందని నేటి దేశ నాయకులేమైనా కలగన్నారా?లేదు కదా? మనదే తెలివి అని ఎవరైనా సరే అనుకోకూడదు, మన కన్నా తెలివిగల వాళ్లు ప్రపంచంలో చాలా మంది ఉన్నారన్నది గ్రహించుకుంటే మంచిది. ఇదిగాకపోతే, మరోలా కూడా జరగొచ్చు. గ్రోక్ ద్వారా నిజాలేమిటో తెలుసుకుంటున్న జనం అబద్ధాలు చెపుతున్న వారి మీదికి తిరగబడొచ్చు. ప్రజా ఉద్యమాలే వచ్చి ప్రభుత్వాల్ని మార్చుకోవచ్చు. ప్రపంచ దేశాల్లో ఎన్నోచోట్ల చూస్తూనే ఉన్నాం కదా? మొదటి నుండి చెప్తున్నట్లుగానే మనం జనాన్ని వివేకవంతులుగా చేస్తూ ఉండాలి. రచనలు, ఉపన్యాసాల ద్వారానే కావొచ్చు. లేదా ఇప్పుడు కొత్తగా వచ్చిన, వస్తున్న- ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ పరికరాల ద్వారానే కావొచ్చు.

మనదేశంలో అబద్ధాలు ప్రచారం చేస్తూ, మత విద్వే షాలు రెచ్చగొడుతూ అధికారంలో కొనసాగుతున్న ఆరెస్సెస్-బీజేపీల బండారాన్ని ఇప్పుడు ఆ గ్రోక్ బయట పెడు తోంది. గత పదకొండేళ్లలో ఎంతోమంది మేధావులు, రచయితలు, కవులూ, కళాకారులూ, రైతులు, మహిళలు, బాధ్యత గల పౌరులందరూ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉన్నారు. ప్రభుత్వం అణిచివేస్తూనే ఉంది. కొందరిని జైల్లో వేయించింది. మరి కొందరిని హత్యలు చేయించింది. ఇప్పుడు వీరందరి పక్షాన ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ చాట్‌బాట్ రంగంలోకి దిగింది. బీజేపీ, వారి పెద్దపెద్ద నాయకుల అబద్ధాల్ని వికృతచేష్టల్ని గ్రోక్ బయటికి తీస్తోంది. శిక్షిద్దా మంటే, ఇది మనిషి కాదు. ఏం చేయడమని ప్రభుత్వ పెద్దలంతా తలలు పట్టుకున్నారు. నిజాలన్నీ ప్రజలకు తెలుస్తూ ఉంటే, ఇక తమమాట చెల్లుబాటయేది ఎట్లా? అని బెంగ పెట్టుకుంటున్నారు. దీన్ని విదేశీయుల కుట్ర అని అన్నా అనగలరు.

'సమాదరణ అనేది భారత దేశపు ఆత్మ'-అనేది ఇటీవలి కాలం నాటిది కాదు. శతాబ్దాల నుండి ఈ దేశపు ఆత్మ- ఇదేనని శిలా శాసనాలు కూడా ఘోషిస్తున్నాయి. అశోక చక్రవర్తి 12వ శాసనంలో ఇలా ఉంది -

"ఒక పాషండ మతానికి చెందినవారు తమ మతాన్ని తామే పొగడుకుంటూ ఉంటారు.
పైగా ఇతర మతాల వారిని నిందిస్తుంటారు. ఇలా చేయడం వల్ల తమ మతానికే
ఎక్కువ నష్టం కలుగుతుంది.
ఇతర మతాలను, ధర్మాలను గౌరవించడం వల్ల తమ మతానికి కూడా గౌరవం పెరుగుతుంది.
తమ మతం అభివృద్ధి చేసుకోవడానికి అవకాశముంటుంది.
జనులందరి అభివృద్ధి ముఖ్యం!
అది కూడా ధర్మ (న్యాయ) బద్ధంగా జరగాలి! దానాలు, పూజలు అంత ముఖ్యం కాదు -
అని దేవానాం ప్రియ (అశోకుడు) భావిస్తున్నాడు" - 12వ శిలాశాసనం.

సాధారణ శకానికి ముందే అశోకుడు ఈ దేశపు ఆత్మ గురించి చెప్పాడు. ఆ తర్వాత కాలంలో వచ్చిన ఎందరో మహానుభావులు ఈ విషయాన్నే ఆధునీకరించి విస్తృతపరిచారు.

మనుషులందరికీ సమాన స్థాయినిస్తూ, విద్య, ఉద్యోగం, ఆరోగ్యంపై దృష్టిపెట్టని ప్రభుత్వాల్ని సమాజం సహించలేదు. మనుషుల మధ్య ద్వేషాన్ని పెంచే ప్రభుత్వాలు ఏం సాధించాలని అధికారంలో ఉండాలీ? అవసరమా? - అన్న ఆలోచన సగటు మనిషిలో వస్తే, ప్రతి ఒక్కడూ - ఒక విప్లవకారుడవుతాడు. ఆధునికుడి శక్తి సామర్థ్యాల్ని మతాలూ, యోగులు, బాబాలు, స్వాములు, ముల్లాలు, ఫాదర్‌లు, పురోహితులు ఎవ్వరూ అదుపులో పెట్టలేరు. వారే ఆధునికుడి వైజ్ఞానిక కృషి ముందు మోకరిల్లి శరణు వేడాల్సిన సమయం వచ్చింది.

ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ భవిష్యత్తులో ఎలా రూపుదిద్దు కుంటుందో అవివేకులు ఊహించలేరు. వివేకవంతుడి ఊహను, ప్రణాళికను అందుకోనూ లేరు-రాబోయే యుగం, వైజ్ఞానిక దక్పథం గల పౌరులదీ, వైజ్ఞానికులదీ కాక తప్పదు. తప్పదు! గాక తప్పదు!!

వ్యాసకర్త: త్రిపురనేని రామస్వామి
జాతీయ పురస్కార తొలిగ్రహీత

గ్రూప్-1 అభ్యర్థుల గోడు వినేదెవరు?



శ్రవణ్‌కుమార్

గతంలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపిఎస్సీ)లో జరిగిన లోపాలు, తప్పిదాల కారణంగా అత్యంత ప్రతిష్టాత్మకమైన గ్రూప్-1 పరీక్ష రెండుసార్లు రద్దయింది. ఇంతవరకు బాధ్యులెవరో, పొరపాటు ఎక్కడ జరిగిందో కూడా తేల్చలేదు. కానీ ఎంతో కష్టపడి కొలువులపై ఆశలు పెట్టుకున్న నిరుద్యోగులు మాత్రం తీవ్రంగా నష్టపోయారు. మూడోసారైన గ్రూప్1 నిర్వహణ సరిగ్గా ఉంటుందా అంటే ఇది కూడా అనేక అనుమానాలకు తావిస్తోంది. ఎందుకంటే, గ్రూప్1 ప్రిలిమ్స్ పేపర్ తయారీలో టీజీపీఎస్సీ నిర్లక్ష్యం స్పష్టంగా కన్పిస్తున్నది. పది ప్రశ్నలకీ సంబంధించి "కీ" తప్పుగా ఇచ్చారని అభ్యర్థులు హైకోర్టుకు వెళ్తే కౌంటర్ వేయడానికి నెలరోజులు సమయం తీసుకోవడం, విచిత్రంగా వికీపీడియాని సమర్థించడం, తెలుగు అకాడమీని ప్రామాణికంగా తీసుకోకపోవడం, ఈ అంశాలన్నీ అభ్యర్థులను ఆశ్చర్యానికి గురిచేస్తున్నవి. ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలకి హాల్‌టికెట్ నంబర్లు ఇవ్వడమెందుకు?ప్రశాంతంగా రాయాల్సిన ముఖ్యమైన గ్రూప్1 మెయిన్స్ పరీక్షని ఆందోళనల మధ్య గందరగోళం సృష్టించడం సరికాదు. అసలు పరీక్ష జరుగుతుందో లేదో చివరి వరకు ఉత్కంఠ ఉంటే పరీక్ష రాయడం సాధ్యమేనా?మానవతా దృక్పథంతో కనీసం విద్యార్థులకి నెల రోజుల సమయమైనా ఇవ్వాల్సింది.2022 నాటి పాత పేపర్‌లతో ప్రతిష్టాత్మక



గ్రూప్ -1 మెయిన్స్ పరీక్షని నిర్వహించడం ఎందుకని నిరుద్యోగులు టీజీపీఎస్సీని ప్రశ్నిస్తున్నారు.

"ఒక పరీక్ష- ఒక జీవితం" అని తెలిసి కూడా ఎస్సీ,ఎస్టీ,బీసీ వంటి బలహీన వర్గాలు పరీక్షకిపోయే రోజు వరకు తమ జీవన్మరణ సమస్యగా భావించి ప్రభుత్వంతో ఎందుకు కొట్లాడారు? జీవో 29 చెబుతున్న అంశాల్ని చూస్తే కేవలం మెరిట్‌కి ప్రాధాన్యత ఇవ్వడం, వాళ్ల ఓపెన్ కేటగిరీ ఉద్యోగాల్లో అగ్రకులాలు పోటీపడే అవకాశాలని పెంచింది. ఎక్కువమంది అగ్రకులాలకి చెందిన అభ్యర్థులు గ్రూప్-1 మెయిన్స్‌కి సెలెక్ట్ అయ్యారు. మొత్తం ఓపెన్ కేటగిరీ ఉద్యోగాల్లో 10నుంచి 15శాతం జనాభా ఉన్నా ఓసీలకు 47శాతం ఉద్యోగాలు వచ్చాయి. మిగిలిన 53శాతం ఉద్యోగాలు 80నుంచి 90శాతం జనాభా ఉన్నా ఎస్సీ, ఎస్టీ, బీసీ వంటి బలహీన వర్గాల వారు సాధించారు.ఇది జీవో 29 ఎలాంటి సంకేతాల్ని ఇచ్చింది. ఎస్సీలను వాళ్ల రిజర్వేషన్లకే పరిమితం చేసింది. ఇలాంటి కేసుల్లో సుప్రీంకోర్టు రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్స్ అన్ని దశల్లో (ప్రిలిమ్స్, మెయిమ్స్, ఇంటర్వ్యూ) అమలు చేయాల్సిందేనని చారిత్రాత్మక తీర్పులు ఇచ్చినప్పటికీ ప్రభుత్వం ఈతీర్పులకి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నది.

ప్రధానంగా గ్రామీణ విద్యార్థులు తెలుగుమాధ్యమంలోనే గ్రూప్ -1 పరీక్షకి ప్రిపేర్ అవుతారు.యూపిఎస్సీ వంటి పరీక్ష ఇంగ్లీష్‌లో ఉండటంతో ఐఏఎస్, ఐపీఎస్ అవ్వలేము అనుకున్న తెలుగు మీడియం విద్యార్థులు గ్రూప్ -1 పరీక్షని ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రిపేర్ అవుతారు.గ్రూప్ 1 అభ్యర్థులు తెలుగు భాషలో సన్నద్ధమవ్వడం ఒక యుద్ధం చేసినట్టే? తెలుగు భాషలో గ్రూప్1 పరీక్ష ప్రామాణిక పుస్తకాలు అందుబాటులో లేకపోవడం, ఇంగ్లీష్ భాషలో ఉన్న యూపిఎస్సీ పుస్తకాలని తెలుగులో అనువాదం చేసుకొని, సొంతంగా నోట్స్ తయారు చేసుకొని ఈ పరీక్షకి తెలుగు మీడియం అభ్యర్థులు ప్రిపేర్ అవుతున్నారు.తెలుగు అకాడమీ పుస్తకాలని మేం ప్రామాణికంగా తీసుకోమని గౌరవ న్యాయస్థానానికి టీజీపీఎస్సీనే చెప్పింది? మరి తెలుగు మీడియం అభ్యర్థులు ఎలా ప్రిపేర్ కావాలి? పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ గ్రూప్ -1 మెయిన్స్ పరీక్షలో అర్హత పేపర్‌గా తెలుగు పేపర్‌ని పెట్టింది, మరి తెలంగాణలో ఎందుకు తెలుగు పేపర్ ని అర్హత పేపర్‌గా పెట్టలేదు.మాతృభాషలో గ్రూప్ -1రాసిన అభ్యర్థులకి సరిగ్గా మార్కులు వేయలేదు? తెలుగులో ఎంత రాసినా అవమానకరంగానే మార్కులు వేశారని అభ్యర్థులు వాపోతున్నారు. తెలుగంటే ప్రభుత్వానికి ఇంత చిన్నచూపు ఎందుకు? ఇప్పటికైనా గ్రూప్-1పై ఉన్న అనుమానలన్నింటిని ప్రభుత్వం తీర్చాలి. జీవో 29 రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్స్‌కి వ్యతిరేకమని కోర్టును ఆశ్రయిస్తే సాంకేతిక కారణాల సాకుతో కేసు కొట్టివేయడం సబబేనా? మరి విద్యార్థులకు, ప్రభుత్వం పట్టించుకోక, కోర్టు కూడా న్యాయం చేయకపోతే గ్రూప్-1 అభ్యర్థుల గోడు వినేదెవరు? ■


ఫూలే దంపతుల ఆదర్శ విద్యావిధానం



సంగిరెడ్డి హనుమంత రెడ్డి
9490204545

జ్యోతిబాఫూలే తండ్రి గోవిందరావు జ్యోతిబాను మహారాష్ట్రలోని పూణే పాఠశాలలో చేర్పడానికి వెళ్లారు. అక్కడి బ్రాహ్మణ గుమాస్తా జ్యోతిబాకు ప్రవేశం ఇవ్వలేదు. శూద్రులకు చదువు నిషేధమన్నాడు. జ్యోతిబా కాలం బ్రాహ్మణులు తప్ప ఇతర కులాలవారు చదువు సంధ్యలను ఆశించే కాలం కాదు. పంతొమ్మిదవ శతాబ్దం నుండి బ్రాహ్మణ అధ్యాపకులు బ్రాహ్మణేతరుల చదువును కుతంత్ర పద్ధతులతో నిరుత్సాహ పరిచేవారు. వారిని చదువు మాన్పించేవారు. అధికసంఖ్యాక కింది కులాలవారు చదువుకుంటే బ్రాహ్మణుల ఉద్యోగా వకాశాలు తగ్గుతాయని వారి ఉద్దేశం. ధాక్జి దాదాజి ప్రభు అనే సంప్రదాయవాద నాయకునికి బాంబే నేటివ్ ఎడ్యుకేషన్ సొసైటీలో పలుకుబడి ఉండేది. ఆయన కింది కులాల పిల్లలను బడుల నుండి తొలగించాడు. చదువులు మనిషిని నాస్తికులుగా మారుస్తాయి. తిరగబడేటట్లు చేస్తాయి. అని ప్రచారం చేసేవారు. హిందు పురాణాల ప్రకారం శూద్రులు చదువుకోడం పాపం. బ్రాహ్మణులు తమ పాఠశాలల్లో సొంత కులస్తులకే సంస్కృతంలో చదువు చెప్పేవారు. దేవతల కథలు, పుక్కిటి పురాణాల రాతప్రతులే పుస్తకాలు. వాటిని రాజుల ప్రోత్సాహంతో పురుష బ్రాహ్మణులు రాసేవారు. బ్రాహ్మణులకే ఈ పుస్తకాలను చదివే అర్హత. ఇతరులు చదివితే తీవ్రంగా శిక్షించేవారు. ఉపాధ్యాయుల ఇళ్లలో, గుళ్లలో బడులు నడిపేవారు. భూస్వాములు తమ పిల్లల కోసం ప్రత్యేకంగా ఉపాధ్యాయులను నియమించుకునేవారు. కొందరు పేద పిల్లలను అక్కడ చదువుకోడానికి అనుమతించేవారు. ముస్లిం లకు మరాఠీ, ఆంగ్ల భాషల్లో ఆసక్తి ఉండేది కాదు. తక్కువ సంఖ్యలోనైనా వారికి ఉర్దూ పాఠశాలలుండేవి. దళితుల, వెనుకబడిన కులాలవారి పిల్లలకు ప్రత్యేక పాఠశాలలు లేవు. హిందువుల బడులకు ఈ పిల్లలను రానివ్వరు. అరుదుగా రానిచ్చినా ఈ పిల్లలను వేరుగా కూర్చోబెట్టేవారు. పలు సందర్భాల్లో ఒక తరగతిలో ఒక పిల్లవాడే ఉండేవాడు. పైతరగతి విద్యార్థులు కింది తరగతి పిల్లలకు చదువు చెప్పేవారు.

ఈ నేపథ్యంలో శూద్రుల, అతిశూద్రుల విముక్తికి విద్య ఆయుధమని జ్యోతిబా గుర్తించారు. నిచ్చెనమెట్ల కులవ్యవస్థ, అమాయకత్వ, పేదరికాల నిర్మూలన, సమానత్వ సాధనకు విద్యా వ్యాప్తి ద్వారా కృషిచేశారు. తన శ్రీమతి సావిత్రిబాయికి చదువు చెప్పారు. ఉన్నత చదువులు చెప్పించారు. చదువుల తల్లిగా మార్చారు. సావిత్రిబాయి భారతంలో 17 ఏళ్ల వయసులో ఉపాధ్యాయిని అయిన తొలి స్త్రీ. చిన్న వయసులో ప్రధాన ఉపాధ్యాయురాలయ్యారు.బాలికలకు, స్త్రీలకు పాఠశాల ప్రారంభించిన తొలి భారతీయుడు జ్యోతిరావు. జ్యోతిబా విజయాల వెనుక సావిత్రిబాయి అవిరళ కృషి ఉంది. ఈ పాఠశాలలో, బ్రాహ్మణ బడుల వలె వేదపురాణాలు గాక, పాశ్చాత్య పాఠ్యాంశాలు, గణితం, విజ్ఞాన భౌగోళిక సాంఘిక మానవవికాస శాస్త్రాలు, చరిత్ర, కళలు, వ్యాకరణం, చిత్రలేఖనం బోధించేవారు. విద్యాహక్కు చట్టం, ఉపకార వేతనాలు, మధ్యాహ్న భోజనం తమ నూతన పథకాలుగా నేటి ప్రభుత్వాలు ప్రకటించుకున్నాయి. కానీ 170 ఏండ్ల క్రితమే ఫూలే దంపతులు విద్యా హక్కు గురించి ప్రచారం చేశారు. దాని అమలుకు ప్రభుత్వాలపై



ఒత్తిడి తెచ్చారు. బడి మానే పిల్లలను తగ్గించడానికి విద్యార్థులకు భోజనవసతి, గృహవసతి కల్పించారు. విద్యార్థి వేతనాలు ఇచ్చారు. పోషకాహార లోపాలను అరికట్టడానికి పిల్లలకు సమతులాహారం అందించారు. ఆరోగ్య సంరక్షణ చర్యలు చేపట్టారు. బడుల్లో గ్రంథాలయాలను స్థాపించారు. వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ముక్తా సాల్వే అన్న దళిత బాలిక దళిత సాహిత్యం, దళిత స్త్రీవాదం మొదలగు అంశాలపై వ్యాసాలు రాసింది. విద్యా ప్రాముఖ్యత గురించి తల్లిదండ్రులను చైతన్యపరచడానికి, క్రమంతప్పక పిల్లలను బడికి పంపేటట్లు ప్రోత్సహించడానికి తరచుగా తల్లిదండ్రుల-ఉపాధ్యాయుల సమావేశాలు జరిపేవారు. సావిత్రిబాయి ఉద్దేశంలో విద్య అంటే అక్షరాలు నేర్పడమే కాదు. పిల్లల మానసిక వికాసంపై దృష్టి కేంద్రీకరించడం. ఆ మేరకు విద్యా బోధనలో జాగ్రత్త వహించేవారు. పగలంతా పనిచేస్తేగాని ఆకలి తీరనివారి కోసం ఫూలే దంపతులు రాత్రి బడులు ప్రారంభించారు. ఆ బళ్లకు ఎక్కువగా దళితులు, వెనుకబడిన తరగతులవారు, వారి పిల్లలు, వ్యవసాయదారులు, కార్మికులు హాజరయ్యేవారు.

1882లో విద్యా కమిషన్ అధ్యక్షులు సర్ విలియం హంటర్‌కు జ్యోతిబా వినతిపత్రం అందజేశారు. అందులోని అంశాలు - ప్రాథమిక విద్యను తప్పనిసరి చేయాలి. విద్యకు బాలికలను ప్రోత్సహించాలి. విద్య భారతీయుల అవసరాల ఆధారిత అంశాలతో ఉపయోగంగా ఉండాలి. అనాథ పిల్లలకు విద్య అందించాలి. భారత వ్యవసాయ ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని వ్యవసాయాన్ని బోధనాంశాల్లో చేర్చాలి. తక్కువ స్థాయివారి పిల్లల విద్యను అడ్డుకుంటున్న 'వడబోత సిద్ధాంతాన్ని' జ్యోతిరావు తీవ్రంగా వ్యతిరేకించారు. (బ్రిటిష్ ఇండియా విద్య, న్యాయ శాఖ మంత్రి లార్డ్ మెకాలే 1835 ఫిబ్రవరిలో వడబోత విద్యా సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టారు. దీని ప్రకారం తమకు అనుకూలురైన అతి కొద్ది మంది ఉన్నత కులాల వారికి ప్రభుత్వం చదువు చెపుతుంది. వీళ్ల తక్కువ కులాల వారికి విద్య అందిస్తారు.) బడుగుల పిల్లలు బడి మానడానికి వారి సామాజిక పరిస్థితులు, పేదరికం కారణమని జ్యోతిబా వివరించారు. నిరుద్యోగ సమస్య పరిష్కారానికి విద్యలో వృత్తి నైపుణ్యతలు బోధించాలి. ఉపాధ్యాయులు సుశిక్షితులయి ఉండాలి. కింది తరగతుల పిల్లలకు సామాజిక విద్య నేర్పడానికి ఉపాధ్యాయులు కింది తరగతివారై ఉండాలి. ఉపాధ్యాయులకు వ్యవసాయం, ఆరోగ్యం, పరిశుభ్రతల గురించి తెలియాలి. గ్రామీణ ఉపాధ్యాయులకు జీతాలతో పాటు విద్యార్థుల ఉత్తీర్ణత, సామర్థ్యాలను బట్టి ప్రత్యేక భత్యం ఇవ్వాలి. వ్యవసాయదారుల పిల్లలకు ఉన్నత విద్యలో రాయితీలివ్వాలి. పేదలు, వెనుకబడ్డ తరగతుల విద్యార్థులకు ఉచిత గృహ వసతి కల్పించాలి. విద్య ప్రభుత్వ అధీనంలో ఉండాలి. ఈ సలహాలు, సూచనలను జ్యోతిబా తాను స్థాపించిన పాఠశాలల్లో అమలుచేశారు. విద్యార్థులకు పద్యగద్యాలలో ఉత్తరాలు రాయడం నేర్పారు. విలువల జీవితం గడపడానికి నీతి, నియమ నిబద్ధతల సామాజిక విద్య నేర్పారు. ఆంగ్లభాష ప్రాముఖ్యతను నొక్కిచెప్పారు. వృత్తి నైపుణ్యతలను పెంచి అసహాయులను మేధోపరంగా ఉన్నతీకరించడంలో ఆంగ్లం కీలక పాత్ర పోషించిందని జ్యోతిబా అభిప్రాయం. ఆంగ్లేయ ప్రభుత్వంలో ఉద్యోగాలు సంపాదించడంలో ఆంగ్లవిద్య సహాయపడుతుందని నమ్మకం. అంటరానివారికి పాఠశాలలు నడపడానికి ఫూలే యూరోపియన్ల ఆర్థిక సాయం పొందారు. క్రైస్తవ విద్యా సంస్థలు దళితులకు విద్యా సౌకర్యాలు అందించాయి. ఫూలే ఆంగ్లేయుల విద్యాసేవలను మెచ్చుకున్నారు. ఆయన్ను అపార్థం చేసుకున్న బ్రాహ్మణులు జోతిబా క్రైస్తవం పుచ్చుకున్నారని దుష్ప్రచారం చేశారు.

18వ శతాబ్దంలో, భారత దేశ ఎగుడుదిగుళ్ల విద్యారంగ చరిత్రతో అనుబంధమున్న రాజా రాంమోహన్‌రాయ్, డేవిడ్ హేర్, విలియం కారేల పక్కన మహాత్మా జ్యోతిబా ఫూలే, సావిత్రిబాయి ఫూలే నిలుస్తారు. బాలికల, అంటరానివారి విద్య, దళిత జనోద్ధరణ, మహిళా విముక్తి, సామాజిక విప్లవం మొదలగు రంగాల్లో పనిచేసిన మహాదేవ్ గోవింద రానడే, విష్ణుశాస్త్రి చిప్లున్కర్, గోపాల్ గణేశ్ అగార్కర్, ధొండే కేశవ్ కర్వే, పండిత రమాబాయి, మహాత్మా గాంధీల కంటే ముందు పుట్టినవారు జ్యోతిరావు, సావిత్రిబాయి. దళిత ఉద్ధరణ, దళిత బాలికల, మహిళల విద్య, మహిళా విముక్తి, సామాజిక విప్లవం ఫూలే దంపతుల ప్రత్యేకతలు. దళితుల కోసం ఫూలే దంపతులు సర్వస్వం త్యాగం చేశారు. జీవితాలనే అర్పించారు.

(నేడు జ్యోతిబాఫూలే జయంతి)

ఉపాధి కూలీలకు కొత్త జాబుకార్డులివ్వాలి

- ప్రభుత్వ వెబ్‌సైట్‌ను ఓపెన్‌లో ఉంచాలి
- పేర్ల మార్పులు, చేర్పులు చేసుకునే వెసులుబాటు కల్పించాలి : వ్యకాస

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ ఏర్పడిన తర్వాత ఉపాధి హామీ చట్టం కింద కొత్త జాబ్‌కార్డులివ్వకుండా వెబ్‌సైట్‌ను లాక్ చేయడం చట్టం మార్గదర్శకాలకు విరుద్ధమనీ, వెంటనే కొత్త జాబ్ కార్డులను మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.నాగయ్య, ఆర్.వెంకట్రాములు డిమాండ్ చేశారు. గురువారం ఈ మేరకు వారు ఒక ప్రకటన విడుదల చేశారు. దరఖాస్తు చేసుకున్న వెంటనే గ్రామ పంచాయితీ కార్యాలయంలో జాబ్ కార్డు ఇచ్చేలా, కొత్త పేర్లు చేర్చుకునేలా అవకాశం కల్పించాలని కోరారు. ఉపాధి హామీ చట్ట ప్రకారం 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరికీ జాబ్ కార్డు పొందే హక్కు ఉందనీ, దాన్ని ఇవ్వకుండా నిరాకరించడమంటే ప్రభుత్వం ఆ బాధ్యత నుంచి తప్పించుకోవడమే అవుతుందని విమర్శించారు. 11 ఏండ్ల కాలంలో అనేకమంది ఎదిగొచ్చిన పిల్లలు, కొత్తగా పెండ్లి చేసుకున్న వారు పెద్ద ఎత్తున పెరిగారనీ, వారందరికీ జాబ్ కార్డు ఇవ్వకుండా ఆపడమంటే ఒక తరాన్ని ఉపాధి పనికి దూరం చేయడంతో పాటు రాష్ట్రాభివృద్ధిలో భాగస్వామి కాకుండా చేయడమే అవుతుందని పేర్కొన్నారు. దళితులు, గిరిజనులు, బలహీన వర్గాల వారిని ఆహార భద్రతకు, సామాజిక భద్రతకు, ఆర్థికాభివృద్ధికి దూరంగా నెట్టే చర్యలకు పాలకులు సిద్ధపడటం దుర్మార్గమని పేర్కొన్నారు. దరఖాస్తు పెట్టుకోగానే ఉపాధి జాబ్ కార్డు లబ్ధిదారునికి జారీ చేసే విధంగా ప్రభుత్వ వెబ్‌సైట్‌ను ఓపెన్‌గా ఉంచాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

23న సీడీపీవో అభ్యర్థులకు ధ్రువపత్రాల పరిశీలన

- టీజీపీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖలో చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు ఆఫీసర్ (సీడీపీవో) అభ్యర్థులకు ఈనెల 23న ధ్రువపత్రాల పరిశీలన నిర్వహిస్తామని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ప్రకటించింది. ఈ మేరకు టీజీపీఎస్సీ కార్యదర్శి ఈ నవీన్ నికోలస్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 23న ఉదయం 10.30 నుంచి హైదరాబాద్ నాంపల్లిలో ఉన్న సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం (పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం)లో ధ్రువపత్రాల పరిశీలన జరుగుతుందని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థుల వివరాలను టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని తెలిపారు. ధ్రువపత్రాల పరిశీలన కోసం అవసరమైన సమాచారాన్ని డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ధ్రువపత్రాలను సిద్ధం చేసుకోవాలని కోరారు. ఈనెల 21 నుంచి 24 వరకు అభ్యర్థులు వెబ్ ఆప్షన్లను నమోదు చేయాలని తెలిపారు. ఎవరైనా అభ్యర్థులు ఈనెల 23న ఒరిజినల్ ధ్రువపత్రతాలను తీసుకురాకపోతే మరుసటి రోజు (24న) అవకాశం ఉంటుందని వివరించారు. ఆ తర్వాత అవకాశం కల్పించబోమని స్పష్టం చేశారు. అభ్యర్థులు ఎవరైనా ఈనెల 23న ధ్రువపత్రాల పరిశీలనకు గైర్హాజరైతే మరుసటి రోజు హాజరు కావాలని సూచించారు. ఆ తర్వాత అవకాశం ఉండబోదని తెలిపారు. ఇతర వివరాల కోసం www://tspsc.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు. 23 సీడీపీవో పోస్టుల భర్తీకి 2022 సెప్టెంబర్ ఐదున టీజీపీఎస్సీ నోటిఫికేషన్‌ను జారీ చేసిన విషయం తెలిసిందే.

ఎస్సీ వర్గీకరణకు గవర్నర్ ఆమోదం

- కాంగ్రెస్ ఎమ్మెల్యే మందుల సామ్యేల్ ధన్యవాదాలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



ఎస్సీ వర్గీకరణకు ఆమోదం తెలిపిన గవర్నర్ కు కాంగ్రెస్ ఎమ్మెల్యే మందుల సామ్యేల్ ధన్యవాదాలు తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. మాదిగల సమస్యలను పరిష్కరించిన సీఎం రేవంత్ రెడ్డికీ, హృదయపూర్వక ధన్యవాదాలు చెప్పారు. ఎస్సి వర్గీకరణ ఉప సంఘం చైర్మెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డికి, వైస్ చైర్మెన్ దామోదర రాజనర్సింహకు, వన్‌మెన్ కమీషన్ చైర్మెన్ షమీమ్ అక్తర్‌కు, వర్గీకరణకు సహకరించిన అన్ని పార్టీలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రానికీ, ఎస్సీ వర్గీకరణకు రాజ్యాంగంలో అంబేడ్కర్ పొందుపరిచిన ఆర్టికల్ 3 పని చేసిందని వివరించారు. సనాతన ధర్మాన్ని కాపాడేందుకు రాహుల్ గాంధీ పోరాడుతున్నారనీ, ఎస్సీలకు న్యాయం కేవలం కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని చెప్పారు. మాదిగలకు మంత్రి పదవి ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డిని కలిసినట్టు తెలిపారు. తెలంగాణ మతతత్వ పార్టీలకు మనుగడ లేదని స్పష్టం చేశారు.



ఉద్యోగుల పెండింగ్ బిల్లులు చెల్లించాలి

● ఉప ముఖ్యమంత్రి భట్టికి ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులతోపాటు ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయనీ, వీలైనంత త్వరగా బకాయిలను చెల్లించాలని ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను గురువారం హైదరాబాద్‌లో ఆయన కలిసి వినతిపత్రం సమర్పించారు. దీనిపై భట్టి సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఇకనుంచి ప్రతినెలా చెల్లించాల్సిన బిల్లులను రెగ్యులర్‌గా చెల్లిస్తామనీ, పెండింగ్‌లో ఉన్న బకాయిలను ప్రతినెలా వరుస క్రమంలో చెల్లిస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గుండు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి పుల్గం దామోదర్‌రెడ్డి, వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అబ్దుల్ గఫార్, రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ సోమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టన్నెల్‌లో కన్వేయర్ బెల్టు పొడిగింపు

● ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రత్యేక అధికారి శివశంకర్ లోతేటి



నవతెలంగాణ మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

ఎస్ఎల్బీసీ సొరంగ ప్రమాద ప్రదేశంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని, ప్రమాద స్థలం వరకు కన్వేయర్ బెల్టును పొడిగించామని ప్రత్యేక అధికారి శివశంకర్ లోతేటి తెలిపారు. గురువారం టన్నెల్ ఇన్లెట్ 1 ఆఫీస్ వద్ద సహాయక చర్యలపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. సొరంగంలో చిక్కుకున్న వారిని గుర్తించేందుకు సహాయక బృందాలు అవిశ్రాంతంగా కృషి చేస్తున్నాయన్నారు. సహాయక చర్యల్లో భాగంగా ప్రమాద స్థలం వరకు కన్వేయర్ బెల్టును పొడిగిస్తూ తద్వారా మట్టిని తవ్వే ప్రక్రియను మరింత వేగవంతం చేస్తున్నట్టు వివరించారు. సహాయక బృందాలకు అవసరమైన అన్ని రకాల సామాగ్రిని ఎప్పటికప్పుడూ అందుబాటులో ఉంచుతున్నామని, సహాయక సిబ్బందికి అవసరమైన వసతులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో ఆర్మీ అధికారులు, జేపీ కంపెనీ ప్రతినిధులు, ఎస్‌డిఆర్ఎఫ్ అధికారి గిరిధర్ రెడ్డి, సింగరేణి మైన్స్ రెస్క్యూ అధికారులు, హైడ్రా అధికారి, దక్షిణ మధ్య రైల్వే అధికారి పాల్గొన్నారు.

సమస్యను కోరి తెచ్చుకున్నారు

(మొదటిపేజీ తరువాయి)

తీసుకెళ్లారని అక్కడ రెండుసార్లు తనపై అత్యాచారం చేశారని ఆమె పేర్కొంది. కాగా బాధితురాలు వెల్లడించిన వాస్తవాలను పరిగణనలోకి తీసుకుని ఇది లైంగికదాడి కేసుగా కాకుండా ఇరువురి మధ్య ఆమోదయోగ్యంతో జరిగిన లైంగిక చర్యగా పరిగణించి తనకు బెయిల్ ఇప్పించాలని నిందితుడు పిటిషన్ పెట్టుకున్నాడు. ఎలాంటి నేరపూరితమైన చరిత్ర లేని తన క్లయింట్ గతేడాది డిసెంబరు నుంచి జైల్లో వున్నాడని ఆయన తరపు న్యాయవాది పేర్కొన్నాడు. దీనిపై విచారణ జరిపిన జస్టిస్ సంజయ్ కుమార్ సింగ్ నేతృత్వంలోని బెంచ్, మార్చి 11న ఉత్తర్వులు జారీ చేసింది. బాధితురాలు తన చర్యల్లోని నైతికత, ప్రాముఖ్యత గురించి అర్థం చేసుకోగలదని బెంచ్ వ్యాఖ్యానించింది. బాధితురాలు చెప్పేదే నిజమని భావించినట్లైతే ఆమె తనకు తానుగా సమస్యను ఆహ్వానించిందని భావించాల్సి వస్తుందని ఈ న్యాయస్థానం అభిప్రాయపడుతోందని కోర్టు తన తీర్పులో వ్యాఖ్యానించింది. ఆమెకు చేసిన వైద్య పరీక్షలను బట్టి చూసినట్లైతే లైంగిక చర్య జరిగినట్లు తెలుస్తోంది కానీ అది లైంగిక దాడి అనే అభిప్రాయాన్ని డాక్టర్ చెప్పలేదని కోర్టు పేర్కొంది.

నేల రాలిన ధాన్యం, మామిడి

(మొదటిపేజీ తరువాయి)

కాయలు రాలి తీరని నష్టం వాటిల్లింది. కొన్ని చోట్ల కల్లాల్లో ఆరబోసిన ధాన్యం, మొక్కజొన్న తడిసి ముద్దయ్యాయి. కొన్ని గ్రామాల్లో వరి చేలలో ధాన్యం పూర్తిగా రాలిపోయి, గడ్డి మాత్రమే మిగిలింది. మండలంలో 3900 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని అధికారులు తెలిపారు. చేర్యాల మండలంలో ఉరుములు, మెరుపులతోపాటు పిడుగు పడటంతో ముస్త్యాల గ్రామంలో పాడి ఆవు మృత్యువాత పడింది. సంగారెడ్డి జిల్లాలో జహీరాబాద్, కొండాపూర్, మనూర్, సదాశివపేట మండలాల్లో వాన బీభత్సం సృష్టించింది. ఇండ్లపై నుంచి రేకులు ఎగిరి పోయాయి. మామిడి తోటలో ఉన్న పండ్లు రాలిపోయాయి. కొండాపూర్ మండలం గంగారం గ్రామానికి చెందిన సంతోష్ పిడుగుపాటుకు గురై మృతిచెందాడు. అలాగే నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలంలో పిడుగుపడి ఓ వ్యక్తి మృతి చెందాడు.

హైదరాబాద్‌లోని మియాపూర్, మదీనాగూడా, చందానగర్, కొండాపూర్, మాదాపూర్, కూకట్‌పల్లి, దుండిగల్, గచ్చిబౌలి, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్‌తో పాటు మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఎస్ఆర్ నగర్, పంజాగుట్ట, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ పరిసర ప్రాంతాల్లో రోడ్లు జలమయం అయ్యాయి. దాంతో వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జీహెచ్ఎంసీ, హైడ్రా అధికారులు సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారు. రాష్ట్రంలో రానున్న మూడ్రోజుల పాటు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

అవసరమైతేనే బయటకు రావాలి

నగరవాసులు అవసరమైతేనే ఇంటి నుంచి బయటకు రావాలని జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి సూచించారు. వాతావరణంలో అకస్మాత్తుగా మార్పులు చోటుచేసుకుని, భారీ వర్షాలు, బలమైన గాలులు వీచే అవకాశం ఉందన్నారు. నగర ప్రజలందరూ సురక్షిత ప్రదేశాల్లో ఉండాలని కోరారు. జీహెచ్ఎంసీ అధికారులు తక్షణమే ఎమర్జెన్సీ టీంలను ఏర్పాటు చేసి, నీరు నిలిచిన ప్రాంతాల్లో తొలగించడమే కాకుండా ఫాగింగ్, శుభ్రపరిచే పనులను ఎప్పటికప్పుడూ నిర్వహించాలని ఆదేశించారు.

సన్నబియ్యం పంపిణీ ఘనత కాంగ్రెస్‌దే

అది కూడా కొందరికే

20 శాతం అదనపు వ్యయంతో అందరికీ సన్నబియ్యం

దుష్ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పి కొట్టాలి

అర్హులైన వారందరికీ తెల్లరేషన్ కార్డులు

ధాన్యం దిగుబడిలో తెలంగాణా రికార్డ్ : మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

కేంద్రం ఇచ్చేది దొడ్డు బియ్యమే



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న నిరుపేదలందరికీ ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఘనత ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని రాష్ట్ర పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి తేల్చి చెప్పారు. స్వతంత్ర భారతదేశంలో మొట్టమొదటి సారిగా పేదలకు సన్నబియ్యం తెలంగాణ రాష్ట్రం అందిస్తున్నదని తెలిపారు. కేంద్రం సన్న బియ్యం పంపిణీ చేస్తుందన్న ప్రచారంలో ఎంతమాత్రం వాస్తవం లేదని ఆయన కొట్టిపారేశారు. కేంద్రం సరఫరా చేసేది ఇప్పటికీ దొడ్డు బియ్యమేననీ, అదీ కుడా కొందరికే పరిమితమని ఆయన స్పష్టం చేశారు. సన్న బియ్యం పంపిణీ చేయాలన్న చారిత్రత్మక నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకుందన్నారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం సరఫరా చేస్తున్న దొడ్డు బియ్యం స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం 20 శాతం అదనంగా వెచ్చించి అందరికీ సన్న బియ్యం పంపిణీ చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

గురువారం మధ్యాహ్నం హైదరాబాద్‌లోని నీటిపారుదల శాఖ కేంద్ర కార్యాలయం జలసౌధ నుంచి ఆయన లోకసభ, శాసనసభ, శాసనమండలి, కార్పొరేషన్ చైర్మెన్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ స్వతంత్ర భారతదేశ చరిత్రలోనే ఇంతకు మించిన సంక్షేమ కార్యక్రమం మరోటి ఉండబోదని అభిప్రాయపడ్డారు. సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులందరూ భాగస్వామ్యం కావడమే కాకుండా సన్న బియ్యం లబ్దిదారులతో కలసి భోజనం చేయాలని తద్వారా పేదల పట్ల కాంగ్రెస్ పార్టీ పెట్టిన ప్రత్యేక దృష్టిని ప్రజలు గుర్తిస్తారని ఆయన ప్రజా ప్రతినిధులతో అన్నారు. ప్రతి లబ్దిదారుడికి నెలకు 6 కిలోల చొప్పున అందిస్తున్న సన్నబియ్యంపై రాష్ట్ర ప్రభుత్వం సంవత్సరానికి రూ.13 వేల కోట్లు ఖర్చు చేస్తున్న విషయాన్ని ప్రజల్లోకి విరివిగా తీసుకుపోవాలని ఆయన వారికి సూచించారు. ప్రతి సంవత్సరం 3.10 కోట్ల మందికి ఉచితంగా 30 లక్షల మెట్రిక్ టన్నుల సన్నబియ్యం సరఫరా చేయాలని నిర్ణయించినట్టు వెల్లడించారు.

సన్నబియ్యం సరఫరాకు ముందు కేంద్రం, రాష్ట్రం కలిపి రూ.10,665 కోట్లు ఖర్చు చేసి పంపిణీ చేస్తున్న దొడ్డు బియ్యం పక్కదోవ పట్టి అనేక అక్రమాలకు కారణమైందని గుర్తు చేశారు. సన్నబియ్యం పంపిణీ నిర్ణయంతో రాష్ట్ర ప్రభుత్వం మీద అదనంగా రూ. 2,858 కోట్లు భారం పడినా సంవత్సరానికి మొత్తంగా రూ.8,033 కోట్లు ఖర్చు పెట్టి ఈ సాహసోపేత నిర్ణయం తీసుకున్నట్టు వివరించారు. సన్న బియ్యం పంపిణీలో కేంద్రం పాత్ర ఉందంటూ విపక్షాలు చేస్తున్న అసత్య ప్రచారాన్ని ప్రజాప్రతినిధులు ముక్తకంఠంతో తిప్పి కొట్టాలని ఆయన పిలుపునిచ్చారు

కాళేశ్వరం కూలినా.. మేడిగడ్డ పని చేయకపోయినా...

బీఆర్ఎస్ పాలనలో నిర్మించిన కాళేశ్వరం కూలిపోయినా మేడిగడ్డ పని చేయకపోయినా రాష్ట్రంలో ఖరీఫ్, రబీ సీజన్‌లో కలిపి 123.27 లక్షల ఎకరాలలో 281 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడైందంటే అది కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగం పట్ల అనుసరించిన విధానాలే కారణమని అన్నారు. ఖరీఫ్‌లో 66.78 లక్షల ఎకరాల్లో 153.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అయితే రబీలో సాగు చేసిన 56.49 లక్షల ఎకరాలలో 127.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడిని అంచనా వేస్తున్నామని ఆయన వివరించారు. ఇంత దిగుబడి తెలంగాణా చరిత్రలోనే కాదు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోని సంచలనాత్మకమని ఆయన అభివర్ణించారు.

సన్న బియ్యం క్వింటాల్ కు రూ.500 బోనస్ ఇచ్చి, రాష్ట్ర వ్యాప్తంగా 4.41 లక్షల మంది రైతుల నుంచి 24 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్టు తెలిపారు. సన్నబియ్యం కోసం రూ.1,199 కోట్లు బోనస్ రూపంలో చెల్లించినట్టు చెప్పారు. ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం రూ.12,511 కోట్లు రైతులకు చెల్లించడంతో పాటు అదనంగా బోనస్ రూపంలో రూ.1,199 చెల్లించినట్టు ఆయన తెలిపారు. రబీ సీజన్‌లో ధాన్యం కొనుగోలుకుగాను 8,209 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు.

ధాన్యం కొనుగోలులో ఆయా జిల్లాల కలెక్టర్లకు పూర్తి స్థాయిలో అధికారం ఇచ్చామని అదనంగా ధాన్యపు కొనుగోలు కేంద్రాలు ఆవశ్యకత ఉన్న చోట ప్రజాప్రతినిధులు ఆయా కలెక్టర్లతో సంప్రదించి ఏర్పాటు చేసుకోవచ్చున్నారు. అయితే ధాన్యం కొనుగోలు విషయంలో 17 శాతానికి మించి ఉంటే అంగీకరించే ప్రసక్తి లేదని ఇది జాతీయ విధానమని ఆయన అన్నారు. అదే సమయంలో 25 శాతానికి మించి నూకలు ఉన్న బియ్యం సరఫరా చేస్తే రైస్ మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

దరఖాస్తుల పరిశీలన

రాష్ట్రంలో అర్హులైన నిరుపేదలందరికీ తెల్ల రేషన్ కార్డులను మంజూరు చేస్తామని ఆయన భరోసా ఇచ్చారు. లబ్దిదారుల దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని త్వరితగతిన పరిశీలన జరిపి తెల్ల రేషన్ కార్డులు అందించే ప్రక్రియకు శ్రీకారం చుట్టబోతున్నట్టు ఆయన ప్రకటించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ సమయంలో 89.73 లక్షల తెల్ల రేషన్ కార్డులు ఉండగా పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ఆ ప్రభుత్వం మంజూరు చేసినవి కేవలం 49,479 తెల్ల కార్డులేనని ఆయన ఎద్దేవా చేశారు. అంతే కాదు కనీసం ఉన్న రేషన్ కార్డుల్లో కొత్త సభ్యులని చేర్పించడంలోనూ బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చూపిందని ఆయన దుయ్యబట్టారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు లబ్దిదారుల నుంచి 30 లక్షల దరఖాస్తులు స్వీకరించినట్టు తెలిపారు. లబ్దిదారుల సంఖ్య 2.81 కోట్ల నుంచి 3.10 లక్షలకు పెరగవచ్చుని ఆయన తెలిపారు. పెరుగుతున్న లబ్దిదారులకు సరిపడా సన్న బియ్యం పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధంగా ఉందని స్పష్టం చేశారు.

పౌష్టికాహార తెలంగాణే లక్ష్యం



ఆ దిశగా అంగన్‌వాడీ కేంద్రాలు పనిచేయాలి

జిల్లా అధికారులు వారంలో కనీసం మూడు కేంద్రాలను సందర్శించాలి : మహిళా శిశు సంక్షేమ శాఖ వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి సీతక్క

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పోషకాహార తెలంగాణే లక్ష్యంగా సిబ్బంది పనిచేయాలనీ, ఆ దిశగా అంగన్‌వాడీ కేంద్రాలు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ(సీతక్క) ఆదేశించారు. జిల్లా అధికారులు వారానికి కనీసం మూడు అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించాల్సిందేనని మరోమారు నొక్కి చెప్పారు. గురువారం హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి ఆ శాఖ జిల్లా అధికారులతో మంత్రి సీతక్క వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అందులో ఆ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, డైరెక్టర్ క్రాంతి వెస్లీ, ఇతర ఉన్నతాధికారులు, జిల్లా సంక్షేమ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ..రాష్ట్రంలో ఇంకా 313 సెంటర్లు ఇంకా తెరుచుకోలేదని చెప్పడం సరిగాదని చురకలంటించారు. 30 అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలు లేకపోవడం, 198 కేంద్రాల్లో ఐదుగురు లోపు, 586 కేంద్రాల్లో పది మంది పిల్లలలోపే ఉండటం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి సెంటర్‌లోనూ కచ్చితంగా 20 మంది చిన్నారులుండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. చిన్నారులు లేకపోతే డిమాండ్ ఉన్న ప్రాంతాలకు కేంద్రాలను తరలించాలని ఆదేశించారు. చిన్నారులతో కేంద్రాలు కళకళలాడాలనీ, వాటికి కేంద్ర ప్రభుత్వ తరహాలో గ్రేడింగ్‌లు, అవార్డులు ఇస్తామని ప్రకటించారు. చిన్నారుల సంక్షేమంపై రాష్ట్ర ప్రభుత్వం వందల కోట్ల రూపాయలు ఖర్చుచేస్తున్నదనీ, అధికారులు దృష్టి పెట్టి పనిచేస్తే లక్ష్యాలు నెరవేరుతాయని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాలకిచ్చే సరుకుల్లో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కంది పప్పు కొనుగోలు విషయంలో సొంత నిర్ణయాలు ఎందుకు తీసుకున్నారు? ఈ-టెండర్ విధానాన్ని పాటించాలన్న ఆదేశాలను ఎందుకు విస్మరించారు? అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. కొన్ని జిల్లాల అధికారులు పాత కాంట్రాక్టర్లకి కందిపప్పు సరఫరాను నామినేషన్ పద్ధతిలో ఎందుకిచ్చారనే దానిపై సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించారు. కలెక్టర్ నేతృత్వంలోని జిల్లా ప్రొక్యూర్‌మెంట్ కమిటీ ద్వారా టెండర్లు పిలవాల్సిందేనని నొక్కి చెప్పారు. సామ్, మామ్ చిన్నారులను గుర్తించి రిపోర్టు అందజేయాలని సూచించారు. చెడ్డ పేరు వస్తుందని పిల్లల పోషకాహర లోపాన్ని దాచి పెడితే సమాజానికి నష్టమని హెచ్చరించారు. పిల్లల అమ్మకాలు, బాల్య వివాహాలు, నిబంధనలకు విరుద్ధంగా దత్తత, సామాజిక రుగ్మతలను అరికట్టడంపై దృష్టి సారించాలనీ, వాటిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు చైతన్య కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. డీడబ్ల్యూఓలతో మే మొదటి వారంలో చింతన్ శివిర్ నిర్వహిస్తామనీ, అంగన్‌వాడీ కేంద్రాల్లో మెరుగైన సేవలందించడంపై మేధోమథనం నిర్వహిస్తామని తెలిపారు.

'శ్రీచైతన్య' బ్రాండ్ అంబాసిడర్‌గా చెస్ చాంపియన్ గుకేశ్ దొమ్మరాజు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

శ్రీచైతన్య విద్యాసంస్థల బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రపంచ చెస్ చాంపియన్ గుకేశ్ దొమ్మరాజు నియమితులయ్యారు. ఈ మేరకు ఇన్ఫినిటీ లెర్న్ సహ వ్యవస్థాపకురాలు, శ్రీచైతన్య గ్రూప్ సీఈవో, డైరెక్టర్ సుష్మ బొప్పన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ భాగస్వామ్యం దేశవ్యాప్తంగా జేఈఈ, నీట్ చాంపియన్లను అత్యధికంగా అందించే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. అతి పిన్న వయసులో ప్రపంచ చెస్ చాంపియన్‌గా గుర్తింపు పొందిన గుకేశ్ జేఈఈ, నీట్ అభ్యర్థులతో సుస్థిరమైన స్ఫూర్తిని కలిగించే భావాలను నింపుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. వారికి మెంటార్‌గా మారి విజయం సాధించేందుకు కావాల్సిన వ్యూహాలు, ఒత్తిడి నిర్వహణ పద్ధతులపై మార్గదర్శకుడిగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. చిన్న వయసులోనే ఆయన సాధించిన విజయాలు పాఠశాల విద్యార్థుల నుంచి జేఈఈ, నీట్ అభ్యర్థుల వరకు ప్రేరణగా నిలిచాయని తెలిపారు. విద్యార్థులను సమస్య పరిష్కారం, విశ్లేషణాత్మక నైపుణ్యాలతో అభివృద్ధి చేసేందుకు తాము అంకితభావంతో పనిచేస్తామని పేర్కొన్నారు.

సంక్లిష్ట సవాళ్లు, ఒత్తిడి పరిస్థితుల్లో ప్రశాంతంగా ఉండటానికి అవసరమైన నైపుణ్యాలతో పోటీ పరీక్షల్లో విజయాన్ని సాధించడంలో విద్యార్థులకు గుకేశ్ సామర్థ్యాలు మార్గదర్శకంగా ఉంటాయని వివరించారు. ఆయన ప్రేరణతో విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో, వ్యూహాత్మకంగా ఆలోచించి అత్యున్నత సామర్థ్యాలను చేరుకునేందుఉ సమర్థులవుతారని తెలిపారు. చదరంగం, పోటీ పరీక్షల్లో విజయం వ్యూహాత్మక ఆలోచన, క్రమశిక్షణ, మానసిక స్థితిస్థాపకతపై ఆధారపడి ఉంటుందని గుకేశ్ వివరించారని పేర్కొన్నారు. చదరంగంలో ముందస్తు ప్రణాళిక అవసరమైతే, జేఈఈ, నీట్‌లో విశ్లేషణాత్మక విధానం తప్పనిసరి అని అన్నారని తెలిపారు.



పోలీసుల అదుపులో మాజీ ఎమ్మెల్యే షకీల్..!

తల్లి అంత్యక్రియల కోసం బోధన్ వచ్చిన షకీల్

పాస్‌పోర్టు స్వాధీనం చేసుకున్న పోలీసులు..!

హైకోర్టు ఆదేశాల మేరకే తదుపరి చర్యలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

పలు కేసుల్లో పరారీలో ఉన్న బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ ఎట్టకేలకు ఏడాదిన్నర తర్వాత దుబాయ్ నుంచి ఇండియాకు వచ్చారు. ఆయన గురువారం ఉదయం శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి నేరుగా బోధన్‌కు వెళ్లారు. ఎయిర్‌పోర్టులోనే పోలీసులు ఆయన్ను అరెస్టు చేస్తారని ప్రచారం జరిగింది. దీంతో బీఆర్ఎస్ నేతలు, ఆయన అనుచరులు పెద్దసంఖ్యలో ఎయిర్‌పోర్టుకు తరలివెళ్లారు. షకీల్ తల్లి శాగుఫ్తా ఆదిబ్(70) అనారోగ్యంతో హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతిచెందారు. ఆమె 2005 వరకు శక్కర్ నగర్‌లోని బాలికల ఉన్నత పాఠశాలలో ప్రధా నోపాధ్యాయురాలిగా విధులు నిర్వర్తించారు. కాగా ఆమె అంత్యక్రియలు శక్కర్‌నగర్‌లో నిర్వహించారు. తల్లి చివరి చూపు, అంత్యక్రియల కోసం షకీల్ దుబాయ్ నుంచి బోధన్‌కు వచ్చారు.

పాస్‌పోర్టు సీజ్.. అంత్యక్రియల తర్వాత విచారణకు..

పలు కేసుల్లో షకీల్‌ను నిందితుడిగా పేర్కొన్న పోలీసులు గతంలోనే లుక్ ఔట్ నోటీసులు జారీ చేశారు. అందులో భాగంగానే గురువారం ఆయన హైదరాబాద్ చేరుకోగానే అతని పాస్‌పోర్టును స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. బోధన్‌లో తల్లి అంత్యక్రియల తర్వాత పోలీసులు షకీల్‌ను అదుపులోకి తీసుకుని విచారించే అవకాశం ఉంది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల మరుసటి రోజే ఆయన దుబాయ్ వెళ్లిపోయారు. సెంట్రల్ జోన్ పోలీసులు ఆయన మీద పలు కేసులు నమోదు చేశారు. రెండు రోడ్డు ప్రమాదాల కేసుల్లో సాక్ష్యాలను తారుమారు చేసి చెరిపేశారని, అధికారులను బెదిరించారని పేర్కొం టూ షకీల్ మీద కేసులు నమోదు చేశారు.

ప్రజాభవన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం కేసులో పంజాగుట్ట పోలీసులను మేనేజ్ చేసి తన కుమారుడిని కేసు నుంచి తప్పించే ప్రయత్నం చేశారంటూ ఆయనపై గతంలోనే పెద్దఎత్తున ఆరో పణలు వచ్చాయి. దీంతో షకీల్‌పై కూడా కేసు నమోదైంది. అప్పటి నుంచి ఆయన ఇండియాకు రాకుండా దుబాయ్‌లోనే ఉంటున్నారు. అలాగే, బోధన్ సెగ్మెంట్‌లోనూ కస్టమ్ మిల్లింగ్ బియ్యం దారి మళ్లించారని అభియోగాలు సైతం ఆయన మీద ఉన్నాయి. కానీ ఆయా కేసుల్లో షకీల్ హైకోర్టును ఆశ్రయించినట్టు తెలిసింది.


షకీల్ తల్లి అంత్యక్రియల్లో మాజీ ఎమ్మెల్యేలు..

షకీల్‌ను అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా ఓదార్చారు. షకీల్ తల్లి మృతదేహానికి బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి, నిజామాబాద్ రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

గొర్రెల మందపై కుక్కల దాడి

54 గొర్రెలు మృత్యువాత

చేవెళ్ల మండలంలో ఘటన



నవతెలంగాణ-చేవెళ్ల

గొర్రెల మందపై కుక్కలు దాడి చేయడంతో 53 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలంలో గురువారం జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. చేవెళ్ల మండల పరిధిలోని తంగడపల్లి గ్రామానికి చెందిన అనంతయ్య గొర్రెలు కాస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. రోజూలాగే బుధవారం రాత్రి గొర్రెలను ఇంటి పక్కన ఉన్న పాకలో తోలాడు. రాత్రి సమయంలో పాకలోకి కుక్కలు చొరబడి గొర్రెల మందపై దాడి చేశాయి. 47 గొర్రె పిల్లలు, 6 గొర్రెలు అక్కడికక్కడే మృత్యువాతపడ్డాయి. గురువారం తెల్లవారుజామున లేచి చూడగా గొర్రెలు విగతజీవులుగా కనిపించాయి. గొర్రెలే తమకు జీవనాధారమని, తమను ఆదుకోవాలని అనంతయ్య ప్రభుత్వాన్ని కోరాడు.

ఎట్టకేలకు భారత్‌కు తహవ్వుర్ రాణా

న్యూఢిల్లీ : భారత్‌లో తీవ్ర కలకలం సృష్టించిన ముంబయి ఉగ్రదాడి కేసులో కీలక సూత్రధారిగా ఉన్న తహవ్వుర్ హుస్సేన్ రాణా(64) ఎట్టకేలకు భారత్‌కు చేరుకున్నాడు. పలు కేసుల్లో అమెరికా న్యాయస్థానాల్లో విచారణ ఎదుర్కొంటున్న ఆయనను అధికారులు ప్రత్యేక విమానంలో భారత్‌కు తీసుకొచ్చారు. లాస్ ఏంజెల్స్ నుంచి బయలుదేరిన స్పెషల్ ఫ్లైట్.. ఢిల్లీ పాలం విమానాశ్రయంలో ల్యాండ్ అయింది. ఆయన వెంట ఎన్ఎస్‌జీ, ఎన్ఐఏ బృందాలు, సీనియర్ అధికారులు ఉన్నారు. ఎయిర్‌పోర్టులో ప్రత్యేక విమానం ల్యాండ్ అయిన వెంటనే అన్ని న్యాయ ప్రక్రియ, హెల్త్ చెకప్‌లు పూర్తయిన తర్వాత నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ) అధికారులు రాణాను అధికారికంగా అరెస్ట్ చేశారు. ఎన్ఐఏ అధికారులు గురువారం సాయంత్రం దీనిని ధృవీకరించారు.

ఆ తర్వాత కట్టుదిట్టమైన భద్రత నడుమ తీహార్ జైలుకు ఆయనను తరలించినట్టు, కట్టుదిట్టమైన తీహార్ జైలు నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాణాను పటియాల హౌజ్ కోర్టు ముందు ప్రవేశపెట్టనున్నారని తొలుత తెలిసింది. ముందుజాగ్రత్తగా పోలీసులు కోర్టు ప్రాంగణాన్ని పూర్తిగా ఖాళీ చేయించారు. మీడియా ప్రతినిధులనూ బయటకు పంపించారు. అయితే, ఎన్ఐఏ బృందం, ఇతర



అధికారులు ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ నుంచి ఆయనను పటియాల హౌజ్ కోర్టుకు తరలించించారు. కోర్టు వద్ద కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. అక్కడే, ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు ఆయనను విచారించింది. ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి జస్టిస్ చందర్‌జీత్ సింగ్ వాదనలు విన్నారు. అయితే, విచారణానంతరం ఆయనను తీహార్ జైలుకు తరలిస్తారా? ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేస్తారా? అన్నదానిపై స్పష్టత రావాల్సి ఉన్నది. దీంతో ఆయా ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఈ కేసులో ఎన్ఐఏ తరపున సీనియర్ అడ్వొకేట్ దయన్ కృష్ణన్, ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ నరేందర్ మాన్ హాజరయ్యారు. నిందితుడు తహవ్వుర్ రాణా తరపున ఢిల్లీ లీగల్ సర్వీసెస్ అథారిటీ నుంచి పియూశ్ సచ్‌దేవ్ హాజరైనట్టు తెలిసింది.

యూపీఏ సర్కారు చర్చలతోనే అప్పగింత : కాంగ్రెస్

ఇటు తహవ్వుర్ రాణాను భారత్‌కు రప్పించిన విషయంలో కాంగ్రెస్, బీజేపీలు మాటల యుద్ధానికి దిగాయి. ఇది తమ దౌత్య ఫలితమేనని బీజేపీ చెప్తుండగా.. కాంగ్రెస్ మాత్రం ఆ వాదనను తోసిపుచ్చింది. తహవ్వుర్ రాణా అప్పగింత ప్రక్రియను ప్రధాని మోడీ ప్రభుత్వం ప్రారంభించలేదని కాంగ్రెస్ వ్యాఖ్యానించింది. యూపీఏ హయాంలో మొదలు పెట్టిన వ్యూహాత్మక దౌత్య ప్రయోజనాలను బీజేపీ ప్రభుత్వం ప్రస్తుతం పొందుతున్నదని ఆరోపించింది. భారత్‌కు రాణా అప్పగింత విషయంలో యూపీఏ ప్రభుత్వం గతంలో అమెరికాతో చర్చలు జరిపిందని కాంగ్రెస్ సీనియర్ నేత చిదంబరం గుర్తు చేశారు. దాదాపు దశాబ్దానికి పైగా యూపీఏ సర్కారు శ్రమించిందని అన్నారు. ముంబయి దాడులో ప్రమేయం ఉన్న డేవిడ్ కోల్మన్ హెడ్లీ, తహవ్వుర్ రాణా, మరికొందరిపై మా హయాంలో ఢిల్లీలో ఎన్ఐఏ కేసు నమోదు చేసిందని తెలిపారు. దీంతో నవంబర్ 11, 2009 నుంచి దీనిపై దర్యాప్తు ప్రారంభమైందని గుర్తు చేశారు. 2011లో అమెరికా కోర్టు అతడిని నిర్దోషిగా విడుదల చేయటంపై కాంగ్రెస్ నిరసన వ్యక్తం చేసిందని చిదంబరం అన్నారు. 2008, నవంబర్ 26న పది మంది ఉగ్రవాదులు ముంబయిలో తీవ్ర మారణహోమం సృష్టించిన విషయం దేశాన్ని ఉలిక్కిపడేలా చేసింది. ఈ ఘటన ప్రపంచవ్యాప్తంగా సంచలనంగా మారింది.

తెలంగాణకు నీరందించే ప్రాజెక్టులు చేపట్టాలి

● మంత్రి ఉత్తమ్‌కు ప్రజాప్రతినిధుల విజ్ఞప్తి



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

తెలంగాణకు నీరందించే ప్రాణహిత ప్రాజెక్టుతోపాటు కుప్టి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి పలువురు ప్రజాప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లోని జలసౌధలో ఎమ్మెల్సీ కోదండరాం, సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ హరీష్‌రావు, తెలంగాణ జలసాధన సమితి కన్వీనర్ నైనాల గోవర్ధన్, ప్రాణహిత పరిరక్షణ వేదిక కన్వీనర్ కెవి ప్రతాప్ మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంబంధిత ప్రాజెక్టులపై వివరించారు. దేశంలోనే అత్యంత వెనుబడ్డ ప్రాంతం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అని చెప్పారు. గతంలో ప్రణాళిక సంఘమే ఈ విషయాన్ని గుర్తించిందని వివరించారు. గత 75 ఏండ్లల్లో ఆదిలాబాద్ జిల్లా దుస్థితి ఏమీ మారలేదని అభిప్రాయపడ్డారు.

జిల్లాకు అన్నీ వైపుల నీటిసదుపాయం ఉన్నా రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాణహిత ప్రాజెక్టును చేపట్టాలని కోరారు. దీనికి గతంలో వైఎస్సార్ శంకుస్థాపన చేశారన్నారు. ఎన్నికల ప్రణాళికలో వాగ్దానం చేసినట్టుగా ఈ ప్రాజెక్టును యుద్ధప్రాతిపదికన నిర్మించాలని కోరారు. కేంద్రం దీన్ని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పోలవరం మాదిరిగానే ప్రాణహితకూ నిధులు వచ్చేలా చూడాలని సూచించారు.కాళేశ్వరం నుంచి నీటి అవకాశం లేదనీ, తుమ్మిడిహెట్టి తప్ప ప్రత్యామ్నాయం లేదని తెలిపారు. ఇచ్చోడ నేరడిగొండతోపాటు, కడెం ఆయకట్టుకు నిరంధించడం, ప్రమాదాన్ని తప్పించేందుకు కుప్టి ప్రాజెక్టు అవసరమని అభిప్రాయపడ్డారు. అలాగే అతికొద్ది నిధులతో పూర్తయ్యే పెండింగ్ ప్రాజెక్టులను వెంటనే పూర్తిచేయాలని వివరించారు.

అమూల్ డెయిరీ ప్రధాన కార్యాలయ సందర్శన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గుజరాత్‌లోని అమూల్ డెయిరీ ప్రధాన కార్యాలయాన్ని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి,ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి సందర్శించారు. శ్వేత విప్లవ పితామహుడు వర్గీస్ కురియన్, అమూల్ డెయిరీ వ్యవస్థకులు త్రిభువన్ వందాస్ కె.పటేల్ విగ్రహాలకు నివాళులు అర్పించారు. అమూల్ ఉత్పత్తి తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. వర్గీస్ కురియన్ వీడియోగ్రఫిని వీక్షించారు.

జీహెచ్‌ఎంల జీపీఎఫ్ ఖాతాలను ఏజీ ఆఫీస్‌కు బదలాయించాలి

● మంత్రి సీతక్కకు పీఆర్టీయూ తెలంగాణ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల (జీహెచ్‌ఎం) జీపీఎఫ్ ఖాతాలను ఏజీ ఆఫీస్‌కు బదులయించాలని పీఆర్టీయూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కను గురువారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం చెన్నయ్య, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అబ్దుల్లా కలిసి వినిపత్రం సమర్పించారు. జీపీఎఫ్‌లో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి దృష్టికి తెచ్చామని తెలిపారు. గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల పోస్టు మల్టీ జోనల్ అయినందున బదిలీ అయిన ప్రతిసారి జీపీఎఫ్ ఖాతా జిల్లాలకు మారడం చాలా ఇబ్బందిగా మారిందని వివరించారు. ఫలితంగా ఉపాధ్యాయుల వ్యక్తిగత ఖాతాలకు డబ్బు చేరడం లేదని తెలిపారు. ఒక్కో ఉపాధ్యాయుడు రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు జీపీఎఫ్ ఖాతాలకు జమ చేస్తున్నారని పేర్కొన్నారు. ఖాతాలు జిల్లాలకు బదిలీ చేయకపోవడం వల్ల ఉపాధ్యాయుల డబ్బులు వ్యక్తిగత ఖాతాలోకి చేరడం లేదని వివరించారు. గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల జీపీఎఫ్ ఖాతాలు ఏ జిల్లాలో పనిచేసినప్పటికీ ఏజీ ఆఫీసు నిర్వహణలోకి బదలాయిస్తే ఉపాధ్యాయులకు మేలు జరుగుతుందని సూచించారు. నెలవారి జీతాల నుంచి మినహాయించిన డబ్బు ఉపాధ్యాయుల వ్యక్తిగత ఖాతాలోకి చేరకపోవడం వల్ల వేల రూపాయల వడ్డీ కూడా జమ కావడం లేదని తెలిపారు. రాష్ట్రంలో ఉన్న గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల జీపీఎఫ్ వివరాలన్నీ ఏజీ ఆఫీస్‌కు బదలాయించాలని కోరారు. ఈ విషయాలను పరిశీలించి తప్పకుండా చర్యలు తీసుకుంటామని మంత్రి సీతక్క హామీ ఇచ్చారని పేర్కొన్నారు.

బీఆర్‌ఎస్‌కు బీసీని ప్రెసిడెంట్ చేయాలి

● చామల కిరణ్ కుమార్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీ బీసీని రాష్ట్ర అధ్యక్షున్ని చేస్తే బీఆర్‌ఎస్ కనీసం వర్కింగ్ ప్రెసిడెంట్ కూడా బీసీకి ఇవ్వలేదని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి విమర్శించారు. బీఆర్‌ఎస్ సిల్వర్ జూబ్లీ సమావేశం సందర్భంగా బీసీని అధ్యక్షున్ని చేయాలని డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ పడగొట్టిన తెలంగాణను సీఎం రేవంత్ రెడ్డి నిలబెట్టారని కొనియాడారు. మామకు వారసున్ని అని కలలు గంటున్న హరీశ్ రావు ఫోటో ఆ పార్టీ బీఆర్‌ఎస్ సిల్వల్ జూబ్లీ సమావేశాల పోస్టర్లలో లేదని ఎద్దేవా చేశారు. కేటీఆర్ వచ్చాక హరీశ్‌రావు పరిస్థితి పార్టీలో అగమ్యగోచరంగా మారిందని తెలిపారు.



సామ్రాజ్యవాదాన్ని తిప్పికొట్టడమే విమలా రణదీవెకిచ్చే నివాళి

సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

చిన్నవయస్సులోనే బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా విమలా రణదీవె పోరాడారనీ, నేడు అమెరికా సామ్రాజ్యవాదాన్ని తిప్పికొట్టడమే ఆమెకిచ్చే నివాళి అని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ నొక్కి చెప్పారు. ట్రంప్ ఆంక్షలు, సుంకాలు విధించడం వంటి చర్యలతో మన దేశంమీద తీవ్ర ప్రభావం పడుతున్న తీరు పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం హైదరాబాద్‌లోని సీఐటీయూ రాష్ట్ర కార్యాలయంలో ఆ యూనియన్ కోశాధికారి వంగూరు రాములు అధ్యక్షతన విమలా రణదీవె జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పాలడుగు భాస్కర్‌తో పాటు సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ...బాల్యం నుంచే దోపిడీ, అణచివేత, వివక్షకు వ్యతిరేకంగా సమసమాజ స్థాపన కోసం పోరాడారని గుర్తుచేశారు. 12వ ఏటనే బ్రిటీష్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా పోరాడారనీ, క్షమాపణ చెపితే వదిలి పెడతామనే అవకాశమిచ్చినా..తాను ప్రజల పక్షానే అని చెబుతూజైలు జీవితాన్ని గడిపిన ధీరవనిత ఆమె అని కొనియాడారు. బ్రిటీష్ వస్త్ర పరిశ్రమలకు వ్యతిరేకంగా పోరాడుతూనే విదేశీ వస్తువుల బహిష్కరణ ఉద్యమంలో పాల్గొన్నారనీ, ఆమె నిజమైన దేశభక్తురాలని తెలిపారు. ఆనాడు బ్రిటీషర్లకు అనుకూలంగా పనిచేసివారు నేడు దేశభక్తులమని ప్రచారం చేసు కోవడం దుర్మార్గమన్నారు. ముంబయి పట్టణంలోనూ, ఆ చుట్టుపక్కల ప్రాంతా ల్లోనూ మహిళా ఉద్యమ నిర్మాతగా పనిచేశారని గుర్తుచేశారు. గిర్ని కాంగార్ యూనియన్ 1940లో చేసిన సాధారణ సమ్మెలో ఆమె చురుకైన పాత్ర పోషిం చిందనీ, 40 రోజుల పాటు జరిగిన సుదీర్ఘ సమ్మెలో కార్మికులు, ముఖ్యంగా మహిళా కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారని తెలిపారు. 1948లో రెండో సారి అరెస్టు అయి రెండేండ్ల పాటు జైలు శిక్ష అనుభవించారనీ, జైలులో 17 రోజులు నిరాహారదీక్షలో పాల్గొన్నారని చెప్పారు. ఇండియా-చైనా సరిహద్దు వివాదంలో ఆమెను అరెస్టు చేసి మరో రెండేళ్లపాటు అదుపులోకి తీసుకున్నారనీ, ఎమర్జెన్సీ సమయంలో బీటీఆర్‌తో కలిసి అజ్ఞాతంలోకి వెళ్లారని తెలిపారు. సీఐటీయూకి అనుబంధంగా శ్రామిక మహిళా సమన్వయ కమిటీ తొలి కన్వీనర్‌గా ఎన్నికయ్యారన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ సీనియర్ నాయకులు పి. రాజారావు, రాష్ట్ర కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్, రాష్ట్ర కమిటీ సభ్యులు యాటల సోమన్న, పి. సుధాకర్, ఎ. సునీత, ఎం.శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

రెండ్రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షం

పలు జిల్లాలకు ఎల్లో హెచ్చరిక జారీ

గురువారం రాత్రి 10 గంటల వరకు 164 ప్రాంతాల్లో వర్షం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావం వల్ల రాష్ట్రంలో వచ్చే రెండు రోజుల పాటు తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు పడే సూచనలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి డాక్టర్ కె.నాగరత్న హెచ్చరించారు. ఈ మేరకు వాతావరణ శాఖ బులిటెన్‌ను విడుదల చేశారు. శుక్రవారం నాడు జయశంకర్‌భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో, శనివారం పై జిల్లాలతో పాటు కరీంనగర్, పెద్దపల్లి, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లో అక్కడక్కడా వర్షం కురిసే సూచనలున్నాయి. ఈదురు గాలులు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వీచ్చే అవకాశముంది. జీహెచ్‌ఎంసీ పరిధిలో వచ్చే 48 గంటల పాటు ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది.

కొన్ని ప్రాంతాల్లో సాయంత్రం, రాత్రి సమయాల్లో తేలికపాటి వర్షం, చిరుజల్లులు పడే అవకాశముంది. తెలంగాణ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ నివేదిక ప్రకారం గురువారం రాత్రి 10 గంటల వరకు 164 ప్రాంతాల్లో వర్షపాతం నమోదైంది. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మండలం బిజిలాపురంలో అత్యధికంగా 4.50 సెంటీమీటర్ల వర్షం కురిసింది. రాష్ట్రంలో వచ్చే ఐదు రోజుల పాటు గరిష్ఠ ఉష్ణోగ్రతలు క్రమంగా పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి.

గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైన ప్రాంతాలు	
ఆదిలాబాద్	41.3 డిగ్రీలు
నిజామాబాద్	40.5 డిగ్రీలు
మహబూబ్‌నగర్	40 డిగ్రీలు
ఖమ్మం	39.8 డిగ్రీలు
రామగుండం	38.4 డిగ్రీలు

అత్యధిక వర్షపాతం నమోదైన ప్రాంతాలు	
బిజిలాపురం (యాదాద్రి భువనగిరి జిల్లా)	4.50 సెంటీమీటర్లు
వెల్టూరుపల్లి (ములుగు)	4.48 సెంటీమీటర్లు
శ్రీగాపూర్(సంగారెడ్డి)	4.18 సెంటీమీటర్లు
ఆలేరు(యాదాద్రి భువనగిరి జిల్లా)	3.18 సెంటీమీటర్లు
అర్కపల్లి(రంగారెడ్డి)	3.08 సెంటీమీటర్లు

చదివేందుకుపుస్తకాలేవి?

కొత్త పాఠ్య పుస్తకాల విడుదలలో ఎన్సీఈఆర్టీ వైఫల్యం

గత వారమే ప్రారంభమైన పాఠశాలలు

ఆందోళనలో విద్యార్థులు, తల్లిదండ్రులు



న్యూఢిల్లీ : విద్యా పరిశోధన, శిక్షణ జాతీయ మండలి (ఎన్సీఈఆర్టీ) తాను నిర్దేశించుకున్న కాలక్రమాన్ని తానే ఉల్లంఘిస్తోంది. నాలుగు తరగతుల విద్యార్థులకు అందుబాటులో ఉంచాల్సిన పాఠ్యపుస్తకాలకు అతీగతీ లేకపోవడంతో పాఠశాలలు గందరగోళంలో పడుతున్నాయి. 2025-26 విద్యా సంవత్సరం నుండి 4, 5, 7, 8 తరగతుల విద్యార్థుల కోసం నూతన పాఠ్య పుస్తకాలు ప్రవేశపెడతామని ఎన్సీఈఆర్టీ గతంలోనే ప్రకటించింది. ఇందుకోసం సంవత్సరం క్రితమే పాఠ్య పుస్తకాల రూపకల్పన కోసం ప్రయత్నాలు ప్రారంభించింది. అయితే సకాలంలో ఆ పనిని పూర్తి చేయడంలో విఫలమైంది. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

గత సంవత్సరం కూడా 3, 6 తరగతుల విద్యార్థులకు నూతన పాఠ్య పుస్తకాలు ప్రచురించడంలో జాప్యం జరిగింది. ఏప్రిల్‌లో విద్యా సంవత్సరం ప్రారంభమైతే ఆగస్టులో 6వ తరగతి గణితం, సాంఘిక శాస్త్ర పుస్తకాలు అందుబాటులోకి వచ్చాయి. ఈ ఏడాది కూడా గత వారమే అన్ని పాఠశాలలు ప్రారంభమయ్యాయి. అయితే ఎన్సీఈఆర్టీ ఇప్పటి వరకూ నాలుగో తరగతి విద్యార్థుల కోసం హిందీ, ఇంగ్లీషు పుస్తకాలను, ఏడో తరగతి విద్యార్థులకు ఇంగ్లీషు పుస్తకాన్ని మాత్రమే విడుదల చేసింది. ఏడో తరగతి హిందీ పాఠ్య పుస్తకం ఇంకా రాలేదు. కొత్త పుస్తకాలను ఎన్సీఈఆర్టీ వెబ్‌సైటులో ఇంకా అప్‌లోడ్ చేయలేదు. 4, 5, 7, 8 తరగతుల విద్యార్థులకు మరే కొత్త పాఠ్య పుస్తకం అందుబాటులో లేదు. 5, 8 తరగతులకు సంబంధించిన అన్ని సబ్జెక్టులకూ ఎన్సీఈఆర్టీ బ్రిడ్జి కోర్సులు రూపొందించి వాటిని తన వెబ్‌సైటులో అప్‌లోడ్ చేసింది.ఎన్సీఈఆర్టీ సిలబస్‌ను, పాఠ్య పుస్తకాలను ఎలాంటి మార్పులు లేకుండా సీబీఎస్‌ఈ అనుసరిస్తోంది. పాఠ్య పుస్తకాల లభ్యతకు ఎన్సీఈఆర్టీ కాలక్రమాన్ని నిర్దేశించిందని గత నెల 26న జారీ చేసిన సర్క్యులర్‌లో సీబీఎస్‌ఈ తెలియజేసింది. ఆ సర్క్యులర్ ప్రకారం...లాంగ్వేజెస్ మినహా నాలుగో తరగతికి చెందిన అన్ని సబ్జెక్టుల పుస్తకాలు ఈ నెల 10వ తేదీకి అందుబాటులో ఉండాలి. అలాగే ఏడో తరగతి సైన్స్ పుస్తకాలు 10న, లెక్కల పుస్తకాలు 20న రావాల్సి ఉంటుంది. అయితే పదో తేదీ వచ్చినా అవి ఇంకా అందుబాటులో లేవు. ఇక ఐదో తరగతి పుస్తకాలు జూన్ 15కు, ఎనిమిదో తరగతి పుస్తకాలు జూన్ 20 నాటికి విద్యార్థుల చేతిలో ఉండాలి. ఐదు, ఎనిమిది తరగతుల విద్యార్థులు పాత పాఠ్య ప్రణాళిక నుండి కొత్త దానికి సులభంగా మారేందుకు వీలుగా ఎన్సీఈఆర్టీ బ్రిడ్జి కోర్సులను రూపొందించింది. కాగా ఢిల్లీలోని ఓ ప్రయివేటు పాఠశాల పాత పాఠ్య పుస్తకాలతోనే విద్యా బోధన కొనసాగిస్తోందని అందులో చదువుతున్న విద్యార్థి తండ్రి తెలిపారు. 'మా అబ్బాయి చదువుకునే స్కూలులో పాత సిలబసే చెబుతున్నారు. సిలబస్ మారితే విద్యార్థులకు కష్టమవుతుంది. సమయం తక్కువగా ఉండడంతో కొత్త సిలబస్‌ను వారు ఎలా పూర్తి చేయగలుగుతారు?' అని ఆయన ప్రశ్నించారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించండి

● మంత్రి శ్రీధర్‌బాబుకు ఉద్యోగ జేఏసీ వినతి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉద్యోగులు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని ఉద్యోగ జేఏసీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు మంత్రి డి శ్రీధర్‌బాబును గురువారం హైదరాబాద్‌లో ఉద్యోగ జేఏసీ చైర్మెన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు నేతృత్వంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పీఆర్సీ నివేదికను తెప్పించుకుని 51 శాతం ఫిట్‌మెంట్‌తో వెంటనే అమలు చేయాలని కోరారు. ఈ-కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న వివిధ రకాల బిల్లులను చెల్లించాలని తెలిపారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న 57 సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం, ఉద్యోగులు, పెన్షనర్ల సమాన సహకారంతో ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఈహెచ్‌ఎస్)ను అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ జేఏసీ కో చైర్మెన్ జి సదానందంగౌడ్, డిప్యూటీ సెక్రటరీ జనరల్ ఎ సత్యనారాయణ, నాయకులు ఎం పర్వత్‌రెడ్డి, గోల్కొండ సతీశ్, ఎం మోహన్, రామారావు, శ్రీరామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 14 వరకు తెలంగాణ రైతు మహోత్సవం

హైదరాబాద్ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో

నిర్వహణ : అగ్రి హార్టీ కల్చరల్ సొసైటీ కార్యదర్శి డాక్టర్ ఏ.వీ.రావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్‌లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఏప్రిల్ 11 నుంచి 14 వరకు నాలుగు రోజుల పాటు తెలంగాణ రైతు మహోత్సవం నిర్వహిస్తున్నట్టు అగ్రి హార్టీ కల్చరల్ సొసైటీ కార్యదర్శి డాక్టర్ ఏ.వీ.రావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 11.30 గంటలకు ఈ మహోత్సవాన్ని తెలంగాణ శాసనమండలి చైర్మెన్ జి.సుఖేందర్ రెడ్డి ప్రారంభించనుండగా, తెలంగాణ అగ్రికల్చర్ అండ్ ఫార్మర్స్ వెల్ఫేర్ కమిషన్ చైర్మెన్ కోదండరెడ్డి, కిసాన్ పరివార్ ప్రయివేట్ లిమిటెడ్ వ్యవస్థాపక చైర్మెన్ భూపాల్ నాయక్, నారాయణపేట్ ఎమ్మెల్యే చిట్టెం పరిణికరెడ్డి, భారతీయ కిసాన్ సంఘ్ జాతీయ ప్రధాన కార్యదర్శి మోహినీ మోహన్ మిశ్రా, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రైస్ రీసెర్చ్ మాజీ డైరెక్టర్ డాక్టర్ వి.రవీంద్రబాబు తదితరులు ప్రారంభోత్సవంలో పాల్గొననున్నారు

మహోత్సవంలో రైతులతో పాటు శాస్త్రవేత్తలు పాల్గొనున్నారు. ఈ మహోత్సవం రైతులు వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాల్లో ఎదుర్కొంటున్న వ్యవసాయ యాంత్రీకరణ, నిల్వలు, ధరలు, మార్కెటింగ్ తదితర సమస్యలకు పరిష్కారం చూపించే దిశగా చర్చిస్తుందని ఏ.వీ.రావు తెలిపారు. అన్నదాతకు మేలు చేకూర్చి ప్రోత్సహించడమే మహోత్సవం ముఖ్య ఉద్దేశమని చెప్పారు. నూతన సాంకేతిక పరిజ్ఞానంపై రైతులు అవగాహన పెంచుకుని బలోపేతం అయ్యేందుకు మహోత్సవం దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అదే విధంగా అవసరమైన ప్రజలకు ఆహార భద్రత కల్పించే దిశగా తగిన అనుసంధానాన్ని వెదికే దిశగా మహోత్సవంలో కార్యక్రమాలుంటాయని వెల్లడించారు.

సచివాలయంలో రాజ్యాంగేతర శక్తిగా మీనాక్షి నటరాజన్

సీఎం లేనప్పుడు అజ్ఞాత వ్యక్తి రివ్యూ చేసిన చరిత్ర లేదు

రాహుల్ మెప్పుకోసం ప్రధానిపై రేవంత్‌రెడ్డి అడ్డగోలు మాటలు : బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాజ్యాంగేతర శక్తిలా మీనాక్షి నటరాజన్ సచివాలయంలో అడుగుపెట్టారనీ, సీఎం లేనప్పుడు అజ్ఞాత వ్యక్తి సచివాలయంలో సమీక్ష నిర్వహించడం చరిత్రలో ఎక్కడా లేదని బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. రేవంత్‌రెడ్డి మతిస్థిమితం లేకుండా బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారనీ, రాహుల్ గాంధీ మెప్పుకోసం ప్రధానిపై అడ్డగోలు మాట్లాడుతున్నారని దెప్పిపొడిచారు. గురువారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఇచ్చిన హామీలు నెరవేర్చాననే నమ్మకం ఉంటే రాజీనామా చేసి ఇప్పటికీ ఇప్పుడు ఎన్నికలకు వెళ్లే దమ్ము రేవంత్‌రెడ్డికి ఉందా? అని ప్రశ్నించారు. అలాచేస్తే ఆయన కొడంగల్‌లో ఓడిపోవడం ఖాయమన్నారు. మొన్నటి ఎంపీ ఎన్నికల్లో కొడంగల్‌లో కాంగ్రెస్‌కు 23 వేల ఓట్లు తగ్గాయని గుర్తుచేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా అహ్మదాబాద్ లో గొప్పలు చెప్తావా? ఆరు గ్యారెంటీల అమలుపై చర్చకు సిద్ధమా? అని సవాల్ విసిరారు. తెలంగాణలో బీజేపీని లేకుండా ఖతం చేస్తానని ఆయన అనటాన్ని తప్పుబట్టారు. హామీలు అమలు చేయనందుకు రాష్ట్ర ప్రజలు రాహుల్‌ను తెలంగాణ లో అడుగు పెట్టనివ్వరన్నారు. తొందర్లోనే కాంగ్రెస్ ముక్త్ భారత్ రాబోతుందన్నారు. రాహుల్ పాదయాత్ర చేస్తే మోకాలు అరిగాయి తప్ప దేశానికి ఏమొచ్చిందని ప్రశ్నించారు. హెచ్‌సీయూ భూముల వ్యవహారం వెనుక కేటీఆర్ ఉన్నాడనే అనుమానం తమకుందన్నారు. దేశాన్ని మతం ప్రాతిపదికన విభజించి పాలించిన పార్టీ కాంగ్రెస్సే అని ఆరోపించారు. రాహుల్ గాంధీకి హిందూ, భారతీయ మూలాల కన్నా విదేశీ మూలాలే ఎక్కువని విమర్శించారు.

సింగరేణి అధికారులు మాట తప్పారు

ఓసి-3 ముందు పరశురాంపల్లి గ్రామస్తుల ధర్నా

16న హైదరాబాద్‌లో సీఎండీతో మాట్లాడిస్తామన్న జీఎం

నెల రోజులైనా సమస్య పరిష్కరించలేదు



నవతెలంగాణ-గణపురం

సింగరేణి అధికారులు నెల రోజుల కిందట మాట ఇచ్చి తప్పారని, తమ సమస్యలు పరిష్కారం కాలేదని, గ్రామాన్ని మొత్తం తరలించాలని జయశంకర్-భూపాలపల్లి జిల్లా గణపురం మండలం పరశురాంపల్లి గ్రామస్తులు డిమాండ్ చేశారు. గురువారం సింగరేణి ఓసీ-3 ఎదుట ప్రధాన రహదారిపై పెద్దఎత్తున ధర్నా చేశారు. పంట పొలాలు మొత్తం తీసుకొని గ్రామాన్ని తరలించకపోవడం వల్ల పనులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, తాగునీరూ సరిగా దొరకని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. నెల రోజుల కిందట ఇదే ఓసి-3 ముందు ధర్నా చేశామని, అప్పుడు ఉన్నతస్థాయి అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని సింగరేణి జీఎం రాజేశ్వర్‌రెడ్డి, చిట్యాల సీఐ మల్లేష్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పటికీ తమ సమస్య పరిష్కారం కాలేదని, సింగరేణి అధికారులను అడిగితే సీఎండీకి లెటర్ పంపించామంటూ సాకులు చెబుతున్నా రని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో చేసేదేమీ లేక గ్రామస్తులందరం ఏకమై మళ్లీ ధర్నా చేస్తున్నామన్నారు. సింగరేణి అధికారులపై నమ్మకం లేదని, జిల్లా కలెక్టర్, సింగరేణి సీఎండీ హామీ ఇస్తేనే తాము ధర్నా విరమిస్తామని భీష్మించుకు కూర్చున్నారు. దీంతో సింగరేణి జీఎం రాజేశ్వర్‌రెడ్డి, సింగరేణి అధికారి కవీంద్ర, చిట్యాల సీఐ మల్లేష్ ధర్నా వద్దకు చేరుకొని గ్రామస్తులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఓసీ-3లో 90 శాతం వ్యవసాయ భూములు కోల్పోయి ఉపాధి లేకుండా పోయిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమ పిల్లలకు కూడా ఉపాధి కల్పించడంలో సంస్థ పూర్తిగా విఫలమైందన్నారు. గ్రామంలో ఇండ్లు మాత్రమే మిగిలాయని, ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు కూలీ పనులకు వెళ్లి జీవనం కొనసాగిస్తున్నామని తెలిపారు. ఓసి-త్రీలో 2012లో భూములు కోల్పోయినప్పటి నుంచి తమను పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగాలు, పునరావాస ప్యాకేజీ అందిస్తామని సింగరేణి అధికారులు చెబితేనే కన్నతల్లి లాంటి పంట భూములు ఇచ్చామన్నారు. ఆ తర్వాత సగం గ్రామాన్ని సింగరేణి సంస్థ సర్వే చేసిందని, సర్వే చేసినంతవరకు ఇంటి స్థలాల భూములను, ఇండ్లను తీసుకుంటామని చెప్పిందని అన్నారు. కానీ సగం ఊరును ఇవ్వబోమని, మొత్తం గ్రామాన్ని తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఓసి-3కి పరశురాంపల్లి దగ్గర ఉండటం వల్ల బాంబు బ్లాస్టింగ్‌లతో ఇంటి గోడలు పగుళ్లు పడుతున్నాయని, సామాన్లు కింద పడుతున్నాయని, వృద్ధులు గుండెపోటుతో మృతిచెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చివరకు జీఎం హామీతో ధర్నా విరమించారు.

ఈనెల 16న సింగరేణి సీఎండీతో మాట్లాడిస్తా : జీఎం రాజేశ్వర్‌రెడ్డి

గతంలో గ్రామస్తుల ధర్నా సందర్భంగా ఇచ్చిన హామీ ప్రకారం సమస్యపై పైఅధికారులకు లెటర్ పెట్టాం. వారి నుంచి ఎలాంటి అనుమతులూ రాలేదు. ఈనెల 16న హైదరాబాద్ తీసుకెళ్లి సింగరేణి సీఎండితో మాట్లాడిస్తా.

అనారోగ్యం పాలవుతున్నాం : ఉడుత మమత

సింగరేణి ఓసి-3 మూలంగా వచ్చే దుమ్ముతో అనారోగ్యం పాలవుతున్నాం. సింగరేణి అధికారులకు పలుమార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదు. ఊపిరితిత్తుల సమస్యలు వస్తున్నాయి. భూములు మొత్తం కోల్పోవడం వల్ల ఉపాధి లేదు.

మాట తప్పారు.. అందుకే ధర్నా



సింగరేణి అధికారులు నెల రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని చెప్పి పరిష్కరించకపోవడం వల్లే మరోసారి ధర్నా చేస్తున్నాం. ఇప్పటికైనా సింగరేణి అధికారులు స్పందించి తమ గ్రామాన్ని ఖాళీ చేయించాలి. ఓసి-త్రీ మూలంగా దుమ్ము ధూళితో తీవ్ర అవస్థలు పడుతున్నాం. గతంలో స్వయంగా జీఎం ధర్నా విరమించండి.. సమస్య పరిష్కరిస్తానని మాట ఇచ్చి తప్పారు.

- ఉడుత నాగరాజు, గ్రామస్తుడు

ఓసీ-3 పనులు నిలిపివేస్తాం



ఈ నెల 16న సింగరేణి సీఎండీతో చర్చించకుంటే ఓసీ-3 పనులను అడ్డుకుంటాం. వాహనాలు రాకుండా చేస్తాం. ఇక్కడే టెంటు వేసుకొని కుటుంబాలతో కలిసి వంటావార్పు చేసుకుని ధర్నా కొనసాగిస్తాం.

- కనుకుంట్ల సమ్మక్క

తెలంగాణ యూనివర్సిటీల బంద్ సక్సెస్

- కాంట్రాక్టు అధ్యాపకుల అరెస్టుపై ఆగ్రహం
- జీవో నెం.21ను రద్దు చేయాలని డిమాండ్



నవతెలంగాణ- ఓయూ/ హనుమకొండ చౌరస్తా/డిచ్‌పల్లి

యూనివర్సిటీల కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల అరెస్టులను నిరసిస్తూ గురువారం తెలంగాణ యూనివర్సిటీల బంద్ విజయవంతమైంది. హైదరాబాద్ ఓయూలో లెక్చరర్స్, ఉద్యోగులు, విద్యార్థులు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొని యూనివర్సిటీ కాంట్రాక్టు టీచర్లకు మద్దతు తెలిపారు. వారిని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే నిరవధిక సమ్మె చేసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని కాంట్రాక్టు అధ్యాపకులు హెచ్చరించారు. అలాగే, 4వ తేదీన విడుదల చేసిన జీవో నెంబర్ 21ను వెంటనే రద్దుచేసి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులర్ చేయాలని కోరారు.కాకతీయ యూనివర్సిటీలో వివిధ విభాగాలు, ప్రిన్సిపల్ ఆఫీస్, ఎగ్జామినేషన్ బ్రాంచ్, ఫైనాన్స్ ఆడిట్, యూజీసీ తదితర కీలకమైన విభాగాలన్నిటినీ కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు బంద్ చేశారు. మహిళా అధ్యాపకులను ఇండ్లల్లోకి వెళ్లి అరెస్టు చేయడం దారుణమని, ఇదెక్కడి న్యాయమని కాకతీయ విశ్వవిద్యాలయం ఒప్పంద అధ్యాపకుల సంఘం అధ్యక్షులు డాక్టర్ శ్రీధర్ కుమార్ లోద్ ప్రశ్నించారు. అనంతరం కాకతీయ యూనివర్సిటీ పరిపాలన భవనం ముందు నిరసన వ్యక్తం చేశారు. కాకతీయ యూనివర్సిటీ రిజిస్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం స్పందించి కాంట్రాక్ట్ అధ్యాపకుల సమస్యను మానవతా దృక్పథంతో ప్రభుత్వం పరిష్కరిస్తుందని, తక్షణమే వీసీతో మాట్లాడి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.తెలంగాణ యూనివర్సిటీ అకాడమిక్ కన్సల్టెంట్లు క్యాంపస్‌లోని వివిధ కళాశాలల తరగతులను కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు బహిష్కరించారు. అనంతరం ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ నుంచి పరిపాలనా భవనం వరకు ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులతో కలిసి బైటాయించి నిరసన చేపట్టారు. జీవో నెంబరు 21ను వెంటనే రద్దు చేసి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

భద్రాచలం పోలీస్ స్టేషన్‌పై ఏసీబీ దాడులు

- లారీ యజమాని నుంచి రూ.20 వేల లంచాన్ని తీసుకున్న సీఐ గన్‌మెన్
- సీఐ సహా ముగ్గురిని అదుపులోకి తీసుకున్న ఏసీబీ

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం పోలీసు స్టేషన్‌లో ఏసీబీ అధికారులు దాడి చేశారు. గ్రావెల్ తోలకం విషయంలో సంబంధిత యజమాని నుంచి రూ.20 వేల లంచం తీసుకున్న ఘటనపై భద్రాచలం సీఐ బర్పటి రమేష్‌తో పాటు గన్‌మెన్ రామారావు, ప్రయివేట్ వ్యక్తి కార్తీక్‌ను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. గత నెల 19న బూర్గంపాడు మండలం సారపాకకు చెందిన లారీ ఓనర్ వెంకట్రాంరెడ్డి లక్ష్మీపురం నుంచి భద్రాచలం పట్టణానికి ఓ ఇంటి నిర్మాణ నిమిత్తం గ్రావెల్ తీసుకొస్తుండగా బ్రిడ్జి సెంటర్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. లారీని భద్రాచలం పోలీస్ స్టేషన్‌కి తరలించారు. లారీ యజమాని వెంకట్రాంరెడ్డి భద్రాచలం పట్టణ పోలీస్ స్టేషన్‌కి వెళ్లి కేసు విషయంపై సీఐ బర్పటి రమేష్‌తో చర్చించారు. ఈ విషయాన్ని సీఐ తన గన్‌మెన్ రామారావుకు అప్పజెప్పారు. లారీ ఓనర్ నుంచి రూ.30 వేలు డిమాండ్ చేశారు. లేదంటే లారీపై కేసు నమోదు చేస్తామని గన్‌మెన్ రామారావు బెదిరింపులకు పాల్పడ్డాడు. దాంతో సదరు లారీ యజమాని 20 వేల రూపాయలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. గన్‌మెన్ రామారావు సూచనతో అతడి స్నేహితుడైన కార్తీక్ అనే వ్యక్తికి ఫోన్ పే ద్వారా రూ.20 వేలు బదిలీ చేశారు. జరిగిన సంఘటనపై నమ్మదగిన సమాచారంతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు సమగ్ర విచారణ జరిపి గురువారం భద్రాచలం పోలీస్ స్టేషన్‌లో తనిఖీ నిర్వహించారు. సీఐ గన్‌మెన్ రామారావుని అదుపులో తీసుకొని విచారించారు. దీంతో సీఐ బర్పటి రమేష్ సూచనతోనే రూ.20వేలు తన స్నేహితుడు కార్తీక్ ఫోన్‌పేకి బదిలీ చేయించానని రామారావు ఏసీబీ అధికారుల ఎదుట ఒప్పుకున్నాడు. ఏసీబీ ఖమ్మం డీఎస్పీ వై.రమేష్ నేతృత్వంలో సీఐ బర్పటి రమేష్‌తోపాటు గన్‌మెన్ రామారావు, కార్తీక్‌పై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు.

పీఆర్‌ఆర్‌డీలో అధిపతుల కాలపరిమితి పొడిగింపు

- స్త్రీ నిధి ఎండీ విద్యాసాగర్ రెడ్డికి ఏడాది..
- పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం ఈఎన్సీ కనకరత్నంకూ ఏడాది
- వీరిద్దరికి రీఅపాయింట్‌మెంట్ ఉత్తర్వులు
- యధావిధిగా విధుల్లో మిషన్‌భగీరథ ఈఎన్సీ కృపాకర్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో స్త్రీనిధి ఎండీ విద్యాసాగర్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం ఈఎన్సీ కనకరత్నం సర్వీసును మరో ఏడాది పాటు పొడిగిస్తూ రీ అపాయింట్‌మెంట్ ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. మిషన్‌భగీరథ ఈఎన్సీ కృపాకర్‌రెడ్డికి గతేడాది అక్టోబర్‌లోనే ప్రభుత్వం సర్వీసు పొడిగించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఆయన అక్టోబర్‌కు కంటిన్యూయేషన్ ఆఫ్ సర్వీస్‌లో కొనసాగుతారు. ఏప్రిల్ ఒకటో తేదీలోపు రిటైర్డ్ అయిన తర్వాత కూడా ఉన్నతస్థాయి పదవుల్లో ఉన్నవారు తప్పనిసరిగా తప్పుకోవాలని రాష్ట్ర సర్కారు ఈ నెల 28న ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పంచాయతీరాజ్ శాఖలో నాలుగు విభాగాలకు సంబంధించిన ఉన్నతాధికారులను విధుల్లో నుంచి తప్పుకోవాలని రాష్ట్ర సర్కారు ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. దీంతో వారు ఏప్రిల్ ఒకటో తేదీన విధుల నుంచి తప్పుకున్నారు. దీంతో వారంపాటు ఆ మూడు కీలక విభాగాలకు ఉన్నతాధికారులు లేకుండా పోయారు. అసలే వేసవి కాలం. రాష్ట్రంలో తాగునీటి కొరత ఉన్నది. ఈ సమయంలో మిషన్‌భగీరథకు పెద్ద దిక్కు లేకపోతే ఏదైనా సమస్య వస్తే ఎలా ఎదుర్కోవాలనే విషయాన్ని ప్రభుత్వ దృష్టికి ఆ అధికారులు తీసుకెళ్లారు. రాష్ట్రంలో హ్యామ్ పద్ధతిలో కింద వేల కిలోమీటర్ల మేర గ్రామీణ రోడ్లను వేయించాలని నిర్ణయించినట్టు బడ్జెట్‌లో ప్రకటించింది. దాంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున రోడ్లు ఇతర మౌలిక సదుపాయాలను కల్పించాల్సిన అవసరముంది. ఇలాంటి తరుణంలో పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ విభాగానికి అధిపతి లేకపోతే ఎలా పనులవుతాయనే ప్రశ్నలు ఉత్పన్నమయ్యాయి. ఆయా శాఖలకు అధిపతులు లేకపోవడం వల్ల నివేదికలు, కీలకమైన సమాచారం ఇటు సీఎంకు, అటు ఉన్నతాధికారులకు పంపడంలోనూ ఇబ్బందులు తలెత్తినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలోనే తిరిగి ఆ ముగ్గురు అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం బాధ్యతలను అప్పగించింది.

రాష్ట్రంలో ఇంటింటికీ ఇంటర్నెట్ సేవలు

- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటికి తెలంగాణా ఫైబర్ నెట్ ద్వారా ఇంటర్నెట్ సేవలు కల్పించనున్నట్టు ఐటీ, పరిశ్రమల మంత్రి డీ.శ్రీధర్‌బాబు తెలిపారు. హైదరాబాద్‌లోని బేగంపేటలో గురువారం టీ ఫైబర్ నూతన కార్యాలయాన్ని ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేబుల్ ఆపరేటర్ల సహకారంతో చివరి వ్యక్తి వరకు టీవీ ఛానెళ్లను అందిస్తామని పేర్కొన్నారు. టీవీ సెట్లను కంప్యూటర్ మానిటర్‌గా వినియోగించుకుని విద్యార్థులు ప్రయోజనం పొందేలా టెక్నాలజీ రూపొందించినట్టు తెలిపారు. 'టీ ఫైబర్ ఇప్పటికే 424 మండలాల్లోని 8,891 గ్రామ పంచాయతీలను అనుసంధానం చేసింది. మరో 7,187 పంచాయతీలు సేవలు అందుకోవటానికి సిద్దంగా ఉన్నాయి. ఈ సంవత్సరం 30 వేల ప్రభుత్వ కార్యాలయాలకు కనెక్టివిటీ కల్పించాం. 2027 నాటికి 60 వేల కార్యాలయాలను అనుసంధానం చేస్తాం. టీ ఫైబర్ ఇకపై (టీఎస్ఎక్స్‌టీ) పేరుతో సేవలందిస్తుంది" అని మంత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా సైబర్ కొత్త లోగోను మంత్రి ఆవిష్కరించారు. అనంతరం ప్రభుత్వ డేటాను సురక్షితంగా ఉంచగల సావరిన్ క్లౌడ్‌ను ప్రారంభించారు. తెలంగాణా ఫైబర్ గ్రిడ్ కార్పొరేషన్ చైర్మెన్‌గా శ్రీధర్‌బాబు బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఐటీ శాఖ అదనపు కార్యదర్శి భవేష్ మిశ్రా, టీ ఫైబర్ ఎండీ వేణు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన ఆరోగ్యమిత్ర అనూజ

- యూనియన్ ఆర్థిక సాయం
- కుటుంబ సభ్యులకు రూ.లక్ష అందజేత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గుర్తు తెలియని వాహనం తగిలి ప్రమాదానికి గురైన యాదగిరిగుట్ట ఆరోగ్యమిత్ర కె.అనూజకు తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (టీయుఎంహెచ్ఇయూ) అండగా నిలబడింది. మార్చి 29న తమ విధులకు ఆన్‌లైన్ అటెండెన్స్ కోసం త్వరగా చేరుకోవాలని వెళుతూ అనూజ రాయగిరి భువనగిరికి మధ్యలో ఈ ప్రమాదం జరిగిన సంగతి తెలిసిందే. ఆమె హైదరాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నది. అనూజకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆరోగ్య మిత్రలందరూ తమకు తోచిన విధంగా చేసిన సహాయం రూ.ఒక లక్షను గురువారం యూనియన్ గౌరవాధ్యక్షులు భూపాల్ కుటుంబ సభ్యులకు అందజేశారు.

అనంతరం హైదరాబాద్‌లోని కోఠిలో ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ సీఈవో కర్ణన్‌ను కలిసి అనూజ పరిస్థితిని వివరించారు. సీఈవో వెంటనే అనూజకు తగిన సహాయ, సహకారాలు అందించాలని ట్రస్ట్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆరోగ్యమిత్రలందరి తరపున సీఈవోకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో ఆరోగ్యమిత్రలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా తక్షణమే పొందే విధంగా చూడాలని ఈ సందర్భంగా సీఈవోను కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. వీటితో పాటు ఆరోగ్యశ్రీ ఉద్యోగుల వేతనాల పెంపుదల ఫైల్ సచివాలయంలోని ఆర్థికశాఖలో క్లియర్ చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు మహేందర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు సుమన్, నల్లగొండ జిల్లా అధ్యక్షులు నాగరాజు, భువనగిరి జిల్లా అధ్యక్షులు మహేశ్, ప్రధాన కార్యదర్శి కాటమయ్య, హైదరాబాద్ మిత్రులు జైపాల్ రెడ్డిలు పాల్గొన్నారు.

బిజినెస్

అమెరికాతో తొందరపాటు లేదు

- మంత్రి పీయూశ్ గోయల్



ముంబయి : అమెరికాతో ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందం విషయంలో తొందరపాటు చర్యలు తీసుకోవడం లేదని వాణిజ్య శాఖ మంత్రి పీయూశ్ గోయల్ అన్నారు. దేశానికి ప్రయోజనం కలిగే విధంగా సరైన ఫలితాలను రాబట్టేందుకు ప్రభుత్వం సంప్రదింపులు జరుపుతుందన్నారు. యూఎస్ టారిఫ్‌ల విధింపు నేపథ్యంలో ఎగుమతి సెజ్‌లు, పరిశ్రమ వర్గాలతో మంత్రి సమావేశమయ్యారు. ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం నెలకొన్న సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, అందుబాటులో ఉన్న అవకాశాలను మంత్రి వివరించారు. టారిఫ్‌లపై ఇతర దేశాలు వివిధ రకాలుగా స్పందిస్తున్నాయన్నారు. అమెరికాతో వాణిజ్యాన్ని రెండున్నర రెట్లు పెంచుకోవడంపై తాము దృష్టి సారించామన్నారు. ఇరు దేశాలపై మధ్య ద్వైపాక్షిక సంబంధాలను, సులభతర వాణిజ్యం కోసం ప్రధాని మోడీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సమక్షంలో ఇరు దేశాలు ఫిబ్రవరిలోనే ఓ ఒప్పందం చేసుకున్నాయన్నారు. దీనివల్ల ఇరు దేశాల వాణిజ్యం 500 బిలియన్ డాలర్లకు చేరుతుందన్నారు. గతంతో పోలిస్తే ఈ మొత్తం రెండున్నర రెట్లు అధికం అన్నారు. దీనివల్ల మరింత మందికి ఉద్యోగ అవకాశాలు వస్తాయని, దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని పేర్కొన్నారు.

చుక్కానిలా భారత్ : ఎన్ఎస్ఈ సీఈఓ చౌహాన్

అల్లకల్లోల ప్రపంచంలోనూ భారత్ చుక్కానిలా ఎదుగోతందని ఎన్ఎస్ఈ ఎండీ, సీఈఓ ఆశిష్ కుమార్ చౌహాన్ పేర్కొన్నారు. ప్రపంచ ప్రతికూలతలు, పెట్టుబడిదారుల సెంటిమెంట్, భవిష్యత్తు అవకాశాల మధ్య భారత మార్కెట్ పనితీరుపై మాట్లాడారు. భారత మార్కెట్లు గరిష్ట స్థాయి నుంచి 1.5 ట్రిలియన్ డాలర్లు తగ్గినప్పటికీ.. మూలధన మార్కెట్లు దీర్ఘకాలిక వృద్ధి పథాన్ని కలిగి ఉన్నాయన్నారు. 2014లో భారత మార్కెట్ల క్యాప్ 1 ట్రిలియన్ డాలర్ల కంటే తక్కువగా ఉండగా.. ఇప్పుడు 5 ట్రిలియన్ డాలర్లకు చేరుకుందన్నారు. ఎస్ఐపీ రూపంలో ప్రతీ నెల మార్కెట్లలోకి 2.5-3 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వస్తున్నాయన్నారు.

తెనాలి డబుల్ హార్స్ నుంచి తృణ ధాన్యాల ఉత్పత్తులు

- తెలుగు రాష్ట్రాల మార్కెట్లోకి విడుదల : గ్రూప్ సీఎండీ మోహన్ శ్యామ్ ప్రసాద్ వెల్లడి



నవ తెలంగాణ - హైదరాబాద్

పప్పులు, ధాన్యాల విక్రయాల్లో ఉన్న తెనాలి డబుల్ హార్స్ గ్రూప్ తాజాగా తృణ ధాన్యాల ఉత్పత్తుల విభాగంలోకి మిల్లెట్ మార్వెల్స్ పేరుతో ప్రవేశించింది. ఈ బ్రాండ్ కింద ధాన్యాలు, నూడుల్స్, కుకీస్, రెడీ టు కుక్ విభాగంలో 18 రకాల ఉత్పత్తులను అందుబాటులోకి తెచ్చింది. వీటిని గురువారం హైదరాబాద్‌లో అపోలో హాస్పిటల్స్ గ్రూప్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ సంగీత రెడ్డి, తెనాలి డబుల్ హార్స్ గ్రూప్ సీఎండీ మోహన్ శ్యామ్ ప్రసాద్ విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్యామ్ ప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ.. వీటిని తొలుత తెలుగు రాష్ట్రాల్లో అందుబాటులోకి తెస్తున్నామని చెప్పారు. గడిచిన 2024-25లో తమ గ్రూప్ ఆదాయం తొమ్మిది శాతం పెరిగి రూ.535 కోట్లుగా నమోదయ్యిందన్నారు. మిల్లెట్స్ ఆవిష్కరణలతో ఈ ఏడాది ఆదాయంలో 15 శాతం వృద్ధిని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఏడాదిలో తెలుగు రాష్ట్రాల్లో 25 చొప్పున మొత్తంగా 50 ప్రత్యేక అవుట్‌లెట్‌లను తెరువాలని నిర్దేశించుకున్నామన్నారు. ప్రస్తుతం ఏపీలో ఐదారు ఉన్నాయన్నారు. ఫ్రాంచైజీ పద్దతిలోనూ స్టోర్లను ఇవ్వనున్నామన్నారు. తెనాలిలోని తమ తయారీ యూనిట్‌లో గంటకు 18 టన్నుల ఉత్పత్తులను ప్రాసెస్ చేస్తున్నామని చెప్పారు. త్వరలోనే ఆర్గానిక్ ఉత్పత్తుల్లోకి ప్రవేశించనున్నామన్నారు. తమ ఉత్పత్తులు ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో లభిస్తాయన్నారు.

కార్గో విమానాల్లో 600 టన్నుల ఐఫోన్‌ల ఎగుమతులు

న్యూఢిల్లీ: అమెరికా ప్రభుత్వం అడ్డగోలుగా వేస్తోన్న టారిఫ్‌ల నేపథ్యంలో ఆపిల్ కంపెనీ ముందు జాగ్రత్తగా తన ఉత్పత్తులను అమెరికాకు తరలించుకుంటుంది. అధిక పన్నుల నుంచి తప్పించుకోవడానికి వీలుగా భారత్ నుంచి 600 టన్నులు లేదా సుమారు 15 లక్షల ఐఫోన్లను ప్రత్యేక కార్గో విమానాల్లో అమెరికాకు తరలించినట్లు రిపోర్టులు వస్తోన్నాయి. ఇటీవల ట్రంప్ చైనాపై 125 శాతం, భారత్‌పై 26 శాతం, ఇతర దేశాలపైనా భారీగా సుంకాలు వేస్తోన్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. కాగా.. చైనా మినహా మిగితా దేశాలపై 90 రోజుల వరకు సుంకాల అమలును వాయిదా వేశారు.

తెలంగాణ ప్రభుత్వంతో గోద్రెజ్ క్యాపిటల్ జట్టు

నవతెలంగాణ - హైదరాబాద్

గోద్రెజ్ ఇండస్ట్రీస్ గ్రూప్‌నకు చెందిన ఆర్థిక సేవల కంపెనీ గోద్రెజ్ క్యాపిటల్ తమ ఫైనాన్స్, హౌసింగ్ ఫైనాన్స్ సంస్థల ద్వారా తెలంగాణ ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం (ఎంఒయు) కుదుర్చుకుంది. రాష్ట్రవ్యాప్తంగా రుణ, వ్యాపార అవకాశాల లభ్యతను పెంచి ఎంఎస్ఎంఇల అభివృద్ధికి ఊతమిచ్చేందుకు ఈ భాగస్వామ్యం దోహదపడనుందని గోద్రెజ్ క్యాపిటల్ ఎండీ, సీఈఓ మనీష్ షా తెలిపారు. ముఖ్యంగా రుణ సదుపాయం అంతగా లేనివారికి రుణాల లభ్యతను మెరుగుపర్చడం ద్వారా ఎంఎస్ఎంఈ వ్యవస్థను పటిష్టం చేయడం ఈ భాగస్వామ్య లక్ష్యమన్నారు. ఎంఎస్ఎంఈ వ్యవస్థను పటిష్టం చేయడంలో చిత్తశుద్ధితో కృషి చేస్తున్న తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పని చేయడం తమకెంతో గర్వకారణంగా ఉందన్నారు.

పీఎన్‌బీ సైబర్ అవర్‌నెస్ వాక్‌థాన్



నవతెలంగాణ - హైదరాబాద్

ప్రభుత్వ రంగంలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ) 131వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో సైబర్ ఆవర్‌నెస్ వాకథాన్‌ను నిర్వహించింది. ప్రస్తుత డిజిటల్ యుగంలో సైబర్ సెక్యూరిటీపై అవగాహన కల్పించే ప్రయత్నం చేసింది. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ సైబర్ క్రైమ్ ఏసీపీ కెవిఎం ప్రసాద్, ఆర్బీఐ సీజీఎం చిన్మయ్ కుమార్, పీఎన్‌బీ హైదరాబాద్ జోనల్ సీజీఎం సునీల్ కుమార్ చుగ్, ఆ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణలోకి ఓబెన్ ఎలక్ట్రిక్ ప్రవేశం

- మూడు కొత్త షోరూంల ఏర్పాటు



నవతెలంగాణ - హైదరాబాద్

దేశీయంగా ఆర్అండ్‌డి కలిగిన విద్యుత్ మోటార్ సైకిల్ తయారీ కంపెనీ ఓబెన్ ఎలక్ట్రిక్ తన కార్యకలాపాలను తెలంగాణ రాష్ట్రంలోకి విస్తరించింది. హైదరాబాద్‌లో రెండు, వరంగల్‌లో ఒక్క షోరూం చొప్పున ఏర్పాటు చేసినట్లు ఆ సంస్థ వెల్లడించింది. ఈ సందర్భంగా తొలి 30 మంది ఖాతాదారులకు బంగారం నాణెంను ఆఫర్ చేస్తోన్నామని ఓబెన్ ఎలక్ట్రిక్ ఫౌండర్, సీఈఓ మధుమిత అగర్వాల్ తెలిపారు. దేశంలో ప్రతీ నెల తమ సంస్థ 8-10 చొప్పున కొత్త షోరూంలను తెరుస్తున్నామన్నారు. 2026 మార్చి ముగింపు నాటికి 50 నగరాల్లో 100 పైగా షోరూంలకు విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

తగ్గిన టీసీఎస్ లాభాలు

న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద టెక్నాలజీ కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) నికర లాభాల్లో తగ్గుదల చోటు చేసుకుంది. గడిచిన ఆర్థిక సంవత్సరం (2024-25) మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం (క్యూ4)లో 2 శాతం తగ్గుదలతో రూ.12,224 కోట్ల లాభాలను ప్రకటించింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.12,434 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇదే సమయంలో రూ.61,237 కోట్లుగా ఉన్న రెవెన్యూ.. గడిచిన క్యూ4లో రూ.64,479 కోట్లకు పెరగడం విశేషం. ఆర్థిక ఫలితాల సందర్భంగా రూ.1 ముఖ విలువ కలిగిన షేర్‌పె రూ.30 చొప్పున తుది డివిడెండ్‌ను చెల్లించేందుకు కంపెనీ బోర్డు నిర్ణయిచింది. వరుసగా రెండో త్రైమాసికంలోనూ మెరుగైన ఆర్డర్ బుక్ సాధించామని టీసీఎస్ సీఈఓ కృతివాసన్ తెలిపారు. వార్షిక ఆదాయం 30 బిలియన్ డాలర్లను దాటడం పట్ల సంతోషం వ్యక్తంచేశారు. గడిచిన క్యూ4లో కొత్తగా 625 మంది ఉద్యోగులను తీసుకున్నామని ఆ సంస్థ హెచ్ఆర్ చీఫ్ మిలింద్ లక్కడ్ పేర్కొన్నారు. మొత్తం ఉద్యోగుల సంఖ్య 6.07 లక్షలకు చేరిందన్నారు.

నాగోల్‌లో ఫిలిప్స్ స్మార్ట్‌లైట్ హబ్ ప్రారంభం

- ఏర్పాటు చేసిన సిగ్నిఫై



హైదరాబాద్ : ప్రముఖ లైటింగ్ కంపెనీ సిగ్నిఫై హైదరాబాద్‌లోని నాగోలులో అత్యాధునిక ఫిలిప్స్ స్మార్ట్ లైట్ హబ్ (ఎస్ఎల్‌హెచ్)ను ప్రారంభించింది. దేశంలో ఇది తమకు 320వ స్టోర్ అని సిగ్నిఫై గ్రేటర్ ఇండియా బిజినెస్ హెడ్ రాజా మౌద్గిల్ తెలిపారు. 2000 చదరపు అడుగుల విస్తీర్ణంలోని ఈ స్టోర్‌లో 400 పైగా విభిన్న ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయన్నారు. వినియోగదారులకు సమగ్ర షాపింగ్ అనుభూతిని అందించడమే లక్ష్యంగా దీనిని రూపొందించామన్నారు. గృహ యజమానులు, ఇంటీరియర్ డిజైనర్లు, పెట్టుబడిదారులకు ప్రత్యేక హోమ్ లైటింగ్ అనుభూతిని అందించడమే లక్ష్యమన్నారు.

సిగ్నేచర్ గ్లోబల్ ప్రీ సేల్ అమ్మకాల్లో 42 శాతం వృద్ధి

న్యూఢిల్లీ: గడిచిన ఆర్థిక సంవత్సరం (2024-25)లో రూ.10,290 కోట్ల విలువ చేసే ముందస్తు బుకింగ్స్‌ను నమోదు చేసినట్టు ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీ సిగ్నేచర్ గ్లోబల్ వెల్లడించింది. ఇంతక్రితం ఏడాది ప్రీబుకింగ్ సేల్స్‌తో పోల్చితే 42 శాతం ఎక్కువని పేర్కొంది. ఇదే సమయంలో 41 శాతం వృద్ధితో రూ.4,380 కోట్ల వసూళ్లను సాధించినట్టు వెల్లడించింది. గడిచిన ఆర్థిక సంవత్సరాన్ని తాము సంతోషంగా ముగించామని ఆ సంస్థ హోల్ టైం డైరెక్టర్ ప్రదీప్ కుమార్ అగర్వాల్ పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన కార్పొరేటర్



నవతెలంగాణ - హస్తినాపురం

హస్తినాపురం డివిజన్ పరిధిలో ని విరాట్ నగర్ కాలనీలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయనున్నట్లు జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ తెలిపారు. గురువారం పాఠశాలను సందర్శించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో తాగు నీటి వసతిని కల్పించాలని పాఠశాల సిబ్బంది కార్పొరేటర్ ను కోరారు. స్పందించిన కార్పొరేటర్ వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడారు. తక్షణమే నీటి సమస్యను తీర్చాలని ఆదేశించారు. ఇంకా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి నిధులు కేటాయించి పరిష్కరించనున్నట్లు తెలిపారు.

నేడు రౌండ్ టేబుల్ సమావేశం : బొడ్డుపల్లి కృష్ణ



నవతెలంగాణ-నాగోల్

న్యూ నాగోల్ ఎస్ఏ డాంగే భవన్ లో నేడు ఉదయం 10:00 గంటలకు బీసీ రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించాలని ఒత్తిడి తెచ్చేందుకు రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర కమిటీ సహాయ కార్యదర్శి బొడ్డు పల్లి కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు కామారెడ్డి డిక్లరేషన్ లో ప్రకటించిన విధంగానే కాంగ్రెస్ ప్రజా పాలన ప్రభుత్వం.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లును శాసనసభలో ప్రవేశపెట్టి ఆమోదింపజేసి పార్లమెంటు కు పంపిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వంపై మరింత ప్రజా తీవ్ర ఒత్తిడి తీసుకురావడానికి, అందులో భాగంగా క్షేత్రస్థాయి నుండి మరింత ప్రభావితం తీసుకురావడం కోసం ఈ రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి బీసీ వాదులు, వివిధ బీసీ సంఘాల నాయకులు, ఉద్యమకారులు, హాజరుకావాలని కోరారు.

నేటికీ కొనసాగుతున్న కుల, వర్ణ వివక్షత



- శ్రమ దోపిడి, సామాజిక అణచివేత, వివక్షతల అంతం కోసం పోరాడుదాం
- మహనీయుల జయంతులను ఘనంగా నిర్వహించాలి
- సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.చంద్రమోహన్

నవతెలంగాణ - హస్తినాపురం

సమాజంలో నేటికి ప్రతి చోటా కుల, వర్ణ వివక్షత కొనసాగుతున్నాయని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాటిని అరికట్టడం లో విఫలమయ్యాయని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.చంద్రమోహన్ అన్నారు. హస్తినాపురం డివిజన్ పరిధిలోని నందన వనంలో సీఐటీయూ అనుబంధ సంఘాల యూనియన్ల సభ్యులతో జనరల్ బాడీ సమావేశాన్ని గురువారం సీఐటీయూ ఎల్బీనగర్ సర్కిల్ అధ్యక్షులు పి.రామస్వామి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రమోహన్ మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలను అవలంబిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును నిరసిస్తూ మే 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని, మహనీయులు, సంఘ సంస్కర్తలను స్మరించుకునే విధంగా ఏప్రిల్ జరిగే సామాజిక సంఘ సంస్కర్తలైన జ్యోతిరావు పూలే జయంతిని, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, కమ్యూనిస్టు యోధులు బి.టి రణదివే జయంతులను జయప్రదం చేయాలని కోరారు. మహనీయుల ఆశయాలను సాధించే విధంగా నేటి తరానికి వారి గొప్పతనం గురించి తెలియజేయాలన్నారు. సమాజంలో నేటికి ప్రతి చోటా కుల, వర్ణ వివక్షత కొనసాగుతున్నాయని మండిపడ్డారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వాటిని అరికట్టడంలో విఫలమయ్యారని విమర్శించారు. స్వాతంత్ర యానంతరం పట్టణ ప్రాంతాల్లో దళిత, గిరిజన కార్మికులకు ఇండ్లు అద్దెకు ఇవ్వకపోవడం చాలా సిగ్గుచేటని అన్నారు. ఇలాంటి వివక్షకు వ్యతిరేకంగా జ్యోతిరావు పూలే, సావిత్రి బాయి పూలే, అంబేద్కర్ మహనీయులు ఎందరో పోరాటం చేసి హక్కులు సాధించారని తెలియజేశారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత దళితులపై, గిరిజనులపై, ఆదివాసులపై, మహిళల పైన రోజురోజుకూ దౌర్జన్యాలు పెరుగుతున్నాయని అన్నారు. అనంతరం సామాజిక విరాళాలు కార్మికుల ద్వారా సేకరించారు. ఈ కార్యక్రమంలో ఎల్బీ నగర్ సర్కిల్ కమిటీ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య, పలువురు భవన నిర్మాణ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ కాలనీలో కనీస సౌకర్యాల్లేవ్..

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రజా పాలన చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రచారం చేయడం తప్పా..ఆచరణలో ఏమి కనిపించడం లేదు. ప్రభుత్వాలు మారినా, పాలకులు మారిన మా బతుకులు మారలేదు. పోస్టర్ కాలనీ ప్రజల జీవన విధానంలో మార్పు కనిపించడం లేదు. కాలనీ ఏర్పడి దశాబ్దాలు గడిచినా నేటికీ పోస్టల్ కాలనీలో కనీస సౌకర్యాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

- రోడ్లు,డ్రయినేజీలు, కనీస సౌకర్యాలు లేవు
- సకాలంలో పన్నులు చెల్లిస్తున్నాం.. కానీ అభివృద్ధి మాత్రం శూన్యం
- ఇబ్బందులు పడుతున్న స్థానిక ప్రజలు
- పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు



నవతెలంగాణ-బడంగ్ పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న 26వ డివిజన్ పరిధిలోని పోస్టర్ కాలనీ సమస్యలకు నిలయంగా మారిందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ కాలనీ ఏర్పడి దశాబ్దాల కాలం గడిచినా నేటికీ కాలనీలో కనీస సౌకర్యాలైన రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు, మిషన్ భగీరథ పథకంలో ఇంటింటికీ తాగునీటి సౌకర్యం లేవు. అంతేకాదు కాలనీలో మురికి నీటితో పాటు పందుల జీవనానికి నిలయంగా మారటంతో కాలనీ ప్రజలు రోగాల బారిన పడుతున్నట్టు వాపోతున్నారు. మురుగు నీటిలో ప్రతి నిత్యం పందులు స్వైర్య విహారం చేస్తున్నాయి. దీంతో మలేరియా,డెంగ్యూ, వైరస్ ఫీవర్ తదితర రోగాల బారిన పడుతున్నామని స్థానిక ప్రజలు చెబుతున్నారు. కనీసం మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది సైతం పరిసరాలను పరిశుభ్రంగా చేయడానికి రావడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు.రాష్ట్రంలోనే బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలిచిందని గతంలో డిల్లీ స్థాయిలో అవార్డు తీసుకోవడం జరిగిందని గుర్తుచేశారు. కానీ మా కాలనీ సమస్యలను పటించుకునే నాథుడు లేడని కాలనీవాసులు మండిపడుతున్నారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న అన్ని కాలనీలలో శరవేగంగా అనేక అభివృద్ధి నిర్మాణ పనులు జరుగుతున్నాయి.మా కాలనీలో అభివృద్ధి పనులు ఎందుకు జరుగటం లేదని కాలనీ వాసులు ప్రశ్నిస్తున్నారు. మా కాలనీ నుండి అన్ని రకాల పన్నులు సకాలంలో మున్సిపల్ అధికారులకు చెల్లిస్తున్నాం కానీ.. అభివృద్ధి ఎందుకు జరగటం లేదని కాలనీ వాసులు మదనపడుతున్నారు. కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని అనేక సార్లు ప్రజా ప్రతినిధులకు, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న పాపాన పోలేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, సమస్యలను పరిష్కరించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.







కాలనీ సమస్యలను త్వరలో పరిష్కరిస్తా..



పోస్టర్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని పోస్టర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఆధ్వర్యంలో ఇటీవలనే తనకు వినతి పత్రం అందజేశారు. ప్రణాళిక ప్రకారం యుద్ధ ప్రాతిపాదికన విడుతల వారీగా కాలనీలో ఉన్న కనీస సౌకర్యాలు కల్పించడం కోసం ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశాం. త్వరలో కాలనీలో ఉన్న ప్రజా సమస్యలను పరిష్కారం చేసి, ఆదుకోవడానికి తన వంతు కృషి చేస్తాను.

- కమిషనర్ సరస్వతి

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



- అధికారులు పరిపాలనను పారదర్శకంగా నిర్వహించాలి
- ఎమ్మెల్యే రంగారెడ్డి

నవతెలంగాణ-తుర్కయంజాల్

కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అధికారులు కృషి చేయాలని, అట్టడుగువర్గాలకు సంక్షేమ ఫలాలు అందాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. అభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాల అమలు తీరుపై తుర్కయంజాల్‌లో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ అమరేందర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన యువ వికాసం పథకంలో లబ్దిదారుల ఎంపికను సీరియస్‌గా తీసుకోవాలని సూచించారు. ఈ నెల 14వరకు గడువు ఉన్నందున అధికారులు వీలైనంత ఎక్కువగా ప్రచారం నిర్వహించాలన్నారు. అలాగే మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో నెలకొన్న సమస్యలను అధికారులను, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కోహెడలో నెలకొన్న మంచినీటి సమస్యను 10రోజుల్లోగా పరిష్కరించాలని ఆదేశించారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ, కరెంట్ సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. తుర్కయంజాల్‌ను మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలన్నారు. అవసరమైతే ఎన్ని నిధులైనా ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ సమావేశంలో అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు గుండ్లపల్లి ధన్‌రాజ్‌గౌడ్, కొశికె ఐలయ్య, కాకుమాను సునీల్, మర్రి మహేందర్ రెడ్డి, సామ భీంరెడ్డి, కొంతం వెంకటరెడ్డి, రెవెల్లె యాదగిరి, మేతరి అనురాధ దర్శన్, పుల్లగుర్రం కీర్తన విజయనంద రెడ్డి, వేముల స్వాతి, నారని కవిత, దాసరి సుధాకర్ రెడ్డి మున్సిపల్ మేనేజర్ శ్రీధర్ రెడ్డి, ఆర్ ఓ శ్రీనివాస్, డీఈ భిక్షపతి, టిపిఓ దినేష్, ఏ ఈ చంద్రశేఖర్ రెడ్డి, సానిటరి ఇన్ స్పెక్టర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

యువత సమాజ సేవలో ముందుండాలి

- ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మిరాజ్



నవతెలంగాణ -చంపాపేట్

సమాజ సేవలో యువత ముందుండాలని యాకుత్ పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మిరాజ్ అన్నారు.హైదరాబాద్ జిల్లా యాకుత్ పురా నియోజకవర్గం సంతోష్ నగర్ డివిజన్ పరిధిలోని కలిందానగర్ కమిటీ హాల్లో ఈద్ మీలాబ్ ఏఐఎంఐఎం ప్రైమరీ యూనిట్ అధ్యక్షులు సయ్యద్ కరీం వుద్దీన్ అక్రమ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంతోష్ నగర్ కాలనీ అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకారం అందించాలన్నారు. స్థానిక సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో మీర్జా రియాజ్ ఉల్ హసన్ ఎఫెండి, మలక్ పేట్ ఇంచార్జి రహమత్ ఉల్లా తయ్యబ్, సంతోష్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మహమ్మద్ ముజఫర్ హుస్సేన్,కుర్మగూడ డివిజన్ కార్పొరేటర్ షఫత్ అలీ పాల్గొన్నారు.

పెంచిన ఫీజులకు నిరసనగా ఇంజినీరింగ్ విద్యార్థుల ధర్నా



నవతెలంగాణ-బడంగ్ పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న నాదర్ గుల్ లోని ఎంవీఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం విద్యార్థులకు అన్ని రకాల ఫీజులు పెంచినందుకు నిరసనగా గురువారం కళాశాల ఎదుట విద్యార్థులు ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ కళాశాల యాజమాన్యం విద్యార్థుల సమస్యలను పట్టించుకోకుండా అన్ని రకాల ఫీజులు పెంచి, విద్యకు దూరం చేసేందుకు కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యంగా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించకుండా పలు రకాల ఫీజులను పెంచడమే ధ్యేయంగా యాజమాన్యం వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కళాశాల యాజమాన్యం కొన్ని సంవత్సరాలుగా ఇండెన్షిఫ్,ప్లేస్‌మెంట్ తీసుకరాక పోవడం వలన విద్యార్థులు నానా ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు రాసిన పరీక్షల్లో యాజమాన్యం కావాలని ఫేల్ చేసి వారినుండి రివ్యాలివేశన్ ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. కళాశాల యాజమాన్యం విద్యార్థులకు వేసవి కాలంలో సెలవులు ఇవ్వక పోవడం వలన ఇన్డెన్షిఫ్ చేయాలని ఉన్నా సమయం లేకపోవడం వలన ఇబ్బందులకు గురవుతున్నారని వివరించారు. కళాశాల యాజమాన్యం తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. విద్యార్థుల సమస్యలను పరిష్కారం చేస్తామని కళాశాల యాజమాన్యం హామీ ఇవ్వడంతో ధర్నా విరమించడం జరిగిందని విద్యార్థులు తెలిపారు. ఈ ధర్నాలో కళాశాల విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ శోభాయాత్రను ప్రశాంతంగా నిర్వహించాలి





- సౌత్ ఈస్ట్ జోన్ హైదరాబాద్ డీసీపీ పాటిల్ కాంతిలాల్ సుభాష్

నవతెలంగాణ - చంపాపేట్

హనుమాన్ శోభాయాత్రను ప్రశాంతంగా నిర్వహించాలని సౌత్ ఈస్ట్ జోన్ హైదరాబాద్ డీసీపీ పాటిల్ కాంతిలాల్ సుభాష్ అన్నారు. ఈనెల 12న హనుమాన్ శోభాయాత్ర సందర్భంగా నగరంలో శాంతిభద్రతల పరి రక్షణ, యాత్ర సజావుగా జరిగేందుకు అవసరమైన ఏర్పాట్లపై హైదరాబాద్ సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ పాటిల్ కాంతిలాల్ సుభాష్ ఐపీఎస్, అడిషనల్ డీసీపీ రఘులు గురువారం ఎల్బీనగర్ నియోజకవర్గం చంపాపేట్ డివిజన్ పరిధిలోని ఎంఎన్ఆర్ గార్డెన్ ఫంక్షన్ హాల్లో పీస్ కమిటీ సభ్యులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ పాటిల్ కాంతిలాల్ సుభాష్ మాట్లాడుతూ శాంతియుత వాతావరణంలో హనుమాన్ విజయయాత్రను నిర్వహించాలని, యాత్ర సందర్భంగా ఎవరైనా కొత్తవారు చేరితే వారిపై దృష్టి పెట్టి సంబంధిత పోలీసు అధికారులకు తెలియజేయాలని సూచించారు. ఊరేగింపు సమయంలో నిర్వాహకులు యాత్ర జరుగుతున్న ప్రాంతాల్లో ఎక్కడ కూడా ట్రాఫిక్ జామ్ కాకుండా ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని కోరారు. విగ్రహాల ఎత్తులో ముందస్తు జాగ్రత్తలు పాటించాలని, ఊరేగింపులలో డీజేలు లేకుండా చూడాలని అన్నారు.

ఊరేగింపులో ఎంతమంది ఎన్ని వాహనాలు వినియోగిస్తున్నారో ముందుగానే ట్రాఫిక్ పోలీసులకు తెలియచేయాలని, నిర్వాహకులు రోప్ పార్టీ సభ్యులకు శిక్షణ ఇచ్చి వారిని వినియోగించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో సంతోష్ నగర్ ఏసీపీ మహమ్మద్ గౌస్, సైదాబాద్ ఏసీపీ డి.వెంకన్న నాయక్, మలక్ పేట్ ఏసీపీ శ్యాంసుందర్, సీఐలు, డీఐలు, ఆల్ జోన్స్ జనరల్ సెక్రెటరీ కిషన్ శర్మ అడ్వకేట్, ఆల్ జోన్స్ చీఫ్ పర్దన్ ఆఫీస్ ముజాఫర్ హుస్సేన్, సౌత్ ఈస్ట్ జోన్ అధ్యక్షులు ఖాజా గజవుద్దీన్, అధ్యక్షులు నారాయణరెడ్డి, జనరల్ సెక్రెటరీ సయ్యద్ అజాజ్ అహ్మద్ ఖాద్రి, సౌత్ ఈస్ట్ జోన్ ఆర్గనైజేషన్ సెక్రెటరీ గోవింద్ సాగర్, ఎం.కె నాసిరుద్దిన్, సంతోష్ నగర్ డివిజన్ అధ్యక్షులు, పీస్ కమిటీ సభ్యులు చింతల శ్రీనివాస్, ఎండి సలీం ఖాజా, సయ్యద్ అబ్దుల్ ఆజాం, రషీద్ భాయ్, నరసింహ చారి, రషీద్, ప్రమోద్ కుమార్, నర్సింగ్ రావు, సయ్యద్ మాల్తాని, షేక్ మహమూద్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షకు వెళ్లి అదృశ్యమైన డిగ్రీ విద్యార్థిని



నవతెలంగాణ -నాగోల్

పరీక్ష రాయడానికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లిన ఓ డిగ్రి విద్యార్థిని అదృశ్యమైన ఘటన నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. నాగోల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ శివ నాగ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగోల్ డివిజన్ పరిధిలోని సాయి నగర్ కాలనీ రోడ్ నెంబర్ -3లో నివాసం ఉంటున్న కాట్రావత్ లాలు కుమార్తె కాట్రావత్ మమత.. శ్రీ సాయి డిగ్రి కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఈనెల 9న ఉదయం 9 గంటల ప్రాంతంలో పరీక్షకు వెళుతున్నానని ఇంట్లో చెప్పి వెళ్లి రాత్రి వరకు కూడా ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు ఆమె సెల్ ఫోన్ కు ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ లో ఉండడంతో వెంటనే పరిసర ప్రాంతాలతో పాటు బంధుమిత్రుల వద్ద విచారించినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో వెంటనే ఆమె కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శివ నాగ ప్రసాద్ తెలిపారు.

ఎల్బీనగర్‌లో మరో హత్య

నవతెలంగాణ-హయత్ నగర్

గత నెలలో ఎల్బీనగర్ లో ఓ యువకుడిని హత్య చేసిన ఘటన మరవక ముందే మరో మహిళను హత్య చేసిన ఘటన ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బడంగ్ పేటలో నివాసం ఉంటున్న లక్ష్మి(40) అనే మహిళను ఈ నెల 8వ తేదీన అర్ధరాత్రి సమయంలో ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రిషి కిచెన్ వెనుక ప్రాంతంలో గుర్తుతెలియని కత్తితో పొడిచారు. తీవ్ర గాయాలపాలైన ఆమెను చికిత్స నిమిత్తం హాస్పిటల్ కి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం ఆమె తుది శ్వాస విడిచారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

మామిడి రైతులకు ఇబ్బందుల్లేకుండా చూస్తాం

- ప్రస్తుతం మామిడి సీజన్ దృష్ట్యా క్రయ విక్రయాలు సజావుగా సాగాలి
- ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలి
- చైర్మెన్ చిలుక మధుసూదన్ రెడ్డి

నవతెలంగాణ - అబ్దుల్లాపూర్ మెట్

మామిడి సీజన్ ప్రారంభం దృష్ట్యా రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందని ఏఎంసీ చైర్మెన్ చిలుక మధుసూదన్ రెడ్డి అన్నారు. బాటసింగారం పండ్ల మార్కెట్ లో జరుగుతున్న మామిడి పండ్ల క్రయ విక్రయాలను గురువారం పాలకవర్గ సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ చిలుక మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ మార్కెట్ కి వచ్చే మామిడి రైతులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, రైతుల ప్రయోజనాలే ముఖ్యమన్నారు. గిట్టుబాటు ధర అందించడంలో ముందుంటామని తెలిపారు. గత ఏడాది కంటే ఈ సంవత్సరం మామిడి దిగుబడి అధికంగా ఉందని, మార్కెట్ కి వచ్చే రైతులకు అన్ని రకాల సదుపాయాలు కలిపిస్తున్నామని తెలిపారు. రైతులకు మంచి గిట్టుబాటు అందించేలా అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. ప్రతి రోజు సుమారుగా ఎనిమిది వందల వాహనాలు మార్కెట్ కి వస్తున్న తరుణంలో ట్రాఫిక్ కి ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. ఈ పరిశీలనలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ భాస్కర చారి, పాలకవర్గం సభ్యులు బండి మధుసూదన్ రావు,దోమలపల్లి అంజయ్య,నవరాజ్,మెగావత్ గణేష్ నాయక్, రఘుపతి రెడ్డి, మేకం లక్ష్మి, గోవర్ధన్ రెడ్డి, మచ్చేందర్ రెడ్డి, నరసింహ, ఎండీ ఇబ్రహీం మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



చలో వరంగల్‌ను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

చలో వరంగల్ సభను ఉద్దేశించి హెూటల్స్ శ్రీ వేదలో గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశం సీనియర్ ఉద్యమ నాయకుడు ఆర్ వి.మహేందర్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ డాక్టర్ శ్రవణ్, అంబర్‌పేట శాసనసభ్యులు కాలేరు వెంకటేష్ పాల్గొన్నారు. సమావేశంలో వక్తలు మాట్లాడుతూ.. 27న వరంగల్‌లో జరిగే రజతోత్సవ సభకు నియోజకవర్గం బీఆర్ఎస్ డివిజన్‌ల వారీగా ఉన్న నాయ కులు, బీఆర్ఎస్ సానుభూతిపరులు పెద్ద సంఖ్యలో సభకు తరలించాలని కోరారు. ఈ సమావేశానికి ఉద్యమకారులు సీనియర్ నాయకులు, మాజీ కార్పొరేటర్లు, కంటెస్టెంట్ కార్పొరేటర్లు, డివిజన్ స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు జి. యాదగిరి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుద్ఘాతానికి గురై భవన నిర్మాణ కార్మికుడి మృతి

నవతెలంగాణ-ముషీరాబాద్

భవన నిర్మాణం పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తూ 11 కేవీ విద్యుత్ తీగలకు తగిలి కూలి మృతి చెందిన సంఘటన చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయనగరానికి చెందిన నాయుడు (54), అతని భార్య లక్ష్మీ పిల్లలతో కలిసి ముషీరాబాద్ బాకారంలో నివసిస్తున్నారు. భవన నిర్మాణ పనుల్లో రోజువారిగా కూలీగా నాయుడు పని చేస్తుంటాడు. రాంనగర్ డివిజన్ రిసాల ఖుర్షీద్ ప్రాంతంలో బీఆర్ఎస్ నాయకుడు ఇలాం హుస్సేన్ గత కొన్ని రోజులుగా భవనాన్ని నిర్మిస్తున్నాడు. నాయుడు ఇలాం హుస్సేన్ భవన నిర్మాణ పనిలో కూలీగా చేరాడు. నిర్మాణ భవనం రెండవ అంతస్తుపై ఇనుప రాడ్తో పని చేస్తున్నాడు. ఆ భవనం పక్కన్నే ఉన్న 11 కేవీ విద్యుత్ తీగలకు ఆ ఇనుప రాడ్ తలిగడంతో విద్యుత్ షాక్‌కు గురై నాయకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న చిక్కడపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతుడి కుటుంబసభ్యులకు సమాచారం అందచేశారు. ఈ మేరకు మృతుడి భార్య లక్ష్మీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఇంటి ఓనర్ ఇలాం హుస్సేన్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వేసవి సెలవుల్లో 'అంగన్‌వాడీ బాట' చేపట్టాలి

- అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల హాజరు శాతం పెరగాలి
- పూర్వ ప్రాథమిక విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి
- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి





నవతెలంగాణ-సిటీబ్యూరో

వేసవి సెలవుల్లో అంగన్‌వాడీ బాట ప్రత్యేక కార్యక్రమం చేపట్టి.. పిల్లల సంఖ్య పెంచాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం పోషణ పక్షం కార్యక్రమంలో భాగంగా హిమాయత్ నగర్ సెక్టర్ నాంపల్లి ప్రాజెక్ట్‌లో గల భీమా మైదాన్ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి సెలవులలో జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని చేపట్టి.. కేంద్రాలకు ఎక్కువ మంది పిల్లలు వచ్చే విధంగా ప్రతి టీచర్, ఆయా చర్యలు చేపట్టాలని సూచించారు. కేంద్రంలో పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రతి కేంద్రంలో పిల్లల హాజరు శాతం పెంచాలన్నారు. పిల్లలకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించాలని కలెక్టర్ ఆదేశించారు. పిల్లలు ఆటల సమయంలో ఆట పరికరాలతో గడుపే విధంగా చూడాలనీ, ప్లాస్టిక్ టేబుల్స్, చైర్స్‌తో పాటు ఆట వస్తువులు అందించే దిశగా ప్రతిపాదనలు అందించాలని సూచించారు. అంగన్‌వాడీ టీచర్లు ఆయాలకు ఇచ్చే శిక్షణ తీరును అడిగి తెలుసుకున్నారు. కేంద్రానికి వచ్చే పిల్లలు యూనిఫాంతో వచ్చేలా చూడాలన్నారు. పిల్లలకు అందించే మిల్క్, బాలామృతం, గుడ్లు, బియ్యాన్ని పరిశీలించారు. కేంద్రాల ద్వారా పిల్లలతో పాటు, గర్భిణీలు, బాలింతలకు మెరుగైన సేవలు అందించాలనీ, ఆ దిశగా సిబ్బంది నిబద్ధతతో పని చేయాలని సూచించారు. ఖాళీ స్థలంలో గార్డెన్ ఏర్పాటుతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలనీ, ముఖ్యంగా బయటి వారు చెత్తాచెదారం వేయకుండా వెనుక భాగంలో ఉన్న అపార్టుమెంట్ వారికి కౌన్సిలింగ్ ఇప్పించాలని తహసిల్దార్‌ను ఆదేశించారు. పిల్లలకు ఆరోగ్య రీత్యా ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు తప్పక విజిట్ చేయాలని సూచించారు. కేంద్రంలో తాగునీటి వాటర్ లైన్‌ను ఏర్పాటుకు సత్వరమే చర్యలు చేపట్టాలన్నారు. నీటి నిల్వకు సంపు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పోషణ పక్షం కార్యక్రమంలో భాగంగా సీడీపీవో, సూపర్‌వైజర్లతో కలిసి గర్భిణీలకు నిర్వహించిన సీమంతం కార్యక్రమంలో పాల్గొని సారె కానుకలు, పిల్లలకు బాలామృతం తినిపించారు. ఈ కార్యక్రమంలో డీడబ్ల్యూవో అక్కేశ్వరరావు, తహసిల్దార్ సంధ్యారాణి, సీడీపీవో కృష్ణ చైతన్య, సూపర్‌వైజర్ బాల, డిస్ట్రిక్ కో-ఆర్డినేటర్ భరత్, తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల స్వీకరణ



నవతెలంగాణ- సుల్తాన్‌బజార్

రాజీవ్ యువ వికాసం కోసం ఆన్‌లైన్, మీసేవా కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకున్న వారు ఆ దరఖాస్తు ఫారాలను గోషామహల్ జీహెచ్ఎంసీ సర్కిల్ -14 యుసీడీసీడీడీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వార్డ్ కార్యాలయంలో గురువారం అబిడ్స్‌లోని జీహెచ్ఎంసీ కార్యాలయంలో గన్ ఫౌండ్రి డివిజన్ కు సంబంధించిన రాజీవ్ యువ వికాసం దరఖాస్తులను సిఓ సమ్మయ్య, రిసోర్స్ పర్సన్ (ఆర్‌పీ)లు బి.అనూష, జి.రాజేశ్వరి, బి.స్వప్నలు స్వీకరించారు. 14వ తేదీ వరకు రాజీవ్ యువ వికాసం దరఖాస్తులను స్వీకరిస్తామని తెలిపారు.

ప్రతిభకు పట్టం నేషనల్ మెరిట్ స్కాలర్ షిప్..



నవతెలంగాణ-ధూల్‌పేట్

ప్రతిభకు పట్టం.. నేషనల్ మెరిట్ స్కాలర్ షిప్ అని సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.బాల భాస్కర్ అన్నారు. డిగ్రీలో అత్యున్నత గ్రేడ్ సాధించి పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదువుతున్న విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం మెరిట్ ఆధారంగా స్కాలర్ షిప్‌లు, ఆర్థిక సహకారం అందిస్తున్నాదన్నారు. ఈ పథకంలో భాగంగా సిటీ కళాశాల ఎం.కామ్ విద్యార్థులు ఐదుగురు 2024-25 విద్యా సంవత్సరానికి గాను జాతీయ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ పథకం కింద నలుగురు విద్యార్థులు మూడు లక్షల చొప్పున, ఒక విద్యార్థి లక్షా యాభైవేల చొప్పున మొత్తం పద మూడు లక్షల యాభైవేలు అందుకున్నారన్నారు. వారి అకడమిక్ ప్రతిభ ఆధారంగా ఈ స్కాలర్ షిప్ లభించిందని, ఇది వారి కృషిని, పట్టుదలని సూచిస్తుందన్నారు. వారు భవిష్యత్తులో మరింత ఉన్నతిని సాధించాలని ఆకాంక్షించారు. కాలేజీలో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో ప్రిన్సిపాల్, కామర్స్ అధ్యాపక బృందం వారిని అభినందించారు.

జైబాపు, జై భీమ్, జై సంవిధాన్ పాదయాత్రను విజయవంతం చేయాలి

- కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ కైలాష్ బి.కుమార్



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్/ధూల్‌పేట్

కాంగ్రెస్ ప్రభుత్వం తలపెట్టిన జై బాపు, జై భీమ్, జై సంవిదాన్ పాదయాత్రను విజయవంతం చేసేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు ఏకతాటిపై వచ్చి ముందుకు నడవవలసిన అవసరం ఎంతైనా ఉందని కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ, గోశామహల్ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ కైలాష్ బి.కుమార్ పేర్కొన్నారు. ఈమేరకు గురువారం జాంబాగ్ డివిజన్, పటేల్ నగర్, కమిటీ హాల్‌లో కాంగ్రెస్ జాంభాగ్ డివిజన్ కమిటీ నాయకుల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జనరల్ సెక్రెటరీ కైలాష్ బి.కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వం రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు అందుతున్నాయా లేదా అని గడపగడపకు వెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన తెలిపారు. అదేవిధంగా త్వరలో ప్రారంభం కానున్న జై బాపూ,జై భీమ్, జై సంవిధాన్ పాదయాత్రను విజయవంతం చేసేందుకు గోశామహల్ కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు సంజయ్ కుమార్ యాదవ్, సికే మూర్తి శ్రీకాంత్ యాదవ్, బి.వెంకటేష్, ఎండి.ఖధీర్, దాసరి రాజ్ కుమార్, సయ్యద్ యూసుఫ్, మొహమ్మద్ ఇఫ్తేకార్‌అలీ, సుభాష్ లడ్డు, జుబేద్ ఖాన్, చైతన్య, నర్సింహ, సదానందం తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం



నవతెలంగాణ-ముషీరాబాద్

ముషీరాబాద్ ఆర్టీసి డిపో పరిసర ప్రాంతంలో నివసించే ప్రజలకు, ప్రయాణికులకు రవాణా సమస్యలపై శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వ హించనున్నట్లు ముషీరాబాద్ డిపో మేనేజర్ సురేందర్ గారు ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం(11-04-2025)సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు డయల్ యువర్ డిపో మేనేజర్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సర్వీసు సేవలకు సంబంధించి సమస్యలు, సలహాలు, ఫిర్యాదులు చేసేందుకు 9959226418 కు సంప్రదించాలని కోరారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ పోటీ

- ఆమ్ ఆద్మీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్



నవతెలంగాణ-హిమాయత్ నగర్

తెలంగాణ రాష్ట్రంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ పోటీ చేస్తుందని ఆప్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ ప్రకటించారు. గురువారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి అభ్యర్థులు దరఖాస్తు చేసుకునేందుకు ఆప్ క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ ఆమ్ ఆద్మీ పార్టీ సభ్యులు కాకపోయినా ఎవరైనా సామాన్యులు పారదర్శకత, జవాబుదారీతనం ఉన్న వారు రాష్ట్రంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ నుండి పోటీ చేయడానికి ఆప్ క్యూఆర్ కోడ్ ను ఉపయోగించి దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. రాష్ట్రంలో సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అన్ని జిల్లాలలో ఆమ్ ఆద్మీ పార్టీ పోరాటాలు నిర్వహిస్తుందని, 'కామన్ మ్యాన్' పార్టీగా రాష్ట్రంలోని స్థానిక సంస్థల ఎన్నికలలో ఆప్ మొదటిసారిగా అన్ని స్థానాల్లో పోటీ చేస్తుందని, రాబోయే ఎన్నికలలో దీనిని పరీక్షిస్తామని, ప్రజలకు ఆప్ ఏమిటో చూపించడానికి, ప్రదర్శించడానికి ఒక అవకాశం అడుగుతామని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆప్ నేతలు జావీద్ షరీఫ్, నర్సింగ్ యమునా గౌడ్, డా.లక్ష్మ నాయుడు, సుధారాణి, షాబాజ్, లియాఖత్ ఖాన్, లతా, మౌనిక, ధర్మేందర్ తివారి, స్వామి, సురేష్, జూలకంటి నాగరాజ్, విజయ్ ముల్లంగి తదితరులు పాల్గొన్నారు.

కానూరి జీవితం నేటి కవులకు, కళాకారులకు స్ఫూర్తిదాయకం



- కానూరి వర్ధంతి సభలో వక్తలు

నవతెలంగాణ-ముషీరాబాద్

నాలుగు తరాలని ప్రభావితం చేసిన అరుణోదయ కానూరి వెంకటేశ్వరరావు జీవితం నేటి కవులకు, కళాకారులకు స్ఫూర్తిదాయకమని పలువురు వక్తలు తెలిపారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షులు విప్లవ సాంస్కృతిక ఉద్యమ కళారంగా యోధులు ఆదర్శ కమ్యూనిస్టు కానూరి వెంకటేశ్వరరావు పదో వర్ధంతి సభ విద్యానగర్ మార్క్స్ భవన్‌లో అరుణోదయ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు పి.వేణు అధ్యక్షతన జరిగింది. సభకు ముందు కామ్రేడ్ కానూరు చిత్రపటానికి ఆయన తొలితరం శిష్యుల్లో ఒకరైన ప్రొఫెసర్ వినయ్ బాబు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కానూరి నాటి సాంస్కృతిక ఉద్యమ నాయకుడు మళ్లీ పుట్ట లేడని కొనియాడుతూ ఆయన తన జీవితాన్ని కాలంలో చేసిన కృషిని పట్టుదలను పోరాట పటిమను నేటితరం కవులు, కళాకారులు రచయితలు అలవర్చుకోవాలని కోరారు. ప్రముఖ సంపాదకులు, కవి సతీష్ చందర్ మాట్లాడుతూ ప్రజానాడిని పట్టుకున్న కానూరి రచనలు అనునిత్యం ప్రజల్ని ఆలోచింపజేసి కర్తవ్యబోధనలు చేసే వారన్నారు. సీపీఐ(ఎం-ఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గోవర్ధన్ మాట్లాడుతూ వీర తెలంగాణ శ్రీకాకుళ, గోదావరిలోయ రైతాంగ విప్లవ పోరాటాలకు సాంస్కృతిక కళాకారునిగా కానూరి అందించిన సేవలు, కృషి మర్చిపోలేనివన్నారు.ఈ వర్ధంతి సభలో కామ్రేడ్ బేబక్క (కానూరు తాత కూతురు) అరుణోదయ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉదయగిరి, మల్లన్న ప్రధాన కార్యదర్శి ఎం.దాసు మాట్లాడుతూ కానూరి తాత ఆశయ సాధనకు కృషి చేస్తామని ప్రకటించారు. అధ్యక్షులు వేణు మాట్లాడుతూ దేశంలో మనువాదులు తమ కాలం చెల్లిన బూజుపట్టిన భావాలతో మధ్యయుగాలనాటి స్థితిలో దేశాన్ని తీసుకెళ్తూ ప్రజల్ని,భక్తి పాఠ్యాంశాలతో ముంచెత్తుతూ, నిజమైన ప్రజా సమస్యలను పక్కదారి పట్టించడాని కళాకారులు ప్రభావితంగా ప్రజల్లో తీసుకెళ్లాలని కోరారు. ప్రజలమధ్య మతం పేరిట విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా సాగిస్తున్న కాషాయ రాజకీయాలకు వ్యతిరేకంగా విస్తృతంగా ప్రచారం సాగించాలని పిలుపునిచ్చారు.

మాదిగ ఉద్యమకారులపై అక్రమ కేసులను ఎత్తివేయాలి

మాదిగ దండోరా ఉద్యమకారుల వేదిక రాష్ట్ర కమిటీ చైర్మెన్ డా.రుద్రవరం లింగస్వామి మాదిగ



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

మూడు దశాబ్దాల ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ పోరాటంలో మాదిగ ఉద్యమకారులపై నమోదైన అక్రమ కేసులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఎత్తివేయాలని మాదిగ దండోర ఉద్యమకారుల వేదిక రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. గురువారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కమిటీ రాష్ట్ర చైర్మన్ డా. రుద్రవరం లింగస్వామి మాదిగ, అధ్యక్షులు జిల్లా వెంకటేష్ మాదిగ మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ ఉద్యమంలో అమరులైన కుటుంబాల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉందని, వారి జీవనం దుర్భరంగా మారిందని, ప్రభుత్వం అమరవీరుల కుటుంబాలు, ఉద్యమకారులను వెంటనే ఆదుకోవాలని కోరారు. ఉద్యమకారులకు, అమరవీరుల కుటుంబాలకు 250 గజాల ఇంటి స్థలం కేటాయించాలని కోరారు. ఎన్నికల హామీలో భాగంగా రాష్ట్ర సీఎం ఎ.రేవంత్ రెడ్డి అమరవీరుల కుటుంబాలకు ఇండ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వాల పథకాల అమలులో దండోరా ఉద్యమకారులకు మొదటి ప్రాధాన్యత కల్పించాలని, రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో మాదిగ అమరవీరుల స్మృతి వనం నిర్మించాలని వారు కోరారు. తెలంగాణ అమరవీరులకు ప్రభుత్వం కల్పించిన ప్రయోజనాలను ఉద్యమకారులకు కల్పించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో వేదిక రాష్ట్ర కమిటీ వైస్-చైర్మన్లు మీసాల కురుమయ్య మాదిగ, నక్క రమేష్ మాదిగ, బడుగుల బాలకృష్ణ మాదిగ, నక్క యదీశ్వర్ మాదిగ, ప్రధాన కార్యదర్శులు ఈరెంటి విజయ్ మాదిగ, పాలడుగు రమేష్ మాదిగ, కార్యదర్శులు బి.సంజీవ్ మాదిగ, గంగాపురం నరసింహులు మాదిగ, వంగూరి శ్రీహరి మాదిగ, సలహాదారులు లాయర్ మల్లన్న మాదిగ తదితరులు పాల్గొన్నారు.

మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ పెండింగ్ పనులు పూర్తి చేయాలి

- బీఆర్ఎస్ నాయకులు ఎం.ఆనంద్ కుమార్ గౌడ్
- జీహెచ్ఎంసీ చీఫ్ ఇంజనీర్‌కు నేతల విజ్ఞప్తి



నవతెలంగాణ-ధూల్‌పేట్

గోషామహల్ చుడి బజార్‌లోని మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలని గోషామహల్ బీఆర్ఎస్ నాయకులు ఎం.ఆనంద్ కుమార్ గౌడ్ ప్రభుత్వ యంత్రాంగాన్ని కోరారు. ఈ మేరకు గురువారం ఆయన, స్థానిక బందు మిత్ర సంఘం, బీఆర్ఎస్ నేతలతో కలిసి జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో చీఫ్ ఇంజనీర్ రత్నాకర్ ను కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2016లో అప్పటి హెూమ్ శాఖ మంత్రి నాయిని నరసింహారెడ్డి చొరవతో చుడి బజార్లో మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణం కు రెండు కోట్ల నిధులు మంజూరు చేశారని చీఫ్ ఇంజనీర్‌కు తెలిపారు. అప్పటి నుండి మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులు నేటికీ పూర్తి చేయకుండా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని వివరించారు. గత రెండేళ్లుగా కాంట్రాక్టర్ మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులు పూర్తి చేయడంలో విఫలమయ్యారని ఆరోపించారు. వెంటనే సదరు కాంట్రాక్టర్‌ను తొలగించి, ఇతర కాంట్రాక్టర్‌కు మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ పనులు అప్పగించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. గతంలో నాసిరకంగా మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులు చేసిన కాంట్రాక్టర్‌కు బిల్లు చెల్లించకుండా, మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ పనులపై విచారణ చేసిన తర్వాతే బిల్లులు చెల్లించాలని కోరారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులు పూర్తి చేసే వరకు తాను నిద్రపోయేది లేదన్నారు. చూడి బజార్ మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ పనులు పూర్తి చేయించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చే వరకు తన పోరాటం కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాదిగ బంధుమిత్ర సేవా సంఘం ప్రధాన కార్యదర్శి సుమన్ కుమార్, బీఆర్ఎస్ నేత, గోషామహల్ ఎస్సీ సెల్ అధ్యక్షులు యాదగిరి, నాగరాజు, జనార్ధన్, వేణు మాదిగ బంధుమిత్ర సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నాయి బ్రాహ్మణులకు వృత్తి శిక్షణ తరగతులు ప్రారంభించాలి



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

కాంగ్రెస్ ప్రభుత్వం నాయి బ్రాహ్మణులకు వృత్తి శిక్షణ తరగతులు ప్రారంభించాలని నాయి బ్రాహ్మణ మహిళా సంక్షేమ సంఘం రాష్ట్ర ఆర్గనైజ్ సెక్రెటరీ జీ.నవనీత అన్నారు. గురువారం కోఠిలోని కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం నాయి బ్రాహ్మణులకు వృత్తి శిక్షణ తరగతులు ప్రారంభించాలని కోరారు. గత ప్రభుత్వంలో నాయి బ్రాహ్మణ ఫెడరేషన్‌కు చైర్మెన్‌ను నియమించలేదని వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం ఉమ్మడి రాష్ట్రంలో నియమించిందని తెలంగాణ రాష్ట్ర ఏర్పాటైనా తర్వాత కేసీఆర్ ప్రభుత్వం నియమించలేద న్నారు. ఇప్పుడైనా రేవంత్ రెడ్డి ప్రభుత్వం నాయి బ్రాహ్మణ ఫెడరేషన్ చైర్మెన్‌ను నియమించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ హాస్పిటల్లో, పోలీస్ శాఖలో, ప్రభుత్వ హాస్టలలలో బార్బర్ పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలలో ఉన్న ఆయా దేవాలయ పాలకమండలిలో నాయి బ్రాహ్మణులకు సభ్యులు అవకాశం కల్పించాలని ప్రభుత్వానికి తలనీలాల టెండర్లలో నాయి బ్రాహ్మణులకు రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలని కోరారు. యాదగిరిగుట్ట కళ్యాణ కట్టులో పనిచేస్తున్న నాయి బ్రాహ్మణ మహిళల ఉద్యోగులను పర్మినెంట్ చేయా లని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కోరారు. తమ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు దుర్గారాణి ఆధ్వర్యంలో త్వరలోనే మంత్రులను కలిసి నాయి బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రం అందజేస్తామ న్నారు. ప్రభుత్వ ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకాన్ని నాయి బ్రాహ్మణుల సద్వినియం చేసుకోవాలని కోరారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం వెనుక మోడీ సర్కార్ హస్తం



- మాల మహానాడు జాతీయ అధ్యక్షులు డా.వి.ఎల్.రాజు

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

రాజ్యాంగ నిబంధనలు పాటించని తెలంగాణ ఎస్సీ వర్గీకరణ బిల్లుకు రాష్ట్ర గవర్నర్ ఆమోదించడం వెనుక మోడీ కేంద్ర సర్కార్ హస్తం ఉందని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు, ప్రొఫెసర్ డా.వి.ఎల్.రాజు ఆరోపించారు. గురువారం హిమాయత్‌నగర్‌లోని మాల మహానాడు రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళిత కులాల్లో ఉన్న మెజార్టీ మాల ఉపకులాలను అణిచివేసేందుకు వారి ప్రయోజనాలను దెబ్బ తీసి మిగతా ఎస్సీ మాదిగ కులాలకు లబ్ది చేకూర్చడం కోసం అంతిమంగా మొత్తం దళిత సమాజాన్ని బానిసత్వం చేసుకోవడం కోసమే ఈ వర్గీకరణను తీసు కొచ్చారని, ఇది ముమ్మాటికి ఓటు బ్యాంకు రాజకీయాలు మాత్రమేనని విమర్శించారు. వర్గీకరణపై గతంలో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును సైతం ఎ.రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం ఉల్లంఘించిందని ఆరోపించారు. ఈ వర్గీకరణతో మాలల భవిష్యత్తు అంధకారంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. మెజార్టీ ఎస్సీ కులాలకు నష్టం చేకూర్చే తెలంగాణ ఎస్సీ వర్గీకరణ బిల్లు గవర్నర్ ఆమోద చట్టాన్ని ఉన్నత న్యాయస్థానంలో సవాల్ చేస్తామన్నారు. తెలంగాణలో మాల జాతికి వెన్నుపోటు పొడిచిన రేవంత్ రెడ్డి కాంగ్రెస్ సర్కార్, బీజేపీ పార్టీలను రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బొంద పెడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణ స్వరూప్, మాల మహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి సంకు శ్రీనివాసులు, రాష్ట్ర శాఖ అధ్యక్షులు జే.ఎస్.రావు తదితరులు పాల్గొన్నారు.

సిటీ కళాశాలలో యూపీఎస్సీ గెలుపునకు సూత్రాలు..

నవతెలంగాణ-ధూల్‌పేట్

సిటీ కళాశాలలో తెలంగాణ స్కిల్స్ అండ్ నోలెడ్జ్ సెంటర్, కెరీర్ గైడెన్స్ సెల్ సంయుక్తంగా "యూపీఎస్సీ పరీక్షలలో గెలుపునకు అనుసరించవలసిన సూత్రాలు" అనే అంశంపై ప్రత్యేక సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన 21 సెంచరీ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ కృష్ణప్రదీప్, చీఫ్ మెంటార్ భవానీ శంకర్ విద్యార్థులకు వివరించారు. సివిల్ సర్వీసులపై ఆసక్తి ఉన్న విద్యార్థులకు ఎంతో దోహదపడతాయన్నారు. ఈ సదస్సులో యూపీఎస్సీ పరీక్షల్లో విజయం సాధించటం ప్రణాళిక, పట్టుదలలతో పాటు తార్కిక ఆలోచనా విధానం, భావోద్వేగ సమతుల్యతతో సాధ్యమని సూచించారు. తమ అనుభవాలను, పరీక్షలకు తయారీపై కీలకమైన పద్ధతులను విద్యార్థులతో పంచుకున్నారు. వారు కరెంట్ ఎఫైర్స్‌పై అవగాహన, క్రమశిక్షణ ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ డాక్టర్. జెవిఎస్ మల్లికార్జున, కోఆర్డినేటర్ డాక్టర్. భాస్కర్ లు వ్యవహరించారు. వారు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. సరైన మార్గదర్శకత్వం వలన విద్యార్థులు విజయం సాధించగలరని తెలిపారు. సదస్సు చివరలో ప్రశ్నలు-సమాధానాల సెషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్.శ్రీదేవి, డాక్టర్.నాగరాజు, డాక్టర్. రవీంద్ర తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.

'పోలీసులు రక్షణ కల్పించకపోవడం బాధాకరం'



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

చట్టబద్ధంగా కొనుగోలు చేసిన భూమికి కోర్టు నుంచి ఫైనల్ డిగ్రీ ఉన్నప్పటికి పోలీసులు రక్షణ కల్పించకపోవడం బాధాకరమని, తమకు వెంటనే రాష్ట్ర ప్రభుత్వం, డీజీపీ రక్షణ కల్పించాలని కమ్మగూడ భూ యజమాని రిజ్వాన్ షేక్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బషీర్ బాగ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, కమ్మగూడ గ్రామం లోని సర్వే నెంబర్లు 240, 241, 242లో గల 10.9 ఎకరాల భూమిని ఉప్పల్ కు చెందిన గుండ్ల రాజమ్మ వద్ద కొనుగోలు చేయడం జరిగిందని చెప్పారు. ఈ భూమికి 2024లో కోర్టు నుంచి ఫైనల్ డిగ్రీ వచ్చిందని, తమ న్యాయవాదులచేత అన్ని సలహాలు తీసుకుని భూమిని కొనుగోలు చేయడం జరిగిందన్నారు. గతంలో కొందరు రియల్ ఎస్టేట్ బ్రోకర్లు తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి అమాయక ప్రజల నుంచి డబ్బులు దండుకుని డబుల్ రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందని ఆరోపించారు. తాము ఈ భూమి వివాదంలో ఉందని చెప్పినా వినిపించుకోకుండా బ్రోకర్ల మాటలు నమ్మి పేద ప్రజలు ఇండ్ల స్థలాల కోసం కొనుగోలు చేసి మోసపోయారని చెప్పారు. ఆ భూమికి సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని, దీంతో తాము కొనుగోలు చేసిన భూమికి సరిహద్దులు వేసేందుకు కూలీలను బుధవారం తీసుకుని వెళ్లడం జరిగిందని, కాగా అక్కడ ఉన్న కొంత మంది తమ కూలీలపై కర్రలు, రాళ్ళతో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై డయల్ 100కు పలుమార్లు ఫోన్ చేసినా పోలీసులు స్పందించలేదని ఆరోపించారు. తమ కూలీలపై దాడి చేసిన వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. తమకు కోర్టు నుంచి ఫైనల్ డిగ్రీ ఉన్న పుటికీ పోలీసులు రక్షణ కల్పించకపోవడం బాధాకరమ న్నారు. ఈ విషయంలో వెంటనే రాష్ట్ర డీజీపీ జోక్యం చేసుకుని తమకు రక్షణ కల్పించి తగు న్యాయం చేయాలని ఆయన కోరారు.

రజకులకు రక్షణ ప్రత్యేక చట్టం చేయాలి

- రజక వృత్తిదారుల జిల్లా అధ్యక్షులు చారకొండ వెంకటస్వామి



నవతెలంగాణ-మెహదీపట్నం/ధూల్‌పేట్

రజకుల రక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చట్టం చేయాలని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు చారకొండ వెంకటస్వామి డిమాండ్ చేశారు. తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం హైదరాబాద్ సెంట్రల్ జిల్లా సమావేశం నాంపల్లి జోన్ కమిటీ కార్యదర్శి సిహెచ్.నగేష్ అధ్యక్షతన మెహదీపట్నంలో జరిగింది. ఈ సందర్భంగా వెంకటస్వామి మాట్లాడుతూ నేటికీ రజకవృత్తిదారులపై గ్రామీణ ప్రాంతంలో కుల వివక్షత, దౌర్జన్యాలు సామాజిక దాడులు పెత్తందారి వర్గాలచే కొనసాగుతున్నాయని వాటిని అరికట్టడానికి ప్రభుత్వం ప్రత్యేక చట్టం తేవాలని కోరారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో తమ వృత్తిని కొనసాగిస్తూ అనేకమంది రజక వృత్తిదారులు బీదరికంలో మగ్గుతున్నారని వారిని ఆదుకోవడానికి ప్రభుత్వం ఇందిరా ఇండ్లు కేటాయించడంలో వారికి మొదటి ప్రాముఖ్యత నివ్వాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సంస్థలలో ప్రభుత్వ కార్యాలయలలో రజకులకే వృత్తి కాంట్రాక్టులు ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రజక వృత్తిదారులకు 50 సంవత్సరాలకే పింఛన్ ఇవ్వాలని, హైదరాబాద్ సెంట్రల్ జిల్లా పరిధిలో ఉన్నటువంటి రజకులకు ప్రభుత్వ భూములలో మోడ్రన్ దోబి గాట్లు, కమ్యూనిటీ హాల్‌లు ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని నిర్మించి ఇవ్వాలని, రజక వృత్తిదారులను ఆదుకోవడానికి రజక పెడరేషన్ ద్వారా ప్రతి రజక కుటుంబానికి రూ.10 లక్షల వరకు ఆర్థిక సహకారం అందించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రజక వృత్తిదారుల సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు యాదమ్మ, పద్మ, జోన్ సభ్యులు రమేష్, లక్ష్మి, మాధవి, చంద్రమోహన్, విఠల్, యాదయ్య, బాబు, రవీందర్, పద్మ, చంద్రమోహన్, శివ, కామేష్, కేశవులు వెంకటేశ్వర్లు, పాండు, వెంకటేష్, బాబు, శ్రీకాంత్, భరత్ గమల్ తదితరులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి కోర్టు నుంచి బస్సు ప్రారంభం



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

కూకట్‌పల్లి కోర్టు నుంచి మెహిదిపట్నం వెళ్లే 19ఎం బస్సును గురువారం కూకట్‌ల్లి కోర్టు థర్డ్ ఏడీజే (జడ్జి) తిరుపతి ప్రారంభించారు. ఈ బస్సు ఉదయం 9:00 గం॥లకు కోర్టు నుంచి ప్రారంభమై మెహిదీపట్నం వెళ్తుంది. మళ్ళీ ఉదయం 10:15 ని॥లకు కోర్టుకు వస్తుంది. సాయంత్రం 4:00 గం॥ లకు బయల్దేరి సాయంత్రం 5:30ని॥ లకు మళ్లీ కోర్టుకు వస్తుంది. ఈ కార్యక్రమంలో జడ్జీలు సిబ్బం ది, బార్ అసోసియేషన్ కమిటీ మెంబర్స్ పాల్గొన్నారు.

గంజాయి అమ్ముతున్న వ్యక్తి అరెస్ట్..

- 900 గ్రాముల గంజాయిని స్వాధీనం
- నిందితుడు రిమాండ్

నవతెలంగాణ-పేట్ బషీరాబాద్

గంజాయి అమ్ముతున్న వ్యక్తిని పేట్ బషీరాబాద్ పోలీసులకు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పేట్ బషీరాబాద్ పరిధిలోని సుచిత్ర చౌరస్తాలో ఒక వ్యక్తి గంజాయి అమ్ముతున్నట్టు సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని.. అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించారు. రాపిడో బైక్ నడుపుకునే షేక్ అబ్దుల్ వసీంగా. రంగారెడ్డి జిల్లా షాహిన్ నగర్ వాసిగా పోలీసులు గుర్తించారు. నిందితుడి దగ్గర పోలీసులు 900 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పోలీసులు అతన్ని అరెస్టు చేసి, కేసు నమోదు చేసి గురువారం రిమాండ్‌కు తరలించారు.

అక్కడో న్యాయం... ఇక్కడో న్యాయమా..

- అయ్యప్పసొసైటీ, గోకుల్‌ప్లాట్స్, హఫీజ్‌పేటలో అడ్డగోలుగా అక్రమ నిర్మాణాలు
- వసూళ్లకు పాల్పడుతున్న అధికారులతోపాటు నకిలీ విలేకరులపై చర్యలు తీసుకోవాలి
- కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు డిమాండ్



నవతెలంగాణ-కూకట్‌పల్లి/సిటీబ్యూరో/కేపీహెచ్‌బీ

గ్రేటర్ హైదరాబాద్‌లో అధికారులు ఒక్కో సర్కిల్‌లో ఒక్కో విధంగా వ్యవహరిస్తున్నారని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. అయ్యప్పసొసైటీ, గోకుల్‌ప్లాట్స్, హఫీజ్‌పేటలో అడ్డగోలుగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని, కూకట్‌పల్లి నియోజకగ్గంలో అన్ని అనుమతులు తీసుకుని నిర్మాణాలు చేపట్టినా అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. జీహెచ్‌ఎంసీ చట్టం కొన్ని సర్కిళ్ల పరిధిలో కొందరికి చుట్టంగా మారిందన్నారు. కొన్ని సర్కిళ్లలో డబ్బులిస్తే నిర్మాణాలకు అనుమతిస్తున్నారని, లేదంటే సీజ్ చేస్తున్నారని ఆరోపించారు. అవినీతికి పాల్పడుతున్న అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలంటూ గురువారం జీహెచ్‌ఎంసీ ప్రధానకార్యాలయంలో అదనపు సీసీపీ గంగాధర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. అయ్యప్పసొసైటీ, గోకుల్‌ప్లాట్స్, హఫీజ్‌పేటలో ఏలాంటి అనుమతులు లేకుండానే ఐదు నుంచి తొమ్మిది ఫోర్లతో బహుళ అంతస్తుల భవనాలను నిర్మిస్తున్నారన్నారు. అలాంటివారిపై ఎలాంటి ఆంక్షలు లేవన్నారు. కూకట్‌పల్లి పరిధిలోని కేపీహెచ్‌బీకాలనీ, బాలాజీనగర్ డివిజన్‌లలో జీహెచ్‌ఎంసీ నుంచి అన్ని అనుమతులు తీసుకుని ఒకటి, రెండు ఫ్లోర్స్ అదనంగా నిర్మిస్తున్నా వాటిని కూల్చేస్తున్నారని, లేదా సీజ్ చేస్తున్నారన్నారు. అవినీతి అధికారులతోపాటు చోటామోటా నాయకులు, నకిలీ విలేకర్లు ఒక ముఠాగా ఏర్పడి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని, వీరి తీరుతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. పేపర్లలో రాస్తామంటూ బెదిరిస్తూ వసూళ్లకు పాల్పడుతున్న నకిలీ మీడియా ప్రతినిధులపై కఠినచర్యలు తీసుకునే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. సామాన్యులకు సైతం న్యాయం జరిగేవిధంగా మొత్తం జీహెచ్‌ఎంసీ పరిధిలో ఒకే విధమైన నిబంధనలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. వినతి పత్రాన్ని స్వీకరించిన అదనపు సీసీపీ గంగాధర్ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీనిచ్చారు.

చదవండి లక్ష రూపాయలు గెలవండి..



చదవండి లక్ష రూపాయలు గెలవండి అనే కర పత్రాన్ని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చేత ఆలివ్ మిఠాయి దొర రాజు ఆవిష్కరింపజేశారు. ప్రతి సంవత్సరం, కూకట్‌పల్లి నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలలో చదు వుతూన్నా.. 10వ తరగతి విద్యార్థులలో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తున్న విద్యా ర్థులకు, ఆలివ్ మిఠాయి దొరరాజు ఒక లక్ష రూపాయలు అందించడం జరుగు తుంది. అలాగే ఈ అకాడమిక్ ఇయర్ కూడా అదే రీతిలో అందించనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ ఆలివ్ మిఠాయి దొరరాజు పిల్లలలో, ఒక మోటి వేషన్ తీసుకువచ్చి వారి భవిష్య త్‌కు భరోసా ఇవ్వడమే కాకుండా.. వారిలో ఒక నూతన ఉత్సాహం నింపుతున్నా రని కొనియాడారు. ఈ సందర్భంగా దొర రాజు మాట్లా డుతూ ఈ సంవత్సరం నుంచి విద్యార్థులకు, ప్రతి ఆది వారం సాయంత్రం 5 గంటలకు జూమ్ మీటింగ్ ద్వారా, విద్యార్థులకు ఉండే సమస్యలకు మార్గాన్ని చూపడం, పదవ తరగతి తర్వాత వారు ఎటువంటి కోర్సులు తీసుకోవాలి స్ట్రాటజీ ఏమిటి, టైం మేనేజ్‌మెంట్ వంటి వాటికి నిపుణులు అందుబాటులో ఉంటారని ప్రతి ఒక్క విద్యార్థి ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

మెరుగైన సేవల కోసమే స్లాట్ బుకింగ్ పద్ధతి



- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్

నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్లు పారదర్శకంగా, అవినీతి రహితంగా, సులువుగా, తక్కువ సమయంలో ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు స్లాట్ బుకింగ్ పద్ధతిని ప్రవేశపెట్టిందని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో దస్తావేజుల రిజిస్ట్రేషన్లకు స్లాట్ బుకింగ్ విధానాన్ని గురువారం నుంచి అమలు అవుతున్న ప్రక్రియను కలెక్టర్ పరిశీలించిన అనంతరం మాట్లాడారు. ప్రజలు వారికి అనుకూలమైన తేదీ, సమయాన్ని registration.tlangana.gov.in వెబ్ సైట్‌లో ఎంపిక చేసుకుని రిజిస్ట్రేషన్లకు వచ్చే విధంగా ప్రభుత్వం వెసలుబాటు కల్పించిందన్నారు. రాష్ట్రంలోని కొన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రయోగాత్మకంగా చేపట్టిన ఈ ప్రక్రియలో భాగంగా జిల్లాలోని కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో స్లాట్ బుకింగ్ ద్వారా నిర్వహిస్తున్న రిజిస్ట్రేషన్ విధానాన్ని పరిశీలించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఈ రోజు ఎన్ని స్లాట్‌లు బుక్ అయ్యాయని కలెక్టర్ సబ్ రిజిస్ట్రార్‌ను అడిగి తెలుసుకున్నారు. స్లాట్ బుకింగ్ విధానంలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ఎలా జరుగుతుందని ఆన్‌లైన్‌లో క్షుణ్ణంగా పరిశీలిస్తూ వివరాలను అడిగి తెలుసుకున్నారు. వెబ్ సైట్ మాడ్యూల్స్‌ను ఆన్ లైన్ ప్రక్రియలో దశల వారిగా ఏవిధంగా చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. దస్తావేజుల రిజిస్ట్రేషన్, ఆన్ లైన్ ఫోటో, స్కానింగ్ చేసే విధానాన్ని కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ వెంట కుత్బుల్లాపూర్ తహశీల్దార్ స్వామి, తదితరులు ఉన్నారు.

కుత్బుల్లాపూర్ అభివృద్ధికి నోచుకుంటోంది



- మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబుల నాయకత్వంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గణనీ యంగా అభివృద్ధి చెందుతుందన్నారు. షాపూర్ నగర్‌లో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ తన నివాసం వద్ద గురువారం నియోజక వర్గం ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనం తరం పలు ఆహ్వానాలు, వినతి పత్రాలను స్వీకరించి సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిత్యం అణగారిన వర్గాల అభివృద్ధికి అండగా ఉంటానని అలాగే నియోజకవర్గంలో స్థానిక సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. తెలం గాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం ప్రతిష్టా త్మకంగా ప్రవేశపెడుతున్న పథకాలతో ప్రజలు సంతో షంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా సంఘాలు, ప్రజా ప్రతినిధులు, సంక్షేమ సంఘాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి టెక్ ఆధ్వర్యంలో సహ పంక్తి భోజనాలు



నవతెలంగాణ-నిజాంపేట్

ప్రగతి నగర్‌లోని సుందరయ్య భవనంలో అనేక సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహిస్తున్నారు. కోర్సులను పూర్తి చేసుకున్న అకాడమీ సభ్యులు గురువారం సీజనల్ వంటకాలను తయారు చేసుకుని సమిష్టి భోజనం చేస్తూ ఆహ్లాదంగా గడిపారు. ప్రగతి నగర్ సుందరయ్య విజ్ఞాన్ భవనంలో ప్రగతి టెక్ అకాడమీ పురంలో గత కొన్ని రోజులుగా స్పోకెన్ ఇంగ్లీష్, ఎం.ఎస్ ఆఫీస్,టాలి, జావా, సి- లాంగ్వేజ్ తదితర కోర్సుల్లో శిక్షణ పూర్తి చేసుకున్న ఔత్సాహికులు ఆహార, విహార కార్యక్రమాన్ని రూపొందించుకొని సందడిగా గడిపారు. వివిధ రకాల సీజనల్ వంటకాలను స్వయంగా తయారు చేసుకుని ఒకరికి మరొకరు షేర్ చేసుకుంటూ అహ్లాదకర కార్యక్రమం కొనసాగిస్తూ సహ పంక్తి భోజన కార్యక్రమాన్ని పూర్తిచేశారు. ఈ అహ్లాద వాతావరణాన్ని సమిష్టి వంటల కార్యక్రమాన్ని ప్రగతి టెక్ అకాడమీ డైరెక్టర్ యాని రూపొందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సుందరయ్య భవన నిర్వహణ కమిటీ కన్వీనర్ సి.హెచ్.ఎం చారి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యాన్ని అందించే పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలనే భుజించాలని అందరికీ సూచించారు. సమిష్టిగా కార్యక్రమాల నిర్వహణ, సహపంక్తి భోజనాలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని ఆయన కొనియాడారు. పుచ్చలపల్లి సుందరయ్య జయంతి సందర్భంగా నిర్వహించనున్న పోటీలలో నాణ్యమైన రుచికరమైన వంటకాల పోటీ, వ్యాసరచన పోటీలు, ఉపన్యాస పోటీలు, డ్రాయింగ్ పోటీలు నిర్వహించనున్నట్టుత ఆయన ప్రకటించారు. పోటీలలో ప్రధానంగా మహిళల భాగస్వామ్యం ఎక్కువగా ఉండాలని ఆయన కోరారు.

నేటి విద్యార్థుల పైనే రేపటి దేశ భవిష్యత్తు



- కార్పొరేటర్ కొలుకుల జగన్
- ఘనంగా సంస్కృతి పాఠశాల 15వ వార్షికోత్సవ వేడుకలు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

నేటి విద్యార్థులపై రేపటి దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందని ఆ దిశగా విద్యార్థులు ఇష్టపడి చదువుతూ సత్ఫలితాలు సాధించాలని జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. బుధవారం సాయంత్రం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి కూన మహాలక్ష్మీ నగర్,ఆర్.జి.కె కాలనీ సమీపంలో గల సంస్కృతి కాన్సెప్ట్ పాఠశాల 15వ (ఉత్సవ్)వార్షికోత్సవ వేడుకలు విద్యార్థుల,చిన్నారుల కేరింతల నడుమ ఉల్లాసంగా.. ఉత్సాహంగా.. కొనసాగాయి. ఈ కార్యక్రమానికి ఆయనతోపాటు జగద్గిరిగుట్ట సీఐ.కేతూరి నరసింహ, ట్రస్మా రాష్ట్ర కె.రామేశ్వర్ రెడ్డి లు ముఖ్య అతిథులుగా హాజరై పలువురు కరస్పాండెంట్‌లతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల విషయంలో తల్లిదండ్రులు బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు.ప్రస్తుత కాలంలో మొబైల్ వాడకం పట్ల పిల్లలు ఆకర్షితులై పెడదోవపడుతున్నారన్నారు. పాఠశాల చైర్మెన్, కరస్పాండెంట్ గడ్డమీది బాలరాజు గౌడ్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో అత్యధికంగా పేద,మధ్య తరగతి ప్రజలు అత్యధికంగా నివసిస్తున్నారని అతి తక్కువ ఫీజులతో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని తెలిపారు. తమ పాఠశాలలో చదివే విద్యార్థుల మనోభావాలకు అనుగుణంగా విలువలతో కూడిన విద్యాబుద్ధులను నేర్పిస్తూ భావి భారత పౌరులుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను ఎంతో ఆకర్షించాయి. ఈ కార్యక్రమంలో ట్రస్మ రాష్ట్ర జిల్లా ఉపాధ్యక్షులు బీరు ఆంజనేయులు, ఎస్ఐ.శంకర్, ట్రాపసా గ్రేటర్ కుత్బుల్లాపూర్ నాయకులు వినోద్ జాదవ్, కోలా వెంకటేష్, నరసింహులు గౌడ్, దయాకర్, శ్రీశైలం, వైష్ణవి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మెన్ చెప్యాల నరసింహులు గౌడ్, సంస్కృతి ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షులు సుధాకర్ గౌడ్, పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ రోజా బాలరాజు గౌడ్, పలు పాఠశాలల కరస్పాండెంట్లు ప్రవీణ్, నరేందర్, మధు, శ్యాం తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ, జర్మన్ మధ్య ఒప్పందం..



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

జేఎన్‌టీయూహెచ్, జర్మనీలోని ఆకెన్ నగరానికి చెందిన జర్మర్ యూనివర్సిటీ ఫర్ అడ్వాన్స్ స్టడిస్ మధ్య ఇండో-జర్మన్ విద్యా, పరిశోధన, ఆవిష్కరణల పరస్పర సహకారానికి సంబంధించిన అవగాహన ఒప్పందం గురువారం కుదిరింది. ఈ అవగాహన ఒప్పందంపై జేఎన్‌టీయూ హెచ్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డా. కె. వెంకటేశ్వరరావు , జీవి మేనేజింగ్ డైరెక్టర్ రాజ్ వంగపండు, వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డా.టి.కిషన్ కుమార్ రెడ్డిల సమక్షంలో అధికారికంగా సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఇండో-యూరో ఆఫ్ సింక్రనైజేషన్ ఇండియా సీఈఓ ఎస్.బంగారు రాజు, విశ్వవిద్యాలయ అకాడెమిక్ వ్యవహారాల విభాగం డైరెక్టర్ డా. ఎస్.వి. రమణలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంతర్జాతీయ మోడల్‌లో ద్వైత డిగ్రీ ప్రోగ్రాముల ప్రారంభం అవుతాయన్నారు. విద్యార్థులు, అధ్యాపకుల మార్పిడి, పరిశోధన సహకార కార్యక్రమాలు, ఇండో-జర్మన్ అధ్యాపకుల ద్వారా వర్క్‌షాప్‌లు, అతిథి ఉపన్యాసాల నిర్వహణ, పరిశోధన, ఆవిష్కరణలకు కేంద్రంగా నిలిచే "సెంటర్ ఫర్ ఎక్సెలెన్స్ స్థాపనపై చర్చలు, ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులు, అధ్యాపకులకు అంతర్జాతీయ అవగాహన పెరుగుతుందని తెలిపారు. ప్రపంచస్థాయి విద్యా, పరిశోధనా అవకాశాలు లభించనున్నాయని పేర్కొన్నారు. ఇది ఉత్తమ ప్రామాణికతల తో కూడిన శిక్షణా కార్యక్రమాలకు దోహదపడుతుందన్నారు. ఈ అవగాహన ఒప్పందం నేటి నుంచి అమలులోకి వస్తుందని, పరస్పర అంగీకారంతో దీన్ని అవసరమైతే పునఃసమీక్షించవచ్చన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనుల పర్యవేక్షణ..



- కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి

నవతెలంగాణ-బాలానగర్

బాలానగర్ డివిజన్ పరిధిలోని రాజీవ్ గాంధీ నగర్‌లో నూతనంగా జరుగుతున్న వీడీసీసీ రోడ్డు పనులను స్థానికులతో కలిసి గురువారం బాలానగర్ డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ రానున్న వర్షాకాలంలో డివిజన్ పరిధిలోని ఆయా ప్రాంతాలలో నాలా పరివాహక ప్రాంతాల్లో స్థానిక ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు పడకుండా సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా రాజీవ్ గాంధీ నగర్‌లో అపరిష్కృతంగా ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేసి రోడ్ల నిర్మాణం చేపడతామన్నారు. తాగు నీటి సమస్యలను, డ్రయినేజీ వ్యవస్థను మెరుగు పరుస్తామని తెలిపారు. బస్తీలలో వీధిలైట్ల నిర్వహణ సరిగా లేకపోవడం వల్ల రాత్రి వేళల్లో వృద్ధులు, మహిళలు అవస్థలు పడుతున్నారని కార్పొరేటర్ రవీందర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ రాములు, రాజీవ్ గాంధీ నగర్ అసోసియేషన్ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎన్.కె.నరేష్, బీఆర్ఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖాజా, బీఆర్ఎస్ ఏరియా కమిటీ అధ్యక్షులు నాగేష్ గౌడ్, డివిజన్ యూత్ ప్రధాన కార్యదర్శి షేక్ అరబ్, నర్రా దేవేందర్ రెడ్డి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ నాలా డీసిల్టింగ్ పనుల పరిశీలన



నవతెలంగాణ-కూకట్‌పల్లి

డివిజన్ పరిధిలోని పరికి చెరువు నుండి ఆల్విన్ కాలనీ ఫేజ్ 2 మీదుగా, పైప్ లైన్ రోడ్డు వరకు విస్తరించి ఉన్న ఓపెన్ నాలా, వరద నీటి కాలువలో జరుగుతున్న పూడికతీత పనులను, డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, కూకట్ పల్లి సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఈఈ) డి.గోవర్ధన్ గౌడ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఓపెన్ నాలా పూడికతీత పనులను మాన్సూన్ కు ముందుగానే పూర్తిచేస్తామని అన్నారు. వేసవి కాలంలోనే పనులు పూర్తిచేస్తే వర్షాకాలంలో వచ్చే వరద నీరు అంతా సజావుగా దిగువకు వెళ్ళిపోతుంది కాబట్టి, లోతట్టు ప్రాంతలవారికి ఇబ్బంది లేకుండా ఉంటుందని అన్నారు.ఈ కార్యక్రమంలో సమ్మారెడ్డి, షౌకత్ అలీ మున్నా, ఎఇ శ్రావణి, వర్క్ ఇన్స్పెక్టర్ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక వాడలో అగ్ని ప్రమాదం


అర్థరాత్రి మంటలు..

- పక్కన ఉన్న ఫ్యాక్టరీకి మంటలు వ్యాపించి భారీగా ఆస్తి నష్టం


స్క్రాప్ కంపెనీ..

నవతెలంగాణ-కూకట్‌పల్లి

ప్రశాంత్ నగర్ పారిశ్రామిక వాడలో శంకర్ ఇంపాక్స్ అనే స్క్రాప్ కంపెనీలో బుధవారం అర్థరాత్రి భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగింది. స్క్రాప్ కంపెనీలో ఉన్న స్టాక్ పూర్తిగా అగ్నికి ఆహుతై భారీ నష్టం జరిగినట్టుగా స్క్రాప్ కంపెనీ సిబ్బంది తెలిపారు. అగ్నిప్రమాదం జరిగిన సమాచారం అందడంతో అగ్ని మాపక శాఖ సిబ్బంది, అగ్ని మాపక వాహనాలతో మంటలను ఆర్పి వేశారు.

రెడ్ జోన్‌లో ఉండాల్సిన స్క్రాప్ కంపెనీ ఆరెంజ్ జోన్‌లో ఉన్నప్పటికీ అధికారుల నిర్లక్ష్యం..!

శంకర్ ఇంపాక్స్ కంపెనీకి ఆనుకుని ఉన్న డెకాన్సీ అనే ఎలక్ట్రానిక వస్తువులకు సంబంధించిన ఫ్యాక్టరీలోకి మంటలు వ్యాపించడంతో,డెకాన్సీ ఫ్యాక్టరీలోని మిషనరీ అలాగే డిస్పాచ్‌కి సిద్ధంగా ఉన్న వారి ఉత్పత్తులు పూర్తిగా కాలిపోయయాని డెకాన్సీ కంపెనీ యజమాని అరవింద్ తన ఆవేదనను వెలిబుచ్చారు. ఈ సందర్భంగా డెకాన్సీ ఫ్యాక్టరీ యజమాని అరవింద్ కుమార్ మాట్లాడుతూ.. రెడ్ జోన్‌లో ఉండాల్సిన కంపెనీ అనుమతి లేకుండా అక్రమంగా ఆరెంజ్ జోన్‌లో ఉండటంతో ఇలాంటి దుర్ఘటన జరిగిందని, అధికారులు వారి పని వారు చేస్తే ఇలాంటి ఘటనలు జరగవు అని తెలిపారు. రెడ్ జోన్ ప్రాంతంలో ఉండాల్సిన ఈ కంపెనీ, ఆరెంజ్ జోన్‌లో ఉన్నపటికీ సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఈ జోన్‌లో కాలుష్యం తక్కువగా ఉండే ఫ్యాక్టరీలకు మాత్రమే అనుమతి ఉంటుంది కానీ, ఈ కంపెనీ వలన కార్బన్ ఉద్గారాలు వంటివి వెలువడి వాతావరణ కాలుష్యం ఏర్పడుతున్నప్పటికీ, అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. గతంలోను పలు మార్లు ఇలాంటి ఘటనలపై ఫిర్యాదులు ఇచ్చినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. గత మూడేండ్లుగా అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఉపయోగం లేకుండా పోయిందని, వారి కారణంగా మా ఫ్యాక్టరీకి మంటలు అంటుకుని భారీ ఆస్తి నష్టం జరిగిందని దీని పై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.


డెకాన్సీ ఫ్యాక్టరీ మిషనరీ..

ఆదర్శవంతమైన కాలనీలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

- కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

సమస్య రహిత ఆదర్శవంతమైన కాలనీలుగా తీర్చిదిద్దడమే నా ప్రథమ లక్ష్యమని హైదర్ నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు అన్నారు. డివిజన్ పరిధిలోని హెచ్‌ఎంటీ శాతవాహన కాలనీ లో జరుగుతున్న డ్రయినేజీ పైప్ లైన్ పనులను ఇరిగేషన్ విభాగం, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులతో కలిసి కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భ ంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీ వారి విజ్ఞప్తి మేరకు అన్ని విభాగాలతో కలసి కాలనీలో పర్యటించి డ్రయినేజీ లైన్ పనులను లెవెల్ కలిసెల చూడాలన్నారు. చెరువు వలన దోమల నివారణ కొరకు డ్రోన్‌ను తెప్పించి చెరువులో మందు చెల్లించి, ఆయిల్ సీడ్ బాల్స్‌ను చెరు వులులో వేసి, ప్రతి రెండు రోజులకు ఒకసారైనా ఫాగింగ్ జరిగేలా చూడాలని అధికారులకు సూచించారు. కాలనీ లలో మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తూ కాలనీలను అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకు వెళుతున్నమన్నారు. అన్నివేళలా ప్రజలకు అందుబాటులోకి ఉంటానని, మెరుగైన ప్రజా జీవనానికి అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు తన వంతు కృషి చేస్తానన్నారు. హైదర్ నగర్ డివిజన్‌ను అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన, అగ్రగామి డివిజన్గా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ లక్ష్మీనారాయణ, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

బాలానగర్‌లో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్



నవతెలంగాణ-బాలానగర్

సైబరాబాద్ కమిషనరేట్ బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు బాలానగర్ సీఐ నర్సింహా రాజు కౌన్సెలింగ్ ఇచ్చారు. గతంలో ఆర్థిక సమస్యలను ఎదుర్కొనేందుకు నేరాలకు పాల్పడిన వారు నేర ప్రవృత్తినే ఎంచుకుని అనేక నేరాలకు పాల్పడిన ఘటనల్లో పలు నేరాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో సీఐ నరసింహ రాజు మాట్లాడుతూ మాట్లాడుతూ రానున్న వేడుకలను దృష్టిలో ఉంచుకుని బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న 5 మంది రౌడీషీటర్లకు, నేర ప్రవృత్తి అనుమానిత వ్యక్తులకు బాలానగర్ పోలీస్ స్టేషన్‌లో కౌన్సిలింగ్ నిర్వహించారు. నేరాలకు పాల్పడిన వారు నేర ప్రవత్తిని వీడి సమాజంలో సత్ప్రవర్తనతో మంచి నడవడికతో కుటుంబంలో, సమాజంలో హుందాగా జీవించాలని బాలానగర్ సీఐ నర్సింహారాజు రౌడీషీటర్లకు సూచించారు. వచ్చే వేడుకలలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేసి జైలుకు తరలిస్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా నేరమయ జీవితానికి స్వస్తి పలికి నేరస్తుల పట్ల తొందర పాటులో నేరాలు చేసినా వారి కుటుంబ సభ్యులు సమాజంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు రాంనారాయణ్, సరితారెడ్డి, వినోద్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

మహనీయులకు భారతరత్న ఇవ్వాలి



- ప్రొ. డా. గాలి వినోద్ కుమార్

నవతెలంగాణ-ఓయూ

భారత దేశంలో విద్యా, ఉద్యోగ, సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో విప్లవత్మాతకమైన మార్పులకు శ్రీకారం చుట్టిన మహనీయులు సామాజిక విప్లవకారులు అయినా మహాత్మా జ్యోతి రావ్ ఫూలే దంపతులకు, బహుజన సిద్ధాంత కర్త మాన్యశ్రీ కాన్షిరాం, దేశ రాజకీయ రంగంలో ఉప ప్రధాన మంత్రి స్థాయికి ఎదిగిన డా. బాబు జగ్‌జీవన్ రామ్‌లకు భారత రత్న అవార్డ్స్ ఇవ్వాలని దక్షిణాది జేఏసీ చైర్మెన్ ప్రొ. డా. గాలి వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం జేఏసీ కార్యక్రమంలో రాకేష్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ. ఏప్రిల్ మాసం మహనీయుల మాసంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ భూమిని కాపాడిన ఎమ్మార్వో



నవతెలంగాణ-బంజారాహిల్స్

షేక్‌పేట్ మండలం జూబ్లీహిల్స్ లోని మస్తాన్ నగర్‌లో ప్రభుత్వ భూమిని తహసీల్దార్ కాపా డారు. అక్రమ నిర్మాణాలు చేపడుతున్నట్టు పక్క సమాచారం అందుకున్న షేక్‌పేట్ తహసీల్దార్ అనితారెడ్డి, రెవెన్యూ అధికారులు ఆ నిర్మాణాలను కూల్చివేయడంతోపాటు వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ భూములను కబ్జా చేయాలని యత్నిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పేదల జోలికొస్తే సహించేది లేదు



- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

నవతెలంగాణ-బేగంపేట్

పేదల జోలికి వస్తే సహించేది లేదని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ హెచ్చరించారు. సనత్‌నగర్‌లోని దాసారంలో సుమారు 300 కుటుంబాలు గత 30 ఏండ్ల నుంచి గుడిసెలు వేసుకొని జీవనం సాగిస్తున్నారు. కాగా బుధవారం కొందరు వ్యక్తులు తమ ప్రాంతానికి తమ అనుచరులతో వచ్చి గుడిసెలు ఖాళీ చేయాలని హెచ్చరించారు. దీంతో ఆందోళనకు గురైన వారు గురువారం వెస్ట్ మారేడ్ పల్లిలోని ఎమ్మెల్యే కార్యాలయం వద్దకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఎన్నో ఏండ్ల నుంచి తాము ఇక్కడే ఉంటున్నామని, ఇప్పుడు తమను వెళ్లిపోవాలంటే ఎక్కడికి పోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఎమ్మెల్యే రెవెన్యూ, పోలీసు, జీహెచ్ఎంసీ తదితర శాఖల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని వివరించారు. పేదల జోలికి రాకుండా, శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి ఆందోళన చెందవద్దని అండగా ఉంటామని వారికి భరోసా ఇచ్చారు. బాధితుల వెంట సనత్‌నగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు కొలన్ బాల్ రెడ్డి, అమీర్‌పేట్ మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, అధ్యక్షుడు హన్మంతరావు, నాయకులు సురేష్ గౌడ్, కరుణాకర్ రెడ్డి, కుమార్, వనం శ్రీనివాస్, దాసారం గుడిసె వాసులు తదితరులు ఉన్నారు.

ఓయూలో బంద్ చేపట్టిన కాంట్రాక్టు అధ్యాపకులు



నవ తెలంగాణ-ఓయూ

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో యూనివర్సిటీ కాంట్రాక్టు టీచర్స్‌ని రెగ్యులరైజేషన్ చేస్తామని ఇచ్చిన హామీ గురించి అడగడానికి బుధవారం రోజున 12 యూనివర్సిటీల కాంట్రాక్టు టీచర్స్ ఉన్నత విద్యామండలి చైర్మెన్‌ని కలిసారు. రెగ్యులరైజేషన్ గురించి అడిగిన దాదాపు 800 వందల మంది కాంట్రాక్టు టీచర్స్‌ని పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెల్సిందే. యూనివర్సిటీ ఉపాధ్యాయులను అప్రజాస్వామికంగా అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ గురువారం 12 యూనివర్సిటీలలో బంద్ నిర్వహిం చారు. ఉస్మానియా యూనివర్సిటీలలో ఉపాధ్యాయులు, ఉద్యోగులు, విద్యా ర్థులు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొని యూనివర్సిటీ కాంట్రాక్టు టీచర్స్‌కి రెగ్యు లరైజేషన్ చేయాలనీ మద్దతు తెలియజేశారు. ప్రభుత్వం ఇప్పటికయినా తక్షణమే యూనివర్సిటీ కాంట్రాక్టు టీచర్స్‌ని రెగ్యులరైజేషన్ చేయకుండా జ్యాపం జరిగితే రానున్న రోజులలో ప్రభుత్వం త్వరగా యూనివర్సిటీలలో నిరవ ధిక సమ్మె చేసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని కాంట్రాక్టు అధ్యాపకులు హెచ్చ రించారు. ఈ కార్యక్రమంలో డా. పరుశరామ్, డా. ధర్మతేజ, డా. సీమర్ల విజేం దర్ రెడ్డి, డా. వేల్పుల కుమార్, డా. ఉపేందర్, డా. రేష్మా రెడ్డి, డా. తాళపల్లి వెంకటేష్, డా. రామలింగం, డా. వెంకటేశ్వర్లు, డా. హరీష్ పాల్గొన్నారు.

అంబేద్కర్ జయంతి కరపత్రం విడుదల



నవతెలంగాణ-ఓయూ

ఆర్ట్స్ కాలేజ్ వేదికగా తెలంగాణ డెమోక్రటిక్ స్టూడెంట్ ఫోరం (టీడీఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు విజయ్ నాయక్ ఆధ్వర్యంలో 14న జరిగే డా. బీఆర్ అంబేద్కర్ 134వ జయంతిని ప్రతి ఒక్కరూ జయప్రదం చేయాలని కోరుతూ.. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన టీడీఎస్ఎఫ్ సలహాదారుడు, పొలిటీ ఫేమ్ డా. ముసవీర్ అలీ చేత కరపత్రాన్ని విడుదల చేశారు. ఓయూ ఆర్ట్స్ కాలేజ్ వేదికగా జరిగే అంబేద్కర్ జయంతి ఉత్సవాల్లో పాల్గొని విజయవంతం చేయాలని విజయ్ నాయక్ కోరారు. ఈ కార్యక్రమంలో టీడీఎస్ఎఫ్ సెక్రెటరీ రమేష్ నాయుడు, ట్రెజరీ కుమ్మరి అనిల్ కుమార్, లీగల్ ఫోరం కరణ్, కోట ప్రభాకర్, శశి కుమార్, ప్రశాంత్, రాజేందర్ నాయక్, ఎంఎస్ఎఫ్ అజయ్ సామ్రాట్, క్రాంతి కుమార్ వివిధ విద్యార్థి సంఘ నాయకులు పాల్గొన్నారు.



ఔట సీ రాష్ట్ర అధ్యక్షుడు డా.ఎ. పరశురాం ఆధ్వర్యంలో గురువారం కాంట్రాక్టు అధ్యాపకులు టెక్నాలజీ కళాశాల బంద్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఓయూ టెక్నాలజీ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు. డా.పరాశురాం మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీకి కట్టుబడి కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. నవతెలంగాణ-ఓయూ

మహనీయుల మార్గం నేటి తరానికి ఆదర్శం

- శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్
- ఓయూలో ఘనంగా ప్రారంభమైన మహనీయుల జయంతి ఉత్సవాలు





నవతెలంగాణ-ఓయూ

మహనీయుల మార్గం నేటి తరానికి ఆదర్శమని శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. ఓయూలో గురువారం మహనీయుల జయంత్యుత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. నాలుగు రోజుల పాటు జరగనున్న కార్యక్రమాలను ఓయూ ఠాగూర్ ఆడిటోరియంలో గడ్డం ప్రసాద్ కుమార్ ప్రారంభించారు. మహాత్మా జ్యోతిబాపూలే, జగ్జీవన్ రామ్, డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్‌ల జీవితం, వారు నడిచిన మార్గం నేటి తరానికి ఆదర్శమని ఈ సందర్భంగా ప్రసాద్ కుమార్ అన్నారు. ముగ్గురు సంఘ సంస్కర్తలు భారత దేశ చరిత్రనే మార్చేశారని, అసమానతలు, అస్పృశ్యత, కుల వివక్షతలకు వ్యతిరేకంగా పోరాడి ఘనణీయమైన మార్పులకు బాటలు వేశారని గుర్తు చేశారు. విద్య, మహిళాసాధికారత కోసం చేసిన కృషిని కొనియాడారు. భారత సమాజంలో సంస్కరణల దిశగా చేసిన విప్లవాత్మక మార్పులు మహనీయుల దూరదృష్టి వల్లే సాధ్యమయ్యాయని గడ్డం ప్రసాద్ కుమార్ వివరించారు.. పేద, బలహీన వర్గాల విద్యార్థుల సంక్షేమం దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందని, ఇటీవలే విద్యార్థుల మెస్ ఛార్జీలు పెంచిన విషయాన్ని గుర్తు చేశారు. ఉద్యోగాల కల్పనలోనూ విప్లవాత్మక మార్పులు చేస్తోందని వివరించారు. విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకుల భర్తీ కోసం ఇటీవలే ప్రభుత్వ నియమావళి విడుదల చేసిన విషయాన్ని గుర్తు చేసిన స్పీకర్, సజావుగా నియామక ప్రక్రియ పూర్తవుతుందని ధీమా వ్యక్తం చేశారు. అద్భుతమైన కార్యక్రమం ద్వారా మహనీయుల జీవితాలను విద్యార్థులకు పరిచయం చేసే కార్యక్రమాన్ని నిర్వహించటం నిజంగా ఆదర్శప్రాయమని, ఇందుకు కృషి చేస్తున్న వీసీ కుమార్ చౌరవను అభినందించారు. గౌరవ అతిథిగా హాజరైన రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మెన్ డా. రియాజ్ తన ప్రసంగం ద్వారా విద్యార్థులను ఉత్తేజ పరిచారు. భారత చారిత్రక వాస్తవాలను వివరిస్తూ.. మహనీయుల స్ఫూర్తితో విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. వాస్తవిక సమాజాన్ని అర్థం చేసుకోవటంతో పాటు సైంటిఫిక్ అవగాహనను మెరుగుపరుచుకోవాలని పిలుపునిచ్చారు. సమాజంలోని అపసవ్య ధోరణులను అర్థం చేసుకుని, రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకునే దిశగా యువత ఆలోచించాలని అన్నారు. ప్రొ. కుమార్ నేతృత్వంలో ఓయూ తీసుకున్న చొరవ మిగతా విద్యాసంస్థలు కూడా తీసుకోవాలని, మహనీయుల చరిత్ర, వారి దృక్పథాలను భవిష్యత్తు తరాలకు అందించాలని ఆకాంక్షించారు. భారత దేశంలో విద్య, సామాజిక సమానత్వం, హక్కుల పరిరక్షణ కోసం అలుపెరుగని పోరాటం చేసిన మహాత్మా జ్యోతిబా పూలే జీవితం ఆదర్శమని ఓయూ వీసీ ప్రొ. కుమార్ మొలుగరం అన్నారు. మహనీయుల జయంత్యుత్సవాలను ప్రారంభించిన శాసనసభాపతి ప్రసాద్ కుమార్‌కు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొ. జి. నరేష్ రెడ్డి, ఓఎస్డీ ప్రొ. జితెందర్ నాయక్, ప్రొఫెసర్ బి. లావణ్య, ప్రొ. కొండ.నాగేశ్వర్, ప్రొ. ఉపేందర్, సీనియర్ ప్రొఫెసర్లు, అధ్యాపకులు, ఉద్యోగులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలింగ్ విధులపై పూర్తి అవగాహన కలిగుండాలి

- ట్రైనింగ్ మేనేజ్మెంట్ నోడల్ అధికారి డా.సునంద రాణి
- పీఓలు, ఏపీఓలు, ఓపీఓలు, మైక్రో అబ్జర్వర్‌లకు శిక్షణా కార్యక్రమం



నవతెలంగాణ-సిటీబ్యూరో

పోలింగ్ విధులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు శిక్షణ ఉపయోగపడు తుందని ఎన్నికల ట్రెనింగ్ మేనేజ్మెంట్ నోడల్ అధికారి డా.సునంద రాణి అన్నారు. పోలింగ్ అధికారులు నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలని సూచిం చారు. హైదరాబాద్ లోకల్ బాడీ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా గురువా రం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో ప్రిసైడి ంగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, మైక్రో అబ్జర్వర్లు, ఓపిఓ లకు తొలి విడత ఎన్నికల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్స్ వారికి ఎన్నికల నియమ నిబంధనలు, బ్యాలెట్ బాక్సుల సీల్ విధానం, బ్యాలెట్ పేపర్స్, అవసరమైన ఫారాలు పూరించడం తదితర అంశాల పై అవగాహన కల్పించారు. డెమో బ్యాలెట్ బాక్స్ ద్వారా వారితో ప్రత్యక్షంగా చేయించి హ్యాండ్స్ ఆన్ శిక్షణను ఇచ్చారు. శిక్షణలో పి.ఓ లు, ఏపిఓ లకు తలెత్తిన సందేహాలను మాస్టర్ ట్రైనర్స్ నివత్తి చేసారు. ఈ శిక్షణ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు విజయలక్ష్మి(పి.ఓ యు.సి.డి), మమత (ఈ ఈ ఎలక్ట్రికల్), పీఓ లు, ఏపీఓలు, మైక్రో అబ్జర్వర్, ఓపిఓలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన బాధితులు



నవతెలంగాణ-కంటోన్మెంట్

పారడైజ్ నుంచి మిలటరీ డైరీ ఫాం వరకు నిర్మిస్తున్న ఎలివేటెడ్ కారిడార్‌లో ఆస్తులు కోల్పోతున్న సంజీవయ్య నగర్ చిన్నతోకట్ట ప్రాంత బాధితులు గురువారం ఎమ్మెల్యే శ్రీ గణేష్‌ని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. రిహాబిలిటేషన్ రీ సెటిల్మెంట్ చట్టం ప్రకారం తమ నుంచి సేకరిస్తున్న ఆస్తుల మార్కెట్ వాల్యుకన్నా 4 రెట్లు పరిహారం ఇప్పించాలని, తమ ఆస్తుల నిర్మాణ వ్యయాన్ని కూడా పరిహారంలో అదనంగా కలపాలని కోరారు. ఎస్సీలు ఉన్న నేపథ్యంలో చట్టంలో ఎస్సీల కోసం ప్రత్యేకంగా ఉన్న ప్రయోజనాలు కూడా తమకు దక్కేలా చూడాలని, మరోచోటుకు వెళ్లడం వలన ఉపాధి కోల్పోతున్న వారికి కూడా ఉపాధి మార్గం చూపించేలే చర్యలు తీసుకోవాలంటూ కోరారు. ఈ సందర్భంగా స్పందించిన ఎమ్మెల్యే శ్రీ గణేష్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి దృష్టికి అధికారుల దృష్టికి తీసుకుపోయే న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

109 మంది మైనర్‌లపై కేసులు

- మైనర్‌లకు వాహనాలిచ్చిన తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చిన ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజ్



నవతెలంగాణ-కంటోన్మెంట్

నార్త్ జోన్ ట్రాఫిక్ పోలీసులు మూడు రోజులపాటు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి 109 మంది మైనర్‌లపై కేసులు నమోదు చేశారు. అధికారులు ఇచ్చిన ఆదేశాల మేరకు గత మూడు రోజులుగా మైనర్‌లు వాహనాలు నడపడంపై ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించారు. ఈ మేరకు గురువారం నార్త్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు తిరుమలగిరి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ ఎల్ మధు బాబుతో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరించారు. ఉత్తర మండలం పరిధిలో 109 కేసులు నమోదైనట్టు ఆయన వెల్లడించారు. వీరిలో మైనర్లు అత్యధికంగా ఉన్నారని తెలిపారు. జోన్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బోయిన్‌పల్లిలో 17, తిరుమలగిరిలో 19, మరేడ్‌పల్లిలో 23, బేగంపేట్‌లో 24 గోపాలపురంలో 9, మహంకాళీ పోలీస్ స్టేషన్ పరిధిలో 17 కేసులు నమోదైనట్టు ఆయన వెల్లడించారు. మైనర్లు వాహనము నడిపితే వారి తల్లిదండ్రులు బాధ్యత వహించాల్సి వస్తుందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. మోటారు వాహన చట్టం 1988 సెక్షన్ 180 ప్రకారం ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించినందుకు వెయ్యి రూపాయల జరిమానా మూడు నెలల జైలు శిక్ష అన్నారు. సెక్షన్ 181 ప్రకారం డ్రైవింగ్ చేసే చోదకుడికి వయస్సు సరిపోకపోతే రూ.500 జరిమానా లేదా మూడు నెలల జైలు శిక్ష కూడా విధించే అవకాశం ఉందన్నారు. సెక్షన్ 207 ప్రకారం వాహనానికి రిజిస్ట్రేషన్ లేదా డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా నడిపితే ఆయా వాహనాలను స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. ఇక మైనర్‌లు తప్పు చేస్తే సెక్షన్ 199 ఏ 2019 ప్రకారం వాహన రిజిస్ట్రేషన్ 12 నెలల పాటు రద్దు అవుతుందని, ఆ వాహన చోదకుడికి 25 ఏండ్లు వచ్చేవరకు డ్రైవింగ్ లైసెన్స్ పొందే అవకాశం లేదన్నారు. మైనర్లు వాహనాలను నడిపి ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా మైనర్‌ల తల్లిదండ్రులకు ట్రాఫిక్ పోలీసులు కౌన్సిలింగ్ నిర్వహించారు. అనంతరం చట్టాలపై అవగాహన కల్పించారు. చట్టాన్ని గౌరవిద్దాం, నియమాలకు లోబడి వాహనాలు నడుపుదాం అంటూ తల్లిదండ్రులతో కలిసి ప్రతిజ్ఞకి పూనారు. ఈ కార్యక్రమంలో మైనర్ పిల్లల తల్లిదండ్రులు, ట్రాఫిక్ కానిస్టేబుల్స్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రాజకీయ చైతన్యం శూన్యం



- రాజ్య సాధనకోసం ఈ నెల 14 పాదయాత్ర
- బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ కన్వీనర్ డా. విశారాదన్ మహరాజ్

నవతెలంగాణ-బంజారాహిల్స్

తెలంగాణ రాష్ట్రంలో రాజకీయ చైతన్యం శూన్యంమని, దశాబ్దాల పోరాటానికి అసువులు బాసిన పోరాటల యోధులు బీసీ, ఎస్సీ, ఎస్టీలేనని, వారి త్యాగాల ఫలితమే తెలంగాణ రాష్ట్రం వచ్చిందని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ కన్వీనర్ డా. విశారాదన్ మహరాజ్ తెలిపారు. గురువారం సోమాజి గూడా ప్రెస్ క్లబ్‌లో 14 నుంచి నిర్వహించనున్న లక్ష కిలో మీటర్‌ల మాభూమి రథయాత్ర సంబంధించిన పోస్టర్ను కో-కన్వీనర్లు తోట్ల రాఘవేందర్ ముదిరాజ్, రాసాల వినోద్ యాదవ్‌లతో కలిసి ఆవిష్కరించి ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ.. డా. బీర్ అంబేద్కర్ జయంతి రోజు ఏప్రిల్ 14 మధ్యాహ్నం 2 గంటలకు నిజామాబాద్ డైట్ కాలేజ్ గ్రౌండ్‌లో ఈ యాత్ర ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసం గడప గడపకు 10 వేల కిలోమీటర్ల పాదయాత్ర ఉంటుందన్నారు. అదిలాబాద్ నుంచి ప్రారంభమౌతున్న 'మా భూమి' రథయాత్ర 39 నెలల పాటు రాష్ట్ర మంతా తిరుగుతూ ప్రజాసమస్యలపై తెలుసుకొన్న అనంతరం 2028 జులై 11న హైదరాబాద్‌లో యాత్ర ముగుసిన అనంతరం జులై 15న పేరెడ్ గ్రౌండ్‌లో భారీ బహిరంగ సమావేశం నిర్వహించనున్నట్టు తెలిపారు. ప్రజలకు రాజ్యాంగపరమైన హక్కుల సాధన లక్ష్యంగా యాత్ర ఉంటుందన్నారు. అన్ని పార్టీలు, ప్రజాసంఘాలు ఒక్కటై తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్న రాష్ట్రపాలననూ గమనిస్తే మళ్ళీ రెడ్డి, రావుల రాజ్యంగా మారిపోయిందని అన్నారు. 4 కోట్ల ప్రజల ఆకాంక్ష, త్యాగం, బలిదానాలు అన్నీ వృధా అయ్యాయనీ ఆవేదన వెలిబుచ్చారు. ఆతప్పును పునరావృత్తం కాకుండా చూడాల్సిన బాధ్యత విద్యావంతులు, రాజకీయ విశ్లేషకులు, మేధావులపై ఉందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు సాయిబాబా పూసల, అబ్దుల్ రెహమాన్, గడ్డం మనీష్ గౌడ్, రాజ్ కమల్ తదితరులు పాల్గొన్నారు.

ఓయూ విద్యార్థి ఆత్మహత్యాయత్నం

- ఆందోళనకు దిగిన విద్యార్థులు



నవతెలంగాణ-ఓయూ

ఓయూ టెక్నాలజీ కళాశాలలో కెమికల్ ఇంజినీరింగ్ ఫైనల్ ఇయర్ అభ్యసిస్తున్న విద్యార్థి ప్రణయ్ శశాంక్ 22 బుధవారం సాయంత్రం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తోటి విద్యార్థులు గుర్తించి అతడిని హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రణయ్ చివరి సంవత్సరం మొదటి సెమిస్టర్‌లో ఒక సబ్జెక్టు ఫెయిల్ అయ్యారు. దీంతో రివల్యూషన్‌కు దరఖాస్తు చేసుకుని పాసయితాననే విశ్వాసంతో సప్లమెంటరీ పరీక్షకు సైతం హాజరు కాలేదు. తీరా రీవాల్యుయేషన్‌లో సైతం పాస్ కాలేకపోయాడు. ఇటీవల విడుదలైన గేట్ ఫలితాల్లో ఉత్తమ స్కోరు సాధించిన ప్రణయ్‌కు పీజీలో ఐఐటీల్లో ప్రవేశం పొందే అవకాశం లభించింది. అంతకు ముందుగానే అతడు ఆన్‌లైన్‌లో ఓ కోర్స్ పూర్తి చేశాడు. దానిని పరిగణనలోకి తీసుకొని క్రెడిట్ ట్రాన్స్‌ఫర్ చేయడం ద్వారా తనను పాస్ చేయాలని కోరారు. దీనికి అధికారులు నిరాకరించడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ప్రణయ్ హాస్టల్‌కి వెళ్లి బుధవారం సాయంత్రం ఫినాయిల్ తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన స్నేహితులు అతడిని దుర్గాబాయ్ దేశముఖ్ హాస్పిటల్‌కు, అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. విద్యార్థులు గురువారం ఉదయం కళాశాలలో ఆందోళనకు దిగారు. అధికారుల వైఖరితోనే ప్రణయ్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని ఆరోపించారు. ఓయూ వీసీకి వ్యతిరేకంగా నినాదించారు. ఇతర యూనివర్సిటీలో క్రెడిట్ ట్రాన్స్‌ఫర్ చేస్తున్నప్పుడు తమ కళాశాలలో ఎందుకు చేయరని ప్రశ్నించారు. ప్రణయ్‌కు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై కళాశాల ప్రిన్సిపల్ ప్రొ.రమేష్ కుమార్ వివరణ ఇస్తూ నిబంధనల ప్రకారమే తాము వ్యవహరించామని స్పష్టం చేశారు. నియమ నిబంధనలకు అనుగుణంగా క్రెడిట్ ట్రాన్స్‌ఫర్ సాధ్యపడదని చెప్పారు. తాము ఇష్టారీతిన ఏదీ చేయడానికి వీలుండదని, నిబంధనలకు అనుగుణంగా పనిచేయాల్సి ఉంటుందన్నారు. ప్రణయ్ ఉదంతంపై అధికారులు సమావేశమై చివరి సంవత్సరం విద్యార్థులకు ఐదవ సెమిస్టర్ సప్లమెంటరీ పరీక్షలను మరోసారి నిర్వహించాలని నిర్ణయించినట్టు తెలిపారు.

యశోద హాస్పిటల్స్‌లో అందుబాటులో ఉన్న 'డీబీఎస్'

- పార్కిన్సన్స్ వ్యాధికి 'డీప్ బ్రెయిన్ స్టిమ్యులేషన్' చికిత్స(డీబీఎస్) అత్యంత ప్రభావవంతమైంది
- న్యూరాలజిస్టులు



నవతెలంగాణ-బేగంపేట్

ప్రపంచవ్యాప్తంగా పార్కిన్సన్స్ వ్యాధి రెండవ అత్యంత న్యూరోడీజెనరేటివ్ డిజార్డర్. సాధారణ భాషలో వణుకుడువ్యాధి (షేకింగ్ డిసీజ్) అనే ఈ వ్యాధి మెదడులో నాడీ కణాలు దెబ్బదినటం, క్షీణించటం కారణంగా వస్తుంది. భారతదేశంలో వివిధ అధ్యయనాల ప్రకారం ప్రతి లక్ష మంది జనాభాకు 15 నుంచి 43 మందిలో ఈ పార్కిన్సన్స్ వ్యాధి ప్రాబల్యం ఉంది. పెరుగుతున్న ఆయుర్దాయం, వృద్ధాప్య జనాభాతో పార్కిన్సన్స్ వ్యాధి భారం మన దేశంలో ఎక్కువగా ఉం టుందని న్యూరో వైద్య నిపుణులు భావిస్తున్నారు. ఈ 'వణుకుడు' వ్యాధిని ముందుగా గుర్తించిన డా. జేమ్స్ పార్కిన్సన్ పేరున ఈ వ్యాధికి 'పార్కిన్సన్స్' వ్యాధిగా నామకరణం చేసి, ఆయ న జన్మది నమైన ఏప్రిల్ 11న ప్రపంచ పార్కిన్సన్స్ డేగా జరుపు కుంటు న్నారు. ప్రపంచ పార్కిన్సన్స్ దినోత్సవం సందర్భంగా, హైటెక్ సిటీలోని యశోద హాస్పిటల్స్, 25 ఏండ్లుకు పైగా అపారమైన అనుభవం, వెయ్యి మందికి పైగా పార్కిన్సన్ రోగులు (దేశం, ప్రపంచవ్యాప్తంగా) డీబీఎస్ చేయడంలో అనుభవం కలిగిన, పార్కిన్సన్స్ డిసీజ్ అండ్ మూవ్‌మెంట్ డిజార్డర్స్ రీసెర్చ్ సెంటర్ (PDMDRC) డైరెక్టర్, సీనియర్ న్యూరాలజిస్ట్, డా. రూపమ్ బోర్గోహైన్ మాట్లాడుతూ.. ఈ పార్కిన్సన్ వ్యాధి ప్రధానంగా మెదడులో డోపమైన్ ఉత్పత్తి చేసే న్యూరాన్‌లను కోల్పోవడం, ఇతర న్యూరోట్రాన్స్మిటర్ ఉత్పత్తి చేసే న్యూరాన్‌లను కోల్పోవడం వల్ల వస్తుంది. పార్కిన్సన్ వ్యాధికి ఖచ్చితమైన కారణం తెలియదు కానీ, జన్యు, పర్యావరణ కారకాల మధ్య సంక్లిష్ట పరస్పర చర్య కారణ ంగా ఇది సంభవిస్తుందన్నారు. పార్కిన్సన్స్ వ్యాధి లక్షణాలు.. విశ్రాంతి సమయంలో వణుకు, అన్ని కార్యకలాపాలలో మంద గమనం, దృఢ త్వం కోల్పోవడం, నడక కష్టం, ప్రసంగం, చేతివ్రాత మార్పులు, మలబద్ధకం, వాసన కోల్పోవడం, మూత్ర విసర్జనలో ఆటంకాలు, బీపీ హెచ్చుతగ్గులు, జ్ఞాపకశక్తి ఆటంకాలు వంటివి గుర్తించాలి. నేటికి పార్కిన్సన్స్ వ్యాధికి కచ్చితమైన చికిత్స లేదు. కానీ, లక్షణా లను మెరుగుపరచడానికి, రోగుల జీవన నాణ్యతను మెరుగు పరచడానికి అనేక చికిత్సలు అందుబాటుతో ఉంటుం దన్నారు. ఈ డీబీఎస్‌తో మోటార్ లక్షణాలు మెరుగుపడతాయి. డీబీఎస్ ముఖ్య ంగా వణుకు, దృఢత్వం, కదలిక మందగమనాన్ని తగ్గించడంలో ప్రభావవంతంగా పనిచేస్తుంది. రోగులు చలన శీలత, స్వాతం త్ర్యాన్ని తిరిగి పొందేందుకు వీలు కల్పిస్తుంది. దీర్ఘకా లిక ఔషధ వినియోగంతో సంబంధం ఉన్న దుష్ప్రభావాలను తగ్గి స్తుంది. ముఖ్యంగా పార్కిన్సన్స్ రోగుల జీవన నాణ్యతను మెరు గుప రుస్తుందని డా. రూపమ్ బోర్గోహైన్ తెలిపారు. యశోద హాస్పిటల్స్ సీనియర్ న్యూరాలజిస్టు డా. రుక్మిణి మృదుల, డా. రాజేష్ అలుగోలు, డా. శృతి కోలా, డా. వీవీఎస్ఆర్‌కే ప్రసాద్‌లతో ప్రొ, డా. రూపమ్ బోర్గోహైన్ బృందం 25 ఏండ్ల పాటు విస్తృత అనుభవాన్ని కలిగి ఉంది. వేలాది మందికి పైగా పార్కిన్సన్స్ రోగులకు ప్రపంచవ్యాప్తంగా డీబీఎస్ చేయడంలో విజయంసాధి ంచారు. డా. రూపమ్ అతని బృందం దేశవ్యాప్తంగా వివిధ కేంద్రాలకు శిక్షణ ఇచ్చారు.

నమ్మకమే ఆరోగ్యానికి మేలు చేకూర్చే ఆయుధం



నవతెలంగాణ-బంజారాహిల్స్

స్వర పేటిక కోల్పోయిన వారు మనోధైర్యంతో జీవించాలనే లక్ష్యంతో బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్, రీసెర్చి ఇన్‌స్టిట్యూట్ చేపట్టిన వినూత్న కార్యక్రమ ఫలంగా ఎందరికో మాట్లాడే అవకాశం లభించింది. గురువారం దానికి సంబంధించి అవగాహన కార్యక్రమం బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్, రీసెర్చి ఇన్‌స్టిట్యూట్‌లో నిర్వహించారు. స్వర పేటికకు వచ్చే క్యాన్సర్‌తో బాధపడే కొద్ది మంది పేషెంట్లకు స్వర పేటికను పూర్తిగా తొలగించాల్సిన అవసరం ఏర్పడుతుంది. అయితే ఇటీవల కాలంలో అందుబాటులోనికి వచ్చిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, చికిత్సా విధానాల కారణంగా ఇలా మాటను కోల్పోయి ఇబ్బందులు పాలవుతున్న వారికి ఊరట కలిగించి వారు సాధారణ జీవనాన్ని గడిపే అవకాశం ఏర్పడింది. ఈ సదవకాశాన్ని పేషెంట్లకు అందించి తద్వారా వారిని సాధారణ జన జీవన స్రవంతిలో భాగంగా చేయడం ద్వారా గౌరవప్రదమైన, స్వతంత్ర్యమైన జీవనాన్ని గడిపేందుకు దోహద పడేలా బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్, రీసెర్చి ఇన్‌స్టిట్యూట్‌లోని సర్జికల్ అంకాలజీ డిపార్ట్‌మెంట్‌లో భాగమైన హెడ్ అండ్ నెక్ సర్జరీ విభాగం అధిపతి డా. చంద్ర శేఖర రావు నేతృత్వంలో ప్రత్యేకమైన సెల్ఫ్ హెల్ప్ గ్రూపు ఏర్పాటు చేయడం జరిగింది. అంకాలజీ సర్జన్స్, ఫిజిషియన్స్, స్పీచ్ థెరపిస్టులు వంటి వారితో ఏరపడిన ఈ సెల్ఫ్ హెల్ప్ గ్రూపులో భాగంగా ఉంటూ స్వర పేటిక క్యాన్సర్ కారణంగా పూర్తిగా మాట కోల్పోయిన పేషెంట్లను గుర్తించి వారిలో ముందుకు వచ్చిన ఔత్సాహికులను గ్రూపులో సభ్యులుగా చేర్చడం జరిగింది. ఇలా గ్రూపులో భాగస్వాములై పేషెంట్ల అవసరాల కనుగుణంగా వైద్యులు, స్పీచ్ థెరపిస్టులు కలసి చికిత్సను అందించడం ప్రారంభమైంది. పేషెంట్ యొక్క ఆరోగ్య పరిస్థితులకు అనుగుణంగా మాట్లాడే శక్తిని తిరిగి సాధించడానికి వీలుగా కొన్ని యంత్రాల సహాయం తీసుకోవాల్సిన అవసరం ఏర్పడిన సందర్భాలలో వాటిని అందించడం జగుతుంది. ఈ సందర్భంగా హాజరైన క్యాన్సర్ సర్వైవర్స్ మాట్లాడుతూ.. ఈ సందర్భంగా ఆంకాలజిస్ట్ హెడ్ అండ్ నెక్ సర్జరీ విభాగం అధిపతి డా.చంద్ర శేఖర రావు మాట్లాడుతూ.. ప్రయత్నం చేస్తే ఎలాంటి వైకల్యాన్ని కూడా అధిగమించవచ్చని ఈ కార్యక్రమం ద్వారా నిరూపించదలిచామని చెప్పారు. అంతే గాకుండా ఇలాంటి ఇబ్బందులతో బాధపడుతున్న వారి సమస్యలకు సమాధానం ఉందనే విశ్వాసం నెలకొల్పడం కూడా కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యమని వివరించారు. ఈ కార్యక్రమాలలో సీఈఓ డా కె కృష్ణయ్య, ఎమ్మెస్, డా. ఫణి కోటేశ్వర రావు, హెడ్ అండ్ నెక్ సర్జికల్ వింగ్, డా.చంద్ర శేఖర రావు,డా. హేమంత్, డా.జొనాథన్, డా. అనిల్ కుమార్, డా.అభినవ్, స్పీచ్ థెరపిస్టు పార్థ సారథిలతో పాటూ పలువురు వైద్యులు, రోగులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ప్రచార హోర్డింగ్ పడి మహిళకు గాయాలు



నవతెలంగాణ-ముషీరాబాద్

ప్రచార హోర్డింగ్ పడి మహిళకు గాయాలైన సంఘటన ముషీరాబాద్ గోల్కొండ చౌరస్తా వద్ద చోటు చేసుకుంది. గోల్కొండ చౌరస్తా మూల మలుపు వద్ద వున్న భారీ భవనం వద్ద ఏర్పాటు చేసిన ప్రచార హోర్డింగ్ ప్రహరీ గోడ సాయంత్రం సమయంలో వచ్చిన తీవ్రమైన గాలి దాటికి పక్కనే నర్సరీ నిర్వహిస్తున్న మహిళపై పడడంతో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చిక్కడపల్లి పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మహిళను గాంధీ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం మహిళకు చికిత్స నిర్వహిస్తున్నారు. పోలీసులు ఘటనకు సంబంధించి దర్యాప్తు చేపట్టారు.

ఏటుకూరి ప్రసాద్ 100 పుస్తకాల వితరణ



నవతెలంగాణ-కాప్రా

ఈసీఐఎల్ సీపీఐ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన కెఎల్. మహేంద్ర సోషల్ స్టడీ సర్కిల్ గ్రంథాలయానికి సీపీఐ సీనియర్ నేత, ప్రముఖ పాత్రికేయులు, రచయిత ఏటుకూరి ప్రసాద్ వి.ఎస్. బోస్ ద్వారా 100 పోటీ పరీక్షల మెటీరియల్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్. బోస్ మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే నిరుద్యోగులు అన్ని అంశాలపై పఠనం చేయాలన్నారు. ఎన్నో సంవత్సరాల నుంచి ఏటుకూరి ప్రసాద్ తన రచనల ద్వారా సామాజిక అంశాలపై ఎనలేని కృషి చేశారని తెలిపారు. గతంలో అనేక దినపత్రికలకు సంపాదకులుగా పనిచేసిన అనుభవం ఆయన సొంతమని అన్నారు. 85 సంవత్సరాలు గడిచినా ఇప్పటికీ అనేక వ్యాసాలు, రచనల ద్వారా సమసమాజ మార్పు కోసం అవిరాళంగా కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కె ఎల్. మహేంద్ర, సోషల్ స్టడీ సర్కిల్ కార్యదర్శి జీ.దామోదర్ రెడ్డి, ఎస్. శంకర్ రావు, నారా నర్సింహా, రాఘవేంద్రరావు,సత్య ప్రసాద్, ధర్మేంద్ర, పోటీ పరీక్షల అభ్యర్థులు సాయి, అరుణ్, ప్రదీప్, నరహరి తదితరులు పాల్గొన్నారు.

మాతృ మరణాలు జరగకుండా ప్రత్యేక శ్రద్ధ చూపాలి

- ఏఎన్ఎం, ఆశాలు తరచుగా గర్భిణుల ఆరోగ్యంపై ఫాలో అప్ చేయాలి
- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



నవతెలంగాణ-సిటీబ్యూరో

జిల్లాలో మాతృ మరణాలు జరగకుండా గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి.. వారికి తగు సూచనలు, సలహాలతో పాటు చికిత్స అందించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి వైద్య ఆరోగ్యశాఖ వైద్యులు, సిబ్బందిని ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో మాతృ మరణాలపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మాతృ మరణాలు సంభవించకుండా గర్భిణీ స్త్రీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. గర్భిణీ స్త్రీల(జనన పూర్వ సంరక్షణ) సేవలు మెరుగుపరచాలనీ, వారి ఆరోగ్యంపై ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు ఫాలో అప్ చేయాలన్నారు. హై రిస్క్ గర్భిణీ స్త్రీలను గుర్తించి వారి వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. జిల్లాలో జరిగిన ఆరు మాతృ మరణాలపై సమీక్షించి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ వైద్యులు, సిబ్బందికి గర్భిణీ స్త్రీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, సరైన సమయంలో చికిత్సలు అందించి ఇకముందు జరగకుండా చూడాలని ఆదేశించారు. ఏఎన్ఎం, ఆశా గృహ సందర్శన చేసి గర్భిణీ స్త్రీల నమోదు సకాలంలో చేసి వారికి వ్యాక్సినేషన్, మాత్రలు, చికిత్సలు అందించాలని ఆదేశించారు. హై రిస్క్ కేసులను సకాలంలో గుర్తించి గర్భిణి సమయంలో ప్రసూతి సమయంలో ఇబ్బంది కలగకుండా తల్లి బిడ్డ క్షేమంగా ఉండేటట్టు వైద్య సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా కోరారు. అవసరమైతే కాన్పు కోసం రిఫరల్ ఆస్పతికి పంపాలని సూచించారు. గర్భవతుల మొబైల్ నెంబర్లు యూపీహెచ్‌సీ, ఏఎన్ఎం, ఆశా దగ్గర ఉంచుకొని గృహ సందర్శన, ఫోన్ ద్వారా గర్భవతుల ఆరోగ్య స్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకొని తగు సూచనలు, సలహాలు, చికిత్స అందించాలని కోరారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటి మాట్లాడుతూ జిల్లాలో యూపీహెచ్‌సీ, బీడీకే ద్వారా గర్భవతులకు అందిస్తున్న ప్రసవానికి ముందు, ప్రసవానంతర సేవలు గురించి వివరించారు. ఈ సమావేశంలో అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జయమాలిని, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సూచేత, గాంధీ మెడికల్ కాలేజ్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సత్యవతి, ఎస్‌పీహెచ్‌వోలు, మెడికల్ ఆఫీసర్స్ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్లాట్ విధానంతో ప్లాట్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ విజయవంతం

- స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ విభాగం డీఐజీ, జాయింట్ ఐజీ మధుసూదన్ రెడ్డి

నవతెలంగాణ-సిటీబ్యూరో

స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ విభాగంలో కొత్తగా ప్రవేశపెట్టిన స్లాట్ విధానంతో ప్లాట్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ విజయవంతమైందని ఆ విభాగం డీఐజీ, జాయింట్ ఐజీ మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం మేడ్చల్ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో కొత్తగా ప్రవేశపెట్టిన స్లాట్ విధానంతో చేపట్టిన రిజిస్ట్రేషన్ ప్రక్రియను జిల్లా రిజిస్ట్రార్ పీ.హెచ్ అశోక్ కుమార్‌తో కలిసి ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మధుసూదన్ రెడ్డి, అశోక్ కుమార్ మాట్లాడుతూ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ విభాగంలో ప్లాట్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత సులభతరం చేసేందుకు కొత్తగా స్లాట్ విధానాన్ని ప్రవేశపెట్టినట్టు తెలిపారు. పైలెట్ ప్రాజెక్టుగా రాష్ట్రవ్యాప్తంగా 22 సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో గురువారం స్లాట్ విధానంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియను చేపట్టినట్టు తెలిపారు. జిల్లా పరిధిలో మేడ్చల్, కుత్బుల్లాపూర్, వల్లభ్‌నగర్ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో చేపట్టిన స్లాట్ విధానంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిస్థాయిలో విజయవంతమైందన్నారు. ఈ స్లాట్ విధానంతో గంటల తరబడి నిరీక్షణ లేకుండా రిజిస్ట్రేషన్ ప్రక్రియ త్వరితగతిన పూర్తవుతుందని తెలిపారు. ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా క్రయవిక్రయదారులు సులభంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా మేడ్చల్ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో స్లాట్ విధానంతో రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్న కొనుగోలు దారుడికి విక్రయదారుడితో పత్రాలను అందజేయించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ సబ్ రిజిస్ట్రార్లు మధుబాబు, రేణుక, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



5 నెలల వేతన బకాయిలను విడుదల చేయాలి

- గ్రామపంచాయతీ కార్మికుల సమ్మెను సత్వరమే పరిష్కరించండి
- సీపీఐ(ఎం) మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి పి.సత్యం



నవతెలంగాణ-సిటీబ్యూరో

మేడ్చల్, శామిర్‌పేట, మూడు చింతలపల్లి మండలాల్లోని గ్రామ పంచాయతీ కార్మికుల 5 నెలల వేతన బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ 10 రోజుల నుంచి సమ్మె చేస్తున్నారని సీపీఐ (ఎం) మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి పి.సత్యం తెలిపారు. వారి వేతన బకాయిలను విడుదల చేసి సమ్మెను పరిష్కరించాల్సిన ప్రభుత్వం, అధికారులు అలసత్వం ప్రదర్శించటం సరికాదన్నారు. పంచాయతీ కార్మికుల సమ్మె వల్ల గ్రామాల్లో పారిశుధ్యం, నీటి సమస్యలను ప్రజలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజల ఇబ్బందులను పంచాయతీ కార్మికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని సమ్మెను సత్వరమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నుంచి ప్రతి కార్మికుడికీ రావాల్సిన రూ.9,500, గ్రామ పంచా యతీ నుంచి ఇవ్వాల్సిన రూ.3వేలను కలిపి ఐదు నెలల బకాయిలను సత్వరమే ఇవ్వడానికి తగిన చర్యలు తీసుకోవాలని సీపీఐ (ఎం) ప్రభుత్వాన్ని, అధికారులను డిమాండ్ చేస్తున్నట్టు తెలిపారు. ట్రెజరీ నుంచి రావాలని అధికారులు చెప్పడం సరికాదనీ, జనరల్ ఫండ్‌లో నుంచైనా కార్మికుల వేతనాలు చెల్లించాలని కోరారు.

కామ్రేడ్ విమల రణదీవే స్ఫూర్తితో పోరాడుదాం

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్



నవతెలంగాణ-కాప్రా

కేంద్ర ప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కామ్రేడ్ విమల రణదీవే స్ఫూర్తితో పోరాడుదామని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. శ్రామిక మహిళ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కమిటీ కన్వీనర్ ఎం.రేవతి కళ్యాణి అధ్యక్షతన కమిటీ ఆధ్వర్యంలో కమలానగర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో గురువారం రణదేవ్ జయంతి సభ జరిగింది. ఆయన చిత్ర పటానికి పలువురు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి మాట్లాడుతూ విమల రణధీవే మహారాష్ట్రలోని మధ్య తరగతి కుటుంబంలో జన్మించారన్నారు. చిన్న వయసులోనే తన జీవిత లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని దానికోసం జీవితం చివరి వరకు కృషి చేసే ఆ కొద్దిమందిలో విమల రణధీవే ఒక్కరన్నారు. 13 సంవత్సరాల వయసులోనే జాతీయ ఉద్యమం పట్ల ఆకర్షితులై సేవాదళ్ వాలంటీర్ గా పని చేశారని గుర్తు చేశారు. 1930లో గాంధీజీ పిలుపుమేరకు సహాయ నిరాకరణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారన్నారు. ఒక విదేశీ వస్త్ర దుకాణం ముందు టికెటింగ్ చేస్తున్న విమలను బ్రిటిష్ పోలీసులు అరెస్టు చేశారని.. బ్రిటిష్ రిజిస్ట్రేషన్ న్యాయస్థానం మీకు రాజకీయాల గురించి తెలిసే వయసు కాదు అందువల్ల క్షమాపణ చెబితే మిమ్మల్ని వదిలేస్తాము ఇంటికి వెళ్లిపోండి అన్నారన్నారు. దానికి ఆమె తాము ఏమీ చేశామో తమకు తెలుసని.. దీనికోసం క్షమాపణలు చెప్పబోమని సమాధానామిచ్చిందన్నారు. దాంతో ఆమెకు ఇతర సహచర్లకు ఆరు నెలల కఠిన జైలు శిక్ష విధించారని తెలిపారు. భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమంలో ప్రముఖ వ్యక్తి ఎస్‌జి సర్దేశాయి కామ్రేడ్ విమలకు దగ్గరి బంధువు అని.. వారి ప్రభావం వల్ల విమల కమ్యూనిస్టు భావజాలం పట్ల ఆకర్షితులయ్యారని చెప్పారు. 1930 లో ఉవ్వెత్తున లేచిన జాతీయ ఉద్యమం తగ్గుముఖం పట్టడంతో ఆమెతోపాటు మొత్తం యువతరం నిరాశకు గురయ్యారని.. ఆ సమయంలో మార్క్స్ ఎంగిల్స్ లెనిన్, స్టాలిన్ గురించి మరి వారి ఆశయాల గురించి చదివగా కొత్త ఆశయాలను మొలకెత్తాయన్నారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం తీసుకు వస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కార్మికుల కనిస వేతనాలు అమలు చేయాలని మే 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.రేవతికళ్యాణి, జిల్లా కోశాధికారి ఉన్నికృష్ణ, ఉపాధ్యక్షుడు ఎం శ్రీనివాస్, రాణి, రాధ, నాయకులు కవిత, మంగ, లలిత భవాని , శ్వేత నమ్రత, మమత లలిత తదితరులు పాల్గొన్నారు.

మూఢనమ్మకాల నిర్మూలనకు కృషి చేసిన హిప్నోకమలాకర్



నవతెలంగాణ-సిటీబ్యూరో

మూఢనమ్మకాల నిర్మూలనకు కృషి చేసిన వ్యక్తి డా.హిప్నోకమలాకర్ అని మానసిక వైద్య నిపుణులు డాక్టర్.రవ్వ హరి కుమార్ అన్నారు. గురువారం డా.హిప్నో కమలాకర్ జయంతి వేడుకలను ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, నవభారత లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చిక్కడపల్లి సోషల్ వెల్ఫేర్ గర్ల్స్ కాలేజీ హాస్టల్లో అమ్మాయిలు మూఢనమ్మకాలు పై పోటీలు, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మానవ మనస్సు సరికొత్త ఆవిష్కరణలకూ, విజ్ఞానానికి బీజమని చెప్పారు. కానీ కొన్ని మూఢనమ్మకాలు మాత్రం ఈ ఎదుగుదలకు అడుగడుగునా అడ్డు తగులుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. తప్పుడు నమ్మకాలను కూల్చి, సైన్సు, తర్క, విజ్ఞానం పట్ల ప్రజల్లో అవగాహన పెంచడానికి జీవితాన్ని అంకితమిచ్చిన వ్యక్తి కమలాకర్ అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు పుస్తకాలు, స్నాక్స్ పంపిణీ చేశారు. అన్నదానాన్ని డా.హరి కుమార్, జి.కృష్ణవేణి, సంఘం తెలంగా ణా అధ్యక్షుడు సాగర్ల రఘు, రమణా, లయన్ జయశ్రీ, వసతి గృహం హెడ్ ఎ.అనసుయా అందజేశారు. సంఘం తెలంగాణా అధ్యక్షుడు సాగర్ల రఘు మాట్లాడుతూ మూఢ నమ్మకాలకు బాలికాకుండా విజ్ఞానాన్ని వెలిగించాలని తపనపడిన వ్యక్తి కమలాకర్ అన్నారు. లయన్ జి.కృష్ణ వేణి మాట్లాడుతూ మూఢనమ్మకాలు, సమాజాభివద్ధికి అవరోధ మౌఢ్యమని, వ్యక్తిత్వ వికాసానికి ఆటంకాలని తెలియజేసిన వ్యక్తి కమలాకర్ అన్నారు. డా.హిప్నో పద్మా కమలాకర్ మాట్లాడుతూ ప్రశ్నించడం, పరిశీలించడం, పరీక్షించడం లేని వ్యక్తి అంధ విశ్వాసాలకి బలవుతాడని తెలిపారు. అడ్వ కేట్ వెంకటేశ్వంరావు మాట్లాడుతూ 20,000 హిప్నాటిజం ప్రోగ్రామ్స్, 100 పుస్తకాలు రాయడం డా. హిప్నో కమలా కర్‌కే సాధ్యమైందన్నారు. మూఢ నమ్మకాలు తొలగితే విద్యార్థులు అభివృద్ధి వైపు పయనిస్తారన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మేడ్చల్-మల్కాజిగిరి-ఉప్పల్
శుక్రవారం | ఏప్రిల్ 11, 2025 | www.navatelangana.com

పూలే జయంతి మహోత్సవ సభను జయప్రదం చేయండి

- బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర కార్యదర్శి కాసర్ల నాగరాజు



నవతెలంగాణ-నేరేడ్ మెట్

మహాత్మా జ్యోతిబాపూలే 198వ జయంతిని పురస్కరించుకొని బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం 6 గంటలకు ఓల్డ్ సఫిల్ గూడ భరత్ నగర్‌లోని బీసీ భవన్ ఆఫీస్ ఎదురుగా ఉన్న చౌరస్తాలో జయంతి మహోత్సవ సభ నిర్వహిస్తున్నట్టు ఐక్యవేదిక రాష్ట్ర కార్యదర్శి కాసర్ల నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ ఎస్సీ ఎస్టీ కుల బంధువులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాసామిక వాదులు, ప్రజల మధ్య జయంతి మహోత్సవ కార్యక్రమాన్ని జరుపుకోవడం జరుగుతుందన్నారు. కళాకారులచే సాంస్కృతిక కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.



తెలంగాణ ఉద్యమకారుడు బీఆర్ఎస్ సీనియర్ నేత నెవూరి ధర్మేందర్ రెడ్డి మాతృమూర్తి నెవూరి పిచ్చమ్మ మరణించిన విషయం తెలుసుకున్న డాక్టర్ ఏ ఎస్ రావు నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ పజ్జూరి పావని మణిపాల్ రెడ్డి, మోత్కూర్ మండలం దాచారం గ్రామంలోని వారి నివాసానికి వెళ్ళి ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వారితో పాటు కరిపే ప్రవీణ్ వంజరి శ్రీనివాస్ గౌడ్, సింగం రాజు, రాజేష్ హాజరై నివాళులు అర్పించారు. నవతెలంగాణ-కాప్రా



లైంగికదాడికి పాల్పడిన వ్యక్తిని శిక్షించాలి

- ఐద్వా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి ఎం వినోద

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

బాలికపై లైంగికదాడికి పాల్పడిన దుర్మార్గున్ని శిక్షించాలని ఐద్వా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి ఎం వినోద డిమాండ్ చేశారు. మల్కాజిగిరి సర్కిల్ మౌలాలి డివిజన్ పరిధిలోని పీఎస్ఆర్ నగర్ కాలనీలో ఐద్వా మల్కాజిగిరి మండల కార్యదర్శి మంగ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ 11 ఏండ్ల బాలికపై కిషన్ అనే వ్యక్తి లైంగికదాడికి పాల్పడడం దారుణమన్నారు. ఒంటరి మహిళ ప్రయివేటు ఉద్యోగం చేసుకుంటూ ఇల్లు కిరాయి కట్టుకుంటూ పిల్లలను పోషించుకుంటుంటే వారి కుటుంబంలో ఇలా జరగడం అన్యాయమన్నారు. బాధిత కుటుంబానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అండగా నిలబడి అమ్మాయిని ఉచితంగా పై చదువుల వరకు చదివించాలని కోరారు. అలాగే ఆ కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగంతో పాటు ఇల్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా పీఎస్ఆర్ నగర్ కాలనీ కమిటీ సభ్యులు ఎస్ రాజ్యలక్ష్మి, నజీమా, అనిత, షాహీన్, కె పద్మ, నరసమ్మ అంజమ్మ, లక్ష్మి పౌజీయ, తదితరులు పాల్గొన్నారు.



చక్రిపురం-నాగార్జున నగర్‌లో మురుగు సమస్యతో అల్లాడుతున్న ప్రజలు

నవతెలంగాణ - చర్లపల్లి

చక్రిపురం నాగార్జున నగర్ సరిహద్దులో మురుగు గోసపై వెంటనే స్పందించండి సార్ అంటూ చర్లపల్లి కాలనీ సభ్యుల విన్నవించుకుంటున్నారు. నాగార్జున నగర్ సరిహద్దులోని పోచమ్మ గుడి సమీపంలో మురుగు కాలువ పొంగిపొర్లుతూ దారుణ స్థితిని ఏర్పరిచింది. అక్కడ నుంచి వెలువడుతున్న దుర్వాసనతో స్థానికులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మురుగు కాలువల నిర్లక్ష్య నిర్వహణ వలన పరిసరాలు కంపుకొట్టే విధంగా మారాయని స్థానిక సీసీఎస్ చర్లపల్లి కాలనీలా సమాఖ్య సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. "దయచేసి మా గోసను గుర్తించండి సార్.. వెంటనే చర్యలు తీసుకోవాలి" అంటూ సంబంధిత అధికారులకు వారు విజ్ఞప్తి చేస్తున్నారు.



అయ్యప్ప స్వామి ఆలయ పునర్నిర్మాణానికి మాజీ కార్పొరేటర్ విరాళం

నవతెలంగాణ-ఉప్పల్

రామాంతపూర్ డివిజన్ న్యూ గొఖలే నగర్‌లో అయ్యప్ప స్వామి ఆలయ పునర్నిర్మాణానికి రామంతపూర్ మాజీ కార్పొరేటర్ గంధం జోత్స్న నాగేశ్వరరావు రెండు లక్షల 50 వేల రూపాయల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డివిజన్‌లోని ఆలయాల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మురళీధర్ ,దయాకర్ రెడ్డి ,నగేష్ గుప్తా, రాజి రెడ్డి ,చంద్రా రెడ్డి ,రేవు నరసింహ ,సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రజతోత్సవ వేడుకలను విజయవంతం చేయాలి

- బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు భాస్కర్ యాదవ్

నవతెలంగాణ- మేడ్చల్

ఈనెల 27న వరంగల్ లో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు భాస్కర్ యాదవ్ పిలుపునిచ్చారు. మేడ్చల్ మండలం నుంచి వెయ్యి మందికి తక్కువ కాకుండా భారీ ఎత్తున కార్యకర్తలు తరలివెల్లి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. గురువారం మేడ్చల్ పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం వారి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 14న శామీర్‌పేటలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరయ్యే సన్నాహక సమావేశానికి సైతం నియోజకవర్గ వ్యాప్తంగా 10 వేల మంది కార్యకర్తలు హాజరవుతారని తెలిపారు. మేడ్చల్ మండలం నుంచి దాదాపు 300 మంది కార్యకర్తలు తరలి వెళ్లనున్నారని పేర్కొన్నారు. రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని,కార్యకర్తలు ఎవరూ అధైర్య పడకుండా పార్టీ కోసం కష్టపడి పని చేయాలని సూచించారు.పల్లెల్లో పట్టణాలలో ఎక్కడ చూసినా కేసీఆర్ ప్రభుత్వం ఉంటేనే బాగుంటుందని, సంవత్సర కాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం పై వ్యతిరేకత మొదలయ్యిందని తెలిపారు.వరంగల్‌లో జరిగే కేసీఆర్ సభకు కార్యకర్తలు,నాయకులు స్వచ్ఛందంగా తరలి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దయానంద యాదవ్,ప్రధాన కార్యదర్శి సుదర్శన్, సీనియర్ రాజమల్లారెడ్డి,మద్దుల శ్రీనివాస్ రెడ్డి, అకటి నవీన్ రెడ్డి, మల్లికార్జున స్వామి,రఘుపతి రెడ్డి, శ్రీనివాస్ రాజు,ఈశ్వరయ్య,మాజీ వైస్ ఎంపీపీ గోపని వెంకటేష్,మాజీ సర్పంచులు,మాజీ ఎంపీటీసీలు,మాజీ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

మనకోసం మహామనిషి



శారీరక బలం కన్నా సంకల్ప బలం ఉంటే చాలంటారు. ఈ సంకల్ప బలమే ఎక్కడిదాకైనా మనల్ని నడిపిస్తుంది. ఆటుపోట్లు, కష్టనష్టాలు ఎన్నున్నా వాటిని దాటుకుంటూ దరిచేరుస్తుంది. ఓ గొప్ప ఉక్కు సంకల్పం ముందు కష్టాలు, కన్నీళ్లు ఓడిపోతాయని నిరూపించిన మహామనిషే డాక్టర్ ఏఎస్ రావు. పూటపూటకూ ఇబ్బంది పడ్డ ఆయన పేదప్రజల కోసం నిలబడ్డాడు. దేశానికే దారిచూపి మహామనిషిగా, భావితరాలకు మార్గదర్శిగా నిలిచాడు. ఒక సమస్య దాటగానే మరో సమస్య వెంటా డినా పట్టువదలని విక్రమార్కుడిలా ఆశయం కోసం జీవితాన్ని అంకితం చేసి, ఆదర్శప్రాయుడిగా చెరగని ముద్ర వేసిన ఆ మహామనిషి లఘు చిత్రం సమాజాన్ని ఆలోచింప జేస్తోంది. డాక్టర్ ఏఎస్‌రావు విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రూపొందించిన ఈ బయోపిక్ చూసినా ఎవ్వరైనా మహామనిషి బాట ఆచరణీయమని, స్ఫూర్తిదాయకమని వర్ణించక మానరు..!!
ఈసీఐఎల్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఈసీఐఎల్ సంస్థ స్థాపకుడు డాక్టర్ ఏఎస్ రావు స్ఫూర్తిదాయక జీవితంపై నవతెలంగాణ ప్రత్యేక కథనం...

- తెరకెక్కిన ఏఎస్‌రావు చిత్రం.. ఎందరికో స్ఫూర్తిదాయకం
- వాస్తవ జీవనానికి దర్పణం పట్టిన బయోపిక్
- ఇప్పటికే నాలుగు అవార్డులు సొంతం చేసుకున్న లఘుచిత్రం
- డాక్టర్ ఏఎస్‌రావు విజ్ఞాన వేదిక సొసైటీ విశేష కృషి



గొడుగు యాదగిరిరావు



పీబీ చారి

నవతెలంగాణ - చర్లపల్లి

ప్రతియేటా ఏఎస్‌రావు జయంతి, వర్ధంతి కార్యక్రమాల సందర్భంగా ఆయన ఆశయ సాధన కోసం కంకణబద్ధులవ్వాలని వక్తలు అభిభాషించడం తెలిసిందే. ఈ నేపథ్యంలో 2023లో డాక్టర్ ఏఎస్‌రావు వర్ధంతి సందర్భంగా స్ఫూర్తి గ్రూప్, ఏఎస్‌రావు నగర్ సొసైటీ బృందంతో కలిసి నిర్వహించిన కార్యక్రమంలో 'మహా మనిషి' బయోపిక్ తీయాలనే ఆలోచనకు బీజంపడింది. డాక్యుమెం టలరీ ఫిలీం నిర్మించాలని పలువురు ప్రముఖుల సూచనలు కూడా తోడయ్యాయి. 2022లోనే రిజిస్ట్రేషన్ చేసిన డాక్టర్ ఏఎస్ రావు విజ్ఞాన వేదిక సొసైటీ అధ్యక్షులు గొడుగు యాదగిరి రావు, ప్రధాన కార్యదర్శి పి.బి.చారి లఘుచిత్రం కార్యాచరణను ముమ్మరం చేశారు. పి.బి.చారి సినిమా భారమంతా భుజాన వేసుకొని నిధులు సమకూర్చారు. ఏఎస్‌రావు జీవితంపై చాలా లోతుల్లోకి వెళ్లి, వారి జీవితంపై పూర్తి సమాచారం సేకరించి కరపత్రం రూపంగా వేలమంది ప్రజలకు అందించారు. దాని ఆధారంగా సినిమా తీయా లని ప్రయత్నించారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రం వారి సహకా రం, ముఖ్యంగా వినయ్ కుమార్,డైరెక్టర్ రఘురామచంద్ర, దాశరధి ఫిలిమ్ సొసైటీ బాధ్యులు బీడీఎల్ సత్యనారాయణను పరిచయం చేయటం దాదాపు 9 నెలలపాటు కృషిచేసి రఘురామ చంద్ర చిత్రాన్ని గొప్పగా నిర్మించటం చకచకా జరిగిపోయాయి. బీడీఎల్ సత్యనారాయణ సాంకేతికంగానూ, గొప్ప గొప్ప నటులను నటింపజేయడంలోనూ అద్భుతంగా కృషి చేశారు.

వివిధ ప్రాంతాల్లో షూటింగ్.. అవార్డులు

చిత్ర షూటింగ్ ఈసీఐఎల్ పరిశ్రమ, చర్లపల్లి పారిశ్రామిక ప్రాంతంలో, డాక్టర్ ఎస్ రావు నగర్‌లో, శ్రామిక నగర్, సుందరయ్య విజ్ఞాన కేంద్రం, డాక్టర్ ఏఎస్ రావు స్వగ్రామమైన మోగల్లు గ్రామంలో జరిగింది. ఫలితంగా మహా మనిషి డాక్టర్ ఏఎస్ రావు డాక్యుమెంటరీ బయోపిక్ సినిమా రూపొందింది. 2024 ఏప్రిల్ 30న లఘుచిత్రం రిలీజ్ ఫంక్షన్ డాక్టర్ ఏఎస్‌రావునగర్ కాలనీలోని హెూమీ జే బాబా ఫంక్షన్ హాల్‌లో ఘనంగా జరిగింది. ఈసీఐఎల్ చైర్మెన్, మేనేజింగ్ డైరెక్టర్ అనురాగ్ కుమార్, సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బీవి రాఘవులు, తెలకపల్లి రవి, ఎస్.వినయ్ కుమార్, మొగల్లు నాయకులు బలరాం హాజరయ్యారు. అనురాగ్ కుమార్ చిత్రప్రదర్శనను స్విచాన్ చేశారు. ఈ కార్యక్రమాన్ని వందలాదిమంది తిలకించి చిత్రాన్ని వేనోళ్ల పొగిడారు. దీనికి ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్ ఒడిస్సా వారు ఉత్తమ బయోపిక్ చిత్రంగా అవార్డును ప్రదానం చేశారు. నవంబర్ 17న ఒరిస్సా భువనేశ్వర్‌లో అవార్డును తీసుకున్నారు. డాక్టర్ ఏఎస్ రావు విజ్ఞాన వేదిక యూట్యూబ్ ఛానల్‌లోనూ, ప్రొఫెసర్ నాగేశ్వర్ యూట్యూబ్ ఛానల్‌లోనూ ప్రదర్శనకి ఏర్పాటు చేశారు. 2024 సెప్టెంబర్ 20 నుంచి వర్ధంతి అక్టోబర్ 31 వరకు డాక్టర్ ఏఎస్ రావు విజ్ఞాన ఉత్సవాలు నిర్వహించగా.. నవంబర్ 4 వరకు పొడిగించి నవంబర్ 4న ముగింపు కార్యక్రమం చేపట్టారు. ఈ విజ్ఞానోత్సవాల సందర్భంగా డాక్టర్ ఏఎస్ రావు బయోపిక్ సినిమాలు ప్రదర్శించటం, విజ్ఞాన దర్శిని వ్యవస్థాపకులు టి రమేష్‌చే విజ్ఞాన ప్రసంగం, ప్రదర్శనలు ఏర్పాటుచేశారు.



విశాఖపట్నంలో ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్ అవార్డు ఇస్తున్న సందర్భంగా..

చైతన్యదీప్తి 'మహామనిషి'

15 బస్తీల్లో, నివాస ప్రాంతాలలో, 15 విద్యాసంస్థలలో 45 రోజులపాటు మొత్తం 50 ప్రదర్శనలు చేశారు. దీంతో వేలాదిమంది ప్రజలు, విద్యార్థులు సినిమా చూసి చైతన్యవంతులయ్యారు. విద్యార్థులకు డార్విన్ పరిణామ వాదంపై వ్యాసరచన పోటీలు పెట్టి విజేతలకు ముగింపు సభలో బహుమతి ప్రదానం కూడా చేశారు. ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్ విశాఖపట్నం వారిచే ఉత్తమ డాక్యుమెంటరీ ఫీలింగా డిసెంబర్ 29న విశాఖపట్నంలో అవార్డు పొందారు. విజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి పి.బి చారి, అధ్యక్షులు గొడుగు యాదగిరిరావు, ఉపాధ్యక్షులు జి శివరామకృష్ణ, చిత్ర డైరెక్టర్ రఘురామచంద్ర, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బీడీఎల్ సత్యనారాయణ అవార్డును అందుకున్నారు. ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్, ఫిలిం మేకర్స్ అసోసియేషన్ వారు ఉత్తమ డాక్యుమెంట్ ఫిలింగా హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆవరణలో ఎన్టీఆర్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 9, 2025న అవార్డులిచ్చారు.



మహా మనిషి డాక్టర్ ఏఎస్ రావు చిత్రానికి బెస్ట్ డాక్యుమెంటరీ ఫిలిం అవార్డును రవీంద్రభారతిలో అందజేశారు



ఒరిస్సా ఫిలిం ఫెస్టివల్ లో అవార్డు వచ్చిన సందర్భంగా...

డాక్టర్ ఏఎస్ రావుది స్ఫూర్తిదాయక జీవితం



డాక్టర్ ఏఎస్ రావుది స్ఫూర్తిదాయక జీవితం. వేలాది మందికి ఉపాధి కల్పించిన మార్గదర్శకుడు ఆయన. ఈసీఐఎల్ సంస్థ ఆధారంగా ఎన్నో చిన్న పరిశ్రమలు ఏర్పా టు ద్వారా లక్షలాదిమంది కార్మికులకు ఉపాధి చూపించిన మహోన్నత వ్యక్తి. స్ఫూర్తిదాయకంగా తెరకెక్కిన ఏఎస్‌రావు చిత్రం అభినందనీయం.
– సీఐటీయూ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి జె. చంద్రశేఖర్

మహామనిషి ఏఎస్ రావు చిత్రాన్ని ఇంగ్లీష్ వర్షన్‌లో అనువాదించేందుకు కూడా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇవన్నీ దిగ్విజయంగా జరగటానికి అనేకమంది దాతల ప్రోత్సాహం స్ఫూర్తిదాయకంగా నిలిచింది. భవిష్యత్తులో విద్యార్థుల్లోనూ, యువకుల్లోనూ సైంటిఫిక్ టెంపర్‌ను కలిగించ టానికి నిరంతరాయంగా పనిచేస్తుంది. ప్రజల్లో డాక్టర్ ఏఎస్ రావు ఆశయాలను ప్రబోధిస్తూ, చైతన్యం కలిగించడానికి ఈ సినిమా దోహదపడుతుందని చెప్పడంలో సందేహం లేదు..!

మూఢనమ్మకాలను పారదోలే విజ్ఞాన వేదిక

డాక్టర్ ఏఎస్ రావు విజ్ఞాన వేదిక 2017 సెప్టెంబర్ మాసంలో ప్రారంభించారు. పద్మభూషణ్ డాక్టర్ ఎస్ రావు గొప్ప శాస్త్రవేత్త. శాస్త్ర సాంకేతిక రంగాలలో భారతదేశాన్ని స్వావలంబన దిశగా నడిపించిన మహోన్నతమైన వ్యక్తి. వారి ఆశయాల సాధన కోసం ప్రజలలో వైజ్ఞానిక దృక్పథం కలిగించటం కోసం ముఖ్యంగా విద్యార్థులలో మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా, వైజ్ఞానిక దృక్పథం అలవాటు చేయడం కోసం డాక్టర్ ఏఎస్ రావు విజ్ఞాన వేదిక ఏర్పాటైంది. అనేక విద్యా సంస్థలలో సైంటిఫిక్ టెంపర్ ఆవశ్యకత గురించి సెమినార్లు, విజ్ఞాన ప్రదర్శనలు, డిబేట్స్, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నారు. విద్యార్థుల్లో పరీక్షలపై ఫియర్ (భయం) పోగొట్టేందుకు గొప్ప కార్యక్రమం చేపడుతున్నారు. అనేకమంది నిపుణులు ప్రసంగించి, ఇంట్రాక్షన్ ద్వారా వారి సందేహాలను నివృత్తి చేయడం విశేషం. ఇలా నిరంతరం కృషి ఎంతోమందిని చైతన్యవంతుల చేస్తోంది.

చిల్కానగర్ అభివృద్ధిలో బన్నాల మార్క్

- ప్రతి క్షణం ప్రజల కోసమే, ప్రతి అడుగూ అభివృద్ధి వైపే
- ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి
- డివిజన్‌లో సుమారు రూ. 80 లక్షల నిధులతో సీసీ రోడ్లకు శంకుస్థాపన



నవతెలంగాణ-ఉప్పల్

చిల్కానగర్ డివిజన్ అభివృద్ధిలో కార్పొరేటర్ బన్నాల పక్కా ప్రణాళికలతో, ప్రతిక్షణం ప్రజల కోసమే, ఆలోచిస్తూ ప్రతి అడుగు అభివృద్ధి వైపు వేస్తూ డివిజన్ రూపు రేఖలు మార్చి గ్రేటర్‌లోనే నెంబర్ వన్ డివిజన్‌గా తీర్చిదిద్దుతున్నారని ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం డివిజన్‌లోని బీరప్ప గడ్డ, న్యూ రాంనగర్ కాలనీ, రాఘవేంద్ర నగర్ కాలనీలలో సుమారు రూ.80 లక్షల నిధుల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చిల్కానగర్ డివిజన్ 70 శాతం స్లమ్ ఏరియా ఉండడం కారణంగా ఎక్కువ నిధులు వెచ్చించి డివిజన్ కు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని, డివిజన్‌లో సుమారు 80 శాతం పనులు పూర్తి చేశామని మిగతా 20 శాతం పనులను కూడా తొందరలో పూర్తి చేస్తామన్నారు. ఖాళీ ప్రభుత్వ స్థలాలు, పార్కులలో ఓపెన్ జిమ్‌లను కూడా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అదేవిధంగా కార్పొరేటర్ ప్రణాళిక బద్ధంగా వచ్చిన నిధులతో స్టార్మ్ వాటర్ డ్రైన్, అండర్ గ్రౌండ్ డ్రయినేజీ, వాటర్ పైప్ లైన్, సీసీ రోడ్ల పనులను పూర్తి చేసుకుంటూ ముందుకు సాగుతున్నారని వారిని అభినందించారు.

కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లో నాలుగేండ్లలో సుమారు రూ. 85 నిధులు వివిధ అభివృద్ధి పనులకు వెచ్చించినట్టు తెలిపారు. నిధులు వెచ్చించే విషయంలో ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారన్నారు. నిత్యం అధికారులను సంప్రదిస్తూ పెద్ద ఎత్తున నిధులు కేటాయింపు చేసే విషయంలో సహకరిస్తున్నందుకు వారికి డివిజన్ ప్రజల తరఫున, తమ తరఫున ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు డీఈ వినీల్ గౌడ్, ఏఈ రాధిక , వర్క్ ఇన్‌స్పెక్టర్ కేదార్, బీఆర్ఎస్ నాయకులు, కాలనీల, బస్తీల అధ్యక్ష కార్యదర్శులు, వారి కమిటీ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయ నూతన చైర్మెన్‌గా ధాత్రిక కాశీనాథ్



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ పట్టణంలోని శ్రీ దాక్షాయణి సమేత శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయ కమిటీ నూతన చైర్మెన్ గా మాజీ ఎంపీటీసీ ధాత్రిక కాశీనాథ్ గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి,మార్కెట్ కమిటీ డైరెక్టర్ దుర్గం శంకర్,మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ సత్యనారాయణలు ఆయనకు పూల బొకే అందజేసి శాలువా కప్పి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో మాజీ కౌన్సిలర్లు కొడే మహేష్, చాపరాజు,జంగా హరి కృష్ణ యాదవ్,నాయకులు రొయ్యపల్లి మల్లేష్ గౌడ్,మధుకర్ యాదవ్, సత్యనారాయణ రెడ్డి,ఆలయ అర్చకులు ఆల్కోడ్ అయ్యప్ప,ఆల్కోడ్ కార్తీక్,శివ దీక్షా గురుస్వాములు రుద్ర జనార్ధన్,అత్వెల్లి శ్రీనివాస్ గౌడ్,తోట రాజు,యెదుగని శ్రీనివాస్,సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

నందమూరి సుహాసినిని కలిసిన టీడీపీ నాయకులు



నవతెలంగాణ-కాప్రా

తెలుగుదేశం తెలంగాణ మాజీ ఉపాధ్యక్షురాలు నందమూరి సుహాసిని పార్టీ మాజీ రాష్ట్ర కార్యదర్శి, ఉప్పల్ నియోజక వర్గం అడ హాక్ కమిటీ మెంబర్ నీరు కొండ సతీష్ బాబు, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర మాజి జనరల్ సెక్రటరి శివనంద్, పార్టీ సీనియర్ నేతలు గొట్టిపాటి వెంకటేశ్వరరావు, నాగరాజు తదితరులు వారి నివాసానికి వెళ్లి మర్యాద పూర్వకంగా కలిశారు.

గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను ఉపసంహరించుకోవాలి

- సీపీఐ(ఎం) మల్కాజిగిరి మండల కార్యదర్శి గుంటి లక్ష్మణ్
- పార్టీ ఆధ్వర్యంలో నిరసన



నవతెలంగాణ-నేరేడ్ మెట్

పెంచిన వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్, ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఐ(ఎం) మల్కాజిగిరి మండల కార్యదర్శి గుంటి లక్ష్మణ్ డిమాండ్ చేశారు. గురువారం పార్టీ మల్కాజిగిరి మండల కమిటీ ఆధ్వర్యంలో మల్కాజిగిరి చౌరస్తాలో నిరసన కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ, పేదల ను పేదలుగానే ఉండిపోయే విధంగా భారాల మీద భారాలు మోపుతున్నదన్నారు. గ్యాస్ సిలిండర్ పైన అదనంగా రూ. 50, పెట్రోల్ మీద, డీజిల్ మీద ధరలు పెంచుతూ సామాన్య ప్రజలను ఏమి చేయదలుచు కున్నాడని ప్రశ్నించారు. పేదలకు పని దొరకని పరిస్థితుల్లో ఇలా ధరలను పెంచడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఈ నిర్ణయాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామన్నారు. అనంతరం పార్టీ మల్కాజిగిరి మండల సీనియర్ నాయకులు ఎం కపాసాగర్ మాట్లాడుతూ ప్రధాని కుల మత, గుడులు, మసీదులు, చర్చిల మీద పెట్టిన శ్రద్ధ, సామాన్య నిరుపేదల అభివద్ధి మీద ఎందుకు పెట్టడం లేదని పార్టీ ప్రశ్నిస్తున్నదన్నారు. ఒకవైపు ప్రపంచ మార్కెట్ లో డీజిల్ పెట్రోల్ బ్యారెల్ ధరలు తగ్గుముఖం పట్టినా దేశంలో మ్తారం అడ్డగోలుగా గ్యాస్ ధర, పెట్రోల్ ధర, డీజిల్ ధర పెంచడం పూర్తిగా ప్రజావ్యతిరేక నిర్ణయమన్నారు. తక్షణ మే పెంచిన గ్యాస్ ధరను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మల్కాజిగిరి మండల కమి టీ నాయకులు విజయ్ కుమార్, శ్రీనివాస్, కొండల్, సరోజ, సూర్య కుమార్, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ కార్మికులకు పెండింగ్ వేతనాలివ్వాలి

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్ శ్రీనివాస్
- దమ్మాయిగూడా మున్సిపల్ ఎదుట కార్మికుల ధర్నా

నవతెలంగాణ-కీసర

మున్సిపల్ కార్మికులకు రెండు నెలల పెండింగ్ వేతనాలు వెంటనే ఇవ్వాలని సీఐటీయూ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం దమ్మాయిగూడా మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు వేతనాలు లేక ఎలా గడపాలని ప్రశ్నించారు. ఇంటి కిరాయి, రోజు ఖర్చులు, డ్యూటీకి వచ్చి పోవడానికి కిరాయిలు ఎలా సమకూర్చుకోవాలని నిలదీశారు. ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు వేతనం చెల్లించని పక్షంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కష్ణ, రాములమ్మతోపాటు మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

ఇట్ల చేద్దాం

ఒక అరటిపండు తీసుకుని తొక్కతీసి చిన్నచిన్న ముక్కలుగా కట్ చేయాలి. ఈ ముక్కల్లో టేబుల్ స్పూను పెరుగు, టేబుల్ స్పూను శనగపిండి వేసి పేస్టులా గ్రైండ్ చేసుకోవాలి. ఈ పేస్టును ముఖానికి అప్లైచేసి పదిహేను నిమిషాల తరువాత కడగాలి. వారానికి రెండు సార్లు ఈ ప్యాక్ వేయడం వల్ల ముఖంపై ఏర్పడిన నల్లని మచ్చలు పోతాయి.





పాలు కాచేటప్పుడు కొద్దిగా సోంపు వేసి మరిగించి ఆ పాలను తాగితే శరీరానికి కావాల్సిన పోషకాలు అందుతాయి.

మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్‌తో నల్లటి దుస్తులు ధరించిన ఓ మహిళ ఉన్న ఓ వీడియో ఇటీవల బాగా వైరల్ అయ్యింది. సోషల్ మీడియాలో సంచలనం సృష్టించింది. ఈ వీడియో అంతగా ప్రచారం అవుతుందని ఆ క్షణాన ఆమె అనుకోలేదు. అయితే ఆ వీడియో ఇప్పుడు ఆమె మార్గాన్ని మరింత సుగమం చేసింది. ఆమె వృత్తికి అత్యంత ప్రాధాన్యం తెచ్చిపెట్టింది. ఆమె గౌరవాన్ని పెంచింది. ఆమే కేరళకు చెందిన మహిళా బౌన్సర్ అను

ఆమె మార్గం అసాధారణం...



మహిళలు అరుదుగా కనిపించే రంగం ఇది. అటువంటి చోట పురుషాధిక్యతను బద్దలు కొట్టి ముందుకు దూసుకుపోతోంది. తన కలల గురించి ప్రపంచానికి తెలియజేస్తోంది. 'మహిళా బౌన్సర్ల గురించి పరిశోధన చేస్తున్న పీటీఐ నుండి వచ్చిన ఒక రిపోర్టర్‌కు ఇంటర్వ్యూ ఇచ్చాను. నేను వారికి నా కథ చెప్పాను. నా వీడియోలలో కొన్నింటిని వారికి ఇచ్చాను. వాటిలో ఒకటి వైరల్ అయింది' అని ఆమె పంచుకున్నారు. వీడియాలోని ఒక విభాగంలో చూపించినట్టు తాను నటుడు మోహన్ లాల్‌కు బాడీగార్డ్ కాదని ఆమె స్పష్టం చేసింది. ఈ ఫొటో ఒక సినిమా ప్రకటన కోసం షూట్‌లో తీయబడింది, అక్కడ కుంజుమోన్ సమన్వయకర్తగా, బౌన్సర్‌గా రెండు పాత్రలుపోషించారు.



పోరాటం కొత్త కాదు

పదమూడు ఏండ్లుగా ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్‌గా ఉన్న కుంజుమోన్ పబ్‌లు, ఈవెంట్‌లలో పార్ట్‌టైమ్ బౌన్సర్‌గా కూడా పనిచేస్తున్నారు. ఆమె తరచుగా పగటిపూట షూటింగ్‌లో పాల్గొంటూ రాత్రిపూట సెక్యూరిటీగా ఉంటారు. ఎర్నాకుళం జిల్లాలోని కంజిరామట్టంలో జన్మించిన కుంజుమోన్ ఒంటరి తల్లి దగ్గర పెరిగారు. ఇది ఆమె జీవితంపై ఎంతో ప్రభావాన్ని చూపింది. చిన్నతనం నుండే ఇబ్బందులు, పోరాటాలను అర్థం చేసుకుంది. అందుకే ఆమె ప్రతి అవకాశంలోనూ తనను తాను సవాలు చేసుకుంది. మహిళలకు అంతగా ప్రాధాన్యం లేని ఫొటోగ్రఫీలోకి అడుగుపెట్టింది. వృత్తిలో భాగంగా వివాహాలు, సినిమా ప్రమోషన్‌లను కవర్ చేసింది. అలాగే ప్రకటనల షూట్‌లలో పనిచేసింది. అయితే బౌన్సర్‌గా మారడం అనేది ఆమె ఊహించని మలుపు.

వారి పని పట్ల ఆసక్తితో...

'ఫొటోగ్రాఫర్‌గా ఒక ప్రమోషనల్ ఈవెంట్‌కు వెళ్ళినప్పుడు అక్కడ నేను ఒక బౌన్సర్‌తో ఘర్షణ పడ్డాను. అయితే త్వరలోనే నేను ఆ బౌన్సర్ల బృందంతో స్నేహం చేశాను. వారి పని పట్ల ఆసక్తి కలిగింది. నేను అప్పటికే ఫిట్‌నెస్‌తో ఉండేదాన్ని. అందుకే రాష్ట్రంలో అప్పటి వరకు కేవలం కొంతమంది మహిళలు మాత్రమే వెళ్లిన మార్గాన్ని ముందు అన్వేషించాలని నిర్ణయించుకున్నాను' అని ఆమె చెప్పింది. ఇది మూడేండ్ల కిందట జరిగిన సంఘటన. అప్పటి నుండి కుంజుమోన్ కొచ్చిలోని వివిధ పబ్‌లలో బౌన్సర్‌గా ఉంది. ప్రైవేట్ ఈవెంట్‌లలో కూడా పనిచేసింది. విజయవంతమైన మహిళా బౌన్సర్‌గా గుర్తింపు తెచ్చుకుంది.

దృఢత్వం ప్రారంభం మాత్రమే

'ఈ రంగంలో నిలదొక్కుకోవాలంటే శారీరకంగా దృఢంగా ఉండటం, మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడం మంచిది. కానీ మానసికంగా అప్రమత్తంగా, బలంగా ఉండటం, కఠినమైన పరిస్థితులను ఎదుర్కోగలగడం కూడా అంతే ముఖ్యం' అని ఆమె వివరిస్తుంది. ఆమె మానసిక బలాన్ని అనేకసార్లు పరీక్షించారు. ఒక పబ్‌లో జరిగిన ఘర్షణకు దారితీసిన సంఘటనను గుర్తుచేసుకుంటూ కుంజుమోన్ 'నేను పరిస్థితిని ప్రశాంతంగా నిర్వహించడానికి ప్రయత్నించాను. కానీ అది పని చేయలేదు. గొడవకు దారితీసింది. కానీ నేను దాన్ని వృత్తిపరంగా నిర్వహించానని భావించాను. దీనిపై ఎటువంటి అధికారిక ఫిర్యాదూ ఉండదు' ఏదైనా పరిస్థితిని నిర్వహించడానికి మానసిక శక్తి ఉండాలని, భద్రత యొక్క మానసిక అంశాలను ఆమె నొక్కి చెబుతుంది.

నాకు వేరే మార్గం లేదు

ఒంటరి తల్లి వద్ద ఆమె ఎదుర్కొంటున్న పోరాటాలను వివరిస్తూ 'నేను ఒంటరి తల్లి దగ్గర పెరిగాను, నా తల్లి కష్టాలను చూశాను. విభిన్న పరిస్థితులను ఎదుర్కోవడానికి నేను ధైర్యంగా ఉండాలి. ఇప్పుడు నాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాను. కానీ నేను ఏ పరిస్థితినైనా నిర్వహించగలనని నాకు తెలుసు. ఎందుకంటే నాకు వేరే మార్గం లేదు' అని ఆమె చెప్పింది. కుంజుమోన్‌కు పన్నెండవ తరగతి చదువుతున్న కూతురు, ఏడో తరగతి చదువుతున్న కొడుకు ఉన్నారు. 'నేను ఎంచుకున్న రంగాన్ని చూసి నా పిల్లలు సంతోషంగా ఉన్నారు. ప్రతిదానిలోనూ నాకు మద్దతు ఇస్తున్నారు. ఇది నన్ను ముందుకు నడిపిస్తుంది' అని ఆమె గర్వంగా పంచుకుంటుంది.

మన దగ్గర గుర్తింపు తక్కువ

ఓ మహిళా బౌన్సర్‌గా కుంజుమోన్ తెచ్చుకున్న గుర్తింపు, పొందుతున్న గౌరవం ఇప్పుడు ఇతర మహిళలకు స్ఫూర్తిదాయకంగా మారింది. వారు కూడా ఈ రంగాన్ని ఎంచుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. 'నా గురించి తెలుసుకొని తాము కూడా బౌన్సర్‌గా పని చేయడం గురించి ఆలోచిస్తున్నామని కొందరు మహిళల నుండి నాకు ఫోన్ కాల్స్ వచ్చినపుడు చాలా సంతోషంగా అనిపిస్తుంది' అని ఆమె చెప్పింది. పురుషాధిక్య రంగాన్ని ఎంపిక చేసుకునేందుకు గల కారణాల గురించి ప్రజలు తరచూ ఆమెను ప్రశ్నిస్తున్నారు. ఆమె చెప్పే సమాధానం జీవితం పట్ల ఆమె వైఖరి ఆచరణాత్మకత, అభిరుచి రెండింటినీ ప్రతిబింబిస్తుంది. 'నేను జీవితంలో కష్టాలు పడే వ్యక్తిని. ముందుకు సాగాలంటే నాకు ఉద్యోగం అవసరం. ఇది నేను అభిరుచి, ప్రేమతో చేసే పని. ఇష్టపడి చేసే పనిలో మనకు బాధ ఉండదని నేను నమ్ముతాను. అది నాకు ఆదాయాన్ని కూడా ఇస్తుంది' అంటారు ఆమె. అయితే ఇతర దేశాల్లో బౌన్సర్లకు ఉన్న గౌరవం, హోదా మన భారతదేశంలో ఉండదని కుంజుమోన్ ఎత్తి చూపారు. 'ఇక్కడ వారిని గూండాలతో సమానం చేస్తారు' అని ఆమె అంటుంది.



ఆమె ఆశయాలు బహుముఖం

ఆమె ఫొటోగ్రాఫర్‌గా, బౌన్సర్‌గా పని చేస్తూనే ఉంటుంది. అయితే ఆమె సినిమాల్లో నటించేందుకు అవకాశాల కోసం ఎదురు చూస్తోంది. ఇప్పటికే ఆమె మలయాళ చిత్రం విశేషమ్‌లో ఒక చిన్న పాత్ర పోషించింది. అలాగే ఆమె అతిథి పాత్ర పోషించిన పూరం పూరదం పూరుతాది అనే సినిమా విడుదలకు సిద్ధంగా ఉంది. ఏ రంగంలో ఉన్నా కుంజుమోన్ తన కంటూ ప్రత్యేక గుర్తింపు, స్థానం సంపాదించుకోవడం కోసమే ప్రయత్నిస్తోంది. అభిరుచి, పట్టుదలతో పాటు, ఇతర మహిళలు పెద్ద కలలు కనేలా ప్రేరేపించడమే ఆమె ఉద్దేశ్యం. ■

'వెనుకడుగు' వెనుక..

(మొదటిపేజీ తరువాయి)

భాగస్వామ్య దేశాలు ప్రతీకార సుంకాలు వేయకుండా చర్చల కోసం తమను సంప్రదించడంతో తాత్కాలికంగా సుంకాల చర్యలను నిలిపివేశామన్నారు.

ఇన్‌సైడర్ ట్రేడింగ్..

అధిక టారిఫ్‌లను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ట్రంప్ ప్రకటించే ముందు సోషల్ మీడియాలో తన కంపెనీ షేర్లకు డిమాండ్ వచ్చేలా పోస్టులు పెట్టారు. అంతా సక్రమంగా జరుగుతుందని.. అమెరికా ఇంతకుముందుతో పోలిస్తే మరింత మెరుగ్గా రాణిస్తుందని ట్రూత్ సోషల్‌లో పోస్టు పెట్టారు. కాసేపటి తర్వాత కొనుగోలు చేయడానికి ఇదే సరైన సమయమంటూ.. చివర్లో డీజేటీ అని జోడించారు. ట్రంప్‌నకు చెందిన మీడియా అండ్ టెక్నాలజీ గ్రూప్ కార్పొరేషన్‌ను డీజేటీగా పిలుస్తారు. అనంతరం మార్కెట్లు భారీగా పెరగడం, ఆయన కంపెనీ షేర్లు కూడా ర్యాలీ చేశాయి. దీనిపై ట్రంప్ ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు పాల్పడ్డారని లేదా మార్కెట్ అవతవకలకు పాల్పడ్డారంటూ డెమోక్రట్లు ఆరోపించారు. దీనిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

మేం చైనీయులం..

రెచ్చగొడితే భయపడం : చైనా విదేశాంగ శాఖ

బీజింగ్: చైనా దిగుమతులపై అమెరికా భారీగా సుంకాలను ప్రకటించాక.. ఆ దేశ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మావో నింగ్ తీవ్రంగా స్పందించారు. ఎక్స్ వేదికగా ఒక పోస్టు చేశారు. 'మేం చైనీయులం. కవ్వింపు చర్యలకు భయపడం. టారిఫ్‌ల విషయంలో వెనక్కి తగ్గం' అని పేర్కొన్నారు. దీనికి ఆమె 1953 నాటి వీడియోను పంచుకున్నారు. నాడు కొరియా యుద్ధం నేపథ్యంలో డ్రాగన్ నాయకుడు మావో జెడాంగ్ ప్రసంగించిన వీడియో అది. అందులో 'ఈ యుద్ధం ఎంతకాలం కొనసాగుతుందో మేము నిర్ణ యించలేం.. అది వాళ్ల (అమెరికా) ఇష్టం. ఇది ఎంతకాలం సాగినా మేము వెనక్కి తగ్గం. పూర్తిగా విజయం సాధించేవరకు పోరాడతాం' అని జెడాంగ్ పేర్కొన్నారు.

ఆర్టీఐ చట్టాన్ని నాశనం చేసే డీపీడీపీ యాక్ట్

(మొదటిపేజీ తరువాయి)

రాహుల్ గాంధీతో సహా ఇండియా బ్లాక్ పార్టీలకు చెందిన 120మందికి పైగా ఎంపీలు ఈ సెక్షన్ రద్దు చేయాలని కోరుతూ సంయుక్త మెమోరాండంపై సంతకాలు చేశారన్నారు. ఐటీ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు ఈ మెమోరాండాన్ని అందచేయనున్నట్లు తెలిపారు. ఈ పత్రికా సమావేశంలో ఎం.ఎం.అబ్దుల్లా (డీఎంకే), ప్రియాంక చతుర్వేది (శివసేన-యూబీటీ), జాన్ బ్రిట్టాస్ (సీపీఐ(ఎం), జావేద్ అలీ ఖాన్(ఎస్‌పీ), నావల్ కిషోర్(ఆర్‌జేడీ)లు పాల్గొన్నారు. పౌర హక్కుల కార్యకర్తలు కూడా ఈ సెక్షన్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారన్నారు. సెక్షన్ 44(3)ని ఆర్‌టిఐ చట్టం, 2005లోని సెక్షన్ 8(1)(జె)కి ప్రత్యామ్నాయంగా మార్చడానికి ప్రయత్నిస్తోందని గగోయ్ తెలిపారు.

వ్యక్తిగత సమాచారమేదైనా దాన్ని వెల్లడించడం ప్రజా కార్యకలాపాలకు గానీ లేదా ప్రజా ప్రయోజనాలకు గానీ సంబంధం లేదని భావించినా, లేదా గోప్యతపై అనవసరపు దాడి చేస్తుందని భావించినా సదరు సమాచారాన్ని నిలిపివేయడానికి ఆర్‌టిఐ చట్టంలోని సెక్షన్ 8(1)(జె) అనుమతిస్తుంది.

అయితే ఈ ఆంక్ష లేదా పరిమితి విధించడమనేది ఒక ముఖ్యమైన అంశానికి లోబడి వుంటుంది. ఇలా వెల్లడించిన సమాచారానికి విస్తృత ప్రజా ప్రయోజనాలు వున్నాయని కేంద్ర పౌర సమాచార అధికారి, రాష్ట్ర పౌర సమాచార అధికారి లేదా అప్పిలేట్ అథారిటీ నిర్ధయించినట్లైతే దీన్ని అందుబాటులో వుంచుతారు.

డీపీడీపీ చట్టంలోని సెక్షన్ 44(3), ఆర్టీఐ చట్టంలోని సెక్షన్ 8(1)(జె)ని సవరిస్తుంది. ఇది, ప్రజా ప్రయోజనాలు లేదా మరే ఇతర అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండానే ప్రభుత్వ సంస్థలు వ్యక్తిగత సమాచారానికి సంబంధించిన సమాచారాన్ని దాచడానికి అనుమతిస్తుంది.

వాస్తవమేంటీ!

(మొదటిపేజీ తరువాయి)

నరకొద్దని ఆదేశించింది. భూముల అమ్మకం, చెట్ల నరికివేతపై స్టే విధించింది. ఈ క్రమంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ కంచ గచ్చిబౌలి ప్రాంతాన్ని సుప్రీంకోర్టు కమిటీ పరిశీలించింది. సర్వే నెంబర్ 25లోని కంచ గచ్చిబౌలి భూములను పరిశీలించి వివరాలు సేకరించింది. కమిటీ పర్యటన నేపథ్యంలో విద్యార్థి సంఘం నాయకులు వారిని కలిసి తమ సమస్యను విన్నవించాలని ప్రయత్నించారు. కానీ విద్యార్థులు బయటకు రాకుండా పోలీసులు ఎక్కడికక్కడా అడ్డుకున్నారు. క్యాంపస్‌లో కర్ఫ్యూ వాతావరణం నెలకొంది. చివరిగా హైదరాబాద్ యూనివర్సిటీ క్యాంపస్‌లో కాకుండా కొంతమంది విద్యార్థులను మానవ అభివృద్ధి వనరుల పరిపాలన విభాగం ఆఫీస్‌కి తీసుకెళ్లి అక్కడ సుప్రీంకోర్టు కమిటీని కలిశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ నాయకులు మాట్లాడారు. సమస్యలను సుప్రీంకోర్టు కమిటీ దృష్టికి తీసుకెళ్లాలని ఎంత ప్రయత్నం చేసినా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పరిపాలన విభాగం, పోలీసులు అడ్డుకున్నారని ఆరోపించారు. ఎక్కడైతే వివాదం జరిగిందో అక్కడికే వెళ్లి, సమస్య చెప్తే బాగుండేదని అన్నారు. అది నేరుగా ఆ కమిటీకి తెలిసే విధంగా ప్రయత్నం చేసేవారమని చెప్పారు. ఈ విషయంలో పూర్తిగా తమ హక్కులను కాలరాసే విధంగా పోలీసులు వ్యవహరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు కమిటీపై తమకు నమ్మకం ఉందని, ఈ భూములు సుప్రీంకోర్టు రక్షిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

కంచ గచ్చిబౌలి భూములపై కేంద్ర ప్రభుత్వం విచారణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కంచ గచ్చిబౌలి భూములపై సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన పర్యావరణ, అటవీ శాఖల కేంద్ర సాధికారిక కమిటీ గురువారం వరుస భేటీలు నిర్వహించింది. కమిటీ చైర్మెన్ సిద్ధాంత దాస్‌తో కూడిన ముగ్గురు సభ్యుల బృందం రాష్ట్ర ప్రభుత్వంతో పాటు వివిధ పార్టీలు, విద్యార్థి సంఘాలతో సమావేశమై వారి నుంచి అభిప్రాయాలను తీసుకుంది. ఉదయం క్షేత్ర స్థాయిలో పర్యటించి వివరాలు సేకరించింది. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, పరిశ్రమల శాఖ కార్యదర్శి, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్ రెడ్డి, డీజీపీ జితేందర్, న్యాయశాఖ కార్యదర్శి తిరుపతి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్, రెవెన్యూ, అటవీ శాఖల అధికారులతో భేటీ అయింది.

3గంటలపాటు జరిగిన సమావేశం 400 ఎకరాల భూమికి సంబంధించిన రికార్డులు, ప్రభుత్వ విధివిధానాలు, ఈ క్రమంలో చోటుచేసుకున్న పరిణామాలపై పూర్తి వివరాలతో కూడిన నివేదికను కమిటీకి ప్రభుత్వం సమర్పించింది. అనంతరం ఎంసీహెచ్‌ఆర్‌డీలో విద్యార్థి సంఘాల నేతలతో భేటీ అయ్యింది. వారి నుంచి వివరాలు సేకరించింది. బీఆర్‌ఎస్ నేతలతో భేటీ అయింది. మాజీ మంత్రి హరీశ్‌రావు నేతృత్వంలోని బృందం భూములకు సంబంధించి వ్యవహారంపై కమిటీకి నివేదిక ఇచ్చింది. హెచ్‌సీయూ పాలకవర్గం, బీజేపీ ఎంపీలతో కమిటీ భేటీ అయింది. వారి నుంచి భూములకు సంబంధించిన వివరాలను సేకరించింది.

నేడూ క్షేత్ర స్థాయిలో పర్యటన

సాధికారిక కమిటీ శుక్రవారం కూడా వివిధ సంఘాలు, నేతలు, స్వచ్ఛంద సంస్థలతో భేటీ కానుంది. అనంతరం వివిధ వర్గాలనుంచి సేకరించిన పూర్తి వివరాలను సుప్రీంకోర్టుకు అందజేయనుంది. టీజీఐఐసీ ఈ భూములను చదును చేపట్టిన నేపథ్యంలో .. సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. దీనిపై క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి నివేదిక అందజేయాలని కమిటీకి సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలోనే బుధవారం సెంట్రల్ ఎంపవర్ కమిటీ హైదరాబాద్‌కు చేరుకుంది. కంచ గచ్చిబౌలి భూముల్లో పరిశీలన జరిపి.. వాస్తవ పరిస్థితులను అధ్యయనం చేస్తుంది.

అ భూములు హెచ్‌సీయూవే

2012లోనే అప్పటి కలెక్టర్ లేఖ

వాల్టా చట్టాన్ని ఉల్లంఘించి చెట్లు నరికివేత

మాజీ మంత్రి హరీశ్‌రావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కంచ గచ్చిబౌలి భూములు హెచ్‌సీయూవేనని మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి సీసీఎల్‌ఏకు 2012లోనే అప్పటి కలెక్టర్ లేఖ రాశారని ఆయన పేర్కొన్నారు. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, దేవిప్రసాద్, ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్‌లతో కలిసి కేంద్ర పర్యావరణ, అటవీ శాఖల సాధికారిత బృందంతో ఆయన గురువారం హైదరాబాద్‌లో భేటీ అయ్యారు. క్షేత్రస్థాయి పరిశీలన, వాస్తవ పరిస్థితులపై కమిటీకి డాక్యుమెంట్లు, విజువల్స్‌తో కూడిన నివేదికను వారికి అందించారు. అనంతరం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కంచ గచ్చిబౌలి భూములను అమ్ముకోవడానికి రాత్రికి రాత్రే నిబంధనలకు విరుద్ధంగా వేలాది చెట్లను నరికేయించిందని ఆరోపించారు. "వాల్టా చట్టం ప్రకారం.. గ్రామీణ ప్రాంతాల్లో అయితే రూ. 50, పట్టణ ప్రాంతాల్లో అయితే రూ. 100 చలాన్ కట్టి.. ఇల్లు కట్టేందుకు చెట్లు నరికేస్తున్నట్టు దరఖాస్తు చేయాలి. ఆ దరఖాస్తు పరిశీలించిన తర్వాత కమిటీ ఒక్కొక్క చెట్టుకు రూ. 450 డిపాజిట్ చేయమని చెబుతుంది. ఒక చెట్టు కొడితే రెండు చెట్లు పెంచాలని సూచిస్తుంది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం దరఖాస్తు పెట్టలేదు.. అటవీశాఖ అనుమతి తీసుకోలేదు. అటవీ భూముల్లోనే కాదు.. సొంత పట్టా భూమి, ఇంటి నిర్మాణంలోనూ చెట్లు కొడితే అనుమతి తీసుకోవాల్సిందేనని చట్టం చెబుతోంది. కానీ ఇవాళ రాష్ట్ర ప్రభుత్వం వేలాది చెట్లను నరికేస్తుంది. వీటిని నరికేందుకు టీజీఐఐసీ రక్షణ కావాలంటూ పోలీసులకు దరఖాస్తు పెట్టారు. న్యాయబద్ధమా.. చట్టానికి లోబడి ఉందా..? లేదా..? అని పోలీసులు విచారణ చేయాలి. ఆ దరఖాస్తే నేరపూరితం.. దీనికి ఫారెస్ట్ అనుమతి ఉందా..? వాల్టా చట్టానికి లోబడి ఉందా..? వైల్డ్ లైఫ్ యాక్ట్‌కు లోబడి ఉందా..? అని పోలీసులు పరిశీలించి అనుమతులు ఇవ్వాలి. కానీ ఇవేమీ చేయకుండా పోలీసుల రక్షణలో 50 బుల్డోజర్లు పెట్టి చెట్లను నరికేశారు." అని హరీశ్‌రావు తెలిపారు. ఈ విషయంలో సుప్రీంకోర్టు తీర్పులు, మార్గదర్శకాలు, నిబంధనలు స్పష్టంగా ఉన్నప్పటికీ వాటిని పట్టించుకోలేదని ఆరోపించారు.

2011లో కంచ గచ్చిబౌలి భూముల్లో జీహెచ్‌ఎంసీ లక్ష మొక్కలను నాటిందనీ, మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ నాటిన మొక్కలు కూడా ఉన్నాయని గుర్తు చేశారు. అరుదైన పక్షులు, జంతువులు, చెట్లు కంచ గచ్చిబౌలి భూముల్లో ఉన్నాయనీ, వాటిని పరిరక్షించాల్సిన రాష్ట్ర ప్రభుత్వమే వాటిని భక్షిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. .రాష్ట్ర ప్రభుత్వం భూములను తాకట్టు పెట్టి గతేడాది నవంబర్ 22న రూ.10వేల కోట్లు రుణం తెచ్చిందని విమర్శించారు. ఫార్మాసిటీ కోసం సేకరించిన 14వేల ఎకరాల్లో ఏకో పార్కుతో పాటు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని సర్కార్‌కు హరీశ్ సూచించారు.

పాలస్తీనా దేశాన్ని గుర్తిస్తాం

(మొదటిపేజీ తరువాయి)

గుర్తించలేదు. "పాలస్తీనా దేశాన్ని గుర్తించే దిశగా మేం ముందుకు సాగాల్సిన అవసరం వుంది. బహుశా కొద్ది నెలల్లో అది జరగవచ్చు. ఎవరినో బుజ్జగించడానికి నేను ఇది చేయడం లేదు. ఒక దశలో ఇది సరైందని భావిస్తున్నందున ఈ చర్య తీసుకుంటున్నాం." అని ఫ్రాన్స్ 5 టెలివిజన్‌తో ఇంటర్వ్యూ సందర్భంగా మాక్రాన్ వ్యాఖ్యానించారు.

పాలస్తీనాను ఎవరైతే సమర్థిస్తారో వారు కూడా అందుకు ప్రతిగా ఇజ్రాయిల్‌ను గుర్తించాలని సూచించారు. కానీ వారిలో చాలామంది అలా చేయడం లేదన్నారు. ఇజ్రాయిల్‌ను గుర్తించని దేశాల్లో సౌదీ అరేబియా, ఇరాన్, ఇరాక్, సిరియా, యెమెన్ వంటి దేశాలు వున్నాయి. సౌదీ అరేబియా అధ్యక్షతన జరిగే సమావేశంలో జూన్‌లో తమ లక్ష్య సాధన దిశగా అడుగులు పడతాయని మాక్రాన్ పేర్కొన్నారు.

యంగ్ ఇండియా నా బ్రాండ్

(మొదటిపేజీ తరువాయి)

ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, డీజీపీ జితేందర్, ఎమ్మెల్యేలు ప్రకాష్‌గౌడ్, కాలే యాదయ్య, అనిల్‌రెడ్డి, యంగ్ ఇండియా స్కూల్ సొసైటీ వైస్ ప్రెసిడెంట్ సివి.ఆనంద్, ఉన్నతాధికారులు, యంగ్ ఇండియా స్కూల్ ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మలుపు తిప్పిన నిర్ణయాలు..

దేశ చరిత్రలో ఎంతో మంది ప్రధానులు, ముఖ్యమంత్రులు అయ్యారని, కానీ అందులో కొద్దిమంది మాత్రమే చరిత్రలో గుర్తుండిపోయారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఆ కొద్దిమంది తీసుకున్న నిర్ణయాలు చరిత్రను మలుపు తిప్పాయని, ముఖ్యమంత్రుల్లో ఒక్కొక్కరికి ఒక్కో బ్రాండ్ ఉందని చెప్పుకుంటున్నారని తెలిపారు. కిలో రెండు రూపాయల బియ్యంతో ఎన్టీఆర్ ప్రతి పేదవాడి మనసులో స్థానం సంపాదించుకున్నారని గుర్తు చేశారు. హైదరాబాద్‌లో ఐటీని అభివృద్ధి చేసి చంద్రబాబు నాయుడు ఒక బ్రాండ్ క్రియేట్ చేసుకున్నారని అన్నారు. రైతు బాంధవుడిగా ప్రజలు వైఎస్‌ను గుర్తుంచుకుంటారని తెలిపారు. "16 నెలలైనా బ్రాండ్ ఎందుకు సృష్టించుకోలేదని నన్ను కొందరు అడుగుతున్నారు. అందుకే ఇవాళ నేను క్రియేట్ చేసిన నా బ్రాండ్ 'యంగ్ ఇండియా'లో చదువు, ఉపాధి నా బ్రాండ్" అని అన్నారు. ఆనంద్ మహేంద్రను యూనివర్సిటీకి చైర్మెన్‌గా నియమించుకున్నామని తెలిపారు. ఇందులో చేరిన ప్రతి విద్యార్థికీ ఉద్యోగ భద్రత ఉందన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

(మొదటిపేజీ తరువాయి)

అవకాశముందన్న వాతావరణ శాఖ సూచనలను పరిగణనలోకి తీసుకుని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను అప్రమత్తం చేశారు.

పూలే మార్గం అందరికీ ఆచరణీయం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మహాత్మా జ్యోతిరావు పూలే అనుసరించిన మార్గం అందరికీ ఆచరణీయమని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. పూలే 198వ జయంతి (ఏప్రిల్11) సందర్భంగా ముఖ్యమంత్రి ఆయన త్యాగాలను, సమాజానికి చేసిన సేవలను స్మరించుకున్నారు. ఒక సామాన్యుడిగా మొదలై ఒక సామాజిక ఉద్యమ కెరటంగా ఎదిగిన పూలే జీవితం అందరికీ ఆదర్శనీయమన్నారు. సామాజిక కార్యకర్తగా, వర్ణ వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన సంఘ సంస్కర్త పూలే భావితరాలకు సైతం మార్గదర్శకుడని ముఖ్యమంత్రి గుర్తు చేసుకున్నారు. సమాజంలో వివక్షకు తావు లేదనీ, సమానత్వం ఉండాలని జీవితాంతం పోరాడిన మహనీయుడని కొనియాడారు. వెనుకబడిన వర్గాలు, దళిత జనోద్ధరణకు ఆయన ఎంచుకున్న బాట, అనుసరించిన మార్గం సమాజ శ్రేయస్సును కాంక్షించే వారందరికీ స్ఫూర్తిగా నిలుస్తుందని చెప్పారు.

మహాత్మా జ్యోతిబా పూలే స్ఫూర్తితోనే రాష్ట్ర ప్రభుత్వం అనేక వినూత్న ప్రజా ప్రయోజన కార్యక్రమాలు చేపట్టిందని గుర్తుచేశారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ప్రగతి భవన్‌కు మహాత్మా జ్యోతిభా పూలే పేరు పెట్టి ప్రజాభవన్‌గా మార్చినట్టు తెలిపారు. పూలే స్ఫూర్తితోనే అన్ని వర్గాల వారికి విద్య, ఉపాధి అవకాశాలు అందించాలనే లక్ష్యంతోనే ఎస్సీ వర్గీకరణ చేపట్టినట్టు తెలిపారు. దేశంలోనే తొలిసారిగా బీసీ కులగణన చేపట్టి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లును అసెంబ్లీలో ఆమోదించినట్టు తెలిపారు. మహిళల సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. మహిళా శక్తి పాలసీ ద్వారా డ్వాక్రా సంఘాల మహిళలకు వడ్డీ లేని రుణాలు, వారి పేరిట పెట్రోల్ బంకుల ఏర్పాటు, సోలార్ పవర్ ప్లాంట్ల కేటాయింపు, ఆర్టీసీకి అద్దె బస్సులు ఇలా ప్రతి రంగంలో మహిళలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో పని చేస్తుందని తెలిపారు. ఆరు గ్యారంటీల్లో భాగంగా మహాలక్ష్మి పథకంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో పాటు రూ.500కు గ్యాస్ సిలిండర్ పథకాలను ఇప్పటికే అమలు చేసిందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పట్టాలు కూడా మహిళల పేరుతోనే ఇస్తున్నట్టు చెప్పారు.

నవచిత్రం



పూరి సినిమాలో టుబు కీలక పాత్ర

విజయ్‌సేతుపతి హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో ఓ పాన్ ఇండియా సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే.
ఉగాది శుభ సందర్భంగా ప్రకటించిన ఈ చిత్రాన్ని పూరి జగన్నాథ్, చార్మీ కౌర్ తమ సొంత బ్యానర్ పూరి కనెక్ట్స్ పై నిర్మించనున్నారు.
ఈ హైలీ యాంటిసిపేటెడ్ సినిమా కోసం పూరి జగన్నాథ్ పవర్ ఫుల్ కథ రాశారు. ఇందులో విజయ్ సేతుపతి నెవర్ బిఫోర్ క్యారెక్టర్ కనిపించబోతున్నారు. విజయ్ సేతుపతి అవుట్ స్టాండింగ్ పెర్ఫార్మెన్స్‌తో పాటు ఆయన్ని డిఫరెంట్ అవతార్‌లో చూడబోతున్నారు. ఈ సినిమాపై ఎగ్జైట్‌మెంట్‌ని మరింత పెంచుతూ టబు ఈ చిత్రంలో చాలా కీలకమైన పాత్రలో కనిపించనున్నారు. సెలెక్టెడ్ రోల్స్‌కి పాపులరైన టబు ఈ చిత్రంలోని పాత్ర, కథాంశం నచ్చి వెంటనే ఈ ప్రాజెక్టులో భాగం కావడానికి అంగీకరించారు. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ జూన్‌లో ప్రారంభం కానుంది. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీతో సహా పలు భాషల్లో ఈ చిత్రం విడుదల కానుంది. త్వరలోనే ఈ చిత్రంలోని ఇతర నటీనటులు, సిబ్బందిని మేకర్స్ అనౌన్స్ చేయనున్నారు.



చిరంజీవి

'రామ రామ..' సందడి షురూ

చిరంజీవి నటిస్తున్న నూతన చిత్రం 'విశ్వంభర'. వశిష్ట దర్శకుడు. యువి క్రియేషన్స్ బ్యానర్‌పై విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మించిన ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్-ప్రొడక్షన్ దశలో ఉంది. తాజాగా మేకర్స్ సినిమా మ్యూజిక్ ప్రమోషన్స్‌ని స్టార్ట్ చేస్తున్నట్లు అనౌన్స్ చేశారు.
ఇందులో భాగంగా ఎం.ఎం. కీరవాణి స్వరపరిచిన తొలి పాట 'రామ రామ..' ఈనెల 12న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో విడుదల చేసిన పోస్టర్ లో చిరంజీవి చుట్టూ హనుమంతుడి వేషధారణలో ఉన్న పిల్లలు, బ్యాక్‌డ్రాప్‌లో సుందరమైన రాముడి విగ్రహం ఉంది. రామజోగయ్య శాస్త్రి ఈ పాటకి సాహిత్యం అందించారు. తన బ్లాక్‌బస్టర్ ఫస్ట్ మూవీ 'బింబిసార'తో చెరగని ముద్ర వేసిన దర్శకుడు వశిష్ట ఈ చిత్రాన్ని అత్యద్భుతంగా తెరకెక్కించారు. ఈ చిత్రంలో త్రిష కృష్ణన్, ఆశికా రంగనాథ్ హీరోయిన్స్‌గా నటిస్తుండగా, కునాల్ కపూర్ కీలక పాత్ర పోషించారు. ఈ చిత్రానికి రచన, దర్శకత్వం: వశిష్ట, నిర్మాతలు: విక్రమ్, వంశీ, ప్రమోద్, సంగీతం: ఎంఎం కీరవాణి, డిఓపి: చోటా కె నాయుడు, ప్రొడక్షన్ డిజైనర్: ఎఎస్ ప్రకాష్.

తల్లీ కొడుకుల అనుబంధానికి ప్రతిబింబం



'ఒక అమ్మ ప్రాణాన్ని పణంగా పెట్టి ఒక బిడ్డకి జన్మనిస్తుంది. ఈ రోజు మనం వేసే ప్రతి అడుగు అమ్మ నేర్పిందే. అలాంటి అమ్మలని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. ఆ బాధ్యత కోసం మనం ఎంత త్యాగం చేసిన సరిపోదు. అదే 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'. చాలా నిజాయితీగా చేసిన సినిమా ఇది' అని హీరో కళ్యాణ్ రామ్ అన్నారు.
ఆయనతోపాటు విజయశాంతి ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'.
అశోక క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ పతాకాలపై అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మించిన ఈ చిత్రానికి ప్రదీప్ చిలుకూరి దర్శకత్వం వహించారు. చిత్తూరులో జరిగిన గ్రాండ్ ఈవెంట్‌లో సినిమాలోని సెకండ్ సింగిల్ 'ముచ్చటగా బంధాలే ..'ని లాంచ్ చేశారు.
ఈ సందర్భంగా విజయశాంతి మాట్లాడుతూ, 'కళ్యాణ్ రామ్ తల్లి గురించి ఎంత అద్భుతంగా చెప్పాడు. తను విలువలు ఉన్న మనిషి, క్రమశిక్షణ గల మనిషి. ఎన్టీ రామారావు మనవడు. ఆ క్రమశిక్షణ ఎక్కడికి పోతుంది?, ఈ సినిమాలో చాలా అద్భుతంగా చేశాడు. 18వ తేదీ మీరంతా చూస్తారు. మీరంతా మెచ్చుకుంటారు. అంత అద్భుతంగా చేసాడు. ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డాం. నిజాయితీగా పని చేసాం. ఈ సినిమాని చాలా పెద్ద హిట్ చేయవలసిందిగా మీ అందరిని కోరుకుంటున్నాను' అని అన్నారు.
'చిత్తూరు ప్రజలకు, విద్యార్థులకు, మా నందమూరి అభిమానులందరికీ ధన్యవాదాలు. మీ అందరికీ జీవితాంతం రుణపడి ఉంటాను. కాలేజ్ లైఫ్ బెస్ట్ లైఫ్. ఇక్కడ ఎంజాయ్ చేయండి. బాధ్యతగా ఉండండి. నేర్చుకోండి. ఎందుకంటే ఇక్కడ మనం నేర్చుకున్నదే రేపు మనకి లైఫ్ ఇస్తుంది. 12వ తేదీన మా సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ ఉండబోతుంది. ఆ ఈవెంట్‌కి తమ్ముడు ఎన్టీఆర్ వస్తాడు. ఆరోజు మరిన్ని విశేషాలు మాట్లాడుకుందాం' అని హీరో నందమూరి కళ్యాణ్ రామ్ చెప్పారు. హీరోయిన్ సాయి మంజ్రేకర్ మాట్లాడుతూ,'సెకండ్ సాంగ్‌ని చిత్తూరులో లాంచ్ చేయడం చాలా ఆనందంగా ఉంది. మా హీరో కళ్యాణ్ రామ్‌కి, విజయశాంతికి, దర్శక నిర్మాతలకు ధన్యవాదాలు. కళ్యాణ్ రామ్‌తో కలిసి నటించడం చాలా ఆనందంగా ఉంది. అందరూ థియేటర్స్‌లో మా సినిమాని చూసి ఆదరిస్తారని ఆశిస్తున్నాను' అని తెలిపారు.
'మీలో అందరికీ మీ మదర్ బర్త్‌డే గుర్తుందా?, మనం పుట్టగానే అమ్మ ప్రతి బర్త్ డే కి కేక్ కట్ చేస్తుంది. అది సెలబ్రేషన్. మనం పెద్దయ్యాక అమ్మ బర్త్ డేని గుర్తు పెట్టుకుని కేక్ కట్ చేయాలి. అది ఎమోషన్. అదే ఈ సినిమాలో చూపించాలనుకున్నాం. దీనికి సపోర్ట్ చేసిన మా ప్రొడ్యూసర్స్‌కి, మా హీరో కళ్యాణ్ రామ్‌కి, విజయశాంతికి ధన్యవాదాలు' అని డైరెక్టర్ ప్రదీప్ చెప్పారు.
నిర్మాత అశోక్ వర్ధన్ ముప్పా మాట్లాడుతూ,'మీ అందరి ఎనర్జీ చూస్తుంటే మాకు చాలా ఉత్సాహంగా ఉంది. ఈ సినిమాలో కళ్యాణ్ రామ్, విజయశాంతి పోటాపోటీగా నటించారు. కళ్యాణ్‌రామ్‌తో మరిన్ని సినిమాలు చేయాలని ఉంది. విజయశాంతి ఈ సినిమాని ఒప్పుకోవడమే మా ఫస్ట్ సక్సెస్‌గా భావిస్తున్నాం. మా డైరెక్టర్ ప్రదీప్ ఈ చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కించారు. ఈ సినిమా తప్పకుండా మిమ్మల్ని అలరిస్తుంది' అని అన్నారు.

అందరికీ కనెక్ట్ అయ్యే 'కృష్ణ లీల'



నిఖిల్, దేవన్

దేవన్ హీరోగా ఆయన స్వీయ దర్శకత్వంలో ఓ సూపర్ నేచురల్ లవ్ స్టోరీ రూపొందుతోంది.
ధన్య బాలకృష్ణన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. బేబీ వైష్ణవి సమర్పణలో మహాసేన్ విజువల్స్ బ్యానర్ పై జ్యోత్స్న జి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.
ఈ సినిమాకి 'కృష్ణ లీల' అనే బ్యూటీఫుల్ టైటిల్ ఖరారు చేశారు. 'తిరిగొచ్చిన కాలం'అనేది ట్యాగ్ లైన్.
ఈ సినిమా టైటిల్, మోషన్ పోస్టర్ లాంచ్ ఈవెంట్‌కు ముఖ్య అతిథులుగా హీరో నిఖిల్, ఎల్ వీ గంగాధర్ శాస్త్రి, డీవోపీ చోటా కే నాయుడు హాజరయ్యారు.
హీరో నిఖిల్ మాట్లాడుతూ,'దేవన్ చాలా ప్యాషన్ ఉన్న యాక్టర్, డైరెక్టర్. 'హ్యాపీడేస్'కి ముందు నేను కూడా ఒక మంచి అవకాశం కోసం తపన పడేవాడిని. దేవుడి దయవల్ల నాకు 'హ్యాపీడేస్' దొరికింది. అదే దేవుడి దయవల్ల తనకి ఈ సినిమాతో దేవన్‌కి పెద్ద హిట్ రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. మోషన్ పోస్టర్ నాకు చాలా నచ్చింది. ఇందులోని దేవ్ డిఫరెంట్ షేడ్స్ నాకు చాలా నచ్చాయి' అని అన్నారు.
'నాకు సినిమా జీవితాన్ని ఇచ్చిన మా నిర్మాతలు జ్యోత్స్న, అనిల్‌కి ధన్యవాదాలు. వారికి లైఫ్ లాంగ్ రుణపడి ఉంటాను. చోటా కే నాయుడు నాకు ఇష్టమైన కెమెరామెన్. ఆయనతో కలవడానికి చాలా ప్రయత్నాలు చేశాను. ఫైనల్‌గా ఆయనని కలిసి ఈ సినిమా కథ చెప్పాను. ఆయన కొన్ని మార్పులు చెప్పారు. అవి మాకు చాలా హెల్ప్ అయ్యాయి. ఆయనే నాకు ఇండస్ట్రీలో బ్యాగ్రౌండ్. ఈ జర్నీ ఒక మిరాకిల్‌లా మొదలైంది. గంగాధర్ శాస్త్రికి కూడా ఈ సినిమా కథ చెప్పాను. ఆయన కూడా నాకు విలువైన సూచనలు ఇచ్చారు. '18పేజస్' నుంచి నిఖిల్‌తో నాకు పరిచయం ఏర్పడింది. ఆయన నన్ను చాలా ఎంకరేజ్ చేశారు. ఈవెంట్ కొచ్చి మాకు సపోర్ట్ చేసిన నిఖిల్‌కి థ్యాంక్స్' అని హీరో, డైరెక్టర్ దేవన్ చెప్పారు.
ప్రొడ్యూసర్ జ్యోత్స్న మాట్లాడుతూ,'మా సినిమా నిజంగా ఒక అద్భుతం. ప్రతి ఒక్కరినీ జీవితంలో కనెక్ట్ చేసే పాయింట్స్ ఇందులో ఉంటాయి. ప్రతి ఒక్కరికీ ఈ సినిమా నచ్చుతుందని నమ్ముతున్నాం' అని తెలిపారు. 'ప్రేమ గురించైనా, యుద్ధం గురించైనా చెప్పాలంటే కృష్ణుని పేరే చెప్తాం. ఎవరైతే కరెక్ట్‌గా ప్రేమించగలరో అతనికి మించి యుద్ధం చేసేవాడు ఎవరు ఉండరు . దేవన్ చాలా డెడికేటెడ్‌గా పని చేశాడు' అని స్టోరీ రైటర్ అనిల్ కుమార్ చెప్పారు.

శివశక్తి క్యారెక్టర్ చేయడం నా అదృష్టం : తమన్నా



తమన్నా

తమన్నా ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'ఓదెల 2'.
సూపర్ నేచురల్ థ్రిల్లర్ 'ఓదెల రైల్వే స్టేషన్'కి ఇది సీక్వెల్. ఈ చిత్రాన్ని పాన్-ఇండియా స్థాయిలో రూపొందిస్తున్నారు. సంపత్ నంది కథ, స్క్రీన్‌ప్లే, డైలాగ్ రైటర్‌గా మల్టిపుల్ రోల్స్‌లో వర్క్ చేశారు. అలాగే డైరెక్షన్ సూపర్ విజన్‌ని అందిస్తున్నారు. అశోక్ తేజ ఈ చిత్రానికి దర్శకుడు. మధు క్రియేషన్స్, సంపత్ నంది టీమ్‌వర్క్స్ బ్యానర్స్ పై డి. మధు నిర్మిస్తున్నారు. ఇటీవల ముంబైలో జరిగిన గ్రాండ్ ఈవెంట్‌లో మేకర్స్ థియేట్రికల్ ట్రైలర్‌ను లాంచ్ చేశారు.
ఈ సందర్భంగా హీరోయిన్ తమన్నా మాట్లాడుతూ,'ఈ సినిమా నాకు చాలా ప్రత్యేకం. ఇలాంటి సినిమాలు ఒక యాక్టర్‌కి చాలా అరుదుగా వస్తుంటాయి. ఈ సినిమాలో పార్ట్ కావడం ప్రౌడ్‌గా ఫీల్ అవుతున్నాను. సంపత్ నంది ఈ సినిమాలో నా పాత్రని రాసిన విధానం చాలా అద్భుతంగా ఉంటుంది. ఇలాంటి అద్భుతమైనటువంటి కథలో నన్ను పార్ట్ చేసిన ఆయనకు కృతజ్ఞతలు తెలుపుతున్నాను. వశిష్ట సింహ చాలా అద్భుతమైన నటుడు. ఈ సినిమాల్లో తన పాత్ర టెర్రిఫిక్‌గా ఉంటుంది. గాడ్ వర్సెస్ ఈవిల్ ఫైట్‌ని తన పెర్ఫార్మెన్స్‌తో మరో స్థాయికి తీసుకు వెళ్లాడు. ఈ సినిమాలో నేను చేసిన శివశక్తి పాత్రకు ఎలాంటి రిఫరెన్స్ లేదు. ఇంత మంచి క్యారెక్టర్ పోషించడం చాలా అదృష్టంగా ఫీలవుతున్నాను. ఈ సినిమా కోసం నేచర్ కూడా మాకు సపోర్ట్ చేసిందని నమ్ముతున్నాం. ఈ సినిమా నాకు చాలా డిఫరెంట్ జర్నీ. ఇది గ్రాండ్ స్కేల్ కమర్షియల్ ఫిల్మ్. ఈ సినిమా అందరికీ నచ్చుతుందనే నమ్మకం ఉంది' అని అన్నారు.
'తమన్నా ఈ సినిమాలో శివశక్తి పాత్రని మరో స్థాయిలో చేశారు. సినిమా కోసం చాలా హార్డ్ వర్క్ చేశారు. మండుటెండలో చెప్పులు లేకుండా నడిచారు. ఈ సినిమా తర్వాత ఆమెకు డిఫరెంట్ రోల్స్ వస్తాయి. ఆమె కోసం పాత్రలు క్రియేట్ అవుతాయి. ప్రేక్షకులకి ఈ సినిమా గ్రేట్ సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ఇస్తుంది. ఈనెల 17న థియేటర్స్‌లో సినిమా చూడండి. ఖచ్చితంగా బ్లాస్టింగ్ ఎక్స్‌పీరియన్స్ ఉంటుంది' అని సంపత్ నంది చెప్పారు. వశిష్ట సింహ మాట్లాడుతూ,'ఇది చాలా పవర్ ఫుల్ మూవీ. నిర్మాత మధు ఈ సినిమాని చాలా బిగ్ స్కేల్‌లో తీశారు. తమన్నా ఈ సినిమాలో చేయబోయే మ్యాజిక్ చూడబోతున్నారు. నేను నటించిన 'కేజీఎఫ్' మాస్ ఎక్స్‌పీరియన్స్. ఈ సినిమా ఒక డివైన్ ఎక్స్పీరియన్స్‌లా ఉండబోతుంది' అని తెలిపారు.

ఆటలు

సింధు పరాజయం

- యమగూచి చేతిలో ఓటమి
- ఆసియా చాంపియన్‌షిప్స్ 2025



నింగ్బో (చైనా) : ఈ ఏడాదిలో భారత బ్యాడ్మింటన్ అగ్రశ్రేణి క్రీడాకారుల పేలవ ఫామ్ కొనసాగుతుంది. ప్రతిష్టాత్మక ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్స్ నుంచి ఇప్పటికే లక్ష్యసేన్, హెచ్.ఎస్ ప్రణయ్ పరాజయం పాలవగా.. తాజాగా డబుల్ ఒలింపిక్ మెడలిస్ట్ పి.వి సింధు సైతం నిష్క్రమించింది. మహిళల సింగిల్స్ ప్రీ క్వార్టర్‌ఫైనల్లో పి.వి సింధు వరుస గేముల్లో నిరాశపరిచింది. మూడో సీడ్, జపాన్ స్టార్ అకానె యమగూచి 21-12, 16-21, 21-16తో మూడు గేముల మ్యాచ్‌లో సింధుపై విజయం సాధించింది. గంటకు పైగా సాగిన మ్యాచ్‌లో సింధు తొలి గేమ్‌లో తడబాటుకు లోనైనా.. రెండో గేమ్‌లో గొప్పగా పుంజుకుంది. 21-16తో రెండో గేమ్ సొంతం చేసుకుని మ్యాచ్‌ను నిర్ణయాత్మక మూడో గేమ్‌కు తీసుకెళ్లింది. కానీ చావోరేవో తేల్చుకోవాల్సిన గేమ్‌లో సింధు మళ్లీ వెనుకంజ వేసింది. యమగూచి సూపర్ గేమ్ ముంగిట తలొంచింది. దీంతో ఆసియా చాంపియన్‌షిప్స్‌లో సింధు పోరాటానికి తెరపడింది. ఈ సీజన్‌లో సింధు అంచనాలను అందుకోవటం లేదు. ఇండియా ఓపెన్‌లో క్వార్టర్స్‌కు చేరిన సింధు.. ఇండోనేషియా మాస్టర్స్, ఆల్ ఇంగ్లాండ్ ఓపెన్, స్విస్ ఓపన్‌లో తొలి రౌండ్లోనే పరాజయం పాలైంది.
పి.వి సింధు ఓటమితో సింగిల్స్ విభాగంలో టీమ్ ఇండియా టైటిల్ వేట ముగిసింది. పురుషుల సింగిల్స్‌లో కిరణ్ జార్జ్, ప్రియాన్షు రజావత్‌లు రెండో రౌండ్ మ్యాచ్‌లో పరాజయం పాలయ్యారు. ప్రియాన్షు రజావత్ 14-21, 17-21తో వరల్డ్ నం.7 నరొక (జపాన్) చేతిలో ఓటమి పాలవగా.. కిరణ్ జార్జ్ 21-19, 13-21, 16-21తో వరల్డ్ నం.5 కునాల్‌విట్ (థాయ్‌లాండ్) చేతిలో పరాజయం చెందాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ కపిల, తనీశ క్రాస్టో జంట క్వార్టర్‌ఫైనల్లోకి ప్రవేశించింది. 12-21, 21-16, 21-18తో ఐదో సీడ్ చైనీస్ తైపీ జోడీపై అలవోక విజయం సాధించారు.

సూపర్‌కింగ్స్ కెప్టెన్‌గా ధోని

గాయంతో సీజన్‌కు రుతురాజ్ దూరం
సిఎస్‌కె చీఫ్ కోచ్ స్టిఫెన్ ఫ్లెమింగ్



చెన్నై : దిగ్గజ క్రికెటర్, కెప్టెన్ కూల్ ఎం.ఎస్ ధోని ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో మరోసారి సారథ్య పగ్గాలు చేపట్టనున్నాడు. ఐపీఎల్18లో చెన్నై సూపర్‌కింగ్స్ కెప్టెన్సీ బాధ్యతలు ఎం.ఎస్ ధోని తీసుకోనున్నట్టు ఆ జట్టు చీఫ్ కోచ్ స్టిఫెన్ ఫ్లెమింగ్ గురువారం వెల్లడించారు. సూపర్‌కింగ్స్ రెగ్యులర్ కెప్టెన్, ఫామ్‌లో ఉన్న కీలక బ్యాటర్ రుతురాజ్ గైక్వాడ్ గాయంతో సీజన్‌కు దూరం అయ్యాడు.
'రుతురాజ్ గైక్వాడ్ సీజన్‌కు దూరమయ్యాడు. రాజస్థాన్ రాయల్స్‌తో మ్యాచ్‌లో గువహటిలో రుతురాజ్ గాయానికి గురయ్యాడు. నొప్పితో బాధపడుతున్న రుతురాజ్‌కు ఎల్బోలో ఎయిర్‌లైన్ ఫ్రాక్చర్ అయ్యిందని ఎంఆర్‌ఐ స్కాన్‌లో తేలింది' అని ఫ్లెమింగ్ తెలిపాడు. చెపాక్ వేదికగా నేడు కోల్‌కత నైట్‌రైడర్స్‌తో చెన్నై సూపర్‌కింగ్స్ తలపడనుంది. ప్రీ మ్యాచ్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడిన ఫ్లెమింగ్.. జట్టులోని అన్‌క్యాప్‌డ్ ఆటగాడిని కొత్త కెప్టెన్‌గా ప్రకటించాడు. 'మా జట్టులో అన్‌క్యాప్‌డ్ ప్లేయర్ ఎం.ఎస్ ధోని ఉన్నాడు. ఐపీఎల్18లో మిగిలిన మ్యాచులకు అతడు సారథ్యం వహిస్తాడు. ప్రస్తుత పరిస్థితిని ధోని అర్థం చేసుకున్నాడు. సారథ్య పగ్గాలు అందుకునేందుకు ఏమాత్రం వెనుకాడలేదు' అని ఫ్లెమింగ్ అన్నాడు. సీజన్‌లో ఐదు మ్యాచులు ఆడిన చెన్నై సూపర్‌కింగ్స్ నాలుగింట పరాజయం పాలైంది.

351 మెడల్ ఈవెంట్లతో..!

2028 ఒలింపిక్స్‌లో 31 స్పోర్ట్స్



లసానె (స్విట్జర్లాండ్) : విశ్వ క్రీడా వేదిక ఒలింపిక్స్‌లో లింగ సమానత్వం ప్రస్ఫుటించేలా స్పోర్ట్స్ ప్రోగ్రామ్‌ను అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) తుది ఆమోదం తెలిపింది. 2028 ఒలింపిక్స్‌కు అమెరికాలోని లాస్ ఏంజిల్స్ నగరం ఆతిథ్యం ఇవ్వనుండగా కొత్తగా చేర్చిన ఐదు క్రీడాంశాలతో కలిపి ఓవరాల్‌గా 31 స్పోర్ట్స్‌లో పతక పోటీలు నిర్వహించనున్నారు. 351 పసిడి పతక ఈవెంట్లు లాస్ ఏంజిల్స్ నిర్వహించనుండగా.. 10500 మంది క్రీడాకారులు పోటీ పడనున్నారు. ఇందులో 5333 మహిళా, 5167 పరుష అథ్లెట్లు పోటీలో నిలువనున్నారు. లాస్‌ఏంజిల్స్ నిర్వహణ కమిటీ ప్రతిపాదనలతో కొత్తగా మహిళా క్రీడాకారులకు అవకాశాలు ఏర్పడ్డాయి. ఇక ఒలింపిక్స్‌లో దాదాపుగా అన్ని ఈవెంట్లలోనూ మెన్స్ జట్లతో సమానంగా ఉమెన్ జట్లు బరిలోకి దిగనున్నాయి. ఫుట్‌బాల్‌లో పురుషుల జట్లు 12 మాత్రమే ఆడనుండగా.. మహిళల విభాగంలో 16 జట్లు పోటీపడనున్నాయి.
క్రికెట్‌లో ఆరు జట్లు : లాస్ ఏంజిల్స్‌లో క్రికెట్ ప్రవేశపెట్టగా.. పురుషుల, మహిళల విభాగాల్లో ఆరేసి జట్లు పోటీపడనున్నాయి. ఒలింపిక్స్‌లో పోటీపడే జట్ల అర్హత ప్రక్రియపై ఐసీసీ నుంచి ఎటువంటి అధికారిక సమాచారం లేదు. కానీ ఐసీసీ ర్యాంకింగ్స్ లేదా ఐసీసీ టీ20 ప్రపంచకప్‌లో టాప్-6లో నిలిచిన జట్లు నేరుగా ఒలింపిక్స్‌కు అర్హత సాధించే అవకాశం ఉంది. బాక్సింగ్‌ను సైతం అధికారికంగా ఒలింపిక్ ప్రోగ్రామ్‌లో చేర్చిన సంగతి తెలిసిందే.

ఎదురులేని ఢిల్లీ

- 6 వికెట్ల తేడాతో ఆర్‌సీబీపై గెలుపు
- ఛేదనలో కెఎల్ రాహుల్ ధనాధన్

బెంగళూర్ 163/7, ఢిల్లీ 169/4

ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఎదురు లేదు. ఐపీఎల్18లో క్యాపిటల్స్ వరుసగా నాల్గో మ్యాచ్‌లో విజయం సాధించి, అజేయ జోరు కొనసాగిస్తోంది. కెఎల్ రాహుల్ (93 నాటౌట్), స్టబ్స్ (38 నాటౌట్) మెరుపులతో 164 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఢిల్లీ క్యాపిటల్స్ 17.5 ఓవర్లలోనే ముగించింది. రాయల్ చాలెంజర్స్ బెంగళూర్‌కు చిన్నస్వామిలో ఇది వరుసగా రెండో ఓటమి.

నవతెలంగాణ-బెంగళూర్



కెఎల్ రాహుల్ (93 నాటౌట్, 53 బంతుల్లో 7 ఫోర్లు, 6 సిక్సులు) అజేయ అర్థ సెంచరీతో చెలరేగాడు. సొంత మైదానంలో ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున బరిలోకి దిగిన కెఎల్ రాహుల్ అదరగొట్టాడు. పవర్‌ప్లేలోనే డుప్లెసిస్ (2), జేక్‌ఫ్రేజర్ మెక్‌గుర్క్ (7), అభిషేక్ పోరెల్ (7) సహా కెప్టెన్ అక్షర్ పటేల్ (15) ఆరంభంలోనే అవుటయ్యారు. 58/4తో ఒత్తిడిలో కూరుకున్న ఢిల్లీ క్యాపిటల్స్‌ను కెఎల్ రాహుల్ ఒక్కడై ఆదుకున్నాడు. ట్రిస్టన్ స్టబ్స్ (38 నాటౌట్, 23 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్) జతగా ఐదో వికెట్‌కు 111 పరుగులు జోడించి ఆతిథ్య రాయల్ చాలెంజర్స్ బెంగళూర్‌కు షాక్ ఇచ్చాడు. 55 బంతుల్లోనే 111 పరుగులు పిండుకున్న రాహుల్, స్టబ్స్ మ్యాచ్‌ను ఏకపక్షం చేశారు. మిడిల్ ఓవర్లలో బెంగళూర్ బౌలర్లు లయ తప్పటంతో.. రాహుల్, స్టబ్స్ స్వేచ్ఛగా ఆడారు. మూడు ఫోర్లు, మూడు సిక్సర్లతో 37 బంతుల్లో అర్థ సెంచరీ బాదిన రాహుల్... ఆ తర్వాత టాప్ గేర్‌లోకి వచ్చాడు. మరో నాలుగు ఫోర్లు, మూడు సిక్సర్లతో సెంచరీకి చేరువయ్యాడు. మరో ఎండ్‌లో స్టబ్స్ సైతం చక్కటి సహకారం అందించాడు. దీంతో 17.5 ఓవర్లలో 4 వికెట్లకు 169 పరుగులు చేసిన ఢిల్లీ క్యాపిటల్స్ 6 వికెట్ల తేడాతో రాయల్ చాలెంజర్స్ బెంగళూర్‌పై ఘన విజయం సాధించింది. ఐపీఎల్18లో నాలుగు మ్యాచుల్లో ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఇది నాల్గో విజయం కాగా.. రాయల్ చాలెంజర్స్ బెంగళూర్‌కు ఐదు మ్యాచుల్లో ఇది రెండో పరాజయం. ఛేదనలో అజేయ అర్థ సెంచరీ సాధించిన కెఎల్ రాహుల్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.
కుల్దీప్ మాయజాలం :
తొలుత బ్యాటింగ్ చేసిన బెంగళూర్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 163 పరుగులే చేసింది. స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ (2/17) మాయ చేయగా.. విప్‌రాజ్ (2/18), మోహిత్ శర్మ (1/10) రాణించారు. టాప్ ఆర్డర్‌లో ఫిల్ సాల్ట్ (37), విరాట్ కోహ్లి (22) ధనాధన్ ఆరంభం అందించారు. తొలి వికెట్‌కు 3.5 ఓవర్లలోనే 61 పరుగులు జోడించారు. కానీ ఆ తర్వాత ఆర్‌సీబీ దూకుడు తగ్గింది. పడిక్కల్ (1), లివింగ్‌స్టోన్ (4), జితేశ్ శర్మ (3) నిరాశపరిచారు. పాటిదార్ (25), కృనాల్ (18) సహా టిమ్ డెవిడ్ (37 నాటౌట్) రాణించటంతో బెంగళూర్ 163 పరుగులైనా చేయగల్గింది.

ఐపీఎల్ 2025 పాయింట్ల పట్టిక

జట్టు	మ్యా	వి	ఓ	పా
1 గుజరాత్	05	04	01	08
2 ఢిల్లీ	04	04	00	08
3 బెంగళూర్	05	03	02	06
4 పంజాబ్	04	03	01	06
5 లక్నో	05	03	02	06
6 కోల్‌కత	05	02	03	04
7 రాజస్థాన్	05	02	03	04
8 ముంబయి	05	01	04	02
9 చెన్నై	05	01	04	02
10 హైదరాబాద్	05	01	04	02

మ్యా : మ్యాచులు, వి : విజయాలు, ఓ : ఓటములు, పా : పాయింట్లు

జకోవిచ్‌కు షాక్

- చిలీ ఆటగాడి చేతిలో చిత్తు
- మోంటోకార్లో మాస్టర్స్ టెన్నిస్



రోక్యూబ్రునే కాప్ మార్టిన్ (ఫ్రాన్స్) : టెన్నిస్ దిగ్గజం, సెర్బియా యోధుడు నొవాక్ జకోవిచ్‌కు మళ్లీ షాక్ తగిలింది. మోంటోకార్లో మాస్టర్స్ ఏటీపీ 1000 టోర్నమెంట్‌లో నొవాక్ జకోవిచ్ రెండో రౌండ్లోనే పరాజయం పాలయ్యాడు. పురుషుల సింగిల్స్‌లో మూడో సీడ్ జకోవిచ్ గురువారం జరిగిన మ్యాచ్‌లో వరుస సెట్లలో ఓటమి చెందాడు. 27 ఏండ్ల యువ చిలీ ఆటగాడు అలెగ్జాండ్రో తబిలో 6-3, 6-4తో జకోవిచ్‌పై అద్భుత విజయం సాధించాడు. రెండు ఏస్‌లు, మూడు బ్రేక్ పాయింట్లతో మెరిసిన అలెగ్జాండ్రో..24 గ్రాండ్‌స్లామ్ టైటిళ్ల విజేతను మట్టికరిపించాడు. జకోవిచ్ మూడు ఏస్‌లు కొట్టినా.. ఒక్క బ్రేక్ పాయింట్‌తోనే సరిపెట్టుకున్నాడు. పాయింట్ల పరంగా 66-49తో తబిలో ఆధిపత్యం నిరూపించుకుని ముందంజ వేశాడు. రష్యా స్టార్, తొమ్మిదో సీడ్ డానిల్ మెద్వదేవ్ 7-6(8-6), 5-7, 6-2తో అలెగ్జాండ్ర ముల్లర్‌పై విజయం సాధజంచాడు. ఏడు ఏస్‌లు, ఐదు బ్రేక్ పాయింట్లతో మెద్వదేవ్ మూడు సెట్ల మ్యాచ్‌లో మెప్పించాడు. గ్రిగర్ దిమిత్రోవ్ 4-6, 6-3, 6-1తో వాలెంటిన్‌పై గెలుపొందగా.. నాల్గో సీడ్ కాస్పర్ రూడ్ 6-2, 6-1తో రాబర్టో బటిస్టాపై అలవోక విజయం నమోదు చేశాడు. రెండో సీడ్ కార్లోస్ అల్కరాస్ 6-3, 6-1తో డానియల్‌ను మట్టికరిపించి క్వార్టర్‌ఫైనల్‌కు చేరుకున్నాడు. లొరెంజో ముసెటి 6-3, 6-3తో సహచర ఆటగాడు మాటో బెరాటినిపై సాధికారిక విజయం సాధించాడు. మూడు బ్రేక్ పాయింట్లతో అదరగొట్టిన ముసెటి.. మెరుపు విజయంతో క్వార్టర్‌ఫైనల్లోకి అడుగుపెట్టాడు.
క్వార్టర్స్‌లో బోపన్న జోడీ : 45 ఏండ్ల వయసులో అదిరే విజయాలు సాధిస్తూ ఏటీపీ రికార్డు పుస్తకాలను తిరగరాస్తున్న భారత వెటరన్ ఆటగాడు రోహన్ బోపన్న మోంటోకార్లో మాస్టర్స్ పురుషుల డబుల్స్‌లో క్వార్టర్‌ఫైనల్‌కు చేరుకున్నాడు. ప్రీ క్వార్టర్‌ఫైనల్లో ఇటలీ ఆటగాళ్లు సిమెనె, ఆండ్రీవలపై బెన్ షెల్టన్ (అమెరికా)తో కలిసి 2-6, 7-6(7-4), 10-7తో రోహన్ బోపన్న విజయం

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.